తాత్పర్యము

(శత్రుఘ్నుని మాటలకుఁ జెలువవ్వుతో రాజా! నీకు స్వాగతము నీవు క్రొత్తి వానివలెఁ బలుకుచున్నావే- ఇది రఘువంశము వారి సొంత సొమ్మని తలఁపుము.)

క. అని పాద్యం బర్ఘ్యం బాసన మొసఁగఁగఁ నాతఁ డులరి ♦ చారు ఫలాదుల్
తనివార మెసఁగి సమ్మదమున ని ట్లను నాశ్రమంబు ♦ సొంతనమానీ! ౧౯౯ ౨

తాత్పర్యము

(అని యర్ఘ్యము పాద్యము నీయఁగా నతఁడు సంతోషించి వా రిచ్చిన యింపైన పండ్లు మున్నగునవి తనివితీర నారగించి యానందమున నిట్లనెను. మునిశ్రేష్ఠా! యీ యాశ్రమము సమీపమున.)

క. యాగం బెవ్వరో చేసిన, యా గురుతులు కానఁబడెడి ♦ నతఁ డెవ్వఁ డనన్
యోగీంద్రుఁ డిట్టులను గుణ సాగర! మీపూర్వుఁ డొకడుఁ♦ స త్త్వధనుండున్.

తాత్పర్యము

(ఎవరో యాగము చేసిన గుర్తులు కనఁబడుచున్నవే-అతఁ డెవ్వఁడని యడుగ వాల్మీకి మహర్షి గుణసముద్రా! శత్రుఘ్నా, మీ పూర్వులలో నొకఁడు సత్త్వగుణ సంపన్నుఁడు.)

### —♦ వాల్మీకి శత్రుఘ్నునకు సౌదాసు చరిత్రంబుఁ దెలుపుట ♦—

సీ. పరఁగ సుదాసుఁ డన్ ♦ పార్థివుఁ డాతనిఁ సుతుఁడు వీరసహుండు ♦ శుద్ధచరితుఁ
డతఁడు బాల్యమునందు ♦ యటవికి వేటకై, పలుమాఱుఁ బోవుచు ♦ వచ్చుచుండు
రాక్షసు లిద్ద ఱ ♦ రణ్యమందలి మృగ, కోటులఁ బులులయి ♦ కూల్చి తినఁగ
నిర్మృగ మయ్యె వ ♦ నీ దేశమంతయు, నది గని సౌదాసుఁ ♦ డాగ్రహమునఁ

ఆ. గ్రూరమార్గణమునఁ ♦ ద్రుంచి యొక్కని వానిఁ జూచుచుండ నమిత ♦ శోకయుక్తి
దోడివాఁడు వల్కె ♦ దోసంబు లే కేమి, నాసహాయుఁ జంప ♦ న్యాయ్యమగునె.

అర్థములు. నిర్మృగము=మృగములు లేనిది, వనీదేశము=అడవిప్రదేశము.

తాత్పర్యము

సుదాసుఁడను రాజొకరుఁ డుండెను. అతని కొడుకు వీరసహుఁడు. వీనికిమిత్రసహుఁడనియు పేరుగలదు. వీఁడు నిర్మల చరిత్రుఁడు. ధర్మాత్ముఁడు. వీఁడు బాల్యమునందు నడవికిఁ బలుమాఱు వేటకై వచ్చుచుఁ బోవుచుండెను. ఆ యడవియందిరువురు రాక్షసులు పులులవలెనై మృగములఁ జంపి తినుటచే నడవియందు మృగము లన్నియు నశించెను. అతఁడు వేటాడుటకు మృగములు లేవయ్యెను. అదిచూచి

సౌదాసుఁడు కోపించి యా యిరువురు రాక్షసులలో నొకనిఁ జంపెను రెండవ వాఁడు మిగుల శోకించి యే దోషము చేయని నా సహోదరుని నీవు చంపుట న్యాయమా?

ఆ. దీనిమాఱు కీడు • నేను నీకు ఘటింతుఁ, గను మటంచుఁ జెప్పి • కానఁ బడక
చనియెఁ గొంతకాల • మునకు సమిత్ర స, హాయుఁడు దాల్పెఁ గలిగి • నుర్వీభరము.

వీరసహుఁడే మిత్రసహుఁడు.

తాత్పర్యము

(వీనిని బదులపకారము నేను జేసెదను చూడుమని చెప్పికనఁబడకుండఁ బోయెను. కొంతకాలమునకా మిత్రసహుఁడు రాజయ్యెను.)

ఉ. ఆనృపుఁ డశ్వమేధ మను • యాగ మొనర్ప నిటన్ వసిష్ఠుఁ డ
ద్దానిని నిర్వహించు నెడఁ • దత్పరిపూర్తిని బూర్వవైరమున్
మానసమందు నిల్పి యల • మానవభోజి వసిష్ఠ రూపి యై
మానవనాథ! నా కిపుడు మాంసయుతాన్నముఁ బెట్టు మం చనన్. ౧౧౬

అర్థములు. అలమానవభోజి=ఆ రాక్షసుఁడు.

తాత్పర్యము

(ఆరా జశ్వమేధ యాగము చేయుచుండ వసిష్ఠుఁడాయాగమును నిర్వహించుచుండు సమయమునందు యజ్ఞము సమాప్తి చెందిన తర్వాత నా రాక్షసుఁడు వెనుకటి పగను మనస్సులో నుంచుకొని వసిష్ఠుని రూపముతో వచ్చి, రాజా నాకు మాంసముతోఁ గూడిన యన్నము బెట్టింపు మని యడుగఁగాఁ.)

చ. క్షితిపతి సూపకారుఁ గని • చెచ్చెర సామిషభుక్తిని౦ బురో
హితునకుఁ దృప్తిగూర ఘటి • యింపు మటంచు నచింప నాతఁడున్
ద్రుతగతి సంభ్రమంబు గొనఁ • దొల్లిటి సోఁకుఁడు సూద కారునా
కృతి మనుజామిషంబును న • రేంద్రునకుం గొనివచ్చి భూపతీ! ౧౧౭

అర్థములు. సూపకారుని=వంటవాని, సామిష భుక్తినిన్=మాంసముతోడి భోజనము, ద్రుతగతిన్=త్వరగా, తొల్లిటిసోఁకుఁడు=పూర్వపురాక్షసుఁడు, సూదకారునాకృతిన్=వంటవాని రూపముతో.

తాత్పర్యము

రాజు వంటవానిని జూచి త్వరగా మాంసముతోడి యన్నమును బురోహితునకుఁ దృప్తిగాఁ బెట్టు మని చెప్పఁగా వంటవాని వేషమున నున్న రాక్షసుఁడు మనుష్యమాంసము వండి తెచ్చి రాజునొద్ద నుంచి.

క. ఇది స్వాదు హావిష్యము మునిమది మెచ్చున్ సామిషంబు • మంజుల మన న
య్యది పక్షియుతుఁడై ముని, కిడఁ గల్మష మేమి లేక • నృపుఁ డిడఁగుడువన్.

అర్థములు. స్వాదుహవిష్యము=తియ్యనిది, హవికి యోగ్యమైనది, సామిషంబు=మాంసముతోఁ గూడినది, మంజులము=మనోహరము.

తాత్పర్యము

ఇది తియ్యనిది, హవిస్సు, మాంసముతోఁ గూడినది, మనోహరమైన దని చెప్పఁగా రాజు తన భార్యచేత మనస్సులోఁ గల్మషము లేక మునికి వడ్డింపఁ జేసెను.

భారతమునఁ జెప్పఁబడినదానికి దీనికిఁ గొంచెము భేదము గలదు. అందు రాక్షసావిష్టుఁడైన రాజే మనుష్యమాంసము పెట్టుమని చెప్పినట్లున్నది.

—• వసిష్ఠుఁడు సౌదాసుని శపించుట •—

క. భాజనమం దుంచినయా, భోజనమున్ మనుజమాంస•ముగ నెఱిఁగి మదిన్
రాజా! యెది నాకిడి తది, భోజనమగుఁ గాక నీకు•ముగ నీ కనుచున్. ౧౧౯౯

అర్థములు. భాజనమందు=పాత్రమందు.

తాత్పర్యము.

పాత్రమందుంచఁగా నా భోజనము మనుష్యమాంస మని ముని తెలిసికొని రాజా! యేది నా కాహారముగఁ బెట్టితివో యదియే నీ కాహారమగును గాక అనఁగా మనుష్యమాంసము దిను రాక్షసుఁడ వగుదువు గాక.

క. ముని శపియించిన రోషం, బున సౌదాసుండు నీర•ములఁ గేలఁ గొనెన్
మునిని శపించెద నని యా, తనిసతి మదయంతి ప్రాణ•ధవు నిట్లనియెన్. ౧౨౦౦

తాత్పర్యము

(ముని శాపమును బెట్టఁగా రోషముతో సౌదాసుఁడు మరల మునిని శపించెద నని జలములు చేత నుంచుకొనెను. అతనిభార్య మదయంతి మగనితో నిట్లనెను.)

క. భగవంతుఁ డగు వసిష్ఠుం, డగ వే శపియింప నీకు • ధరణీశ యనన్
మగువవచనంబులం గొని, దిగవిడిచి చలంబు రోష•దీప్తుం డగుచున్. ౧౨౦౧

తాత్పర్యము

(రాజా! భగవంతుఁడగు వసిష్ఠుని శపింపఁ దగునా యని నివారింప, భార్య మాటల నంగీకరించి తన పట్టుదల వదలి కోపముచే నుడికిన వగుచు.)

క. తేజోబలయుత మగు జల, మాజనపతి తనదు పం(క్తి?)•లందున విడువన్
దేజోహతి నాభూమిబి, డౌజనిపాదములు కమ రో•వది మొద లతఁడున్. ౧౨౦౨

తా త్ప ర్య ము

తేజోబలముతోఁ గూడిన యా జలము భూమిపై విడిచిన దేశము నశించు నని తలఁచి తన పాదముల మీఁదనే విడిచెను. ఆ తేజస్సుచే నారాజు పాదములు కమరెను. అది మొదలు తేఁడు.

తే. పరఁగెఁ గల్మాషపాదుఁ డన్ ♦ ప్రథ నరేంద్రుఁ
డాత్మపత్నీ యుతుండయి ♦ యమ్మహర్షి
వేఁడె నిర్దోషి తా నని ♦ వేయిగతుల
నృపతినుడి మాని తనయోగ♦దృష్టిఁ జూచి. ౧౨౦౩

అర్థములు. ప్రథ=కీర్తి.

తా త్ప ర్య ము

(కల్మాష పాదుఁడను పేరఁ బ్రసిద్ధుఁడయ్యెను- భార్యయుఁ దానును వసిష్ఠుని స్వామీ! నిర్దోషిని- ఏ పాప మెఱుఁగనని యనేక విధములఁ బ్రార్థించెను- వసిష్ఠ ముని యా రాజు మాటలందలి సత్యమును తన యోగదృష్టితోఁ జూచి.)

క. అక్కపటవ్యాపారము, రక్కసుపని యంచు నెఱిఁగి ♦ రాజా! విను నా
వాక్కును ద్రిప్ప నశక్యము, నొక్కవరము నొసఁగువాఁడ♦నూఱడు దానన్.

తా త్ప ర్య ము

(ఆ కపటపుఁ బని రాక్షసునిదని తెలిసికొని, రాజా! విను- నా మాటను ద్రిప్పుటను శక్యముగాదు-నీకొక వరమిచ్చెదను, దానితో నీవు సమాధానపడుము.)

చ. పదియును రెండువర్షములు ♦ పార్థివవర్య! సహింపు శాపమున్
బదపడి శాపముక్తి యగు ♦ భావమునందు గతంబు విస్మృతిన్
బొదలెడు నాఁగ నట్టు లని ♦ భూపతి శాపము సైఁచి మీఁదఁ దా
సదనముఁ జేరి ప్రోలెను బ్రజాపరిపాలనసక్తచిత్తుఁడై. ౧౨౦౪

అర్థములు. విస్మృతిం బొదలెడు=నీవు యథాప్రకారము మనుష్యుఁడవై నపుడు నీవు రాక్షసుఁడుగా నుండి చేసిన కార్యములు మఱచెదవు.

తా త్ప ర్య ము

(పండ్రెండు సంవత్సరము లీ శాపమును నోర్చుకొనుము తర్వాత నీకీశాప విమోచనము కలుగఁ గలదు. శాపము తీఱి మరల నీవు మనుష్యుఁడవై నప్పుడు, రాక్షసుఁడుగా నుండి చేసిన కార్యములు మఱచిపోయెదవు. అని చెప్పఁగా, రా జట్లే యని శాపము సహించి తరువాతఁ దనయింటికిఁజేరి ప్రజలను పాలించుట యందాసక్తి కలిగి ప్రకాశించెను.)

క. ఆతని యజ్ఞాయతనం, బీతల మని మౌని చెప్ప ♦ నెలమి గని సుమి
త్రాతనయుఁడు మునినాథున, కాతతమతి మ్రొక్కి చొచ్చె ♦ నాకులగుడిసెన్.

అర్థములు. యజ్ఞాయతనము=యజ్ఞముచేసిన ప్రదేశము.

తాత్పర్యము

(ఆతఁడు యజ్ఞముచేసిన చోటిది. అని వాల్మీకిముని చెప్పఁగా సంతసించి శత్రుఘ్నుఁడు మునివరునకు దండము సమర్పించి పర్ణకుటీరములోనికిఁ బోయెను.)

## — ♦ సీతాదేవి కుమారులఁ గనుట ♦ —

క. యామవతి దేనియం దా, రామానుజుఁ డుండెఁ బర్ణ♦రమ్యగృహమునన్
భూమితనూజాతయు నా, యామవతీ వేళ సుతుల ♦ యమడలఁ గాంచెన్. ౧౨౦౭

అర్థములు. యామవతి=రాత్రి, పర్ణరమ్యగృహమునన్ = రమ్యమైన పర్ణశాలయందు, యామవతీ వేళ=రాత్రిసమయమున.

తాత్పర్యము

ఏరాత్రియందు శత్రుఘ్నుఁడు పర్ణశాలయందుండెనో యా రాత్రియందే సీతాదేవి యమడల కుమారులఁ గనెను.

తే. తపసి బాలకు లర్ధరా♦త్రమున వచ్చి, వాల్మికిం గని రాముని♦పత్ని గనియె
సుతులనిద్దఱ భూతముల్ ♦ సోఁక కుండ బాలచంద్రాభులను గావు♦బాలకులను.

అర్థములు. భూతముల్=బాలురను బీడించు గ్రహములు అఱువదినాలుగు, బాలచంద్రాభులను=లేఁత చంద్రునితో సమానులను,

తాత్పర్యము

(మునిబాలకు లర్ధమరేయి వచ్చి వాల్మీకినిఁ జూచి రామచంద్రమూర్తి భార్య యిద్దఱు కొడుకులను గనినది. లేఁత చంద్రునితో సమానులగు నా బాలకులకు భూతములు సోఁకకుండ మీరు రక్షచేయవలెను.)

చ. అనవుడు మౌని యోగిజన♦కాత్మజపుత్రులఁ గాంచి భూతనా
శన మగు మంత్రముల్ చదివి ♦ చయ్యన మంత్రిత మైన దర్భలన్
గొనలను బుత్రు నొక్కనిని ♦ గూర్చ మొదళ్ళ మఱొండుపుత్రు మా
ర్జన మొనరింపఁ బంచె ముని ♦ సంయమివృద్ధసరోజనేత్రలన్. ౧౨౦౯

అర్థములు. మంత్రితమైన=మంత్రింపఁబడిన, సంయమివృద్ధసరోజనేత్రలన్=వృద్ధలైన మునిపత్నులను, కూర్చ=దర్భపిడికిలి.

తా త్ప ర్య ము

(అని విన్నవింపఁగా, వాల్మీకిముని పోయి, సీతబిడ్డలను జూచి భూతములను నాశముచేయు మంత్రములు చదివి వెంటనే మంత్రించిన దర్భలను వృద్ధలయిన ముని పత్నులకిచ్చి కొనలతో నొకనిని, మొదళ్ళతో నొకనిని మార్జనము చేయుఁడని యాజ్ఞాపించెను.)

తే. అనిమి త్తంబుచేతఁ గు◆శాఖ్య నొకని, కిచ్చి లవుఁ డను పేరిచ్చి◆యింకొకనికి
సమడబిడ్డలుఁ గుశలవు◆ లనెడిపేరఁ బరఁగువా రిద్దియే నామ◆కరణ మనుడు.

తా త్ప ర్య ము

దర్భ కూర్చకొనలచె మార్జనము చేయఁబడినవాఁడు కుశుఁడనియు, దాని మొదళ్ళచే మార్జనము చేయఁబడిన వాఁడు లవుఁడనియు నమడ బిడ్డలకు కుశలవు లనియు వారి కదియే నామకరణమనియు, వాల్మీకి చెప్పెను.

క. ఆరక్షను గొని చని ముని,నారులు తద్విధిని మార్జ◆నం బొనరిచి రా
భూరమణుఁడు శత్రుఘ్నుం, డారఁగ మునిపతుల పలుకు◆ లాలిచి నిశన్.

తా త్ప ర్య ము

(ఆ రక్షను దీసికొనిపోయి మునిపత్నులు వాల్మీకి చెప్పిన విధముగామార్జనము చేసిరి. శత్రుఘ్నుఁడా రాత్రి మునిపత్నులాడుకొను మాటలను జక్కఁగావినె.)

క. కవలం గనిరొసె భూమిజ, భవ భాగ్యము! తల్లి! యనుచుఁ◆ బలికెను హర్షం
బవిరళముగఁ గనుచుండగ, రవి దోఁచెన్ శ్రావణికపు◆రజనియుఁ జనియెన్.

అర్థములు. అవిరళముగన్=దట్టముగ, శ్రావణికపురజని = శ్రావణమాస రాత్రి, ఆషాఢముతో గ్రీష్మము ముగియుటచే శ్రావణమందుఁ బ్రయాణము చేసెనని యెఱుఁగనగు, దీనివలన సీతాదేవి వాల్మీకాశ్రమము చేరు నప్పటికి నిండు చూలుగాదు, నాలుగు మాసములుగా నుండవలెను. వసంతము ముందు చెప్పఁబడెను కావున.

తా త్ప ర్య ము

(భాగ్యము! తల్లీ! సీతాదేవి కవలను గన్నది! యనుచుఁ బరమానందమునఁ బలికెను. చూచుచుండఁగాఁ బ్రొద్దుపొడిచెను. శ్రావణమాసపు రాత్రి యును కడచి పోయెను.)

క. పౌర్వాహ్ణిక కార్యంబుల, సర్వంబును దీర్చి ప్రొక్కి◆సంయమిమణికిన్
శర్వరి శేషిటఁ గడపి యు,ఖర్వజవుఁడు త్రోవ మునిని◆కాయముఁ గాంచెన్.

తాత్పర్యము.

అర్థములు. పౌర్వాహ్ణిక కార్యములన్=దినమున పూర్వభాగమునఁ జేయ వలసిన కార్యములను, సంయమిమణికిన్=మునిశ్రేష్ఠునకు, శర్వరులు=రాత్రులు, అఖర్వజవుఁడు=మిగుల వేగము గలవాఁడు, శీఘ్రముగఁ బ్రయాణము చేసినని భావము, మునినికాయము=చ్యవనాది మునుల సమూహమును.

తాత్పర్యము

(పగలు మొదటిభాగమునఁ జేయవలసిన కార్యముల నెల్లఁదీర్చి మునిశ్రేష్ఠునకు మ్రొక్కి యతి శీఘ్రముగఁ బయనించి యేడురాత్రులు దారిలోఁ గడపి చ్యవనాది మహాముని సమూహమును జూచెను.)

**శత్రుఘ్నునకుఁ జ్యవనుండు లవణుచే మాంధాత మడసిన విధంబుఁ దెలుపుట**

తే. భార్గవుండాదియైన త•పస్విజనుల, యాశ్రమంబుల నుండి సం•యములుపల్కు-
చిత్రగాథల వినుచు ని•శీథ మెల్లఁ, గడపుచో నిట్టు లడిగె భా•ర్గవుని నృపుఁడు

అర్థములు. భార్గవుఁడు=చ్యవనుఁడు, నిశీథమెల్ల=రాత్రియంతయు.

తాత్పర్యము

(చ్యవనుఁడు మున్నుఁగాఁగల మునుల యాశ్రమములనుండి యామునులు చెప్పుచున్న విచిత్రములగు కథలను వినుచు రాత్రియంతయుఁ గడుపునప్పుడు శత్రుఘ్నుఁడు చ్యవనుని నిట్టులడిగెను.)

చ. చ్యవన! మహానుభావ! గిరి•జాధవదత్తము శూల మూని యా
లవణుఁడు సంగరంబున ని•లాధవులన్ వధియించె నెట్టు మున్?
లవణుబలంబు శూలము బ•లంబు విధంబు వచింపుమీ యనన్
జ్యవనుఁడు రామచంద్రు సను•జాతునిఁ గన్గొని పల్కెఁ బ్రీతితోన్. ౧౨౧౫

అర్థములు. గిరిజాధవదత్తము=శివునిచే నీయఁబడినది. ఇలాధవులన్=రాజులను.

తాత్పర్యము

(చ్యవన! మహానుభావా! శివుఁడిచ్చిన శూలమును దాల్చి యా లవణుఁడు పూర్వము యుద్ధమున రాజులను జంపెనఁట!! లవణాసురుని బలమెట్టిది? శూలము శక్తియెట్టిది? ఆవిధమంతయు నాకుఁ దెలుపుఁడు. అని యడుగఁ జ్యవనుఁడు శత్రుఘ్నునిఁజూచి ప్రీతితోఁ జెప్పుచున్నాఁడు.)

సీ. ఎందఱో మడిసిరి • ఏటికి నాకథ, లిక్ష్వాకువంశ్యుఁ డ•హీనబలుఁడు
యువనాశ్వనందనుం • డుగ్రతేజుండు మాంధాత నా వడసిన్న•ధరణివిభుఁడు
ధారణీచక్రంబుఁ • దనయాజ్ఞలో నిల్పి, స్వర్గలోకజిగీష • జనియెదివికి
హరిహయుతోడ స•మాసనంబుననుండి. దివిజులు మ్రొక్కంగ• దేజరిల్ల

తే. గోరు నాతనిపావపుఁ • గోర్కి నెఱిఁగి, సాంత్వపూర్వోక్తి నతనికి • శక్రుఁడనియె
నేమి రాజేంద్ర! నీయాజ్ఞ • పృథివియంద, చెల్ల దే యేలస్వర్గంబుఁ • జేరరాఁగ.

అర్థములు. ప్రసిసన్న=ప్రసిద్ధికెక్కిన, స్వర్గలోక జిగీష=స్వర్గలోకమును జయించు కోరికతో, హరిహయుతో డన్=ఇంద్రునితో, అర్ధాసనంబున నుండి= ఇంద్రుఁడు కూర్చున్న సింహాసనమున నతనితో సగము పీఠమునఁ దానుండఁగోరి, సాంత్వపూర్వోక్తిన్=మంచి మాటలతో.

తాత్పర్యము

రాజు లెందఱో వచ్చిరి. ఆకథ లేల కాని మీ యిక్ష్వాకువంశమందే మిగుల బలశాలి, యువనాశ్వుని కొడుకు భయంకర తేజస్సు గలవాఁడు మాంధాత యని ప్రసిద్ధికెక్కిన రాజు భూచక్రమంతయుఁ దన యాజ్ఞప్రకారము ప్రవర్తింపఁ జేసి స్వర్గము గెలువఁగోరి యచ్చటికిఁ బోయెను. అచ్చట నింద్రుతో నేకాసనంబుననుండి దేవతలు తనకు మ్రొక్కఁగా గోరు నతని పాపపు టభిప్రాయ మెఱిఁగి మంచి మాటలతోనే రాజా నీ యాజ్ఞ భూమియందే చెల్లుటలేదే. ఇచ్చటి కేల వచ్చితివి అది గెలిచి కదా యిచ్చటికి రావలె ననెను.

క. భూలోకం బంతయు నీ, పేలం గలిగినను దివికి • నే తెమ్ము చమూ
పాళులతో నావుఁడు భూ,పాలుఁడు తలవంచి సిగ్గు • పడి యిట్లనియెన్. ౧౨-౧౩

తాత్పర్యము

భూలోకమంతయు నీవు పరిపాలింపఁ గలిగిననాఁడు స్వర్గమునీఁదికి సేనలతో రమ్ము అనఁగా రాజు సిగ్గుచేఁ దలవంచి యిట్లనియె.

తే. ఎందునాయాజ్ఞ చెల్లదో • యింద్ర! పుడమిఁ,
బలుకుమీయన లవణుడన్ • పలలభోజి
మధువనంబున నున్నాఁడు • మనుజనాథ!
చెల్లడినె యందు నీయాజ్ఞ • చెప్పుమనిన,

అర్థములు. పలలభోజి=మాంసభక్షకుఁడు=రాక్షసుఁడు.

తాత్పర్యము

(ఇంద్రా! నా యాజ్ఞ భూమియందెందుఁ జెల్లుటలేదు! చెప్పుమని యడుగ, మధువనములో లవణుఁడనెడి రాక్షసుఁడున్నాఁడు. రాజా! యచ్చట నీయాజ్ఞ చెల్లు చున్నదా? చెప్పుమని పలుకఁగా)

—• మాంధాత లవణుచే హతుఁడగుట •—

ఉ. ఘోరపువిప్రియంబు సుర • కుంజరుఁ డాడిన సిగ్గు చెంది ధా
త్రీరమణుండు కెంది చను • దెంచెద నంచు నవాఙ్ముఖంబునన్
శూరుఁడు వీడికోల్వడసి • శూలధరున్ గెలువంగ రాక్షసున్
గోరి పురంబుఁ జేరఁ జని • గొబ్బునఁ బంచెను దూత నొక్కనిన్. ౧౪-౧౫

అర్థములు. ఘోరపు విప్రియంబు=భయంకరమై యనిష్టమైనది, అవాఙ్ముఖంబునన్=తలవంచుకొని, వీడికోలు=సెలవు.

తాత్పర్యము

(భయంకరమయిన యనిష్టము నింద్రుఁడు పలుకఁగా మాంధాత సిగ్గునఁ దలవంచుకొని మరల వచ్చెద నని సెలవుపొంది శూరుఁడైన యారాజు శూలధారియగు లవణాసురుని గెల్వవలెనని వాని పత్తనము నొద్దకుఁబోయి వెంటనె యొక దూతను బంపెను.)

క. మధుపుత్రునొద్దకును వాఁ, డధికంబుగ నందు ప్రేల • నప్రియభాషల్
క్రుధచే లవణుఁడు వానిన్, వధియించి భుజించె నృపతి•వర్యుం డచటన్. ౧౨౨౦

తాత్పర్యము

(వాఁడు మధుపుత్రుఁడగు లవణునొద్దకుఁబోయి యప్రియములగు మాటలధికముగఁ బ్రేలెను. లవణుఁడువీని కోపమున నాదూతను జంపితినెను. మాంధాత యచ్చట)

ఆ. తడవు చాల నయ్యుఁ•దనదూత రాకున్నఁ, దాన యరిగి లవణుఁ•దాఁకిఘోర
బాణవృష్టి ముంపఁ • బలలాశి శూలంబు, వైచె రాజుమీఁద•బలముమీఁద.

తాత్పర్యము

(దూత యెంతసేపునకు రాకుండుటచేఁ దానేపోయి లవణునెదిర్చి భయంకరముగ బాణవర్షముచే వాని ముంచివేయ రాక్షసుఁడు రాజుమీఁద సేనమీఁద శూలమును వేసెను.)

ఆ. అదియు నృపతితోడ • నఖిలసేనాతతి, దగ్ధముగ నొనర్చి • దనుజనాథు
చేత వచ్చి నిలిచెఁ బూతచరిత్ర శత్రు,శూలాయుధంబు మహిమ•యతులితంబు.

తాత్పర్యము

(ఆ శూలము రాజుతో సేనాసమూహము నంతయుఁ గాల్చి మరల రాక్షసుని చేతిలోనికి వచ్చి నిలిచెను. పవిత్రచరిత్రా! శత్రుఘ్నా! శూలాయుధము యొక్క మహిమ మసమానము.)

ఉ. శూరవరేణ్య! వేగినను • శూలము నాలయమందు వీడి యా
హారముపొంచు దైత్యుఁడు వ•నాంతరవీథులఁ గ్రుమ్మరంగ ను
ద్వారపరాక్రమంబునను • వాని వధించెద వీవటంచు నే
తీరున మందలించు నెడఁ • దెల్పి వహించెను దూరు పంతటన్. ౧౨౨౩

అర్థములు. వేగినను=ఉదయము కాఁగా, ఆలయమందున్=ఇంటిలో, పొంచున్=కొఱకు, దీనివలన నెవరికిఁ దెలియకుండునట్లు రాత్రివేళ ఋషుల యాశ్రమమునకుఁ బోయి యందే యుదయము వఱకుండెనని యేర్పడుచున్నది.

తాత్పర్యము

(రఘువరేణ్యా! యుదయము కాఁగానే రాక్షసుఁడు శూలమును గృహము నందు వదలి యాహారము కొఱకడవులలోఁ దిరుగఁబోవును. ఆ సమయమున నీవు పరాక్రమించి వానిని వధింపవలెను. అని ఋషివిధము మందలించునప్పుడు తూరుపు తెల్లవాఱెను.)

—• శత్రుఘ్నుఁడు లవణుఁ బురంబులోనికిఁ బోకుండ నిరోధించుట •—

ఉ. ఆవలువాత దైత్యవరుఁ•డామిషకాంక్షఁ బురంబు వీడి వ
న్యావళి కేగ, దాశరథి • యంతట సూర్యసుతం దరించి యా
కావలు వీటి వాకిటను • గాంచి శరాసనహస్తుఁ డౌచు స
ద్భావనుఁ డుండె మింటి నడి•భాగము సూర్యుఁ డలంకరింపఁగన్. ౧.౨.౨౮

అర్థములు. వలువాతన్=ఉదయమున, ఆమిషకాంక్ష=మాంసము నందలి కోరికచే, వన్యావళికిన్=అడవులకు, సూర్యసుతన్=యమునను, కావలు=దుష్టుని యొక్క, వీటివాకిటను=ఊరి గవనియొద్ద, శరాసన హస్తుఁడు=విల్లుచేత ధరించినవాఁడు.

తాత్పర్యము

ఆ యుదయముననే రాక్షసుఁడు మాంసము నిమిత్తమై పురమువదలి యడవులకుఁ బోయెను. వాఁడటు పోయిన పిమ్మట శత్రుఘ్నుఁడు యమునదాఁటి విల్లుచేతఁ గొని యాతని యూరివాకిట మధ్యాహ్నము వఱకుఁగాచి యుండెను.

ఉ. క్రూరుఁడు రాక్షసుండు మృగ • కోటుల నెల్ల వధించి మోచి త
ద్భారముతోడ వచ్చి పురి • వాకిట లక్ష్మణు తమ్ముఁ గాంచి యే
కార్యము నిందుఁ జేసెదవు • కాండ శరాసము లూని నాకు నా
హారము పూర్ణమయ్యె వద•నాంతర మీ విటు వచ్చి చొచ్చుటన్. ౧.౨.౨౯

అర్థములు. తద్భారముతోడన్=ఆ చచ్చిన మృగముల బరువుతో, కాండ శరాసములూని=బాణములు విల్లు ధరించి, వదనాంతరము=నోటిలోపల.

తాత్పర్యము

(క్రూరుఁడైన రాక్షసుఁడు మృగములను జంపి మోచి యా చచ్చిన మృగముల బరువుతో వచ్చి పత్తనమువాకిట శత్రుఘ్నునిఁ జూచి విల్లు నమ్ములు పూని యిక్కడ నేమి చేయుచున్నావు? నా నోటిలోపల నీవీ విధముగా వచ్చి ప్రవేశించుటచే నాహారము నాకుఁ బూర్తియైనది.)

చ. అని కడుబిగ్గనవ్వు దను•జాధముఁ గాంచి సుమిత్ర పట్టి పె
న్గినుకను బొప్పము ల్దొరలఁ • గీలలు పెల్వడ గాత్రదేశమం
దనియె దురాత్మ నిన్నొడరి • యాహవ మే నొనరింప వచ్చినాఁ
డను, నినుఁ గాలుప్రోలికి గ•డంకను బంపెద నేల నవ్వఁగన్. ౧.౨.౩౦

అర్థములు. కీలలు=జ్వాలలు, గాత్రదేశమందున్ = దేహమునందు, తొడరి=ఎదిరించి, కాలుప్రోలికిన్ = యమునిపురమునకు, కడంకను=పరాక్రమముచే.

తాత్పర్యము

అతి పెద్దగా నవ్వు నా రాక్షసాధముని జూచి శత్రుఘ్నుఁడు కోపముచేఁ గన్నుల నీళ్లురాల దేహమునుండి యగ్నిశిఖలు వెలువడ నిట్లనియె. దుష్టుఁడా! నిన్నెదిరించి యుద్ధముచేయ వచ్చితిని. నిన్నుఁ జంపెదను. ఏల నవ్వెదవు ?

క. తనయుండను దశరథునకు, ననుజుండను రామునకు ని◆శాటవరేణ్యా!
వినరా! నే శత్రుఘ్నుఁడ, జనరక్షాపరుఁడ నిత్య◆శత్రుఘ్నుండన్. ౧౨

అర్థములు. నిశాటవరేణ్యా=రాక్షసశ్రేష్ఠుఁడా, నిత్యశత్రుఘ్నుండన్=నిత్యశత్రువుల జయించినవాఁడను.

తాత్పర్యము

(రాక్షసశ్రేష్ఠా! నేను దశరథ మహారాజు కుమారుఁడను, రామచంద్రమూర్తి తమ్ముఁడను. నాపేరు శత్రుఘ్నుఁడందురు. లోకులను రక్షింపఁ గోరువాఁడను. నిత్యశత్రువుల జయించిన వాఁడను. వినరా,)

తాత్పర్యము.

ఉ. కావున ద్వంద్వ యుద్ధమున ◆ కాంక్ష దలిర్పఁగ వచ్చినాఁడ, నీ
చావు నిజంబు నావుడు ల ◆ సత్పరిహాసవికాసవక్త్రర
క్షోవరుఁ డాగ్రహంబునను ◆ గూళుఁడ! నాతలితోడఁ బుట్టు వా
రావణుఁ, డాతనిం దునిమె ◆ రాముఁ డనిం దరుణీనిమిత్తమై. ౧౩

అర్థములు. లసత్=ప్రకాశించు, పరిహాస=నవ్వుచే, వికాస=తెఱచుకొనఁబడిన, వక్త్ర=నోరుగల, రక్షోవరుఁడు=రాక్షసశ్రేష్ఠుఁడు, కూళుఁడ=దుష్టుడా, అనిన్=యుద్ధమందు, తరుణీనిమిత్తమై=ఆఁడుదానికొఱకు.

తాత్పర్యము

(కావున నీతో ద్వంద్వయుద్ధము చేయఁ గోరి వచ్చితిని. నీ చిఁక జచ్చినవాఁడవే నిజము. అని యనఁగాఁ బెద్దగా నోరు తెఱచి నవ్వి కోపముతో దుష్టుఁడా! నా మేనమామ రావణాసురుఁడు- ఆఁడుదాని కొఱకు రాముఁడు యుద్ధములో నాతనిఁ జంపెను.)

క. మునుపటివారల నధునా,తనులను బోరి గొంటి నృపులఁ ◆ దక్కిన వారిన్
మనమునఁ దృణీకరించితిఁ, గనుకం జాల శాంతిఁ దాల్చి ◆ కదలక యుంటిన్.

అర్థములు. అధునాతనులను=ఇప్పటివారిని, పోరిగొంటిన్=చంపితిని.

### తాత్పర్యము

నా మేనమామకు నేనేల సహాయపడలేదందువా? నేను మునుపటి రాజులను ఇప్పటి రాజులను జంపితిని తక్కిన వారిని నేను లక్ష్యము చేయలేదు. కావున నేను రాముని జంపుటకై రావణునకుఁ దోడుపడలేదు.

ఉ. రావణునంతే మెల్లను దు◆రంబునఁ గూలుటయున్ సహించితిన్;
నీవిట వచ్చినాఁడవె య◆దిన్ ననుఁ దాఁకఁగ? నేను శూల మెం
తేవఁడఁ దెత్తుఁ దాఁకు మొక◆యింత యనన్ నృపసూతి నవ్వి నే
జీవముతోడ నుండ నెటు◆చేకొనఁ బోయెద వోరి శూలమున్. ౧౨౩౦

అర్థములు. దురంబునన్=యుద్ధమునందు.

### తాత్పర్యము

(యుద్ధములో రావణుని వంటి వంతయును నాశముగుట కోర్చితిని; నన్నెదిరించుట కిక్కడకు వచ్చితివా? కొంచెము సేపు తాళు. నేను శూలమును త్వరగాఁ దీసికొని వచ్చెదను. అని చెప్పఁగా శత్రుఘ్నుఁడు నవ్వి నేను జీవముతో నుండఁగా నోరీ! నీవు శూలమును దెచ్చుట కెట్లు పోయెదవురా?)

క. పగతుఁ◆డు యాదృచ్ఛికముగ, నగపడినన్ విడుచు మూఢుఁ◆డవనిం గలఁడే?
జగముల కెల్లను శత్రువ వగునో దుష్టాత్మ! నీకు◆నంతర మొసఁగన్. ౧౨౩౧

అర్థములు. యాదృచ్ఛికముగన్=ఆకస్మికముగ, అంతరము=సందు.

### తాత్పర్యము

(పగవాఁ డాకస్మికముగా నగపడినప్పుడు వదలిపెట్టు మూఢుఁడు భూమిలో నుండునా? లోక కంటకుఁడవగు నో దుష్టాత్మా! నీకు సందీయను.)

### —◆ లవణ శత్రుఘ్నుల యుద్ధము ◆—

సీ. అనవుడు మధుపుత్రుఁ◆డట్టహాస మొనర్చి, పాణిఁ బాణిని నల్చి◆పటపట మన
దంతముల్, పోరికి◆ధరణీశుఁ బిల్వంగ, నతఁడు రక్కసుతోడ◆ననియె నోరి!
మున్ను నీ గెలిచిన◆యన్నృపతులలోని, వాఁడఁగా నన్నెంచ◆వలదు నిన్నుఁ
బరిమార్చి బుధుల ని◆ర్భయులను గావింతు, నుగ్రతూణీర బాణాగ్ని◆మహినిఁబడిన

తే. నిన్ను రావణు సమకాలు◆గన్నులార, గాంచినట్టులు విప్రులు◆బ్రహ్మజనంబు
గాంచుఁ గావుత క్షేమంబుఁ◆గనెడిగాక, యూళ్ళుఁ బల్లెలు నేఁడాది◆యుదిలకొనక.

అర్థములు. అట్టహాసము=పెద్దనవ్వు. ఉదిలగొనక=పరితాప పడక.

తాత్పర్యము

(అని చెప్పఁగా లవణుఁడు పెద్దగా నవ్వి చేతినిఁ జేతితో నలిపి పండ్లు పట పట కొఱుకుచు శత్రుఘ్నుని యుద్ధమునకు రమ్మని పిలువఁగా నతఁడు రాక్షసునితో నోరీ! మునుపు నీవు గెలిచిన రాజులలోనివానిఁగా నన్నుఁ దలఁపకుము – నిన్నుఁ జంపి ఋషుల భయము వాపెద – క్రూరములగు నా బాణములచే నేలఁగూలిన నిన్ను రావణుని దేవతలు కన్నులారఁ జూచినట్లు విప్రులు లోకులు చూచెదరు గాత – ఊళ్ళు పల్లెలు నేఁడు మొదలుగఁ బరితాప ముడిగి క్షేమపడుఁ గాత.)

ఉ. మామకహస్తముక్తశిత ♦ మార్గణరాజులు వజ్రతుల్యతే
జోమయముల్ దివాకరరు ♦ చుల్ సరసీజముఁ జొచ్చు భంగి దు
ర్ధామజవంబునన్ ఖలుఁడ ♦ తావకహృత్స్థలిఁ జొచ్చుఁ జూడుమీ
నా మధునందనుండు రఘు♦నందను వైచె ధరారుహంబునన్. ౧౨౩౩

అర్థములు. మామక హస్తముక్త=నాచేత విడువఁబడిన, శిత=వాడియైన, మార్గణరాజులు=బాణసమూహములు, వజ్రతుల్య తేజోమయమున్=వజ్రముతో సమానమైన తేజస్సుచే నిండినది, దివాకర రుచుల్=సూర్యకాంతి గలవి, సరసీజము=కమలమును, దుర్ధామజవంబునన్ = ఆఁపరాని వేగముతో, తావక=నీ యొక్క, హృత్+స్థలి=హృదయప్రదేశము, ధరారుహంబునన్=చెట్టుచే.

తాత్పర్యము

వజ్రమువంటి తేజస్సు సూర్యునివంటి కాంతి కలిగి నాచే విడువఁబడినబాణ సమూహములు తుమ్మెదలు కమలమునందుఁ జొచ్చునట్లు నీహృదయము లోపలఁ బ్రవేశించి నీ ప్రాణవాయువులను తేనెవలెఁ గ్రోలును. దుష్టుఁడా! చూచుచుండుము. అనిన రాక్షసుఁడు శత్రుఘ్నుని చెట్టుతోఁ గొట్టును.

ఉ. దానిని నూఱుతున్కలుగ ♦ ధారిణి వ్రాల్లఁగ నేయఁ గింకచే
దానవుఁ డుగ్రభంగి వసు♦ధారుహవర్షము మీఁదఁ గొల్పినన్
మానవనాయకుండు ఖర♦మార్గణపంక్తి నణంచె దాని ని
క్కైన నిశాటుఁ డుద్ధతి ద్రు♦మాహతి నొంచె నరేంద్రుమూర్ధమున్. ౧౨౩౪

అర్థములు. వసుధారుహవర్షము=చెట్లవాన, ఖరమార్గణ పంక్తిన్ = తీక్ష్ణములైన బాణముల వరుసలచే, ద్రుమహతిన్=చెట్టుదెబ్బచే, మూర్ధమున్= తలను.

తాత్పర్యము

ఆ చెట్టును నూఱు తుంటలుగ నేలఁబడఁగొట్టగా రాక్షసుఁడు కోపించి చెట్ల వాన గురియించెను. దానిని శత్రుఘ్నుఁడు తీక్ష్ణబాణములచే నణంచెను గాని రాక్షసుఁడు చెట్టుతో శత్రుఘ్నుని తలపైఁ గొట్టెను.

తాత్పర్యము

క. శత్రుఘ్నుఁడు సడలుడు నిజ,గాత్రంబున సంధులెల్ల • గడిమి చెడి పడెన్
ధాత్రిపయి మూర్ఛమునుప సుమిత్రాసుతుఁడిట్లు కూల•నింట న్వేల్పుల్. ౧౨౩౧

అర్థములు. కమిడి=బలము.

తాత్పర్యము

(తన దేహమున సంధులు సడలి బలముడిగి శత్రుఘ్నుఁడు నేలమీఁద మూర్ఛిల్లిపడెను. ఆ శత్రుఘ్నుఁడీ ప్రకారము పడిపోఁగా, నాకసమున దేవతలు)

క. చారణగంధర్వులు ఋషి, వారంబులు నప్పరపలు • భయపడి హాహా
కారంబులు నింపఁగ దేవారియు హతుఁ డయ్యె శత్రుఁ•డనుచున్ మదిలోన్.

అర్థములు. దేవారియు=లవణుఁడు కూడ.

తాత్పర్యము

(చారణులు, గంధర్వులు, ఋషిసమూహములు నచ్చరలు భయపడిహాహాకారము లొనరించిరి. దేవవిరోధి లవణాసురుఁడు పగవాఁడు చచ్చినాఁడని తన మనస్సునందు)

తే. సడ్డ సేయక శూలంబు • సంగ్రహింప
జనఁగ, లబ్ధావకాశుఁడై • సత్త్వములను
గొనుచు నుండఁగ శత్రుఘ్నుఁ • డును ముహూర్త
మాత్రమునఁ బ్రాప్తసంజ్ఞుఁడై • మౌను లలర. ౧౨౩౨

అర్థములు. సడ్డచేయక=లక్ష్యములేక, చచ్చినాఁడు వీఁడేమి చేయఁగలఁడను తలంపుతో, చనఁడు=పోయినవాఁడు కాఁడు, లబ్ధావకాశుఁడై=విరామము దొరికినవాఁడై, సత్త్వములను=జంతువులను, వాఁడు తెచ్చినమోపు యుద్ధమువలన నేలపడవైచెను, దాని నిప్పుడు మరల సవరించి కట్టుకొనుచున్నాఁడు. ప్రాప్తసంజ్ఞుఁడై=స్మృతినొందినవాఁడై, మౌనులలరన్=మునులు సంతోషపడుచుండఁగా దీనివలన మునులు దూరమునుండి యుద్ధము చూచుచుండిరని సూచన.

తాత్పర్యము

(లక్ష్యము చేయక శూలము తెచ్చికొనఁ బోయినవాఁడు కాఁడు సందు దొరికినదని నిదివఱకు యుద్ధము చేయునప్పుడు క్రిందపడవేసిన జంతువుల మోపు. మరల సవరించి కట్టుకొనుచుండెను శత్రుఘ్నుఁడు స్వల్పకాలముననే మూర్ఛ తెలిసి మునులు సంతోషపడుచుండఁగా.)

—• శత్రుఘ్నుఁడు లవణు వధించుట •—

సీ. శత్రువు నెదిరించి శరంబాసనంబున శతకోటివేగంబు • శాతకుంభ
శైలమంధర•సన్నికాశంబును, నతపర్వ ముగ్ర మ•నాహతంబు
శోణితచందన • శోభితంబును జారు, పత్రంబు దానవ•భంజనంబు
ప్రలయకాలానలా•భంబు, మహాస్త్రంబు సర్వభూతంబులు•సంభ్రమింపఁ

తే. దీయఁ గిన్నరగంధర్వ • దేవసమితి, మునులతోడుత నప్సరో•జనముతోడ
ధాతఁ గానఁగఁ జని భూత•ధాత్రియెల్ల, భువనములు నాశనంబగు•పోల్కిఁ దోఁచె.

అర్థములు. శంబానంబును=వజ్రముఖమును, శతకోటి=వజ్రాయుధము యొక్క, శాతకుంభ శైల=బంగారుకొండ మేరువు. మందరధర=మందర పర్వతముతో, సన్నికాశంబును=పోలినదియు, నతపర్వము=వంగిన కణుపులుగలది, అనాహతంబు=కొట్టుపడనిది, శోణితచందనశోభితంబును = ఎఱ్ఱని గంధముచేఁ బ్రకాశించునదియు, చారుపత్రము=అందమైన కణుపులు గలది, దానవ భంజనంబు=రాక్షసుల వధించునది, ప్రలయకాలానలాభంబు = ప్రలయకాలాగ్నితో సమానమైనది.

తాత్పర్యము

వజ్రముఖంబును వజ్రవేగంబును మేరుమందర గౌరవంబును భయంకరమును వంగిన కణుపులు గలదియు పరాభవము లేనిదియు రక్తచందనముచేఁ బ్రకాశించునదియు రాక్షసులఁ జంపునదియు ప్రలయకాలాగ్నితో సమానమైనదియు నగు మహాస్త్రంబును ప్రాణికోటు లన్నియు భయపడునట్లు దీయఁగా కిన్నరులును దేవ గంధర్వులు మునులతోడను అప్సరోజనలతోడను బ్రహ్మను జూడఁబోయి భూమియు సమస్త ప్రాణులు నాశమగు నట్లున్నది.

చ. అనవుడు బ్రహ్మపల్కు నమృ•తాంధసులార! భయంబు హేతువున్
వినుఁడు సుమిత్రనందనుఁడు • విశ్వపరున్ లవణున్ వధింపఁగా
ధనువునఁ గూర్చినాఁడు భయ•దం బగునస్త్రము దాని తేజమున్
మన మతిమూఁఢ మయ్యెఁ జెడి•నాకును మీకుఁ బ్రపంచ మంతకున్. ౧౨౬

అర్థములు. అమృతాంధసులార = దేవతలారా! విశ్వపరున్=ప్రపంచ ద్రోహిని.

తాత్పర్యము

అని చెప్పఁగా బ్రహ్మ యిట్లనియె. దేవతలారా! భయకారణము చెప్పెద వినుఁడు. విశ్వద్రోహియగు లవణుని జంపుటకు శత్రుఘ్నుఁడు భయంకరమైన యస్త్రమును వింట సంధించినాఁడు దాని తేజస్సుచే మీకు నాకు ప్రపంచమంతకు మనస్సు దిగ్భ్రమ చెందినది.

తే. అది సనాతనుఁడైన లో • కాదికర్త
దగుటఁ దేజోమయంబు ము • న్నసురులైన
మధునిఁ గైటభుఁ దునుమంగ • మాధవుండు
దాని సృజియించె; దాని నా • తం డొకం డె. ౧౨౭

అర్థములు. లోకాదికర్త=లోకమునకు మొదటికర్త.

### తాత్పర్యము

(ఆ యస్త్రము సనాతనుఁడైన లోకముల కాదికర్త యయిన సర్వేశ్వరునిది. కావునఁ దేజోమయమైనది. పూర్వము మధుకైటభులను రాక్షసులను జంపుటకు శ్రీమన్నారాయణుఁడు దానిని సృజించెను. దాని నాతఁడొకఁడే.)

చ. తెలిసినవాఁడు, వెన్నునకుఁ • దేజ మియ్యది కాన మీరు త
త్తలమున కేగి దైత్యునివ•ధంబును జూడుఁ డటన్న వారలున్
గలహధరిత్రికిం జనిరి • కార్ముకమందు శరంబుఁ గూర్చి తాఁ
బిలిచె విరోధి, నాతఁడును, • బేర్చిన కింకను బాఱుదెంచినన్. ౧౨౪౧

అర్థములు. వెన్నునకున్=విష్ణునకు, కలహధరిత్రికిన్=యుద్ధభూమికి.

### తాత్పర్యము

(తెలిసినవాఁడు, విష్ణుని తేజమది. కావున మీరా చోటికిఁ బోయి రాక్షసుని చావు చూడుఁడు. అనఁగా వారలు యుద్ధభూమికిఁ బోయిరి. శత్రుఘ్నుఁడు వింటియందు బాణమును దొడిగి తాను విరోధినిఁ బిలిచెను. వాఁడును మించిన కోపమునఁ బరుగెత్తికొని రాఁగా.

శా. ఆకర్ణాంతము లాగి తచ్ఛరము దై•త్యాధీశునిన్ వ్రేయ న
వ్యాకీర్ణద్యుతిపూర మభ్రపదవిన్ • వ్యాపింపఁగా నేగి యా
లోకద్వేషియురంబు వ్రచ్చియు నధో•లోకంబుఁ బ్రాపించి యి
క్ష్వాకుప్రోద్భవుతూణిఁ జొచ్చె సుర లా•శ్చర్యంబున న్మున్గఁగన్. ౧౨౪౨

అర్థములు. ఆకర్ణాంతము=చెవివఱకు, అవ్యాకీర్ణద్యుతిపూరము=చెదరని కాంతిప్రవాహము, అభ్రపదవిన్ =ఆకాశమార్గమున, లోకద్వేషి=లోకజనులకుఁ బగవాఁడగు రాక్షసుని యొక్క, వ్రచ్చి=చీల్చి, అధోలోకంబు=పాతాళము.

### తాత్పర్యము

అల్లెత్రాడు చెవికొనవఱకు లాగి యా బాణమును రాక్షసుని మీఁద వ్రేయఁగా నాకాశమును కాంతిప్రవాహముచే నిండించుచు పోయి సర్వజనద్రోహి యగు వాని ఱొమ్మును బగులఁజీల్చి పాతాళమునకుఁ బోయి మరలివచ్చి శత్రుఘ్ను నంబుల పొదిలోఁ బ్రవేశించెను, చూచుచున్న దేవత లాశ్చర్యపడిరి.

క. లవణుఁడు శరనిర్భిన్నుం, డవనిం బడె వజ్రహతమ•హాశైల మనన్
దివిజులు గన శూలము సని, శివుఁ గలసె యమున్ సురారి•చేరిన మాత్రన్.

అర్థములు. శరనిర్భిన్నుఁడు=బాణముచే భేదింపఁబడినవాఁడు, వజ్రహతమహాశైలము=వజ్రాయుధముచే గొట్టఁబడిన పెద్ద పర్వతము.

తా త్ప ర్య ము

బాణముచే హృదయము భేదింపఁబడఁగా లవణుఁడు వజ్రముచేఁ గొట్టఁబడిన పర్వతమువలెఁ బడిచచ్చెను. వాఁడు చావఁగానే శూలము శివునిలోఁ గలిసెను.

క. ఖరకరుఁ డిరులం దోలెడి, కరుసన రామానుజుండు • పటుశరమొకటన్
హరియించెన్ భువనత్రయి, పురుతరసాధ్వసము బుధులు • పొగడుచునుండన్.

అర్థములు. ఖరకరుఁడు=సూర్యుఁడు, ఇరులన్=చీఁకటులను, పటుశర మొకటన్=ఒక్క బలిష్ఠమైన బాణముచే, భువనత్రయపురుతరసాధ్వసము = మూఁడు లోకముల గొప్పభయము, బుధులు=దేవతలు.

తా త్ప ర్య ము

(సూర్యుఁడు చీఁకటులను బోఁగొట్టునట్లు శత్రుఘ్నుఁడు బలిష్ఠమగు నొక్క బాణముచే మూఁడు లోకములకుఁ గలిగిన భయము దేవతలు పొగడుచుండఁ బోఁదోలెను.)

ఆ. మధుసుతుండు కూల • మౌనులు వేల్పులు,పన్నగులును పాము • వలని భయము
విడిచినట్లు మోద • విభవంబు పొల్చార, శాంతచిత్తు లగుచుఁ • జనినయంత

తా త్ప ర్య ము

•(లవణుఁడు చావఁగా మునులు దేవతలు పన్నగులు పామువలనఁ గలిగిన భయమువదలిన విధమున సంతోషాతిశయమున శాంత చిత్తులయి చనిన పిమ్మట)

—• దేవతలు శత్రుఘ్నునకు వరమిచ్చుట •—

సీ. అగ్నిపురోగము • లమరులు పాకారి,తోడ శత్రుఘ్నునిఁ • జూడ వచ్చి
మధురోక్తిఁ బల్కిరి • మధునందను నదృష్ట వశమునఁ జంపితి • ప్రథితశౌర్య!
వరమిచ్చుకోరిక • వచ్చియున్నారము, మా దర్శనం బెప్డు • పోదు వృథగ
నెద్ది నీకోరిక • యొఱఁగింపుమీ యన, శిరమునఁ గరములు • చేర్చిపలికె
తే. రాజధానిగ నీమధు • రాపురంబు, దేవనిర్మిత మమరుత • దివ్యులార!
యనిన నోఁ గాక మఱియు రా • మానుజన్మ, శూరసేనగ నౌనని • వారలెల్ల.

అర్థములు. అగ్నిపురోగములు=అగ్ని మొదలుగాఁగలవారు, పాకారి తోడన్=ఇంద్రునితో, మధురోక్తిన్=తియ్యని మాటలచే, ప్రథితశౌర్య=ప్రసిద్ధికెక్కిన శౌర్యము గలవాఁడా! శూరసేనగ=శూరులగు సేనగలది, శూరసేనయను పేరుగలది.

తా త్ప ర్య ము

(అగ్ని మొదలగు దేవతలు దేవేంద్రునితో శత్రుఘ్ను నొద్దకు వచ్చి తీయని మాటలాడిరి. ప్రసిద్ధి శౌర్యశాలివగు శత్రుఘ్నా! అదృష్టవశమున లవణునిఁ జంపి

తివి. నీకు వరమీయఁ గోరి వచ్చినారము. మా దర్శనము వృథాగాఁబోదు. నీ కోరిక యేది తెలుపుము. అని పలుకఁ దలమీఁద జేతులు మోపి వినయమున దేవతలారా! దేవతలచే నిర్మింపఁ బడిన మధురాపురము రాజధానిగ నమరును గాత, మని యడిగెను. దానికి వా రట్టులే యగుగాక, మఱియు నిదియు శూర సేనగ నౌనని వారలందఱు.)

ఆ. వర మొసంగి దివికి • నరుగ శత్రుఘ్నుండు, పిలువఁ బంచెఁ దనదు • దళము నెల్ల
వచ్చి మథురయందు • వల నగుచోటుల, నెలవు గొనియె జనము • లలితభంగి.

అర్థములు. దళము నెల్లన్=సేనసంతయు.

తాత్పర్యము

(వరమిచ్చి స్వర్గమునకుఁ బోవ, శత్రుఘ్నుఁడు తన సేనసంతయుఁ బిలువఁ బంచెను. జనము వచ్చి మథురయం దనుకూలమగు చోటుల నివాస మేర్పఱుచు కొనెను.)

మథురయందు రెండవ యక్షరము తవర్గ ద్వితీయాక్షరము.

—• శత్రుఘ్నుఁడు మథురాపురంబు నభివృద్ధి పఱచుట •—

తే. శ్రావణంబున నిట్లు ప్రా • రంభ మయ్యెఁ, దన్ని వేశన మాది యా • ద్వాదశాబ్ద
మునను నిండారి సేనాస • మూహములను, దద్విషయములు నిర్భయ • తనరహించె!

అర్థములు. తద్విషయములు=ఆ దేశములు, నిర్భయతన్=భయము లేమిచే.

తాత్పర్యము

పురమేర్పాటు శ్రావణమునఁ బ్రారంభమై పండ్రెండు సంవత్సరములకు సేనాసమూహములతో నిండి ఆ దేశములను భయము విడిచిన దయ్యెను.

సీ. కాలకాలమున వా • కారి వాన లొసంగఁ, బైరులుఁ బచ్చలుఁ • బ్రబలమయ్యె
నారోగ్యయుక్తులై • రఖిలమానవులును, సుందరగృహముల • సొగసు లెసఁగె
సంగడివీడులు • రంగారుచుండెను, వాణిజ్యసంపద • బహుళ మయ్యె
లవణ కల్పితమహా • భవనంబు సుకృతమై. పెరుఁగు వన్నెలకల్మిఁ • బేర్మిఁ గాంచె.
తే. నర్ధచంద్రనిభంబయి • యమునతీర, మందుఁ బుర మొప్పుచుండె వా • హ్యాళి యోగ్య
సుందరారామములు చాల • శోభఁ గూర్చె, హాళి శత్రుఘ్నుఁ డాపురి • నేలు వేళ.

అర్థములు. వాహ్యాళి యోగ్యము=వినోదముగాఁ దిరుగుటకుఁ దగినది.

తాత్పర్యము

(శత్రుఘ్నుఁడు రాజ్యము చేయు కాలమున నింద్రుఁడు ప్రతికాలమున వాన గురిసెను. పైరుపచ్చలు ప్రబలెను. మనుష్యులందఱు ఆరోగ్యవంతులయి యుండిరి. సుంద

రములగు నిండ్లయందు సొగసులతిశయించెను అంగడి వీథుల సొంపుగా నుండెను. వ్యాపారము విస్తరించెను. లవణాసురుఁడు కట్టించిన మహాభవనము మంచి పనితనము కలిగి పలువన్నెల నలరారుచుండెను. యమున యొడ్డున నర్థచంద్రాకారముగఁ బత్తనము చూడ నొప్పియుండెను. వినోదముగా విహరించుటకుఁ దగిన యందమగు తోఁట లా పురికిఁ జాలశోభఁ దెచ్చెను.)

తే. అన్యతలములనుండి వై♦శ్యాళి వచ్చి, నెలవుకొనెనందు నీ రీతి♦ నిర్భయముగఁ
బురము ప్రోపువహించినఁ ♦ బొంగి లక్ష్మ, ణానుజుఁడు పది రెండవ♦హాయనంబు.

తాత్పర్యము

(ఇతర స్థలములనుండి వైశ్యులు వచ్చి స్థిరనివాసము లేర్పఱుచుకొనిరి. ఈ విధముగాఁ బట్టనమునందెట్టి భయములేక యభివృద్ధినందుటకు సంతసించి శత్రుఘ్నుఁడు, పండ్రెండవ యేఁడు.)

క. పుట్టిన రాముని పదములు, పట్టి నమస్కృతిని జేయు ♦ భావము దనకున్
బుట్ట మితజన్యుతుండై, పట్టనమున్ మంత్రిజనుల♦వశమున నిడుచున్. ౧-౫౧

తాత్పర్యము.

పండ్రెండు సంవత్సరములు జరుగగా నన్నను జూచి నమస్కరింప వలయునను తలంపు కలిగి కొలఁది జనములఁ దీసికొని పట్టనము మంత్రుల కప్పగించి పండ్రెండు సంవత్సరము లొకరి నొకరు చూచుకొనకుండిన మరల దర్శన ప్రాప్తి లేదు. వారు చచ్చిన వారితో సమానులు.

—♦ శత్రుఘ్నుఁడు వాల్మీకి యాశ్రమంబున విడియుట ♦—

సీ. అరదముల్ నూఱుతో♦నరుదేర నియమించి, యేడెనిమిది తావు♦లేర్పరించి
యందంద నిలుచుచు♦నసఘుఁడా వాల్మీకి, యాశ్రమంబును జేరి♦యమ్మహాత్ము
పాదంబులకు మ్రొక్కి♦పాద్యంబుఁ గైకొని, యర్ఘ్యమాతిథ్యంబు♦నందియుండె
నన్ని యాకథలు ము♦నీశుండు వచియింప,వినుచుండె నృపసూతి♦వేడ్క మీఱ

తే. వాల్మికుండును బ్రస్తావ♦వశముఁ జేసి, లవణువధఁ గూర్చి యిట్లను♦లలితచరిత.
దుష్టచరితుని లవణునిఁ ♦ ద్రుంచి నీవు, జగములకు మేలు నేసితి♦సత్యశౌర్య!

అర్థములు. తావులు=దిగుస్థలములు.

తాత్పర్యము

(నూఱు రథములు వెంట వచ్చునట్లులు నియమించి యేడెనిమిది దిగుస్థలము లేర్పాటుచేసి యచ్చట నచ్చట నిలుచుచు శత్రుఘ్నుఁడు వాల్మీకాశ్రమమును జేరి యామహాత్ముని శ్రీపాదములకు మ్రొక్కి, వారివలన నర్ఘ్యపాద్యాదులుగ్రహించి

యాతిథ్యమును బడసియుండ వాల్మీకి మహర్షి యెన్నియో కథలు చెప్పుచుండ వినుచుండెను. వాల్మీకి ముని ప్రస్తావవశమున లవణాసురవధను గూర్చి చెప్పుచు నత్యమయిన శౌర్యముగల నీవు దుష్ట చరిత్రుఁడగు లవణునిఁజంపి లోకములకు మేలు సేసితి.)

క. నీ తేజంబున లోకము భీతి యణంగెను దశాస్యుఁ • బెనుజతనమునన్
సీతాపతి గూల్చెను నీ, వీతనిఁ బోరిఁగొంటి యత్న•హీనత నర రే! ౧౨౫౩

అర్థములు. పెను జతనమునన్=పెద్ద ప్రయత్నము చేసి, వానరులనుగూర్చు కొని సేతువు కట్టి యేడు దినములు యుద్ధముచేసి రావణుని రాముఁడు చంపెను. నీవంత కంటె బలవంతుని నే ప్రయత్నము లేక యొంటరివై చంపితివి. ఏమి యాశ్చర్యము.

ఉ. వాసవులోక నుండి సుర•వర్త్మమునం గనుఁగొంటి నీవు దు
ష్టాసురుఁ జంపు భంగి భవ•దద్భుతవిక్రమశక్తి కెల్లరున్
వాసి రహింప మెచ్చిరిదెఁ • బార్థివనందన! నాకు నెంతో సం
తోసము గల్గె భూతవిత•తుల్ ప్రియ మందెను నీదు సత్కృతిన్. ౧౨౫౪

అర్థములు. సురవర్త్మమునన్=ఆకాశమున.

తాత్పర్యము

(నే నింద్రునితో నాకసమునుండి నీవు లవణాసురునిఁజంపు విధమంతయుఁ జూచితిని. అద్భుతమగు నీ పరాక్రమము కందఱును మెచ్చుకొనిరి. నాకును సంతోషమైనది. సర్వప్రాణులు నీవు చేసిన సత్కార్యమునకుఁ జాలప్రీతి వహించినవి.)

క. ప్రేమ సమగ్రము నాకును నీ మూర్ధము మూరుకొందు • నే, నే నిపు డో
రామానుజ! యిదియే కద, ప్రేమమునకుఁ బరమగతి వి•వేకధురీణా! ౧౨౫౫

అర్థములు. మూరుకొందునే=వాసన చూతునా

తాత్పర్యము

(రామానుజా! నాకును నీయెడఁ బ్రేమ సంపూర్ణముగ నున్నది. నేనిప్పుడు నీ శిరము వాసన చూతునా? ప్రేమమున కిదియే కదా పరమావధి)

క. అని శిరమును మూర్కొని తన నెనరుం గనఁబఱిచి యాత•నిం గొలిచెడి త
జ్జనముల కాతిథ్యంబును, మునివరుఁడు ఘటించె వారు•మోదముఁ గూరన్.

అర్థములు. నెనరు=ప్రేమ.

తాత్పర్యము

(అని శత్రుఘ్నుని శిరస్సు వాసనచూచి, తన ప్రేమను గనఁబఱచి, యతని తో వచ్చిన వారు సంతోషపడునట్లు వాల్మీకి మహర్షి వారికాతిథ్యమొసఁగెను.)

—• శత్రుఘ్నుఁడు శ్రీరామాయణమును వినుట •—

సీ. శత్రుఘ్నుఁ డాహార•సంతుష్టిఁ గాంచి యు,క్తకాలంబునను యథా•క్రమముగాఁగఁ
దంత్రీలయయుతంబుఁ • దాలాన్వితంబును, సంగీతమాధుర్య•సంయుతంబు
సంస్కృతంబును సుల•క్షణసముపేతంబుఁ ద్రిస్థానకరణసం•దీపితంబుఁ
బూర్వకృతంబు నై•పొలుపొందు శ్రీరామ, చరిత యథావృత్త•సరణి మొదటి

ఆ. నుండి వినియె సర్వ•ముర్వీశుఁ డది వీత, చేష్టుఁ డగుచుఁ గనులు•చెమ్మగిల్ల
విగతసంజ్ఞుఁ డగుచు•వెఱను నిట్టూర్చుచు, వినియె నపుడు జరుగు•విధము దోఁప.

అర్థములు. ఆహార సంతుష్టిన్=ఆహారముచేఁ దృప్తిని, తంత్రీ=వీణెల తంత్రులతోను, లయ=లయతోను, తాలాన్వితంబును=తాలముతోడను గూడినది, సంగీత మాధుర్య సంయుతంబు=మధురమైన సంగీతముతోఁ గూడినది, సంస్కృతంబును=సంస్కృత పదములతోఁ జెప్పఁబడినది, సులక్షణసముపేతంబు=కావ్యలక్షణములతోఁ గూడినది. త్రిస్థాన కరణసందీపితంబు = త్రిస్థానములు= హృదయము, కంఠము, ముఖము, ఇవి వర్ణోత్పత్తి స్థానములు, వీని ప్రయత్నముతో గూడినది, అనఁగా నే యే యక్షరము స్వర మెచ్చటఁ బుట్టవలయునో యే ప్రయత్నము కావలయునో యది సరిగాఁ గలది, పూర్వకృతము = మునుపు జరిగినది, యథావృత్తము=యథాప్రవృత్తము, యథానుభవముగా జెప్పఁబడినది.

తాత్పర్యము

వాల్మీకి యిచ్చిన యాహారముచే సంతోషించి శత్రుఘ్నుఁ డా కాలమున సక్రమముగా వీణెమీఁద లయ తాలము సరిపోవునట్లు సంగీతశాస్త్ర ప్రకారము మధురముగ సంస్కృతభాష యందు వ్యాకరణ దోషములు లేక శాస్త్రసమ్మతమైన రీతిని, ఏ యే యక్షరము ఏయే స్వరము, ఏయే ప్రదేశములఁ బుట్టవలయునో యట్టి స్థానములు ప్రయత్నములు గలదై పూర్వమాయా నాయికా నాయకులచేఁ జేయుబడినదై యొప్పు శ్రీరామ చరిత్రము ఎట్లు జరిగినదో యట్లు మొదటినుండి శత్రుఘ్నుఁడు వినెను. విని యాశ్చర్యముచేఁ జేష్టలు మాని కనుల నీరు గాఱ తన్నుదాను మఱచి భయముచే నిట్టూర్పులు విడుచుచు అప్పుడు జరుగుచున్నదా యేమి యను నట్లు వినెను

చ. నరపతితోడి వచ్చిన జ•నంబులు గీతము నాలకించి య
చ్చెరుపడి దీనతం గనుచు • శీర్షము లొయ్యన వ్రాలి వారిలోఁ
బరఁగుననె యిట్టిచిత్ర; మిది • స్వప్నమ, యెచ్చట నున్నవార, మే
కరణిని గంటిమో మునుపు•కార్యము లయ్యవి యాశ్రమంబునన్. ౧౩౯౫

తాత్పర్యము

(శత్రుఘ్నునితో వచ్చిన జనులు గానమువిని యాశ్చర్యపడి దీనతతోఁ జూచుచుఁ దలలు వెల్లన వ్రాల్చి వారిలో వార లిట్టి చిత్రము కలదా? ఇది కలయా? మన మెచట నున్నాము? మును పెట్లు చూచితిమో యవియె కార్యము లీ యాశ్రమమందు.)

ఆ. వినఁగఁ గలిగె గాన•విధముగ నేమియా వింత యనుచు వారు•విభునిఁ జేరి
యేమియిదియటంచు•ఋషి వర్యనడుగుమీ, యనిన వారికనియె•నవనివిభుఁడు.

తాత్పర్యము

మును పెట్లు చూచిరో యిప్పుడట్లు విన్నవా రగుటచే వారాశ్చర్యపడి శత్రుఘ్నుని సమీపించి యిదియేమి వింత, ఋషి నడుగుమని చెప్పఁగా శత్రుఘ్నుఁడు వారితో నిట్లనెను.

క. ఇట్టి విచిత్రము లీముని, రాట్టాశ్రమమం దనేక్కు•రాలెడి నివి యి
ట్టట్టని మూలము నెఱుఁగం, బట్టఁగఁ గౌతూహలంబు • పోలదు చుండీ!

అర్థములు. మునిరాట్టు=మునిరాజుయొక్క.

తాత్పర్యము

ఇటువంటి యాశ్చర్యము లెన్నియో యీ మునీంద్రు నాశ్రమమునఁ గలవు. అది యెట్లు లేలయని తెలియుటకై తహ తహ పడరాదు.

శత్రుఘ్నునకు ధ్వనిమాత్రము వినవచ్చెను గాని పాడిన బాలకులు కాన వచ్చినవారు గారు. ఇంతకుఁబూర్వ మిట్టి కావ్య మీ విధముగఁ జెప్పఁబడినది లేదు. ఇవి యాశ్చర్య కారణములు.

క. అనిచెప్పి మౌనివరునకు వినయంబున మ్రొక్కి తనని•వేశమునకున్
జని రామగీతవిషయం, బునఁ జిత్తము నిలిచి పెక్కు•పోకలఁ బోవన్. ౧౨౬౧

అర్థములు. తన నివేశమునకున్=తాను దిగినచోటికి, పెక్కుపోకలఁబోవన్= ఎన్నెన్ని విధములైన యాలోచనలో పోవుచుండఁగా.

తాత్పర్యము

(అని చెప్పి వాల్మీకి మునివరునకు వినయమున మ్రొక్కి తాను దిగిన చోటికిఁ బోయి, తానప్పుడు వినిన రాముని కథ విషయమున మనసు నిలిపి యెన్నెన్ని విధములైన యాలోచనలో పోవుచుండగా.)

**—• శత్రుఘ్నుఁడు శ్రీరాము దర్శింప నయోధ్య కేగుట •—**

ఉ. నిద్దుర లేక శ్రవ్య మయి • నిండుముదంబున గూర్చు తత్కథన్
ముద్దులమాటలన్ భువ•మోహనమౌ నునుఁబాటలన్ వినన్
బ్రొద్దుదయింపఁ గల్యవిధి•పుంజముఁ దీర్చి మునీంద్రు మ్రొక్కుచున్
మద్దయితున్ రఘూత్తముఁ గ•నన్ మది యుత్సుక లూఁగెనంయమీ. ౧౨౬౨

అర్థములు. కల్యవిధి పుంజము=ఉదయమునఁ జేయవలసిన నిత్యకృత్యములు, మత్ దయితున్=నాకుఁ బ్రియుఁడైన రామచంద్రుని.

తాత్పర్యము

రాత్రియంతయు నిద్దుర లేక విన వింపయి నిండు సంతోషమును గలిగించు నా కథను ఆ ముద్దుల మాటలు జగమును మోహింప జేయు పాటలు వినుచుండఁగాఁ దెల్లవారెను. అప్పుడు ప్రాతఃకాలమున నిర్వహింపవలసిన కార్యములు చేసి వాల్మీకికి నమస్కరించి నా ప్రియుఁడైన రామచంద్రమూర్తిని జూడ మనస్సువ్విళులూరుచున్నది.

క. అనుమతి యిచ్చినఁ జనియెద, ననవుడు నెదఁ గ్రుచ్చి చను మటన్న • శతాంగం
బున వడి వడిఁ జనె రామునిఁ గను కౌతుహలము దానిఁ • గడవం బాఱన్.

తాత్పర్యము

ఆజ్ఞ యిచ్చినఁ బోయెదననఁగా నట్టులే చేయుమని కౌఁగిలించుకొని పోయి రమ్మనఁగా నాయనయు తేరెక్కి మిగుల వేగముగాఁ బోయెను. ఆ రథమునకంటె ముందుగ రామచంద్రుని జూచుకోరిక దానిని దాఁటి పోవుచుండెను.

సీ. చని యయోధ్యా పురం • బును జొచ్చి శ్రీరాముఁ
డున్నెడ కేగి హే • మోజ్జ్వలంపు
సింహాసనంబున • శ్రీరాము మంత్రిమ, ధ్యస్థుని రాకామృ • గాంక వదను
నమరమధ్యస్థుఁడౌ • హరిహయు బోలిన, వాని దర్శించి • వసుధఁ ప్రాలి
మ్రొక్కిడి కరములు • మోడ్చిమీయాజ్ఞ, లవణు వధించితిఁ • బవరమునను

ఆ. పట్టణంబుఁ జక్కఁ • బఱిచితి జనులు ని, వేశనములు గొనిరి • ప్రీతిమతుల
నేండ్లు పదియు రెండు • నేఁగె మిమ్ముఁ బాసి, యుండనొల్లనందు • నొంటినింక.

అర్థములు. హేమోజ్జ్వలంపు=బంగారు మయమై ప్రకాశించుచున్న, మంత్రిమధ్యస్థుని=మంత్రుల నడుమ నున్నవానిని, రాకామృగాంకవదను=నిండు చంద్రునివంటి ముఖము గలవానిని, అమరమధ్యస్థుఁడు = దేవతల నడుమనున్న వాఁడు, హరిహయున్=ఇంద్రుని, బవరమునను=యుద్ధమందు.

తాత్పర్యము

(పోయి, యయోధ్యాపట్టణమునఁ బ్రవేశించి శ్రీరాముఁడున్న చోటికేగి, యందు బంగారు సింహాసనముమీఁద మంత్రుల నడుమ, దేవతలమధ్యనున్న నింద్రుని వలెఁ బూర్ణచంద్రునిఁబోలు నెమ్మోముతోనున్న శ్రీరామచంద్రమూర్తిని దర్శించి, నేలమీఁద సాగిలపడి మ్రొక్కి, చేతులు మోడ్చి మీ యానతి మేరకు లవణుని యుద్ధములోఁ జంపితిని. పట్టణము చక్కఁబఱిచితిని. జనులు నివాసము లేర్పఱుచుకొని సుఖముగా నున్నారు. పండ్రెండేండ్లు జరిగిపోయినవి. మిమ్ము విడిచి యిఁక నొంటిగా నుండలేను.)

## —• శ్రీరామ శత్రుఘ్నుల సంభాషణము •—

ఉ. తల్లిని బాయువత్సము వి•ధంబున నిన్నొదఁ బాసి యెన్నియో
నాళ్ళట సంతపించుచు న•నాథువలెన్ మనియుండ నేర, నీ
యుల్లమునం దలంపు దయ • యుత్తమకారుణికాగ్రగణ్య! నాఁ
దల్లడ మందు తమ్ముఁ గని త•ద్దయుఁ బ్రీతి వచించె రాముఁడున్. ౧౨౬౫

అర్థములు. వత్సము=దూడ, అనాథువలెన్=రక్షకుఁడు లేనివానివలె, మనియుండనేరన్=బ్రతికియుండఁజాలను, ఉల్లమునన్=మనస్సునందు, ఉత్తమకారుణికాగ్రగణ్యా=పరమదయావంతులలో శ్రేష్ఠుఁడా, తల్లడము=పరితాపము, తద్దయున్=మిక్కిలి.

### తాత్పర్యము

తల్లిని బాసినలేగవలె నిన్నొదఁ బాసి యెన్నియో దినములా మధురయందుఁ బరితాపపడుచు దిక్కు లేని వానివలె బ్రతికియుండనేరను. నీవు దయావంతులలో నుత్తమోత్తముఁడవు. కావున నాయందు మనస్సున దయ దలఁచి యిందే యుండ నాజ్ఞాపింపుము. అని పరితాపపడుచున్న తమ్మునిఁ గని రామచంద్రమూర్తి ప్రీతితో నిట్లనియె.

చ. వగవకు మన్న యివ్విధపు • వర్తన మర్హము గాదు క్షత్రియుం
డగు పురుషాగ్రగణ్యునకు • నర్హము తేనికి క్షత్త్రధర్మమం
దోగి దృఢచిత్తుఁడై ప్రజల • నోపి భరించుట, కావ నిల్వఁగాఁ
దగ దిట నప్పుడప్పుడు య•థామతి వచ్చుచుఁ బోవు చుండుమీ. ౧౨౬౬

### తాత్పర్యము

నాయనా! నీవు వ్యసనపడకుము. క్షత్రియుఁడగు పురుషశ్రేష్ఠునకు నిది సరిగాదు. క్షత్రియుఁడగు వానికి సంయోగ వియోగములందు దృఢమైన మనస్సుగలవాఁడై యోపికతోఁ బ్రజల రక్షించుట యుత్తమ కార్యము. కావున నిందే యుండెదననుట సరిగాదు. నీ వందే యుండి నీ యిష్టము వచ్చినపుడు రమ్ము పొమ్ము.

ఉ. కూరిమి నాదు ప్రాణముల•కుం గడు నెక్కుడ నీవ యైననున్
ధారణిపాలనంబు విధి • తప్ప దవశ్యము కార్య మాటచేఁ
గోరిక దీర నింక మముఁ • గూడి చరింపుము యేడునాళ్ళలో
పై రథదంతివాజియుత • వాహినితోఁ బురిఁ జేరఁబోవుమీ. ౧౨౬౭

### తాత్పర్యము

నా ప్రాణములందు నాకుఁగల ప్రేమకంటె నీ యం దెక్కువ ప్రేమగలదు. అయినను రాజ్యపాలనము విధి, అది తప్పునది కాదు. కావున నీకోరిక దీర

నిం దేడు దినము లుండుము. ఆవల రథములు ఏనుఁగులు గుఱ్ఱములు వీనితోఁ గూడిన సేనతో నీ పట్టనమునకుఁ బొమ్ము.

చ. అనవుడు ధర్మయుక్తమగు • నప్పలుకుల్ విని దీనుఁ డౌచు నా
య్యన నలు రాత మంచు నని • యందు వసించెను సప్తరాత్రముల్
జనపతియాజ్ఞఁ గాంచి మఱి • చయ్యన నన్నలు సాగనంపఁగాఁ
దనపురి కేఁగె నిట్లు పిన•తమ్ముఁడు పోవఁగ రామభద్రుఁడున్. ౧౨౬౮

తాత్పర్యము

(అని చెప్పఁగా ధర్మయుక్తములైన యీ మాటలు విని దీనుఁడై మెల్లఁగా నట్టులే యేరాత మని యం దేడు దినములుండి రామప్రభువు వలన సెలవుపొంది, యన్నలు సాగనంపఁగా శత్రుఘ్నుఁడు తన పట్టనమునకు బోయెను. ఈ ప్రకారము విన్నతమ్ముఁడగు శత్రుఘ్నుఁడు పోయిన పిమ్మట శ్రీరామభద్రుఁడును.)

## బ్రాహ్మణుఁడు మృతబాలకు కళేబరమును శ్రీరాముని యింటివాకిట వైచి యేడ్చుట

చ. అనుజులతోడఁ గూడి సుఖ•మార సధర్మవిధిం బ్రజావనం
బొనరుచు చుండ నొక్క-యెడ • నొక్క-ద్విజుండు మృతాత్మజాతుతో
జనపదమందునుండి రఘు•చంద్రమునిం గన వచ్చి ద్వారసీ
మను మృతబాలు వైచి పలు•మార్గములన్ విలపించె నార్తుఁడై. ౧౨౬౯

అర్థములు. ప్రజావనంబు=జనరక్షణము, మృతాత్మజాతుతోన్=మరణించిన కొడుకు నెత్తికొని, జనపదమందు నుండి=గ్రామమందుండి, పలుమార్గములన్= అనేక విధములు.

తాత్పర్యము

(తమ్ములతో సుఖముగా నుండి ధర్మముగాఁ బ్రజలను పాలించు చుండ నొక సమయమున నొక బ్రాహ్మణుఁడు చచ్చిన కొడుకును దీసికొని పల్లెటూరు నుండి శ్రీరామచంద్రునిఁ జూడవచ్చి, ద్వారమునొద్ద మృతబాలునిఁ బడవేసి యార్తుఁడై యనేక విధముల నేడ్చెను.

క. కొడుకా! కొడుకా! యనుచును,గడుపుపయిన్ బాఁదుకొనుచుఁ•గను నీరంబుల్
జడిగొన నేడ్చుచు నిట్లనుఁ జెడుపాపం బేమి మున్ను•చేసితి నొకో-. ౧౨౭౦

తాత్పర్యము

(కొడుకా! కొడుకా! యని కడుపుమీఁద బాఁదుకొనుచుఁ గన్నుల వెంటఁ గన్నీళ్లు కాలువలుగఁ గాఱుచుండ నేడ్చుచు నీ విధముగా ననుచుండెను. పూర్వమున నే నెట్టి చెడ్డ పాపము చేసితినో?)

క. ఆ లలి కాదే నొక సుతుఁ, డీలాగున మరణ మొందు • నే ప్రాయమునన్
నాలుగు పదివర్షంబుల, కాలంబునఁ జచ్చె నాదు • కర్మము బలిమిన్. ౧౨౭

అర్థములు. ఆలలి=ఆవిధము, కాదేన్=కానియెడల, నేను పూర్వము పాపము చేసియుండనియెడల, ప్రాయమునన్ = వయసునందే, కర్మము=పాపకర్మము, పంచవర్ష సహస్రకమ్ అనిమూల మం దున్నది. ఐదువేల సంవత్సరముల వాఁడు బాలుఁడు కాఁజాలఁడు. కావున నిచట వర్షశబ్దము దినపర్యాయముగ గ్రహింపవలెను. అప్పుడు కొంచెము తక్కువగా పదునాలుగు సంవత్సరములగు చున్నవి. 'సహస్రసంవత్సరే సత్రముపాసీత' యనుచోట సంవత్సరమనఁగా దినమనియేకదా యర్థము. పంచవర్ష సమన్వితమ్మని యొక పాఠము గలదు. అప్పుడైదేండ్ల బాలుఁడనియే యర్థము.

తాత్పర్యము

ఆ విధముగా నేను బాపము చేయక యుండినయెడల పదునాలుగు సంవత్సరముల వయస్సుగల బాలుఁ డీ విధముగఁ జచ్చునా! ఈ యకాల మృత్యువునకు నా పాపకర్మమే కారణము.

ఉ. నాయన! నిన్నుఁ బాసియు మ • నం గలమా? యిఁక నల్పకాలమం
దే యముఁ గాంతు మయ్య! జన • యిత్రియు నేను, నిటేల యయ్యెనో?
ధ్యేయొడఁ గల్లలం దలఁచి • యేని వచించియ యే నెఱుంగ, నే
నేయెడ నెట్టి ప్రాణికిని • హింస స్మరింపను నిక్కువంబుగన్. ౧౨౮

అర్థములు. మనంగలనా=బ్రతుకఁగలనా.

తాత్పర్యము

నాయనా! నిన్ను విడనాడి నేను బ్రదుకఁగలనా? ఇఁక నల్పకాలమందే నేను నీ తల్లి యిరువురము మరణించుట సత్యము. నీ కకాలమరణము వచ్చుటకుఁ గారణమేమి? ఏ సందర్భమందెన్నఁడైన నేనసత్యమాడినది లేదు. నేనేప్రాణికి హింసయు తలంచినవాఁడను గాను.

దీనివలన వేదోక్తాయువు జీవింపక నడుమంతరమున నర్థాయువై చచ్చుటకు కల్లలాడుట, హింస కారణములని సూచన. ఈజన్మమునఁ బాపము చేయకున్నను పోయిన జన్మమునఁ జేసిన పాపఫల మిట్లు దాపరించె నేమో యందునా? పోయిన జన్మమున నేను బాపము చేసియుండిన నీ జన్మమున దాని వాసన కొంచెమైనఁ జూపవలెను గదా. ఈ జన్మమున నేనే పాపము చేయనప్పుడు పోయిన జన్మమందును జేయనివాఁడనే. కావున నీ బాలుఁడు చచ్చుటకు నేను గారణము కాఁజాలను.

క ఏ పాపముచే నీ మా, పాపఁడు మాయిద్దరకును • బైతృకవిధిఁ దా
నోపి యొనర్పకమున్నే, యీపగిదిం జనియె దండ • ధృన్నగరంబున్. ౧౨౯

అర్థములు. పైతృక విధి=నివాపములు విడుచుట, శ్రాద్ధాదులు పెట్టుట లోనైన పితృదేవతల నుద్దేశించి చేయు కార్యములు, మా యిర్వురకున్=నాకు నా భార్యకు, దండభృత్=యమునకు, నగరంబునకున్=పట్టణమునకు.

చ. కనినది లేదు మున్ను విన । గానము రాముని రాజ్యమందు మా
 దృశజని నిటువంటి ఘోర మగు । కీడు న కాలమునందుఁ జావు, రా
 మునిమహితాఘ మిట్లు మము । ముంచెడి, నేదియొ ఘోరపాప మీ
 జనపతి సల్పె । నయ్యదియ । చంపెను నాదు తనూజ బాలకున్. ౧౨౨౪

తాత్పర్యము

రాముని రాజ్యమందువలె నిటువంటి కీడు, అకాలపుఁజావు. ఇంతకుముందు, విన్నది లేదు, కన్నది లేదు, ఈ రాముఁడు చేసిన గొప్ప పాపము మమ్ము నిట్లు ముంచినది. ఈ రాజేదియో ఘోరపాపము చేసెను. ఆయన పాపమే నా కొడుకును బిల్లవానిని జంపెను.

క. బాలురమృతి వినఁబడదు నృపాలా! నీరాజ్యమందు । వలె నితరనృపుల్
 పాలించెడివిషయంబుల, బాలకునిన్ నీవ యిపుడు । బ్రతికింపవయా! ౧౨౨౫

తాత్పర్యము

రాజా! నీరాజ్యమునందువలె నితరరాజులు పాలించు దేశమందు బాలుర చచ్చుట వినరాదు. కావున నీవు చంపిన బాలుని నీవే బ్రదికింపుము.

క. బ్రతికింప వేనియును భూపతి! రాజద్వారమందుఁ । బత్నియు నేనున్
 మృతిఁ గందు మనాథులవలె. క్షితిసురహత్యాప్తి నీవు । చెలఁగుము సుఖనై.

అర్థములు. అనాథుఁడు+అనాథ=ఏకశేషముచే అనాథులు.

తాత్పర్యము

రాజా! నీవు నాకొడుకును బ్రతికింపకపోయితివా నేను నాభార్య యిరువురము నీ రాజద్వారమందుఁ బడి యనాథులవలె ప్రాణములు వదలుదుము. బ్రహ్మహత్య కట్టుకొని నీవు సుఖపడుము.

ఉ. దీనన నీవు తమ్ములును । దీర్ఘతరాయువుఁ గాంచి భోగముల్
 మానక యుండుఁడీ! మనువు । మానవనాయక దుఃఖ మెట్టిదో
 కానక నీదు నేలబడెఁ । గామితముల్ కొనసాగ నుంటి మి
 క్షీనతి మన్నహోత్రి లభి । యించె సుతుండు మృతుండు గావుటన్. ౧౨౨౭

ఇట్లు మా కొడుకును మమ్ముఁ జంపి బ్రహ్మహత్య కట్టుకొని నీవు నీ తమ్ములు దీర్ఘకాలము భోగములనుభవించుచు జీవింపుఁడు. రాజా! ఇంతవఱకు నీరాజ్యమందు

దుఃఖమెట్టిదో యెఱుఁగక కోరికలన్నియు ఫలింపఁగా సుఖముంటిమి. ఇప్పుడీ కొడుకు మరణించుటచే నిట్లు సహింపరాని దుఃఖములకుఁ బాలుబడితిమి.

క. బాలురను జంపు భూమీ౯పాలుం డిటు దాపరింపఁ • బ్రజ లీక్ష్వా
కేలామండలి దెస చెడి, వాలాయముఁ జచ్చువారు•పతిపాపములన్. ౧౨౪

అర్థములు. ఐక్ష్వాక+ఇలా+మండలి=ఇక్ష్వాకు వంశమువారు పాలించు భూమండలమందు, దెస చెడి=దిక్కుమాలి, వాలాయమున్=తప్పక, పతిపాపములన్=రాజుచేసిన పాపము వలన.

తాత్పర్యము

పిల్లవాండ్రను జంపు రాజు దాపరించుటచేత నిక్ష్వాకువంశరాజులు పాలించు దేశమందు దిక్కుచెడి రాజపాపమున లోకులనేక విధములఁ జత్తురు.

క. రాజు లొనర్చిన దోషము, భూజనముల కెక్కుగతులఁ • బొలియించుఁ జుమీ
రాజు లసద్వృత్తులుగా, భూజనులు నకాలమృత్యు•వును గంద్రు గదా? ౧౨౫

తాత్పర్యము

రాజులు చేసిన పాపమువలన లోకులు పలువిధములఁ జత్తురు. రాజులు దుర్వృత్తులయి రేని లోకుల కకాలమృత్యువు లభించును గదా.

క. జనపదములఁ బట్టనముల, ననుచితముల భూమినాథుఁ • డణఁపఁడ యేనిన్
జనముల నకాలమరణము, గన వచ్చెడి సందియంబు•గలుగదు దీనన్. ౧౨౬

తాత్పర్యము

గ్రామము లందును బురము లందును జరుగు నన్యాయములను రాజణఁపక పోయెనా లోకుల కకాలమరణము సంభవించును. ఇందు సందేహము లేదు.

క. రామా! నీవే చేసితి, వేమో పాపంబు దాన • నీ బాలుఁడు దా
నేమియు నెఱుఁగనివాఁ డ,య్యో! మరణముఁ గాంచె ననుచు•నుర్వీశునకున్.

తాత్పర్యము

రామా! నీవేదో పాపము చేసితివి. కావుననే నా బాలుఁడేమియుఁ బుణ్య పాపము లెఱుఁగనివాఁడు నిష్కారణముగఁ జచ్చెను అని చెప్పుచు.

తే. అడ్డముగఁ బోవుచును బాలు • నగపఱుచుచుఁ
గను పుదుఃఖంబునను గడుఁ • గ్రాఁగుచున్న
నాతనిం గని రాముఁ డ • త్యంతదుఃఖ
తప్తుఁ డై భ్రాతృయుక్తుఁ డై • ధరణిసురుల. ౧౨౭

తాత్పర్యము

(అడ్డముగాఁ బోవుచు బాలునిఁ జూపుచుఁ గడుపు దుఃఖమున మిగులఁ దపించు నాతనిఁ జూచి రామచంద్రుఁ డంతరంగమున మిక్కిలి దుఃఖతప్తుఁడై తమ్ము లతోఁ గూడి బ్రాహ్మణులను.

**నారదుఁడు శ్రీరామునకు బాలకుండు మృతుండైన కారణము దెలుపుట**

ఉ. పౌరుల మంత్రులం బిలువఁ • బంప వసిష్ఠుఁడు వామదేవుఁడున్
ధారిణిదేవతాష్టకము • తప్పక వే యరుదెంచి దీవనల్
గూరిచి భూమిభర్తకును • గొల్వున యోగ్యపుటాసనంబులం
జేర రఘూత్తముండు నతి • చేసి కరంబులు మోడ్చి భక్తిమై. ౧-౨౭౩

అర్థములు. ధారిణి దేవతాష్టకము=ఎనమండ్రు బ్రాహ్మణులు.

తాత్పర్యము

(పౌరులను, మంత్రులను బిలువనంపఁగా వసిష్ఠుడు వామదేవుఁడు మొన మండ్రు బ్రాహ్మణులు వెంటనే వచ్చి రామచంద్రుని నాశీర్వదించి కొల్వులో యోగ్యమగు నాసనములపైఁ గూర్చుండిరి. అంత శ్రీరామచంద్రమూర్తి వారికి భక్తితో నమస్కరించి చేతులు జోడించి.)

సీ. కాత్యాయనాఖ్య మా•ర్కండేయ మౌద్గల్యు గౌతమ జాబాలి•కాశ్యపులను
వామదేవాఖ్య దే•వమునినారదు మంత్రి, పౌరులఁ గనుఁగొని•బ్రాహ్మణుండు
వాకిట కడ్డంబు•పండిన విధమెల్లఁ, బలికి యేటికి నిట్లు•దెలుపుఁ డనిన
బార్థివవరు దీన•భాషణమ్ముల విని, మునులసమక్షమం•బునను వచించె

ఆ. నారదుండు రాజ! కారణంబు వచింతు, బాలుఁడిట్లు మరణ•బాధఁ జెంద
నాలకించి దాని•కర్హప్రతిక్రియ, నాచరింపఁ దలఁపు•మాత్మలోన. ౧-౨౭౪

అర్థములు. అర్హప్రతిక్రియ=తగిన బదులు కార్యము.

తాత్పర్యము

(కాత్యాయనుఁడు, మార్కండేయుఁడుఁ మౌద్గల్యుఁడు, గౌతముఁడు, జాబాలి, కాశ్యపుఁడు, వామదేవుఁడు, నారదుఁడు, మంత్రులు, పౌరులు, వీరి నందఱను జూచి బ్రాహ్మణుఁడు వాకిటి కడ్డముగాఁ బడియున్న విధమంతయుఁ జెప్పి యిది యిట్టు లగుట కేమి కారణము తెలుపుఁడని యడుగ, రాజుయొక్క దీనపు మాటలను విని మునుల సమక్షమున నారదుఁడు, 'రాజా' బాలుఁడిట్లు మరణించుటకుఁ గారణము తెలిపెదను. దాని విని దానికిఁ దగిన బదులు కార్యము చేయుటకు నీ యాత్మలో విచారింపుఁడు.)

సీ. పూర్వంబు కృతయుగం•బున బ్రాహ్మణులుమాత్ర,
మధిప! తపంబుల • నాచరింత్రు
బ్రాహ్మణేతరుఁడు త•పస్వి యొండును లేఁడు, బ్రహ్మభూతం బయి •ప్రజ్వలించి
యజ్ఞానరహితమై•యయ్యుగంబు రహింప, జనులెల్ల దీర్ఘ ద•ర్శను లమృత్యు
వులు నయి యుండిరి•భూమీశ! పదపడి, త్రేతాయుగంబుదో•ఁతెంచుటయును

తే. మానవాళివపుష్మంత•మైనకతన, క్షత్రియులు తప మొనరింపఁ•గడఁగిమున్ను
కంటె వీర్యంబునను దప•శ్శకలన మిన్న, యైరి పూర్వులకును దక్కు•వైరిరామ!

అర్థములు. బ్రాహ్మణేతరుఁడు=బ్రాహ్మణుఁడు కానివాఁడు, తపస్వి=తపసు చేయువాఁడు, ఉపవాసాదులచే దేహము క్లేశపఱచువాఁడు, బ్రహ్మభూతము=బ్రాహ్మణమయము, అజ్ఞానరహితమై=అజ్ఞాన మనునది లేనిదై, దీర్ఘదర్శనులు=దూరపుఁజూపు గలవారు, అమృత్యువులు=మరణము లేనివారు, తోఁతెంచుటయును=రాఁగా, మానవాళి = మనువంశరాజుల గుంపు, వపుష్మంతము=దేహబలము గలది, కడఁగి=ప్రయత్నించి, మున్నుకంటె=మునుపటికంటె.

తాత్పర్యము

ముందు కృతయుగంబున బ్రాహ్మణులు మాత్రమే యుపవాసాది కాయక్లేశ కార్యములు చేయుచుండిరి. అది వారికి స్వధర్మము. ఆ కృతయుగమున బ్రాహ్మణులు తప్ప మఱియెవరు తపస్సు చేసినవారుగారు. వారి వారి స్వధర్మములం దుండి నిత్యనైమిత్తికాది కార్యములు చేయుచుండిరి. అప్పుడు బ్రాహ్మణులను ముఖ్యులుగా నుంచుకొని క్షత్రియులు జ్ఞాన మార్జించుచుండిరి.

ఆ యుగమున నజ్ఞాన మనునది లేదు. జనులందఱు స్వధర్మనిష్ఠులైన కారణమున భూతభవిష్యత్ జ్ఞానము గలవారును, మరణము లేనివారునై యుండిరి. ఈ విధముగఁ గృతయుగము గడచెను. ఆవలఁ త్రేతాయుగము రాఁగా క్షత్రియులు దేహబలము గలవారగుటచే బ్రాహ్మణులు తపస్సుచేసిన మనమేల చేయరాదని తపస్సుచేయ నారంభించి మునుపటి రాజులకంటె బలమునందుఁ దపమునందు బలవంతులైరి. కాని పరధర్మమైన తపస్సునందుఁ గొంతకాలము పోవుటచే స్వధర్మ నిర్వహణమునందుఁ గొంచెము లోపము గలిగెను. ఆ కారణముచే స్వధర్మ నిర్వహణమునందుఁ బూర్వ రాజులకంటెఁ దక్కువ వారైరి.

ఉ. త్రేత మహాత్ము లా వసుమ•తీజనవర్యులకంటె మున్ను వా
రాతతవీర్యవంతులుఁ ద•పోధికులున్, నమవీర్యయుక్తులై
త్రేతను క్షత్రియుల్ ద్విజులు • తేజనఁ గ్రాలిరి, వారిలోన వి
ఖ్యాతిగ నెచ్చులొచ్చుల మ•హాత్మ! వచింప నశక్య మయ్యెడిన్. ౧౨౭౬

### తాత్పర్యము

త్రేతయందు మహాత్ములైన రాజులకంటెఁ గృతమున స్వధర్మమునందుండిన రాజులు విస్తారముగ బలవంతులు, తపమున నధికులయి యుండిరి, ఈయుగమందు బ్రాహ్మణులు క్షత్రియులు తపస్సునందు సమానులైరి ఒకరు తక్కువ మఱియొకరు తక్కువయని చెప్పసాధ్యపడదు.

ఉ. అప్పుడు నాల్గు వర్ణముల ♦ కార సుసమ్మత మైన పద్ధతుల్
చెప్పిరి నిల్చి రప్పటివి ♦ శిష్ట లధర్మము పాదమొందు దా
నుప్పతిలెన్ ద్వితీయముగ ♦ ముద్భవమౌట ధరిత్రియందు, నా
ముప్పునఁ దేజఁ గోల్పడిరి ♦ మోహమతుల్ జను లెల్లవారిలన్. ౧-౨౦౭

### తాత్పర్యము

కృతయుగమందు బ్రాహ్మణులు తపస్సు చేయుట క్షత్రియుల తపస్సు చేయక ప్రజాపాలనము చేయుటచే నాయిరువురకు భేదము స్పష్టమై యుండెను, త్రేతయందు నిరువురు తపస్సు చేయుటచే భేదము మాసిపోయెను. ప్రజాపాలన కార్యము కొఱఁతబడెను. ఆకారణమున నధర్మము ప్రవేశించెను. జనులం దజ్ఞానము ప్రవేశించెను. అప్పు డప్పటి శిష్టు లట్లుండిన నధర్మము మించిపోవునని తలచి నాలుగు వర్ణముల వారికి నాచారములు వేఱువేఱుగ విభజించిరి.

కృతయుగము వారికంటెఁ త్రేతాయుగము వారికి నిర్మల జ్ఞానము లేక పోవుటచే బ్రహ్మజ్ఞానమందు నధికారము లేనివారైరి. కావున వారికిఁ దారకముగ వర్ణాశ్రమధర్మము లేర్పడెను. విమలజ్ఞానము లేకపోవుటచే నధర్మము సంక్రమించెను. దీనివలన విమలజ్ఞానము ప్రబలించిన కృతయుగము నందు వర్ణాశ్రమ విభాగము లేదని యేర్పడుచున్నది. 'నిస్త్రైగుణ్యేపథి విహరతాం కోవిధిః' కోనిషేధః' 'అత్యంతభక్తియుక్తానాం నచశాస్త్రం నచక్రమః' ఇత్యాది వాక్యము లనుసంధించునది. ఈ కారణముచేతనే 'ధ్యాయన్ కృతే' యని పరాశరుఁడు చెప్పెను.

క. కృతమున బ్రహ్మజ్ఞానం బతివేలం బగుట మహిమ ♦ మతిశయమగుటన్
మతి విమలజ్ఞానైక స, హితమగుటను నన్నృతమూన ♦ రెండును లోకుల్. ౧-౨౦౮

అర్థములు. అతి వేలము=అధికము, మతి=మనస్సు, విమలజ్ఞానైక సహితమగుటను=నిర్మలమైన జ్ఞానముతోఁ గూడిన దగుటను, అన్నృతము = సేద్యము, 'సేవా శ్వవృత్తి రనృతం కృషి రుంఛశిలం త్వృతమ్' అమరము.

### తాత్పర్యము

కృతయుగమునందు బ్రహ్మజ్ఞానము పూర్ణమై యుండుటచేతను, ఆకారణమున ప్రభావము అధికమై యాహారవిచారము లేకుండుట చేతను మనస్సెప్పుడు

నిర్మల జ్ఞానముతోఁ గూడియుండుటను లోకు లెవ్వరు సేద్యమునకై పూనినవారు గారు. వారు సత్యసంకల్పు లగుటచే కోరినది కోరినచోట దున్నకయె లభించు చుండెను.

క. కృతయుగజనము లమేధ్యము, గతిఁ జూచెడిఁ రాజసంపుఁ ♦ గర్షకవృత్తిన్
బ్రతుకునకై త్రేతాజన, తతి గైకొనె మహిమ మన స్వ ♦ తంత్రత లేమిన్.

అర్థములు. అమేధ్యముగతిన్=అపవిత్రపదార్థమువలె, రాజసంపు=రజోగుణముతోఁ గూడిన, కర్షకవృత్తిన్=దున్ని జీవించుటను, మనన్=బ్రతుకుటకు.

తాత్పర్యము.

కృతయుగమున బ్రహ్మజ్ఞానము మహిమ విస్తరించి యుండుటచే నెవ్వరును గూటికై దేవులాడినవారు లేరు. కావలసిన యాహారము ఫలవృక్షములే యిచ్చుచుండెను. బ్రహ్మవిచారముచే బ్రహ్మతేజస్సు నిండిన వారగుటచే నాహారముతో వారికిఁ బనియు లేకుండెను. కావున వారు దున్ని బ్రతుకుటకు అమేధ్యమువలెఁ జూచుచుండిరి. అది రాజసవృత్తి కావున, అట్టిమహిమచే జీవింపలేని వారగుటచే లోకులు భూమిదున్ని బ్రదుక మొదలు వెట్టిరి.

సీ. అనృతంబుతో ధర్మ♦హానియు జనియించె, నద్దాన దీర్ఘాయు♦వణఁగఁ దొడఁగె
నాయువు దఱుఁగుట ♦ వడలి శుభంబులు, సత్యధర్మాసక్తిఁ ♦ జలుపుచుండ్రు
త్రేతాయుగంబున♦ద్విజులును క్షత్రియుల్, తప మాచరింపఁగఁ♦దక్కువారు
పరిచర్య సలుపుచుఁ ♦ బరిఢవిల్లిరి యందు, శూద్రులకెల్ల శు♦శ్రూష పరమ
తే. ధర్మమయ్యెను బదపడి ♦ ద్వాపరంబు, దాపరింప ద్వితీయ పా♦దం బధర్మ
ముద్భవిల్లెను దాన న♦భ్యుదయ మొందె,ననృతమును బై నధర్మంబు♦నవనియందు

అర్థములు. అనృతంబుతోన్=సేద్యంబుతో, ధర్మహాని=ధర్మమునకు కీడు, సేద్యము హింసాత్మకము కావున నది ధర్మహానికిఁ గారణమయ్యెను, అద్దానన్=ధర్మహానివలన, శుభంబులు = పుణ్యకార్యములు, సత్యధర్మాసక్తిన్=సత్యమునందు ధర్మమునందు ఆసక్తిచేత, పరిచర్య=సేవ, పరిఢవిల్లిరి=ఒప్పిరి.

తాత్పర్యము

హింసాత్మకమైన సేద్యముతో ధర్మహానియుఁ బుట్టెను ధర్మము లోపించుటచే నాయువు క్షీణించెను. కావున కృతయుగ పురుషులకంటెఁ త్రేతాయుగ పురుషులు తక్కువ కాలము బ్రదుకు చుండిరి. ఆయువు క్షీణించుటచే భయపడినవారై త్రేతాయుగమువారు సత్యమునందు వర్ణాశ్రమ ధర్మములందు నాసక్తి గలవారై పుణ్యకార్యములు చేయ మొదలు పెట్టిరి. అవి యెట్టి వనిన త్రేతాయుగంబున బ్రాహ్మణులు క్షత్రియులు తపస్సు చేయఁగా తక్కినవారు కృషి చేయసాగిరి.

అందు శూద్రులకు కృషికంటె శుశ్రూష పరమధర్మమయ్యెను. ఆవల ద్వాపరంబు డాపరింపగా నధర్మము రెండవపాదము ప్రవేశించెను. దానిచే సేద్యము అధర్మము ప్రబలించెను. దానివలన త్రేతాయుగ పురుషులకంటె ద్వాపరయుగము వారు అల్పాయుష్కులైరి. మఱియు

క. ఎక్కువ కృషి కష్టముగాఁ, దక్కువఫల మయ్యె నందుఁ దప మొనరింపన్
మక్కువ గొందురు వైశ్యులు, తక్కువ మే మెట్టు లనిడి తాత్పర్యమున్.

తా త్ప ర్య ము

అధర్మఫలముగా నెక్కువకృషి కష్టము చేయఁగాఁ దక్కువ ఫలముకలుగుచుండెను. కష్ట మెక్కువ, ఫలము తక్కువ యయ్యెను. అప్పుడు వైశ్యులు కృషి మాని తక్కిన వారికంటె మే మెట్లు తక్కువయని వారును దపము చేయసాగుదురు

తే. మూడు యుగములయం దిట్లు మూడువర్ణ
ములజనంబులు తపమును జలుపఁగలుగు
శూద్రుఁ డిమ్మూడు యుగముల శుభ చరిత్ర!
తపముఁ జలుపంగఁ దగఁడు తథ్యంబు రామ! ౧౨౨

తా త్ప ర్య ము

ఈ విధముగ మూఁడు యుగములందును దొలిమూఁడు వర్ణములవారు తపము చేయఁగలుగుదురు. ఈమూఁడు యుగములలో శూద్రుఁడు తపముచేయఁ దగిన వాఁడు కానేరఁడు.

చ. కలియుగవేళ శూద్రులు ప్రకాశముగాఁ దప మొంచువారు, త
త్కలుషపువర్తనంబు నృప! ద్వాపరమందె ఘటిల్లె నేనియున్
బలుకఁగ నేల ఘోరమని పార్థివ! నాలవజాతివాఁ డొకం
డిలఁ దపమున్న వాఁ డదియ యిట్టియకాలపుఁజావుఁ గూర్చెడిన్. ౧౨౩

తా త్ప ర్య ము

కలియుగమందు శూద్రులు బహిరంగముగానే తపస్సు చేయుదురు. అట్టిది ద్వాపరమందే నిషిద్ధమగుచుండఁ త్రేతయందు జరుగుట పరమ నిషిద్ధము గదా. ఇప్పు డెవ్వఁడో శూద్రుఁడు తపస్సుచేయుచున్న వాఁడు. కావున నీ యకాల మృత్యువు సంభవించెను. 'సర్వే బ్రహ్మ వదిష్యంతి సంప్రాప్తే తు కలౌ యుగే–నానుతిష్ఠంతి కౌంతేయ శిశ్నోదర పరాయణాః' కలియుగమున నందఱు బ్రహ్మము బ్రహ్మమను వారే కాని శిశ్నోదరపరాయణులై బ్రహ్మ నిష్ఠయం దుండరు.

ఉ. బాలిశుఁ డెవ్వఁడో యిటు భ ♦ వద్విషయంబున నుంటఁ జేసి నీ
బాలకుఁ డీల్గె రాష్ట్రమునఁ ♦ బట్టన మం దెవఁ డే నలక్ష్మికిన్
మూలముఁ బాపముం జలుప ♦ మూఢత శిక్ష యొనర్ప లేని భూ
పాలుఁ డధోగతిం బడెడి ♦ వారిజమిత్రకులావతంసమా! ౧౨౯౪

అర్థములు. బాలిశుఁడు=మూఢుఁడు, భవద్విషయంబునన్=నీ రాజ్యమందు, అలక్ష్మికిన్=సంపద నాశ మగుటకు, మూఢతన్=అజ్ఞానముచే.

తాత్పర్యము

ఎవఁడో మూఢుఁడు శూద్రుఁడు నీ రాజ్యమునఁ దపస్సు చేయుచున్నాఁడు కాఁబట్టి యీ బాలుఁడు మరణించెను. రాష్ట్రమునందుఁగాని పట్టనమందుఁగాని సంపద చెడుటకు మూల మగు పాపమును మూఢుఁడై యెవఁడేని చేసెనేనిదానికిఁ దగిన దండము చేయని రాజు రామచంద్రా! అధోలోకముల పాలగును.

క. తపమున నధ్యయనంబున, విపులేశ్వర! సుకృతకర్మ ♦ వితతులలోఁ దా
నెపు డాఱవభాగము గొనుఁ నృపునకు ధర్మమునఁ బ్రజల♦నేలమి తగునే. ౧౨౯౫

అర్థములు. విపులా+ఈశ్వర=భూపతి, అధ్యయనము=వేదములు వల్లించుట, సుకృతకర్మవితతులలో=పుణ్యకార్యముల సమూహములలో.

తాత్పర్యము

ప్రజలు చేయు తపమునందు అధ్యయనమునందు పుణ్యకర్మములందు నాఱవ భాగము పుణ్యము తీసికొని రాజు ప్రజలను ధర్మ పద్ధతి రక్షింపకుండవచ్చునా?

ఉ. కావున నీదురాష్ట్రమునఁ ♦ గావలుఁ డెవ్వఁ డధర్మశీలమున్
భావన చేసెనో నెమకి ♦ భవ్యవిధిం బ్రతి యాచరింపుమీ
భూవరుఁ డెప్డు ధర్మమును ♦ బ్రో పౌనరింపగ వృద్ధిఁగూరెడిన్
జీవిత మెల్ల వారికిని ♦ జీవితుఁ డయ్యెడు బాలకుం డనన్. ౧౨౯౬

అర్థములు. కావలుఁడు=దుష్టుఁడు, అధర్మశీలమున్ = ధర్మవిరుద్ధమైన యాచారమును, నెమకి=వెదకి.

తాత్పర్యము

కావున నీ రాజ్యమం దెవ్వఁడో దుష్టుఁడు ధర్మవిరుద్ధమైన ప్రవర్తనము గలవాఁడై యున్నాఁడు. వానిని వెదకి దానికిఁ దగిన ప్రతిక్రియ చేయుము. రాజగు వాఁడు ధర్మమును రక్షించెనా ప్రజలకు నాయువు వృద్ధియగును. బాలుఁడును జీవించును.

### —♦ శ్రీరాముఁడు పుష్పకంబుపై నెక్కి శూద్రమునిని వెదకనేగుట ♦—

చ. అమృతముతోడఁ దుల్య మగు ♦ నమ్ముని వాక్యము లాలకించి హ
ర్షమున సుమిత్రపట్టిఁ గని ♦ బ్రాహ్మణు సుప్రతు నూఱడింపు శీ
ఘ్రమునఁ గుమారు దేహమును ♦ గమ్మనినూనెలకాఁగులోన నుం
పుము చెడిపోక యుండఁ దను ♦ వుం దనుసంధులు ప్రీల కుండగన్. ౧౩౮౭

తా త్ప ర్య ము

(అమృతముతో సమానమగు నా నారదముని మాటలను విని సంతసించి, లక్ష్మణుని జూచి, నీవు బ్రాహ్మణుని నూఱడింపుము. శీఘ్రముగ బ్రాహ్మణ బాలకుని దేహము, దేహసంధులు చెడిపోకుండ, దేహమును గమ్మని నూనెకాఁగులలో నుంపుము.)

చ. అని నియమించి పుష్పకము ♦ నాత్మఁ దలంపఁగ నద్ది వచ్చి యే
పని గలదో మహాత్మ యనఁ ♦ బార్థివవర్యుఁడు మౌనికోటికిన్
వినతు లొనర్చి తమ్ములను ♦ నిల్పి పురిన్ శరచాపధారియై
చనియెఁ బ్రతీచిగా నచట ♦ సర్వము రోసి యుదఙ్ముఖంబుగన్. ౧౩౮౮

అర్థములు. ప్రతీచిగాన్=పడమటి దిక్కుగా, ఉదక్+ముఖంబునన్=ఉత్తర ముఖముగా.

తా త్ప ర్య ము

(అని నియమించి పుష్పకమును స్మరించెను. అంతనది వచ్చి మహాత్మా! యేమి పని? యని ప్రార్థింప, రామచంద్రుఁడు మునులకు నమస్కరించి, తమ్ములను పట్టణమందు నిలిపి, తాను విల్లు నమ్ములు పూని పడమటి దిక్కుగాఁబోయి యచటనంతయు వెదకి, యుత్తరముఖముగా,)

చ. అరిగి హిమావనీధరము ♦ నందలి నేలలు చూచి శక్రది
గ్ధరణిని బుష్పకస్థుఁ డయి ♦ క్రన్నన రోసి యఘంబుఁ గానకా
ధరణివిభుండు దక్షిణపుఁ ♦ దావులు చూడగ శైవలంబు నాఁ
బరఁగు నగన్ సరోవరము ♦ ప్రాంతమునందు నధశ్శిరస్కుఁడై. ౧౩౮౯

అర్థములు. హిమావనీధరము=హిమవత్పర్వతము, శక్రదిక్+ధరణి=తూర్పుప్రదేశమందు, అఘంబు=పాపము, శైవలము=శైవల మను పేరుగల, నగన్=పర్వతమందు, అధశ్శిరస్కుఁడై=తలక్రిందుగా నుంచినవాఁడై.

తా త్ప ర్య ము

పోయి హిమవత్పర్వతమందలి భూములు వెదకి యావల తూర్పుదిక్కు నేలలు చూచి యందెందును పాపము గనలేక దక్షిణదిక్కున వెదకఁగా శైవల మను పర్వతమందు కొలది సమీపమున తలక్రిందుగా.

క. వ్రేలుచు నుత్తమతపమున్, వాలాయముఁ జలుపు నొకనిఁ • బరికించి ధరా
పాలుఁడు చేరం జని యో,శీలి! ధన్యుండ వీవు • చెపు మెవ్వఁడవో? ౧౩౦౦

తా త్ప ర్య ము

(వ్రేలుచు నుత్తమమగు తపస్సు చేయుచున్న నొకనిఁ జూచి, రామచంద్ర మూర్తి సమీపమునకుఁ బోయి,యో మంచి నడత గలవాఁడా! నీవు ధన్యుఁడవు. నీ వెవ్వఁడవు? చెప్పుము.)

క. జాతి యెది నీకు సువ్రత! కౌతూహలమునను బ్రశ్నఁ•గావించెద ధా
త్రీతలనాథుఁడ దశరథ,సూతిని రాముఁడను నన్నుఁ • జూడు తపస్వీ! ౧౩౦౧

అర్థములు. సువ్రత=మంచివ్రతము గలవాఁడా,కౌతూహలమునను=తెలియ నాశ గలిగి.

తా త్ప ర్య ము

తపస్వీ! నేను నీభూమికి నధిపతిని. దశరథరాజు కుమారుఁడను, రాముఁడని నాపేరు. నేను దెలియఁ గోరి నిన్నుఁ బ్రశ్నించుచున్నాను. నీ వేజాతివాఁడవు? జన్మముచే వచ్చినదానికి జాతియని పేరు, వర్ణములు పుట్టువుచేత వచ్చినవి.

ఉ. ఏమి ప్రయోజనంబు మది • నెంచితి వీవు? దివంబుఁ బొందఁగా
నో? మఱి యెండో? యింతటిమ•హోగ్రతపం బొనరింప నేలొకో?
భూమిసురుండవో? నృపతి • వో? మఱి వైశ్యుడవో? జఘన్యజుం
డో? మహితాత్మ! నిక్కముగ • నున్నది యున్నటులే వచింపుమీ. ౧౩౦౨

తా త్ప ర్య ము

ఏమి ప్రయోజనము సాధింపగోరి యిట్లు తపస్సుచేయుచున్నావు? స్వర్గము నకుఁ బోవలయు ననియా? లేక మఱియేదైనఁ గోరికగలదా? ఇంత తీవ్రమైనతప స్సేల చేయుచున్నావు? నీవు బ్రాహ్మణుఁడవా? క్షత్రియుడవా? వైశ్యుఁడవా? శూద్రుఁడవా? గొప్ప మనస్సు గలవాఁడా! ఉన్నదున్నట్టు చెప్పుము:

—• శ్రీరాముఁడు శంబుకుని వధించుట •—

సీ. అనవుడు నాతండు • నవనతవదనుఁడై, రామచంద్రున కను • రామచంద్ర!
శూద్రయోనిని నే బ్ర•సూతిఁ గాంచితి నయ్య,శంబుకుండను పేరఁ•జనెడివాఁడ
దేహంబుతోడనే•దేవత్వ మొందెడి, వాంఛను దపమున • వఱలు వాఁడ
స్వర్గలోకజిగీష•వర్తిల్లువాఁడను, గల్లలాడెడివాఁడ • గాను దేవ!

తే. శూద్రుఁడను నేను శ్రీరామ • భద్ర! తపము
సలుపుచున్నాఁడ నన రామ • చంద్రు డపుడ
ఖడ్గ మొరఁ దూసి యాతని • కంఠతలముఁ
దెగఁగ నరకెను దేవతల్ • పొగడుచుండ. ౧౩౦౩

అర్థములు. అవనత వదనుఁడై=తలవంచుకొన్నవాఁడై, స్వర్గలోక జిగీష= స్వర్గలోకమును జయించుకోరికచే.

తా త్ప ర్య ము

ఇట్లడుగఁగా నతఁడు తలవంచుకొని రామచంద్రమూర్తితో నిట్లనియె. రాజోత్తమా! నేను శూద్రజాతి స్త్రీగర్భమునఁ బుట్టిన వాఁడను. శూద్రుఁడను. నాపేరు శంబుకుఁడు. ఈ దేహముతోనే స్వర్గమునకుఁ బోవఁగోరి తపస్సు చేయుచున్నాను. స్వర్గలోకము జయించుటయే నాకోరిక. నేను కల్లలాడెడివాఁడఁగాను. తపము చేయుచున్నాను. అని చెప్పఁగా రామచంద్రమూర్తి యొఱనుండి కత్తి దూసి దేవతలు పొగడుచుండ వాని తల నఱికెను.

ఉ. కమ్మని పూలవాన రఘు • కాంతునిపైఁ గురియంగ దిగ్విశా
    లమ్ముల మందమారుతుఁడు•నవ్యసుగంధవహుండు వీచె మా
    దమ్మున నగ్నియుక్త విబు•ధవ్రజముల్ దివిజేంద్రుఁ గూడి య
    భ్రమ్మున నిల్చి యిట్లనియె • రామవిభుం గరుణాపరాయణున్. ౧౩౧౪

అర్థములు. కరుణాపరాయణున్=పరిపూర్ణదయగలవానిని, నిర్నిమిత్తముగ శంబుకుని జంపిన రామచంద్రుఁడు కరుణాపరాయణుఁ డెట్లయ్యెను. శ్రీరామ చంద్రమూర్తిచేఁ జచ్చుటను మరణకాలమున భగవద్దర్శన ప్రాప్తివలన శ్రీరామ చంద్రమూర్తి సంకల్పముచేతను వానికి మోక్షము లభించెను. స్వర్గము కోరిన వానికి మోక్ష మిచ్చుట కరుణచేతనేకదా! శాస్త్రవిరుద్ధకార్యము చేయుటచే దండింప వలసి దండించెను గాని యతనిపై ద్వేషబుద్ధిచేఁ గాదు. కావుననే యత నికి నతఁడు కోరినదానికంటె నుత్తమఫల మిచ్చెను. ఈ విషయము భవభూతి యుత్తర రామచరిత్రమం దిట్లు స్పష్టముగా వ్రాసెను ద్వితీయాంకము - ౧౧ వ శ్లోకము.

శ్లో॥ దత్త్వాభయే త్వయి యమాదపి దండధారే
    సంజీవితః శిశు రసౌ మమ చేయమృద్ధిః
    శంబూక ఏష శిరసా చరణే నతస్తే
    సత్సంగజాని నిధనాన్యపి తారయంతి.

రామ॥ ద్వయ మపి ప్రియః నః, తదనుభూయతా ముగ్రస్య తపసః ఫలమ్.
    యత్రానందాశ్చ మోదాశ్చ-యత్ర పుణ్యాశ్చ సంపదః
    వైరాజ నామ తే లోకా స్తైజసాః సంతు తే శివాః।

శంబూకః॥ యుష్మత్ప్రసాదాదైవ మహిమా కిమత్ర తపసా?
    అథవా మహదుపకృతం తపసా॥

తాత్పర్యము.

మంచి వాసనగల పూవుల వాన రామచంద్రునిపై కురిసెను. దిక్కుల యందు క్రొత్తదైన పరిమళ యుక్తమైన వాయువు మెల్లగా వీచెను, ఆకాశము నందు నగ్ని మొదలగు దేవత లింద్రునితోడ నిల్చి పరిపూర్ణ దయాశాలి యగు రామచంద్రునితో నిట్లనిరి.

క. సురకార్యముఁ దీర్చితి భూ,వరచంద్రా! లెస్సనీకు•వర మొసఁగంగా
వరుదెంచితి మీ శూద్రుఁడు, సురపురికిం జనఁడు నీవు•సూదితుఁ జేయన్.

అర్థములు. సురకార్యముఁ దీర్చితి=దేవకార్యము నెఱవేర్చితివి. శాస్త్రవిహితకర్మములు స్వధర్మమందుండి చేయువానికి స్వర్గప్రాప్తి. శంబుకుఁడు స్వధర్మము విడిచి పరధర్మ మనుష్ఠించి చేయరానిపని చేసెను అందు వాఁడు దేహముతోనే స్వర్గము పోఁదలఁచెను. అది సరిగాదు. సురపురికిన్ జనఁడు=స్వర్గమునకుఁ బోవు వాఁడు కాఁడు. నీవు చంపిన కారణముచే స్వర్గమునకంటె నుత్తమలోకములకుఁ బోవునే కాని స్వర్గమునకుఁ బోఁడు. మోక్షఫలమున కెవ్వఁడైన నధికారియే, స్వర్గమున కట్టులు గాదు. సూదితుఁ జేయన్=చంపుటచే.

తాత్పర్యము

. (రాజా! నీవు దేవకార్యము నెఱవేర్చితివి. మేలు. మేలు. నీకు వరమిచ్చుటకు వచ్చితిమి. నీచేతఁ జంపబడుటచే నీ శూద్రుఁడు స్వర్గమునకుఁ బోఁడు.)

చ. అనుసురనాథు ప్రముఖ్కు వసు•ధాధిపుఁ డిట్లను నాయెడన్ సురల్
మన్నమున సంతసించిన•మత్కలుషాహతు విప్రబాలకున్
మనఁగ నొసర్పుఁడీ మరల•మాట యొసంగితి నీతనూభవున్
మనుగడ గూర్తు నంచు సభ•మధ్యమునందు ద్విజాతి సేతకున్. ౧౩౦౬

అర్థములు. మత్కలుషాహతున్=నాదోషముచేఁ జచ్చిన వానిని, మనఁగన్=బ్రతుకఁగా, మనుగడ=జీవితము, ద్విజాతి సేతకున్=బ్రాహ్మణశ్రేష్ఠునకు.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పు నింద్రునకు నమస్కరించి రామచంద్రమూర్తి యిట్లనెను. దేవతలారా! నావిషయమున మీరు సంతోషపడితిరేని నాదోషముచే మరణించిన బ్రాహ్మణ కుమారుని బ్రతికింపుఁడు. ఏలన బ్రాహ్మణునకు నీ కుమారు బ్రదికించెదనని మాట చెప్పితిని.

క. నామది యసత్యదోషముఁ, గానక యుండఁగను జలుపుఁ•గాఁ దగు నదివన్
మానుము నెత ద్విజబాలుఁడు, ప్రాణంబులఁ గాంచి మరల•బంధులఁ గలసెన్

(నామాట పొల్లుపోకుండఁజేయఁదగు నని యడుగఁగా నీవు విచారము మానుము. బ్రాహ్మణ బాలకుఁడు బ్రదికి బంధువులతోఁ జేరెను.)

క. ఏ నిమిషంబున శూద్రుని, నీనిశితతరాసిధార • నీల్గించితివో
యానిమిషంబున బాలుఁడు, ప్రాణంబులఁ గాంచి సుఖిత • వఱలెడుజుమీ. ౧౩౦౪

అర్థములు. నిశితతర=మిగుల పదునైన. అసిధార=కత్తివాదరచే, నీల్గించితివో=చంపితివో.

### తాత్పర్యము

(ఏ నిమిషమున శూద్రుని పదునగు కత్తితోఁ జంపితివో, యానిమిషమునన బాలుఁడు ప్రాణవంతుఁడై సుఖముగా నుండెను సుమీ.)

### —• శ్రీరాముఁ డగస్త్యుఁ జూడఁ బోవుట •—

సీ. అదిపోవ నిమ్ము మే • మరిగెద మిప్పుడు, కలశీతనూభవుఁ • గాంచుటకని
బదిరెండు వర్షముల్ • పన్నుండె జలముల, దీక్షయు ముగిసె నా • దేవనిభుని
నభినందితునిఁ జేయ • నర్హంబువచ్చె దే, మాతోఁ దదాశ్రమ • మహికి వతని
దర్శింపుమా నీకుఁ • దవులు శుభంబులు, మౌనిచేతోబ్జబం • ధర యనంగ

ఆ. నగుల మించుఁ బుష్ప • కారూఢుఁడై వ్యోమ, యానగతము దేవ • తాళితోడ
మునితపోవనంబుఁ • గని నాతఁడును, వారి నర్చ ముదము గూర్చె • నర్హభంగి

• అర్థములు. కలశీతనూభవున్=అగస్త్యుని, పన్నుండెన్=శయనించెను, అభినందితుని=సంతోషపడినవానిని, మౌనిచేతోబ్జబంధర=మునుల హృదయకమలములకుఁ దుమ్మెరవంటివాఁడా, వ్యోమయానగతము = ఆకాశమునఁ బోవునది, అర్చన్=పూజచే.

### తాత్పర్యము

ఆ ముచ్చట పోవ నిమ్ము అగస్త్యుఁడు పండ్రెండు సంవత్సరములునీళ్ళలోఁ బండుకొని యుండి లేచినాఁడు. ఆయనను జూచి సంతోషపెట్ట మేము పోవుచున్నాము. ఆ యాశ్రమభూమికి నీవు వచ్చెదవా? ఆయనను దర్శింపుము. నీకు మేలగును. అనినవల్ల కానిమ్మని దేవత లాకాశమార్గమున రాఁగాఁ దాను పుష్పక మెక్కి ముని తపోవనమునకుఁ బోఁగా నాయన వారికి బూజించి సంతోషింపఁ జేసెను.

ఉ. అంతట దేవతల్ చనిరి • నాకముఁ జేరఁగ, రామధారిణీ
కాంతుఁడు పుష్పకంబు డిగి • కంజభవాభు మునీంద్రు మ్రొక్కినన్
స్వాంతము పొంగ మౌనియును • స్వాగతమున్ వచించి భూమిపా!
యెంతయు మోద మయ్యె దయ • నీ విటు రాఁ బరమాదరంబునన్. ౧౩౧౦

అర్థములు. నాకము=స్వర్గము, కంజభవాభున్=బ్రహ్మతో సమానుని, స్వాంతము=మనస్సు.

తాత్పర్యము

(అంతట దేవతలు స్వర్గమునకుఁబోయిరి శ్రీరామచంద్ర ప్రభువు పుష్పక విమానమునుండి దిగి బ్రహ్మతో సమానుఁడగు నగస్త్యమహామునికి నమస్కరింపఁగా నా మునిచంద్రుఁడు మనస్సులోఁ బొంగి, స్వాగతమిచ్చి, రాజా! పరమాదరమున దయకలిగి యిచ్చటకు విచ్చేయుటచే నెంతో సంతోషమైనది.)

సీ. నాకుఁ బూజ్యుండవ • నంతకల్యాణగు, ణాఢ్యుడవును గొప్పయతిథి వీవు
నామానసమున న • నారతంబును రామ, నిల్చియున్నాఁడవు • నీవు దేవ
వింటి నిర్జరులచే • విప్రబాలునకయి, శూద్రమానిని నీవు • ద్రుక్కఁజేఁత
యీరేయి నిలుమిందు • నెల్లి నేకువఁ బుష్పకంబునఁ జనెదు పు • రంబునకును
తే. నాదిలక్ష్మికిఁ దైననా • రాయణుఁడవు, నిలుచు నీయందు సర్వంబు • నీవ ప్రభువు
భూతములకెల్ల నీవె స • నాతనంపుఁ బురుషుఁడవు రామభూపాల! • పుణ్యశీల!

అర్థములు. పూజ్యుండవు=పూజింప యోగ్యుఁడవు, అనంత=అంతములేని, కల్యాణ గుణాఢ్యుఁడవు=మంచిగుణ సంపత్తిగలవాఁడవు, అనారతంబును=ఎల్ల వేళలఁ నిర్జరులచే=దేవతలచే.

తాత్పర్యము

నే నితరులకుఁ బూజ్యుఁడను. నాకు నీవు పూజ్యుఁడవు అనంతములైన కల్యాణ గుణములు విస్తారముగఁ గలవాఁడవు, గొప్పయతిథివి. ఎల్లప్పుడు నా మనస్సునందుండువాఁడవు. దేవా! బ్రాహ్మణ కుమారునకై నీవు శూద్రమునిని జంపిన వార్త దేవతలు చెప్పఁగా వింటిని. ఈ రాత్రి యిందు నిలిచి యుదయము కాఁగానే పుష్పకము మీఁద నీ పట్టణమునకుఁ బోవచ్చును. నీ వాది లక్ష్మికి భర్తయగు నారాయణుండవు. సర్వము నీయందు మున్నది. సమస్తభూతములకు నీవే ప్రభువు నీవు సనాతన పురుషుఁడవు, పుణ్యస్వభావుఁడవు.

—• అగస్త్యుఁడు శ్రీరామునకు దివ్యాభరణ మొసఁగఁబోవుట •—

సీ. శుభభూషణోత్తమం • బీవు గ్రహింపుము, దివ్యంబు నిజదివ్య • తేజమునను
దివ్యదేహంబున • దీప్యమానం బిది, నీవు గైకొన నాకు • నెమ్మిమీఱు
విశ్వకర్మకృతంబు • వే చెవ్వరును దీని, దాల్ప శక్తులుగారు • ధరణియందు
శక్రసమన్విత • సర్వసురవర్యుల, నీవ సంరక్షింప • నేర్తువట్లు
ఆ. గాన నొసఁగువాఁడఁ • గాకుత్స్థ! నీ కిది, శాస్త్రవిహితరీతి • సమ్మతింపు
తనకు దత్తమైన • దాని నుత్తమపదార్థంబు దాన మొసఁగఁ • దతఫలంబు,

అర్థములు. భూషణోత్తమంబు=శ్రేష్ఠమైన యాభరణము, దివ్యంబు=దేవసంబంధమైనది, దీప్యమానము=ప్రకాశించునది, నెమ్మి=సంతోషము, విశ్వకర్మకృతంబు=విశ్వకర్మచేఁ జేయబడినది, శక్రసమన్విత=ఇంద్రునితోఁ గూడిన, సర్వసుపర్వులన్=దేవతల నందఱను.

తాత్పర్యము

ఇది మేలైన యాభరణము. దివ్యము తన దివ్యతేజముచే దివ్యస్వరూపమునఁ బ్రకాశించునది విశ్వకర్మచేఁ జేయఁబడినది. నీవు గ్రహింపుము. నీవు తీసికొనుట నాకు మిక్కిలి సంతోషకరము. దీనిని నీవు తప్ప మఱియెవ్వరు ధరియింప శక్తులుగారు, నీ వింద్రాది దేవతల సంరక్షింపఁగలవాఁడవు. కావున నీకు శాస్త్రపద్ధతి ననుసరించి యిచ్చెదను, సమ్మతింపుము. తన కితరులిచ్చిన యుత్తమవస్తువును దాన మిచ్చిన యెడల విస్తారఫలము గలదు.

క. అనవుడు క్షత్రియధర్మం,బును లోన స్మరించి రామ♦భూవరుఁ డనియెన్
మునినాథ! బ్రాహ్మణున కీ విని గొనఁదగు క్షత్రియునకు♦విహితం బగునే.

అర్థములు. క్షత్రియధర్మము=క్షత్రియుఁడు దానముపట్టరాదను ధర్మము, ఈవి=దానము.

తాత్పర్యము

(అని చెప్పఁగా, రామచంద్రమూర్తి క్షత్రియ ధర్మమును స్మరించి, మునినాథా! దానము బ్రాహ్మణుఁడు పట్టవచ్చునుగాని క్షత్రియునకుఁ దగునా? యనెను.)

క. భూమీపతి నే నయ్యును. భూమీసురుచేత దాన♦మును గొనఁ దగునే?
యేమి సమాధానం బన, రామునితో నిట్లు మౌని♦రాజు వచించెన్. ౧౩౧౪

తాత్పర్యము

(నేను భూమికి రాజనై యుండియును బ్రాహ్మణుని వలన దానము గ్రహింప వచ్చునా? ఏమనెదవు? అని యడుగ, రామునితో నగస్త్యుఁ డిట్లు చెప్పెను.)

**దివ్యాభరణముఁ గొనవచ్చు నని యగస్త్యుఁడు శ్రీరాము సమాధాన పరచుట**

సీ. కృతయుగంబునఁ దొల్లి♦క్షితిపతి లేకయే, జనము ల్గాలఁగఁ బ్రాక♦శాసనుండు
సురలకు రాజయి ♦ శోభిల్లుచుండఁగ, నరులపోలికఁ♦దమకు నొక్క-
రా జుండఁ దగు నని ♦ బ్రహ్మకుఁ దప ముండి, దేవతలకుఁబోలె♦దేవ మాకు
రాజు నొసంగుము♦రక్షణార్థంబుగాఁ బ్రజలు పాపంబుల♦పాలఁ బడక

తే. యుందు వా రనఁ దామర♦పోద్భవుండు, లోకపాలురతోడ మీ♦లో నొకొక్క-
యంశ మొసఁగుఁడు దాన ధ♦రాధినాథు సృష్టిచేసెద నన వారు ♦ నిచ్చిరట్ల

అర్థములు. తామరసోద్భవుఁడు=బ్రహ్మ.

తా త్ప ర్య ము

(కృతయుగము నందుఁ బ్రథమమున రాజులేకయే ప్రజలుండిరి. ఇంద్రుఁడు దేవతలకు రాజుగా నుండి శోభిల్లుచుండుటఁ జూచి జనులు, దేవతలకువలెఁ దమ కును రాజుండఁదగు నని బ్రహ్మనుగూర్చి తపముచేసి దేవా! దేవతల కిచ్చినట్లు మాకు రక్షణకొఱకు రాజు నొసఁగుము. ఆ కారణమునఁ బ్రజలు పాపములొనరింప కుందురని వేఁడ, బ్రహ్మ లోకపాలురను జూచి మీలో నొక్కొక్క యంశము నొసఁగుఁడు: భూపతిని సృష్టిచేసెద నన వారట్లే యిచ్చిరి.)

చ. క్షువ మొనరింపఁ దామరస•సూతి జనించె క్షువుం డనంగ నొ
కక పురుషుఁ డాతనిన్ నలువ • క్ష్మాపతిఁ జేసి మహేంద్రునంశమున్
విపులఁ దదాజ్ఞ చెల్లఁగను • నీరపునంశము మేము బ్రోవఁగా
విపులధనం బొసంగఁగఁ గు•బేరుని యంశము, లోకశాస్తికిన్. ౧౩౧౬

అర్థములు. క్షువము=తుమ్ము, తామరసూతి=బ్రహ్మ, నలువ=బ్రహ్మ, నీరపునంశము=వరుణాంశము, లోకశాస్తికిన్=లోకము దండించుటకు.

తా త్ప ర్య ము

బ్రహ్మ తుమ్మఁగా క్షువుఁడను పురుషుఁ డొకఁడు జనించెను. అతనిని బ్రహ్మ రాజు చేసి యింద్రుని యంశమున భూమియందు వానియాజ్ఞ చెల్లునట్లును వరుణుని యంశమున దేహరక్షణము చేయునట్లును కుబేరుని యంశమున విస్తార ధన మిచ్చునట్లును లోకులను దండించుటకై.

క. దండధరునంశ మొసఁగెను, దండితఖలసంఘ! నన్నుఁ • దరియింపింపన్
మండన మిది గైకొను మా•ఖండలు భాగమున లేదు•కల్మష మనఘా! ౧౩౧౭

అర్థములు. దండధరునంశము = యమునియంశమును, దండితఖలసంఘ= దుష్టసమూహమును దండించినవాఁడా, తరియింపింపన్=తరియించునట్లు చేయు టకుఁ గాను, మండనము=ఆభరణము, అఖండలు భాగమునన్=ఇంద్రాంశమున, కల్మషము=పాపము.

తా త్ప ర్య ము

(యముని యంశమునిచ్చెను. దుష్టసంహారకా! నన్నుఁ దరింపఁ జేయుట కీయాభరణము నింద్రాంశమునఁ దీసికొనుము. దీనివలన నీకుఁ బాపము లేదు.)

తే. పరమధార్మికుఁ డగు మహా•భావువాక్య•మునను దానిని గైకొని•మునినిగాంచి
యద్భుతం బగునిట్టి ది•వ్యాభరణము, భద్రచారిత్ర! మీకెట్టు•ప్రాప్తమయ్యె.

తా త్ప ర్య ము

(పరమ ధర్మాత్ముఁడగు మహానుభావుని మాటలనుబట్టి దానిని గ్రహించి, మునిని జూచి యద్భుతమైన నీ దివ్యాభరణము మీకెట్లు లభించినది?)

ఈ యాభరణము క్షత్త్రియభావమున గ్రహింపఁ బడలేదు. అగస్త్యుఁడు కోరిన ట్లాయనను దరింపఁజేయ గ్రహింపఁబడెను.

దీనివలన నాత్మార్థముగఁ గాక పరులఁ దరింపఁజేయ 'అచ్యుతః ప్రీయతా' మ్మని గ్రహించిన పరిగ్రహదోషము లేదని సూచితము.

క. అచ్చెరువుల గనులగు మీ, రచ్చరితముఁ జెప్పుఁడనిన • నమ్ముని యనియెన్
సచ్చరితా! నాకడ కది, వచ్చినవిధ మెల్ల సారిది • వాక్రుత్తు వినన్. ౧౩౯

అర్థములు. అచ్చెరువుల గనులు = ఆశ్చర్యములకు స్థానములు, సారిది= క్రమముగ.

## తాత్పర్యము

(ఆశ్చర్యస్థానములగు మీరు నాకా కథఁ జెప్పుఁడని యడుగ, నా ముని సచ్చరిత్రా! నాయొద్ద కాయాభరణము వచ్చిన విధమంతయుఁ గ్రమముగఁ దెలిపెద వినుమని చెప్పెను.)

## — శ్వేతోపాఖ్యానము —

సీ. మున్ను త్రేతాయుగ • మున యోజనశతంబు, మృగపక్షివర్జిత • మగుచు నొక్క
నిర్జనాటవి యుండఁ • నే నందు నిలువఁగఁ, దలఁచి, యేగితి నది • ఫలవితాన
మూలసుమాదుల • మోహన మైయుండె, నా కాననమునఁ దటాక • మొండు
చక్రవాకములచేఁ జక్రాంగములచేతఁ, గారండవములచేఁ • గ్రమ మగుచు
తే. బూర్ణముగఁ బద్మకైరవా • కీర్ణమగుచు, శైవలాన్విత మయి మహా • శ్చర్యకరము
సౌఖ్యకర మయి యుండెఁ ద • త్సవిధభూమి, జనవివర్జితమైన యా • శ్రమ మొకండు

అర్థములు. మృగపక్షివర్జితము=మృగములచేత, పక్షులచేత విడువఁబడినది-పక్షులు మృగములు లేనిది. నిర్జనాటవి=మనుష్యులులేని యడవి, ఫలవితాన=పండ్లసమూహముచే, మూలసుమాదులన్=వేళ్ళు, పూలు మొదలగు వానిచే, మోహనమై=రమ్యమై, కాననమునన్=అడవియందు, చక్రాంగములు=హంసలు, కారండవములు=కన్నెలేళ్ళు, క్రమము=మనోహరము. పద్మకైరవాకీర్ణము=కమలములచే కలువలచే వ్యాపించినది, శైవలాన్వితము=పాఁచితోఁ గూడినది, తత్సవిధభూమి=దానిసమీపప్రదేశము, జనవివర్జితము=మనుష్యులు లేనిది.

## తాత్పర్యము

పూర్వము త్రేతాయుగమునందు మృగములు పక్షులు జనములు లేని నూరామడ యడవియుండగాఁ నే నందు నిలువఁదలఁచి పోయితిని. పండ్లు మూలములు పూలు దండిగ మనోహరమై యుండెను. ఆ యడవియందుఁ దటాక మొకటిగలదు.

అది చక్రవాకములచేఁ హంసలచే, కన్నెలేళ్ళచే మనోహరమై కలువలచేఁదామరలచే నిండి వ్యాపించి నాఁచుగలదై మహైశ్వర్యకరమై సౌఖ్యకరమై యుండెను. దాని సమీపమున జనులు లేని యాశ్రమ మొకటి గలదు.

ఉ. చూచితిఁ దన్నిదాఘనిశ ♦ సుప్తుఁడనై యట వేగఁ గొల్నికై
వేచని యాజలంబు పయిఁ ♦ బీనుగ నొందు సుపుష్టమున్ వయ
శ్శ్రీచతురంబు గాంచితి న ♦ శీర్ణముఁ బంక్తి విశేషబుద్ధిచే
బ్రోచినదాని దానిగని ♦ బుద్ధిని నేమియుఁ దోప కయ్యెడన్. ౧౩౨౧

అర్థములు. నిదాఘనిశ=వేసవిరాత్రి, సుప్తుఁడనై =నిద్రించినవాఁడనై, వేగన్=ఉదయముకాఁగా, సుపుష్టమున్ = మిగుల బలిసినదానిని, వయశ్శ్రీ= వయస్సు సంపదచే, చతురంబు=మనోహరమైనది, అశీర్ణము = శిథిలముగానిది, పంక్తి విశేషబుద్ధిచేతన్=పంక్తిపక్షపాతముచే, ప్రోచినదానిన్ = రక్షింపఁబడిన దానిని.

తా త్ప ర్య ము

దానిని జూచి యా వేసంగిరాత్రి యచట నిద్రపోయి యుదయమున లేచి కొలని కొద్దకుఁ బోయి యానీళ్ళమీఁద బలిసి వయస్సుతోఁగూడిన చివికిపోని యొక పీనుఁగును పంక్తిపక్షపాతముచే రక్షింపఁబడిన దానిని జూచితిని, నాకేమియుఁ దోఁచినదిగాదు.

క. ఎవ్వరి దీ తను వని నే, నివ్విధిఁ దలపోయుచుండ ♦ నీలో వేల్పుం
గ్రొవ్విరిఁ బోఁడులు గొలువఁగ, మవ్వం బగుమేనివాఁడు ♦ మణిభూషలతోన్.

అర్థములు. ఈ తనువు=ఈ శరీరము, వేల్పుం గ్రొవ్విరి బోఁడులు=దేవస్త్రీలు, మవ్వంబగు మేనివాఁడు=అందమైన దేహము గలవాఁడు.

తా త్ప ర్య ము

(ఈ శరీర మెవ్వరిదాయని నే నీ విధముగా నాలోచించు చుండఁగా నీలోపల దేవస్త్రీలు సేవింప నందమగు శరీరము గలిగి మణి భూషణములతో,)

ఉ. రాజిలువాఁ డొకండు సుర ♦ రాజసమానుఁడు దేవకామినీ
రాజులు వీవఁ జామరలు ♦ రమ్యవిమానమునందుఁ గంటి నీ
రేజదళాక్షు హాటకగి ♦ రిన్ డిగు సూర్యుని బోలి స్వీయ మా
తేజము ముంప దిక్కులను ♦ డిగ్గి విమానముఁ గొల్నిచెంగ్టనన్. ౧౩౨౩

అర్థములు. సురరాజసమానుఁడు=ఇంద్రునితో సమానుఁడు దేవకామినీ రాజులు=దేవస్త్రీ సమూహములు, నీరేజదళాక్షు=కమల దళములవంటికన్నులు గలవానిని, హాటకగిరిన్=మేరుపర్వతమును.

తా త్ప ర్య ము

బంగారు మణుల సొమ్ములతో ప్రకాశించువాఁడు కమలములవంటి కన్నులు గలవాఁడు ఇంద్రునితో సమానుఁ డొకఁడు దేవతాస్త్రీలు చామరలు వేయఁగా విమానమునందుఁ జూచితిని, మేరుపర్వతము దిగు సూర్యునివలె తేజస్సు దిక్కులు నిండఁగా విమానము దిగి కొలనియొద్దను.

చ. బలిసినపీనుఁగుం దినియె ♦ వాచినయట్టులు పొట్టనిండ న
వ్వల సరసీజలంబులను ♦ స్వర్గనివాసకుఁ డాచమించి పోఁ
దలపున వ్యోమయానమును ♦ డాసిన తాతనిఁ గాంచి యంటి స్వ
ర్నిలయుఁడ! చెప్పు మెవ్వఁడవు ♦ నీ కిటు లేవపుఁదిండి యేటికిన్. ౧౩౨౪

అర్థములు. సరసీజలంబులు = కొలనినీళ్ళు, స్వర్గ నివాసకుఁడు=స్వర్గము నందుండువాఁడు, పోన్=పోవునట్టి, స్వర్నిలయుఁడ = స్వర్గమందుండు వాఁడ, ఏవపుఁదిండి=రోఁతతిండి.

తా త్ప ర్య ము

ఆ నీళ్ళలోని బలిసిన పీనుఁగును వాఁచినట్లు కడుపునిండఁ దిని కొలని నీళ్ళు త్రావి వాఁడు పోవుటకై విమానమును సమీపింపఁగా నేను వాని యొద్దకుఁ బోయి ఓయాయి స్వర్గవాసీ! నీ వెవ్వఁడవు? ఈ రోఁత తిండి యేల తినెదవు?

ఉ. ఏటికిఁ బీనుఁగుఁ దినెద ♦ వియ్యది యర్హ మె చెప్పు మయ్య! స్వ
ర్వాటి వసించువారలకు ♦ భావ్యము గాదని తోఁచె నన్న నా
మాటల నాలకించి సుర ♦ మండలవర్తి నమస్కరించి యి
ప్పాట వచించె మౌనివర ♦ పల్కెద విన్ము మదీయవృత్తమున్. ౧౩౨౫

అర్థములు. స్వర్వాటిన్=స్వర్గభూమియందు, సురమండలవర్తి=దేవతల సమూహములో నుండు వాఁడు, ఇప్పాట=ఈవిధముగ మదీయ వృత్తమున్= నా చరిత్రమును.

తా త్ప ర్య ము

(ఏటికిఁ బీనుగును దినెదవు? ఇది తగునా? చెప్పుము. స్వర్గమందుండువారికి భావ్యము కాదని తోఁచె నని చెప్పగా నా మాటలను దేవతల సమూహమున నుండు నతఁడు నమస్కరించి యీవిధముగాఁ జెప్పెను. మునీంద్రా! నా చరిత్రము చెప్పెద వినుము.)

—* శ్వేతుఁడు తన వృత్తాంత మగస్త్యుతోఁ దెల్పుట *—

సీ. నే నతిక్రమ ♦ ణీయ మౌ నాదుర, వర్ష నే మని చెప్పు♦వాఁడ నయ్య
మున్ను మజ్జనకుండు♦సన్నుతశీలుఁడు, వైదర్భుఁడు సుదేవ♦భూధవుఁడును
ఇర్వురుసతు లందు♦నిర్వురఁ గాంచెను సుతుల నన్ శ్వేతుని ♦సురథుఁబిదపఁ
బెక్కు వేలేండ్లు నేఁ♦బృథివి బాలించియు, నాయు వస్థిర మని♦యాత్మ నెఱిఁగి

ఆ. యనుచు రాజు శేసి • యభివందించి యీయర, ణ్యమున కీసరస్సు • ప్రాంతమంద
మూఁడు వేలయేండ్లు • మునివరా! తపముంటిఁ, దుదకు బ్రహ్మలోక • పదముగంటి.

అర్థములు. అనతిక్రమణీయము = అతిక్రమింపరానిది, దురవస్థ=చెడ్డస్థితి, సుదేవ భూవయితుఁడు=సుదేవుఁడను రాజు.

తా త్ప ర్య ము

దాటరాని నాదురవస్థ చెప్పెద వినుము. మునీంద్రా! సుదేవుఁడను విదర్భ రాజు నాతండ్రి సాధుజనులు మెచ్చు సదాచారము గలవాఁడు. ఆయన కిరువురు భార్యలు. శ్వేతుఁడను నన్ను, నా వెనుక సురథుఁడను వానిని కొడుకులఁ గనెను. నే ననేక సంవత్సరములు రాజ్యముచేసి యాయువు స్థిరము గాదని యెఱిఁగి నా తమ్మునకు రాజ్యమిచ్చి నేనీ యడవియందు నీకొలని తీరమున మూఁడు వేలయేండ్లు తపస్సుచేసి తుదకు బ్రహ్మలోకము నార్జించితిని.

క. అక్కడ నాఁకలిదప్పులు, మిక్కిలి బాధింప నన్ను • మిడుకుచు నజునిన్
మ్రొక్కి వచించితి నాగతి, నిక్కరణి సరోజగర్భ • యెందుం గలదే? ౧౩-౧౪

తా త్ప ర్య ము

(అక్కడ నాఁకలి దప్పులు మిక్కిలి బాధింపఁగాఁ బరితపించి, బ్రహ్మకు నమస్కరించి, నా విషయ మిట్లు చెప్పితిని. దేవా! యీవిధ మెచటనైన నున్నదా?)

ఆ. బ్రహ్మలోకమంట • భగవంతుఁడా! యుంట, యాకలియును దప్పి • యఱుగవంట
గడుసుఁబాప మేది • పడియెనో నావెంట, గడుపు మంట యెట్లు • గడుపుచుంట?

అర్థములు. అఱుగవు=క్షయింపవు, గడుసుఁబాపము=కఠినపాపము, కడుపు మంట=ఆఁకలి.

తా త్ప ర్య ము

(ఉండునది బ్రహ్మలోకమఁట. ఆఁకలి దప్పియు క్షమింపవఁట. ఏదియో గడుసు పాపము నావెంటఁబడినది. ఈ కడుపుమంటతో నెట్లు కాలము గడుపుదును?)

చ. అనవుడు బ్రహ్మ యిట్టులనె • నాత్మశరీరము మాంసమెప్పుడున్
దిని క్షుధ నార్చుకొ మ్మికను • దేవతనూభవ! యేల యంటివా
తనువును జక్కఁ బ్రోచితివి • దాన మొఱుంగ వ దెట్టిదో నృపా!
విను మల విత్తు నాటకయె • వృక్షము గల్గునె ధీరసత్తమా! ౧౫-౧౬

అర్థములు. ఆత్మశరీరము మాంసము=నీశరీరమందలి మాంసము, క్షుధ= ఆఁకలి.

తాత్పర్యము

అని యడుగఁగా బ్రహ్మ యిట్లనియె. నీశరీరమాంసము దిని యాఁకలి దీర్చు కొమ్ము, సుదేవనందనా! యది యేల యంటివా? దేహమును బాగుగ రక్షించితివి. దాన మెట్టిదో యెఱుఁగవు, రాజా! విత్తు నాటక చెట్టు గలుగునా? కారణము లేక కార్యము పుట్టునా.

చ. తపమును లెస్సచేసితివి ♦ తన్వి ననం దిని మేను బ్రోచి తీ
వెపుడొకకొంచెమేన్ బరుల ♦ కిచ్చిన దెయ్యది లేదు దానిచే
నృపవర! స్వర్గముం గనియు ♦ నిష్ఠురమౌ క్షుధచేత దప్పిచేఁ
గృపణత బాధ నొందెదవు ♦ రిత్తఁగఁ బోవున కర్మ మేదియున్. ౧౩౩౦

అర్థములు. తన్వి=తృప్తి, తపస్సు=మనసశ్చేంద్రియాణాంచ హ్యైకాగ్రం పరమం తపః, మనస్సు ఇంద్రియములు ఏకాగ్రముగ భగవంతునిపై నుంచుట యుత్తమ తపము.

తాత్పర్యము

నీవు తపస్సు చక్కఁగాఁ జేసితివి. ఆ తపస్సు ఫలము బ్రహ్మలోకము లభించెను. నీవు కడుపారఁ దృప్తిదీరఁ దిని దేహమును రక్షించితివి. ఎవరి కేదైన దానమిచ్చినవాఁడవు కావు నీ దేహమునందు నీ కెంత యభిమాన ముండుటచే ఆ దేహమునే తిని యీ కొలని నీళ్ళు త్రావి నీ యాఁకలిదప్పు లణఁచుకొమ్ము. నీ యాఁకలి దప్పుల కిదియే కారణము. చేసిన కర్మము వ్యర్థముగఁ బోవునా?

ఉ. కావున నిన్ను నీవ తిని ♦ కాంచుము తృప్తి నగస్త్యమౌని రా
జా! వనిఁ జేర వచ్చి దరి♦ తాఘువిఁ జేయు నినున్ నృపాల! దే
వావళి నైన నాయనఘుఁ♦డాదటఁ బ్రోవ సమర్థుఁ డట్టిచోఁ
బ్రోవఁగఁజాలు ని న్ననుచుఁ♦బూని వచింపఁగ నేల నావుడున్. ౧౩౩౧

తాత్పర్యము

కావున నిన్ను నీవేతిని తృప్తి పడుము. అగస్త్యమునీంద్రుఁడా యడవికి వచ్చును. ఆయన నీపాపము హరింపజేయును. ఆయన దేవతలనైన రక్షింపఁజాలు వాఁడు. నిన్ను రక్షింపఁగలఁడని వేఱుగఁ జెప్పవలెనా?

క. నీరేజభవుని నుడి నా, హారముఁ జేసితి మునీంద్ర ♦ యాత్మశరీరం
బీరీతిఁ బెక్కు వర్షము, లారఁగఁ జనె గుణప మేమి ♦ యఱుగదు కొంతేన్.

అర్థములు. గుణపము=పీనుఁగు, అఱుగదు = క్షయింపదు, కొంతేనిన్ = కొంచెమైనను.

### తాత్పర్యము

బ్రహ్మవాక్యము ప్రకారము మునీంద్రా! నా శరీరమే నా కాహారముగాఁ జేసికొంటిని. ఇట్లనేక సంవత్సరములు గడచెనుగాని పీనుఁగులో గొంచెమైనను తగ్గినది కాదు. ఈ దినము కొంత తినిపోయి మఱునాఁడు వచ్చువప్పటికి మునుపున్నట్టు మరల శవము పూర్ణముగా నుండును, శవము క్షయింపదు. నీ కెందరు.

క. ఆపోక నాకు దీనన, చేపడియెడి నన్నుఁ గావు • చెచ్చెర మౌనీ!
యీ పాప మణఁప గదవే, యో పావనశీల • తాపసోత్తమ ఘటజా! ౧౩౩౩

అర్థములు. ఆపోక=తృప్తి, చేపడియెడిన్=కలుగుచున్నది, ఘటజా=అగస్త్యముని.

### తాత్పర్యము

దీనిని దినవనే నాయాఁకలి తగ్గుచున్నది. కాని మఱియేది తినినను తగ్గదు, దీనివలననే నాకుఁ దృప్తి కలుగుచున్నది. మునీంద్రా! నాయీ పాపము క్షయింపఁ జేయుము.

క. కలశీసూనుఁడు తక్కఁగఁ, దలమే యన్యులకు నిందుఁ • దలఁ జూపఁగ నీ
లలితాభరణముఁ గొని నన్నలఘుమతి తరింపఁ జేయు • మా నీమహిమన్. ౧౩౩౪

అర్థములు. కలశీసూనుఁడు=అగస్త్యుఁడు, తలమే=తరమే=సాధ్యమా, తలఁ జూపఁగన్=ప్రవేశించుటకు, లలితాభరణము=మనోహరమైన భూషణము.

### తాత్పర్యము

నీళ్ళు లేక, పశుపక్షి మృగమనుష్యులు లేక యుండు నీయడవికి వచ్చుటకు నగస్త్యునకుఁ దప్ప నితరులకు సాధ్యపడదు. కావున నిన్నగస్త్యునిఁగాఁ దలఁచితిని. నీ వీ యాభరణమును గ్రహించి నా పాపము శమింపఁ జేసి నన్ను నీ మహిమచేఁ దరింపఁజేయుము.

చ. కరుణ దలంప వయ్య నను • గావఁగదయ్య యటన్న శ్వేతభూ
వరు వ్యసనోక్తులన్ విని ద్ర • వన్మతి భూషణ మేను గొంటి, నా
భరణము నేను గొన్నపిద • పన్ నృపు కొల్లిటి మర్త్యకాయమా
సరసిని నాశమొందెఁ గడు • సంతస మందెను నాకవాసియున్. ౧౩౩౫

అర్థములు. ద్రవన్మతిన్=మనస్సు కరఁగిన వాఁడనై, మర్త్యకాయము=మనుష్యదేహము, సరసిని=కొలని యందు, నాకవాసియున్=స్వర్గము నందుండు వాఁడు, స్వర్గమనఁగా నిచట బ్రహ్మలోకము.

### తాత్పర్యము

అయ్యా! నన్ను దయ చూడుము. రక్షింపుము అని యేడ్చుచున్న యతని మాటలు విని మనస్సు కరఁగి భూషణముతో నాకుఁ బనిలేకున్నను, ప్రతిగ్రహము

నాకు నిషిద్ధమైనను నతని రక్షించు కోరికతో నాభరణము తీసికొంటిని. నే నాభరణము తీసికొన్న పిదప, కొలనిలోని మనుష్యదేహము నశించెను. అది చూచి శ్వేతుఁడు సంతోషించెను.

క. ఆరా జొసంగినది యిది, శారాధిపవదన! నేను • దరియింపఁగాఁ
గోరి యొసంగితి నీకున్, గారామునఁ గొమ్ము లేదు • కలుష భయంబున్. ౧౩౩౬

తా త్ప ర్య ము

ఇది యారాజు నా కొసఁగినది. అతనిఁ దరింపఁజేయు తలఁపున నేను బరిగ్రహించితిని. దీనిని నేను, బరిగ్రహించిన నాదోషము పోవుటకై దీని నీవు పరిగ్రహించి నన్నుద్ధరింపుము. నీకు వ్రతహాని లేదు. ప్రేమతో గ్రహింపుము.

**—• దండకారణ్య చరిత్ర మగస్త్యుఁడు శ్రీరామునకుఁ దెలుపుట •—**

సీ. అనుడు నత్యద్భుత • మైన వాక్కులు విని, గౌరవవిస్మయ • కారణముల
రామచంద్రుం డిట్లు • ప్రశ్నించె మౌనీంద్ర! శ్వేతు నరణ్యంబు • వీతజీవి
యగుట యెట్లొకొ నిర్జ • నారణ్యమునను వైదర్భుండు తపమూనఁ • దలఁచు టెట్లొ
వినిపింపు మనవుడు • ముని వల్కెను కృతయుగమున మను వేలె • నుర్వి నెల్ల

తే. నతనిపుత్రకుఁ డిక్ష్వాకుఁ • డమితశౌర్యుఁ, డతని రాజుగ నొనరించి • యవనిరాజ
వంశకర్తవు గమ్మని • పలుకినట్లు, కాక యంచు వచించె ని • క్ష్వాకువిభుఁడు.

అర్థములు. వీతజీవి=జీవజంతువులు లేనిది, నిర్జనారణ్యమునను=మనుష్యులు లేని యడవియందు.

తా త్ప ర్య ము

ఈ ప్రకారముగ చెప్పఁగా మిగుల నాశ్చర్యకరమైన యామాటలు విని గౌరవముచేతను, ఆశ్చర్యముచేతను రామచంద్రమూర్తి యిట్లు ప్రశ్నించెను. మునీంద్రా! శ్వేతుఁ డున్న యరణ్యము ప్రాయము లేనిదేల యయ్యెను? మనుష్యులు లేనిచోట నాయన తప మెట్లు చేసెను? వినిపింపు మనఁగా నగస్త్యుఁ డిట్లనియె.

పూర్వ మీ భూమి నంతయు మనువు పాలించెను. అతని కొడు కిక్ష్వాకుఁడు. ఆ పరాక్రమవంతుని రాజుఁగా జేసి నీవు రాజవంశకర్తవు కమ్మని చెప్పఁగా నాయన దాని నంగీకరించెను.

చ. మనువును సంతసిల్లి గుణ • మండన! నిక్కము నీవ కర్త వీ
జనముల దండపద్ధతిని • జక్కఁగ రక్ష యొనర్పు మెవ్వనిం
గినియకు నిర్నిమిత్తముగ • గీడరి దండితుఁ జేయ జేఁడు వా
నిని వదియే దివంబునను • నిల్పుఁజుమీ సుఖహేతుభూతమై. ౧౩౩౭

అర్థములు. గుణమండన=సుగుణములే యలంకారముగాఁ గలవాఁడా.

తా త్ప ర్య ము

ఆ మాటకు మనువు సంతోషించి నిజముగ నీవే వంశోద్ధర్తవు ఈ ప్రజల నందఱను దండపద్ధతిని జక్కఁగా రక్షింపుము. నిష్కారణముగ నెవ్వరిమీఁదను గోపింపకుము. దోషము చేసిన వాని దండించు రాజును నా దండనీతియే స్వర్గము లభింపఁ జేయును. అది పరలోక సుఖమునకుఁ గారణ మగును.

చ. అని హితమున్ వచించి యజు ♦ నాలయు మేగ నతండు పిమ్మటన్
జనకునిమాటబట్టి బహు♦సత్కృతులన్ ఘటియించి నూర్వురన్
దనయుల దేవసన్నిభుల ♦ ధర్మరతాత్ముఁడు గాంచె వారిలో
జనవర! పిన్నవాఁడు కడు♦జ్ఞానవిహీనుఁడు నీతిశూన్యుడున్. ౧౩౩౯

అర్థములు. అజునాలయము=బ్రహ్మలోకము.

తా త్ప ర్య ము

(అని హిత ముపదేశించి బ్రహ్మలోకమునకుఁ బోఁగాఁ, బిమ్మట నతఁడు తండ్రిమాట ప్రకార మనేక సత్కార్యము లొనరించి నూర్వురు కొడుకులను దేవతలతో సమానులను ధర్మపరుఁడగు నతఁడు గనెను. వారిలోఁ గడగొట్టు వాఁడు మిక్కిలి తెలివిమాలిన వాఁడు నీతి లేనివాఁడు.)

చ. చదువరి గాక పూర్వజుల ♦ సమ్మతిఁ గొల్వక తెల్వి లేక దు
ర్మదుఁ డయి సంచరింపఁ గని ♦ మానవపాలుఁడు దండ మెంచుఁ ద
ప్పద యని యెంచి దండుఁ డని ♦ వానికిఁ బేరిడి ఘోరభూమి యె
య్యది యని వింధ్యశైవల న ♦ గాంతరరాజ్యము నిచ్చె నేలఁగన్. ౧౩౪౦

అర్థములు. చదువరి=విద్యావంతుఁడు, పూర్వజులన్=అన్నలను.

తా త్ప ర్య ము

ఆయన కడగొట్టు కొడుకు విద్యావంతుఁడు గాక యన్నల సేవింపక జ్ఞానము లేక మదించి సంచరింపఁగా వీఁ డెంతో దండితుఁడగును. దప్పదనితలఁచి వానికి దండుడని పేరుపెట్టి వానికిఁ దగిన స్థల మేది యని యాలోచించి వింధ్యమునకు శైవలమునకు నడిమి భాగము పాలింపుమని యిచ్చెను.

ఉ. చారుతరాద్రిరోధమున ♦ క్ష్మాపతి యై మధుమంత మన్పురిన్
హారివిలాసయుక్తముగ ♦ నందు వినిర్మితిఁ జేసి శుక్రునిన్
గారవమార వేఁడుకొని ♦ కాంచి పురోహితుఁ గాఁగ స్వర్గమున్
దారితవృత్రుఁ డేలుఁ గతిఁ ♦ దాను బ్రహృష్టజనావమర్దమున్. ౧౩౪౧

అర్థములు. చారుతర=మనోహరమైన, అద్రిరోధమున=కొండ సమీపమున, దారిత వృత్రుఁడు=ఇంద్రుఁడు, ప్రహృష్ట జనావమర్దమున్=సంతోషించిన జనులు దట్టముగాఁ గలది.

తాత్పర్యము

మనోహరమైన పర్వతప్రాంతమున రాజై మధుమంత మను నందమైనపురములు నిర్మించుకొని శుక్రుని దనకుఁ బురోహితుఁడుగా నుండఁగోరి స్వర్గమును నింద్రుని వలెఁ దాను సంతోషించిన జనుల సమృద్ధము గల.

—♦ దండుఁడు శుక్రకూఁతు నరజను జెఱుచుట ♦—

ఉ. ఆవిషయంబు పెక్కు లగు♦ హాయనముల్ నిహతారి యేలుచో
భూవరుఁ డొక్క చైత్రమునఁ ♦ బొల్పగు భార్గవునాశ్రమంబు దు
ర్భావుఁడు వొచ్చి యందు వన ♦ భాగమునం జరియింప దేవతా
భావిని బోలు సుందరిని ♦ భార్గవుకన్యకఁ గాంచి మోహియై. ౧౩౪౨

అర్థములు. ఆ విషయంబు=ఆ దేశము, హాయనముల్=సంవత్సరములు, నిహతారి=చంపఁబడిన శత్రువులు గలవాఁడు, దుర్భావుఁడు=చెడ్డయభిప్రాయము గలవాఁడు, దేవతాభావిని=దేవతాస్త్రీని.

తాత్పర్యము

అతఁడు శత్రువుల జయించి యా దేశమును పెక్కు సంవత్సరములు పాలించుచు నొకానొక చైత్రమాసమున నందమైన శుక్రాచార్యు నాశ్రమమునకుఁ బోయి యందు దేవతాస్త్రీవలెఁ దిరుగుచున్న శుక్రుని కుమారితను జూచి యామె యందు మోహము గలవాఁడై.

క. పువ్విలుతుబారిఁ బడి యా, క్రొవ్విరిఁబోఁడిని వచించుఁ ♦ గుంజరగమనా!
యెవ్వతెవు నీ వి టేలా, యివ్వనిఁ గ్రుమ్మరెదు చెప్పు♦మీ విన్నవినన్. ౧౩౪౩

తాత్పర్యము

(కామవశుఁడై యా పూఁబోఁడినిఁ గాంచి చెప్పెను. ఓ గజగమనా! నీ వెవ్వతెవు? ఎందుకీ వనములోఁ దిరుగుచున్నావు? చెప్పు. నిన్నుఁ జూడఁగానే.)

క. వలరా జేఁచెడి నననఁగాఁ, గలికి యతని మోహమత్తుఁ♦గా నెఱిఁగి యనన్
దలఁపుము శుక్రునికూఁతుఁగ, నలఘుమతీ! పేర నరజ ♦ నంటకు నన్నున్.

అర్థములు. వలరాజు=మన్మథుఁడు, ఏఁచెడిన్=బాధించు చున్నాఁడు, మోహమత్తుఁగా=మోహముచే నుచితానుచితము తెలియని వానిఁగా.

తాత్పర్యము

నన్ను మన్మథుఁడు బాధించుచున్నాఁడని చెప్పఁగా మోహముచే నతఁడు మదించి యున్నాఁడని యెఱిఁగి యామె నేను శుక్రాచార్య పుత్రికను. నా పేరు అరజ. నన్నుఁ దాఁకకుము.

తే. తండ్రివశమున నుండెడు♦దాన నేను, గన్యకను నీదుగురువె కా♦కవియు? వలఁదు
కోపగించిన భువనముల్♦రూపుమాయు, నీవనఁగ నెంత? చెడిపోదు♦నిక్క-మధిప!
అర్థములు. కవి=శుక్రుఁడు.

తాత్పర్యము

(రాజా! నేను దండ్రిచాటు దానను-నేను గన్యకను, శుక్రుఁడు నీకు గురువే కదా! అతఁడు కోపించిన మూఁడు లోకములు నాశమగును. నీ వనఁగా నెంత? నిజము-చెడిపోయెదవు.)

ఉ. నన్ను వరింపఁ గోరితిను♦నా జనకున్ నయమార వేఁడుమీ
మన్ననతోడ నాతఁ డను♦మానము లేక యొసంగు నీకుఁ బో
మ్మన్నను హ_స్తముల్ శిరము♦నందుఁ గదించి భవన్నిమి_త్తమై
కన్నరొ! ప్రాణము ల్చనెడి♦గాలవిలంబన మెట్లు లోర్చెదన్. ౧౩౪౭

తాత్పర్యము

(నన్ను వరింపఁ గోరెదవేని పోయి నా తండ్రి నడుగుము-అతఁ డనుమానింపక నీ కిచ్చును. అని చెప్పఁగా నతఁడు చేతులు తలమీఁదఁ జేర్చి కన్నరో! నీ కొఱకు నా ప్రాణములు పోవుచున్నవి-కాలవిలంబ మెటులోర్చు కొనఁగలను?)

ఉ. చంపినఁ జంపుఁ గాక మరి♦శాపము నిచ్చిన నిచ్చుఁగాక యో
చంపకగంధి! నన్నిపుడు♦చక్కెరవిల్తుని కేళిఁ దేల్పుమీ
చంపెడి వాఁడు నన్ననుచుఁ♦జయ్యన గ్రుచ్చి బలాత్కృతిన్ సతిన్
మంపున సిగ్గు దీసి మధు♦మంతముఁ జేరె; నెలంత యేడ్చుచున్. ౧౩౪౮
అర్థములు. బలాత్కృతిన్=బలవంతముగా, మంపునన్=మత్తుచే.

తాత్పర్యము

(చంపినఁజంప నిమ్ము. శాపము పెట్టినఁ బెట్టనిమ్ము. ఓ చంపక గంధీ! నన్నిప్పుడు మన్మథక్రీడయందు సుఖింపఁజేయుము. కాముఁడు నన్నుఁ జంపుచున్నాఁ డనుచు వెంటనె బలవంతముగాఁ గౌఁగిలించి యా సతిని మత్తుచే సిగ్గు చెఱచి మధుమంతమునకుఁ బోయెను.)

—♦ శుక్రుఁడు దండుని దేశముపై మట్టివాన గురియ శపించుట ♦—

చ. దరమున నాశ్రమంబు దరిఁ♦దండ్రికి వేచి ధరిత్రిఁ బొర్లఁగా
గురువున కాయుదంతమును♦గొబ్బునఁ దెల్పిరి శిష్యులెల్ల, నా
పరమతపోధనుండు విని♦బాధరుషావశుఁడై క్షుధార్తుఁడై
సరగ నిజాశ్రమంబునకు♦జక్కఁగఁ వచ్చి రజోభిసంప్లుతన్. ౧౩౪౯

అర్థములు. దరమునన్=భయముతో, దరిన్=సమీపమందు, బాఢరుషావశుఁడై=మిక్కిలి కోపించినవాఁడై, క్షుధార్తుఁడై=ఆఁకలిచేఁ బీడింపఁబడినవాఁడై, సరగన్=శీఘ్రముగ, రజోభిసంప్లుతన్=దుమ్ముతో నిండిన దానిని ఉదంతము=వార్త.

### తా త్ప ర్య ము

(భయముచే నాశ్రమము సమీపమందుఁ దండ్రి కొఱకు కనిపెట్టుకొని నేల బడుచుండఁగా, శిష్యులందఱు సమాచారమును నాయనకుఁ దక్షణము తెలిపిరి. ఆ పరమ తపోధనుఁడు విని మిక్కిలి కోపించినవాఁడు, నాఁకలిచేఁ బీడింపఁబడిన వాఁడు నగుచు నాశ్రమమునకుఁ జక్కఁగా వచ్చి దుమ్ముతో నిండిన దానిని.)

క. దీన నరజఁ గని శుక్రుఁ డ, నూన రుషాయుక్తుఁ డగుచు ♦ నుర్వీశుం డా
యీ నెఱిపాప మొనర్చెను, గానఁడు పో కన్ను లతఁడు ♦ కండపొవరునన్.

అర్థములు. దీనన్=ఏడుచుచున్న దానిని, అనూన రుషాయుక్తుఁడు=మిక్కిలి కోపముతోఁ గూడినవాఁడు.

### తా త్ప ర్య ము

(దుఃఖపడుచున్న యరజనుజూచి శుక్రుఁడు మిక్కిలి కోపముతో రాజా యిట్లు పాపము చేసినవాఁడు!! అతఁడు కండపొవరునఁ గన్నులు కానఁడు పో!!)

చ. అసమున నాశ్రయాశుశిఖ ♦ లంటగ జూచెడి స్వీయ యుక్తుఁడై
మసి యయి పోవు నింక గతి ♦ మాలి దురాత్ముఁడు పాపశీలుఁ డీ
యసమమహాఘకార్యమున ♦ కర్హ ఫలంబును గాంచుఁ గాక యీ
వసుధయు సప్తరాత్రములఁ ♦ బా డగుఁ గావుత, పాంసువృష్టిచేన్. ౧౩౯౦

అర్థములు. అసమునన్=మదమున, ఆశ్రయాశు శిఖలు=అగ్నిజ్వాలలు, మసి=బూది, అసమ=సమానములేని, మహాఘకార్యమునకున్=గొప్ప పాపకార్యమునకు సప్తరాత్రములన్=ఏడు దినములలో, పాంసువృష్టిచేన్=దుమ్మువానచే

### తా త్ప ర్య ము

మదమున దేహము తెలియక యగ్నిజ్వాలలఁ దాఁకఁ జూచుచున్నాఁడు. దిక్కులేనివాఁడై దురాత్ముఁడు పాపస్వభావుఁడు తనవారితో మసియై పోవును గాక. ఈ మహాపాపమునకు ఫలముగా నేడు దినములకు దుమ్ము వాన గురిసి యీభూమి పాడయి పోవును గాక.

క. యోజనశతంబు ధర యీ, రాజేలెడియంతమేర ♦ రజము గురిసి స్వా
రాజ వినాశ మొనర్చుత, భూజనులు చరాచరములు ♦ పొలియుత మిచటన్.

అర్థములు. రజము=దుమ్ము, స్వారాజు = స్వర్ + రాజు=ఇంద్రుఁడు పొలియుత=నాశమగును గాక.

తాత్పర్యము

ఈ రాజ్యపు నూఱామడ దూరమునేలను నింద్రుఁడు దుమ్ము గురియించి నాశము చేయునుగాక! ఈలోనుండు జనులు చరాచరములు నాశమగును గాక.

చ. అని శపియించి యాశ్రమము ♦ నందలి వారలఁగాంచి మీర లీ
జనపదసీమ దాఁటి చని ♦ స్థానముఁ గొం డన వార లెల్లరుం
జనఁ గవి కూతుఁ గాంచి మతి ♦ చాలనిదాన! సమాహితాత్మవై
దినములు ద్రోయు మిచ్చోడన ♦ తీవ్రతపఃపరినిశ్చితాత్మవై ౧౩౫.౨

అర్థములు. మతి చాలని దాన=బుద్ధిలేనిదాన, సమాహితాత్మవై= ఇంద్రియ నిగ్రహము గలదానవై, తీవ్రతపఃపరినిశ్చితాత్మవై=తీవ్రమైన తపస్సునందు నిశ్చయపడిన మనస్సుగల దానవై.

తాత్పర్యము

(అని శపించి, యాశ్రమమందున్న వారినిఁజూచి, యీ పొలిమేర దాఁటి పోయి వేఱొకచోట నివాసము చేసికొనుఁడని చెప్పఁగా వారందఱును బోయిరి. అంతట శుక్రుఁడు కుమార్తెను జూచి బుద్ధి మాలినదానా? యింద్రియనిగ్రహము కలిగి తీవ్రమైన తపస్సు చేయుచు నిందే కాలము గడుపుము.)

క. ఈకొలని యోజనంబున, నీ కీడు పొసంగ దల్ల ♦ వృష్టిదినములన్
నీకడ వసించుజంతువు, లే కాఱియ నొందకుండు ♦ నింతీ! యనినన్ ౧౩౫.౩

తాత్పర్యము

ఈకొలని చుట్టు ఆమడ దూరము ఆ వానదినములందును ఏ కీడు పొందకుండును. ఇందు వసించు జంతువుల కే యుపద్రవము లేకుండును.

క. అటు పొత మంచుఁ దన్నుడిఁ, గుటిలాలక దుఃఖగరిమఁ గొని నుశనుం డ
ప్పటినుండి వేఱుతావున, వటువులతో నెలవు కొనియె ♦ వారిజనయనా! ౧౩౫.౪

అర్థములు. ఉశనుండు=శుక్రుఁడు, వటువులతోన్=శిష్యులగు బ్రహ్మచారులతో, నెలవుకొనియెన్=స్థాన మేర్పఱచుకొని యుండెను.

తాత్పర్యము

(ఆమాట నట్లాలే కానిండని దుఃఖాతిశయమున నామె గ్రహించెను. శుక్రుఁడప్పటినుండి శిష్యులగు బ్రహ్మచారులతో వేఱొక తావున స్థాన మేర్పఱచుకొనెను.)

క. దితిజాచార్యుఁడు చెప్పిన, గతి దండునిదండు భటులుఁ ♦ దక్కిన వార
ద్భుతపాంసువృష్టిఁ జచ్చిరి, గతిచెడి దినసప్తకమునఁ ♦ గడు ఘోరముగన్.

అర్థములు. దితిజాచార్యుఁడు=శుక్రుఁడు, అద్భుతపాంసువృష్టిన్=ఆశ్చర్య కరమైన దుమ్మువానచే, దిన సప్తకమునన్=ఏడు దినములలో.

తాత్పర్యము

(శుక్రుఁ డన్నవిధముగా దండుఁడు వాని సేన భటులు తక్కినవారుభయం కరమగు దుమ్ము వానచే నేడు దినములలో గతిమాలి మిక్కిలి భయంకరమగు చావు చచ్చిరి.)

క. దండునివిషయము మునివే, దండముచే శాపమునను ♦ ధరఁ గలయుటచే
దండక యని పేరొక్కఁబడు, నుండుటచే మాను లిందు♦నుర్వీరమణా! ౧౩౫౭

అర్థములు. దండుని విషయము=దండుని దేశము, మునివేతండముచేన్= మునిశ్రేష్ఠునిచే.

తాత్పర్యము

దండుని దేశము మునీశ్వరు శాపముచే నేలపాలయ్యెను గావున దీనికిదండక యను పేరు వచ్చెను. ఇందు మును లుండుటచే.

తే. కన జనస్థాన మనుపేరు♦కంజనేత్ర!, యడిగినది యెల్లఁ జెప్పితి♦నబ్జహితుఁడు
పశ్చిమాద్రికి నరిగె వా♦ర్వంగ మునులు, స్నానమొనరించి రవిఁగొల్వ♦జనెడివారు.

అర్థములు. వార్వంగన్=సంధ్య వార్వంగ.

తాత్పర్యము

(రామా! జనస్థాన మని పేరు వచ్చెను. నీ వడిగినదంతయుఁ జెప్పితిని. సూర్యుఁడు పడమటి కొండకుఁ బోయినాఁడు. మునులు స్నానమొనరించి సంధ్య వార్చుటకు సూర్యు నారాధించుటకుఁ బోయినారు.)

క. రవి యస్తంగతుఁ డయ్యెను, రవివంశవరేణ్యా! సాంధ్య♦రాగం బెసఁగెన్
దవుఁ గాదె నీకు సంధ్యా సువిహితకర్మములు దీర్ప ♦ శుద్ధచరిత్రా! ౧౩౫౮

అర్థములు. అస్తంగతుఁడు=అస్తపర్వతము చేరినవాఁడు, సాంధ్యరాగము= సంజకెంజాయ.

తాత్పర్యము

(సూర్యుఁడస్తగిరికిఁ జేరినాఁడు. రామచంద్రా! సంజకెంజాయ యతి శయించినది. నీకు సంధ్యమున్నగు విహితకర్మములు చేయఁదగును గదా.)

## —• శ్రీరాముఁ డగస్త్యుచే నాజ్ఞగొని యయోధ్యకు మరలి వచ్చుట •—

సీ. అనవుడు శ్రీరాముఁ • డర్చింప సంధ్యను, సురసతీయుతసరో•వరముఁ జేరి
సంధ్య నాఱిచి ముని•చంద్రు నాశ్రమమున, కరుగ నాతండు శా•ల్యన్నరుచిర
భోజనంబును ఫల•ములు మూలములు నిడ, నమృతోపమాన్నంబు•నారగించి
సంతుష్టుఁడై రేయి•జరపి యచ్చోటన, వేకువ నాహ్నిక•విధులఁ దీర్చి

తే. కుంభసంభవునకు మ్రొక్కి • గురుత దోఁప,
నాజ్ఞ యిడవయ్య పురమున•కరుగువాఁడఁ
దాపసోత్తమ! నీభవ•ద్దర్శనమున ధన్యతను గంటి త్వత్కృపా•ధనముఁ గొంటి.

అర్థములు. సురసతీయుత=దేవతాస్త్రీలతోఁ గూడిన, సరోవరము=కొలను, శాల్యన్నరుచిర భోజనము = బియ్యపుటన్నముతోఁ గూడిన మనోహరమైన భోజనము, మునుపటివలె నిర్వ్రీహిధాన్యము కందమూలములు గావు. రాజాదశకుఁ దగినది, అమృతోపమాన్నంబు=అమృతముతో సమానమైన యన్నము, కుంభసంభవునకున్=అగస్త్యునకు, గురుత=గౌరవము, త్వత్కృపాధనము = నీ దయ యనెడి ధనమును.

### తాత్పర్యము

(అని చెప్పఁగా, శ్రీరాముఁడు సంధ్యవార్చుటకు దేవతాస్త్రీలతోఁగూడిన కొలని దగ్గఱకుఁ బోయి, సంధ్యవార్చి, యగస్త్యముని యాశ్రమమునకుఁ బోగా, నతఁడు బియ్యపుటన్నముతోఁ గూడిన మనోహరమైన భోజనము కందమూలముల నియ్యఁగా నమృతముతో సమానమైన యన్నము నారగించి యారాత్రియచ్చటనే గడపి వేకువన లేచి యాహ్నికక్రియలు తీర్చుకొని యగస్త్యునకు నమస్కరించి యాజ్ఞ నొసఁగుఁడు పట్టణమునకుఁ బోయెద. మీ దర్శనమున ధన్యుఁడనైతిని, మీ కృపయనెడు ధనమును బొందితిని.)

ఉ. ఏను బవిత్రితం గనఁగ • నిం దరుదెంచుచుఁ బోవుచుందు నా
కానతియే యటన్న వసు • ధాధిపునద్భుతసూక్తి పంక్తికిన్
మౌని వరుండు ధర్మనయ • సత్ప్రవరుండు వచించె రామచం
ద్రా! నినువంటి పావనుఁడు • లభ్యము లేఁ డిట భూతకోటిలోన్. ౧౬౧

అర్థములు. పవిత్రితం గనఁగన్=పవిత్రుఁడ నగుటకుఁగాను, ఆనతియే=ఆజ్ఞయే, ధర్మనయసత్ప్రవరుండు=ధర్మమే కన్నుగా వర్తించు వారిలో శ్రేష్ఠుడు, ధర్మజ్ఞానము కలవాఁడు.

### తాత్పర్యము

నేను బవిత్రుఁడ నగుటకుఁగా నిచ్చటికి వచ్చుచుఁ బోవుచు నుందును. నా కనుజ్ఞ యేల? దా యనిన నా మునిశ్రేష్ఠుఁ డా మాటల కాశ్చర్యపడి యిట్లనియె.

రామచంద్రా! నీ విచ్చటికి వచ్చి పావనుఁడ వయ్యెద వంటివి. నీవంటి పావనుఁడు భూతసమూహాములలో లేఁడు ఇది సత్యము.

ఉ. అచ్చెరువయ్యె నీదుమధు•రాక్షరముల్ విన రామచంద్ర! ని
న్నొచ్చెము లేని ప్రీతినిఁ ము • హూర్తము చూచిన స్వర్గభూతుఁ డై
నిచ్చలు దేవపూజ్యుఁ డయి • నిర్మలుఁ డౌ నరుఁ డెవ్వఁడేని, ని
న్నచ్చని క్రూరదృష్టి గని•నన్ యమదండహతుండు తత్త్రుటిన్. ౧౩౬-౧

అర్థములు. మధురాక్షరముల్=తియ్యనిమాటలు, ఒచ్చెము=లోపము, నిచ్చలు=సర్వదా, నచ్చని=విశ్వాసములేని, తత్+త్రుటిన్=ఆ నిమిషమందే.

తా త్ప ర్య ము

రామచంద్రా! నీవు చెప్పిన తియ్యనిమాటలు వినఁగా నాశ్చర్యమగు చున్నది. నిండు ప్రీతిచే నెవ్వఁడైనను అల్పకాలము చూచినను వాఁడు స్వర్గమున సర్వదా దేవతలచేఁ బూజ్యుఁడయి దోషరహితుఁ డగును. ఎవ్వఁడు నీయందు విశ్వాసము లేక క్రూరదృష్టిఁ జూచునో వాఁ డప్పుడే యమదండముచేఁ గొట్ట బడినవాఁడై.

ఉ. పోవును నారకాధ్వమునఁ • బొక్కుచు; నీవన భూతరాశిలోఁ
బావనమూర్తి విట్టినిమఁ • బాయకకీర్తన సల్పిరేనియున్
భూవర! సిద్ధిఁ గాంచెదరు • భూజను లింక శుభాధ్వనీమఁ బొ
మ్మా! వసుధాతలంబు నయ•మార్గమునన్ భరియింపు రాఘవా! ౧౩౬-౨

అర్థములు. నారకాధ్వమునన్=నరకమార్గమున, పొక్కుచున్=సంతాప పడుచు, నయమార్గమునన్=నీతిమార్గమున.

తా త్ప ర్య ము

నరకమార్గమున నేడ్చుచుఁ బోవును. నీవనఁగా సామాన్యుఁడవా? ప్రాణి సమూహమునందుఁ బావనుఁడవు. ఇట్టి నిన్నుఁ గీర్తించినవారు లోకులు మోక్షము నొందుదురు. ఇంక నీవు శుభమార్గమునఁ బొమ్ము. నీతితప్పక రాజ్యము పాలింపుము.

చ. అనుడు ఘటాత్మసంభవున • కచ్చటి మూనుల కెల్ల మ్రొక్కి వా
రనుమతి సేయఁ బుష్పకము • నవ్విభుఁ డెక్కిన వార లెల్ల దీ
వన లిడి యర్చ సేసిరి సు • పర్వులు శక్రునిఁ బోలె, వార్షికా
బ్దనికటచంద్రునట్లు జన • వర్యుఁడు పుష్పకమందు మింటిపై. ౧౩౬-౩

అర్థములు. ఘటాత్మ సంభవునకున్ = అగస్త్యునకు, అనుమతి=ఆజ్ఞ, వార్షికాబ్ద నికట చంద్రునట్లు=వర్షించు మేఘము సమీపముననున్న చంద్రునివలె.

తా త్ప ర్య ము

అని చెప్పఁగా రామచంద్రమూర్తి యగస్త్యునకు నచ్చట నున్న తక్కిన మునులకు నమస్కరించి వా రనుజ్ఞ యీయఁగాఁ బుష్పకము నెక్కఁగా వారం దఱు దీవించి యింద్రుని దేవతలు పూజించినట్లు పూజించిరి. ఆయనయు వర్షాకాల మేఘము సమీపమున నున్న చంద్రునివలె నాకాశమునఁ బుష్పకమందు.

ఉ. రాజిలి యభ్రమధ్యమునఁ • గ్రాలఁగ నరుగఁ, డయోధ్యఁ జేరి పే
రోజను వచ్చికక్ష్య డిగి • యొయ్యన సూక్తులఁ బుష్పకంబు రా
రాజును గొల్వఁ బంచి తన • భ్రాతలకుం దనరాకఁ దెల్పఁగా
వే జడ నేది లేక యని • పెం డొడిచేరఁగ ద్వారపాలకున్. ౧౩౬౮

అర్థములు. అభ్రమధ్యమునన్=ఆకాశము నడుమ, రారాజును = కుబేరుని, జడను=ఆలస్యము.

తా త్ప ర్య ము

ప్రకాశించుచు మధ్యాహ్నము వేళ కయోధ్య చేరి నగర నడిమికట్టునందు దిగి మంచి మాటలతోఁ బుష్పకమును గుబేరునొద్దకుఁ బంపి తాను వచ్చినవార్త తమ్ములకుఁ దెలిపి వారిని బిలుచుకొని రమ్మని ద్వారపాలునిఁ బంపెను.

**—• శ్రీరాముఁడు రాజసూయంబుఁ జేయఁ దమ్ములతో యోజించుట •—**

క. అతఁ డేగి వారిఁ బిల్వఁగ, ద్రుతగతి నరుదేర వారు • తోడన్ చెప్పెన్
బతి కతఁడు వారు వచ్చుట, యతులముదంబునను రాముఁ • డనుజయుగంబున్.

అర్థములు. ద్రుతగతిన్=శీఘ్రముగ, అనుజయుగంబున్=ఇద్దఱు తమ్ములను.

తా త్ప ర్య ము

(అతఁడు పోయి వారినిఁ బిలువఁగా, వారు శీఘ్రముగా వచ్చిరి. వారు వచ్చిన వార్త వెంటనే రాజున కతఁడు చెప్పెను, సాటిలేని సంతోషముతో రామచంద్రమూర్తి తమ్ముల నిద్దఱను.)

సీ. ఆలింగన మొనర్చి • యనియె బ్రాహ్మణకార్య,మాచరించితిఁ జక్క • ననుజులార!
అక్షయ్య మవ్యయం • బగుధర్మసేతువు, ధర్మవర్ధక మఘ • దారణంబు
రాజసూయంబు మీ • రలు తోడుపడఁ జేయ, నిచ్ఛయించెద ధర్మ • వృద్ధిఁ బొంచు
రాజసూయసమాచ • రణమునఁ గాదొకో, మిత్రుండు వరుణుఁడై • మేల్మిగనిరె

తే. రాజసూయంబునను ద్విజ • రాజు శాశ్వతంబు సత్కీర్తినిలయంబు • ధర్మవిధిని
గాంచె నిప్పుడు మీరు యో • జించి చెప్పుఁడు,యధ్వరం బెద్దిసేయ మే • లగునొ యనిన.

తాత్పర్యము

కౌఁగిలించుకొని యిట్లనెను. నాయనలారా! బ్రాహ్మణకార్యము నెఱవేర్చితిని. అక్షయము, అవ్యయము, ధర్మసేతువు, ధర్మాభివృద్ధి గలది, పాపములఁ బోఁగొట్టునది యగు రాజసూయయాగము మీ సాహాయ్యముతోఁ జేయఁగోరెదను, రాజసూయయాగము చేసికదా మిత్రుఁడు వరుణుఁడై గొప్పవాఁడయ్యెను. రాజసూయము చేసికదా చంద్రుఁడు శాశ్వతసత్కీర్తి ధర్మమార్గమునఁ గాంచెను. గావున మీ రాలోచించి యే యజ్ఞము చేయుట బాగో చెప్పుఁడు.

ఇది లక్ష్మణ విభీషణుల విషయమునందువలె వారి మనస్సులు తెలియఁ గోరి వేసినప్రశ్న.

—• భరతుఁడు రాజసూయ మర్హముగాదని నొడువుట •—

క. ప్రాంజలియై భరతుఁడు జన,రంజనశీలా! వసుంధ•రా ధర్మయశః
పుంజంబు శాశ్వతం బగి, భంజన! నీయందు న్యాయ్య•పద్ధతి నడువన్. ౧౩౮౭

అర్థములు. ప్రాంజలియై=చేతులు జోడించినవాఁడై, జనరంజనశీలా=ప్రజల సంతోషపెట్టు స్వభావముగలవాఁడా, వసుంధరా ధర్మ యశఃపుంజంబు = భూమియు ధర్మము కీర్తి సమూహము, శాశ్వతము=స్థిరముగా నున్నవి.

తాత్పర్యము

(భరతుఁడు చేతులు జోడించి రామచంద్రప్రభూ! నీవు న్యాయ్య మార్గమున నడుచుటచే భూమి, ధర్మము. కీర్తి నీయందు స్థిరముగా నున్నవి.

చ. అమరులు కంజజున్ గొలుచు • నట్లు మహీభుజు లెల్ల నిన్ను మో
దమున భజింపఁగోరెదరు • తండ్రి నటంచును లోకులెల్ల ని
త్యము నినుఁ జూచువారు, వసు • ధాస్థలిఁ గల్గినభూతకోటి కో
యమలదయాంతరంగ! విను • ప్రాణము నీవ నిజంబు చూడఁగన్. ౧౩౮౮

అర్థములు. కంజజున్=బ్రహ్మను, మహీభుజులు=రాజులు, మోదమునన్=సంతోషముతో.

తాత్పర్యము

దేవతలు బ్రహ్మను సేవించునట్లు రాజు లందఱు సంతోషముతో నీ సేవ చేయఁ గోరుచున్నారు. లోకు లందఱు నిన్నుఁ దండ్రివని తలఁచు చున్నారు. భూమియందుఁ గల సమస్తభూతకోటికి నీవే ప్రాణము.

ఉ. ఇట్టి మహానుభావునకు • నేటికొకో నృపవంశనాశనం
బెట్టునుగూర్చు నధ్వరము • నెత్తికొనం జలువంగ? రోషముల్
పుట్టెడి రాజసూయమున • భూధవపాళికి, దాన భూజనుల్
బిట్టు వినాశ మొందెదరు • భీషణరోషకృతాజధారిణిన్. ౧౩౮౯

అర్థములు. నృపవంశనాశనంబున=రాజవంశముల నాశముచేయు, రాజసూయ మనిన రాజుల నందఱ యుద్ధమందు గెల్వవలెను. యుద్ధమందు హత్య తప్పదు, ఎట్టును=తప్పక, అధ్వరము-యాగము, ఎత్తికొనన్=ప్రయత్నింపఁగా, భీషణ రోషకృతాజిధారిణిన్=భయంకరమైన యుద్ధభూమియందు.

తాత్పర్యము

వీరు వారనక యందఱు నిన్నుఁ దమ ప్రాణమువలె నెంతో ప్రీతితో సేవించుచుండ రాజవంశముల నాశముచేయు యజ్ఞము చేయఁ బ్రయత్నింప నేల? రాజసూయ మనఁగానే రాజుల కందఱకు రోషములు పుట్టును. ఇప్పటి యనుకూలురు కూడ రోషమునఁ బ్రతిఘటింతురు. రోషముచేఁ జేయఁబడు యుద్ధము వలన ప్రజలు నాశ మగుదురు.

క. భూవలయంబు సమస్తము, నీవశమున, వర్తిలంగ ♦ నిస్తులితదయా
శ్రీవిభవ లోకులను దగ, వావిలయముఁ గూర్పఁగా స♦వవ్యాజమునన్. ౧౩౭౦

అర్థములు. భూవలయము=భూచక్రము, నిస్తులిత=అసమానమైన, దయాశ్రీభవ=దయాసంపత్తియే విభవముగాఁ గలవాఁడా, సవవ్యాజమునన్=యజ్ఞము నెపమున.

తాత్పర్యము.

భూచక్రమంతయు నీ వశమున నున్నది. నీవు పరమదయామూర్తివై యందఱ రక్షించుచున్నావు. అట్టి వారిని యజ్ఞమని పేరుపెట్టి నాశముచేయఁ దగునా?

చ. అన నమృతోపమాన మగు ♦ నా నుడులం గడు మెచ్చి కైకయీ
తనయునిఁ జూచి యిట్టులనుఁ ♦ దథ్యము పథ్యము భూహితంబుగా
ఘనమతిఁ బల్కి తీవు మదిఁ ♦ గల్గిన తత్క్రతుచింత వీడితిన్
జనులకు బాధఁ గూర్చు పనిఁ ♦ జల్పఁగఁ జెల్లునె భూమినేతకున్. ౧౩౭౧

అర్థములు. అమృతోపమానము=అమృతముతో సమానమైనది, తథ్యము=సత్యము, పథ్యము=హితమైనది, భూహితంబుగా=జనులకు మేలయినదిగా, తత్+క్రతుచింత=రాజసూయము చేయవలయునను నాలోచన.

తాత్పర్యము

ఇట్లు భరతుఁడు చెప్పఁగా రామచంద్రమూర్తి యిట్లనియె. నీవు చెప్పిన మాట లమృతమువలె మధురము శ్రేయస్కరమై యున్నవి. చాల సంతోషించితిని. సత్యముగను మేలైనదిగాను జనులకు హితమైనదిగా చెప్పితివి. ఆ యాగ విషయమైన నాయాలోచన వదలి పెట్టితిని. రాజగువాఁడు ప్రజలకు బాధ కలిగించుపని చేయరాదు.

క. బాలురవాక్యం బైనను, వాలాయము గ్రాహ్య మగు శు ♦ భం బగునేనిన్
శ్రీలక్ష్మణపూర్వజ! నీ, యాలాపము వినెద శుభద♦మాటను సుమతీ! ౧౩౭౨

తాత్పర్యము

(బాలురు చెప్పినను మంచిమాట వినఁదగును. భరతా! నీమాట శుభప్రద మైనది కావున వినెదను. బాలాదపి సుభాషితమ్మని కలదు గదా.)

—♦ లక్ష్మణుఁడు వృత్రుకథ శ్రీరామునితోఁ జెప్పుట ♦—

చ. అను నెడ లక్ష్మణుండు తన ♦ యగ్రజుఁ గన్గొని సర్వపాపముల్
పొనుఁగువడంగ జేయు నతి ♦ పుణ్యము పావన మశ్వమేధముం
బొనరుపవచ్చుఁగాదె, సుర ♦ ముఖ్యుఁడు వృత్రునిఁ జంపి బ్రహ్మహ
త్యను దొలఁగించుకో నదియ ♦ తా నొనరించె నటం్రడు పెద్దలున్. ౧౩౬౩

అర్థములు. పొనుఁగు వడంగజేయున్=క్షయింపఁజేయును.

తాత్పర్యము

అని చెప్పు సమయంబున లక్ష్మణుఁడు రామచంద్రమూర్తితో సర్వపాపముల నాశనము చేయునది మిగులఁ బుణ్యము కలిగించునదియు పవిత్రమైనదియు నగు నశ్వమేధయాగము చేయవచ్చును గదా. వృత్రుని జంపిన బ్రహ్మహత్య పోఁగొట్టుకొనుటకు నింద్రుఁడు దానినే కదా చేసెనని పెద్దలు చెప్పుదురు.

'సర్వం పాప్మానం తరతి తరతి బ్రహ్మహత్యాం యోశ్వమేధేన యజతే' యని శ్రుతి. మేధ మనఁగా యజ్ఞము.

సీ. శతయోజనంబు వి♦స్తృతియుఁ ద త్త్రిగుణము,న్నతిగలవాఁడొక్క♦దితిసుతుండు
వృత్రుఁ డన్వాఁడు జ♦గత్త్రయిఁ బాలించె; నెయ్యంబు దియ్యంబు♦నేర్పు మెఱసి
ధర్మజ్ఞుఁడును బ్రాజ్ఞ♦తముఁడు కృతజ్ఞుండు, వానిపాలనమున ♦ వసుధయెల్ల
గామధేనువుపోలెఁ ♦ గ్రమమూలఫలాళిఁ, గుసుమచయంబుల♦నొసఁగుచుండె

తే. దున్నకయ పండె ధాత్రి సం ♦ పన్న మగుచు
నిట్టు లుండఁగ నాతని ♦ కితరసుఖము
లెల్ల మాయయు తపమె య ♦ హీన ఫలద
మనుచుఁ దోచిన వనముల ♦ కరుగఁ దలఁచి. ౧౩౬౪

అర్థములు. విస్తృతి=విస్తారము, తత్త్రిగుణము = మూఁడునూర్ల యోజనములు, ఉన్నతి=ఎత్తు, ధర్మజ్ఞుఁడు=ధర్మమెఱిఁగిన వాఁడు, ప్రాజ్ఞతముఁడు=మిక్కిలి బుద్ధిమంతుఁడు, కృతజ్ఞుండు=మే లెఱిఁగినవాఁడు, మాయయు=శాశ్వతమైనవి కావు. అహీనఫలదము=గొప్ప ఫలము నిచ్చునది.

తాత్పర్యము

నూఱామడ విస్తారము, మూఁడు నూర్ల యోజనము లెత్తుగల రాక్షసుఁ డొకఁడు వృత్రాసురుఁడను వాఁడు మూఁడు లోకములు నేర్పుతోఁ బాలించెను.

వాఁడు ధర్మమెఱిఁగినవాఁడు, మిక్కిలి బుద్ధిమంతుఁడు, మేలెఱిఁగినవాఁడు. వాని పాలనమున భూమి కామధేనువువలెఁ గందమూల ఫలములు పూలు నవ్వారిగా నొసఁగుచుండెను. భూమి సర్వసమృద్ధి గలదై యుండెను. దున్నకుండనె పండెను. ఈవిధముగా నుండఁగా వాని కితర సుఖములన్నియు ననిత్యములనియుఁ దపమె గొప్ప ఫలమిచ్చునది యనియుఁ దోఁప నడవులకుఁబోఁదలఁచి,)

క. మధురాపురి కగ్రసుతుం, బ్రథితబలున్ రాజుఁ జేసి ♦ వనములలోనన్
బృథునిష్ఠం దప ముండిన, వ్యథితాత్మకు లైరి యింద్రుఁ♦డాదిగ వేల్పుల్.

అర్థములు. పృథునిష్ఠన్=గొప్పనిష్ఠచే, వ్యథితాత్మకులు=బాధపడు మనస్సు గలవారు, వేల్పుల్=దేవతలు.

తా త్ప ర్య ము

మధురాపురమునకుఁ దన పెద్దకొడుకును రాజుగాఁజేసి యడవికిఁబోయి యందు గొప్ప నియమము గలవాఁడై తపస్సు చేయఁగా దేవతలు మిగుల సంతసించిరి.

చ. హరిహయుఁ డంత జక్రధరు♦నార్తిని జేరి మహాత్మ! వృత్రుఁ డన్
సురరిపు వుగ్రమాతపము ♦ నూల్కొన లోకము తత్తరించె వాఁ
డురుతరశక్తిశాలి కద ♦ నోర్విఁ జయింపఁగ నా కసాధ్య మీ
కరణిని దత్తపంబు కడ ♦ గాంచిన లోకము లుండునంతకున్. ౧౩౭౬

అర్థములు. హరిహయుఁడు=ఇంద్రుఁడు. నూల్కొనన్=చేయఁబూనఁగా, కదనోర్విన్=యుద్ధభూమియందు.

తా త్ప ర్య ము

(అంత నింద్రుఁడు విష్ణువు సన్నిధికిఁబోయి దుఃఖముతో మహాత్మా! వృత్రుఁడను దేవ విరోధి యుగ్రమగు తపము చేయఁబూనఁగా లోకము తత్తఱపాటు చెందినది. వాఁడు మిగుల శక్తిగలవాఁడు. వానిని యుద్ధభూమిలో గెలుచుట నాకసాధ్యము. వాని తపము పూర్తియయ్యెనా లోకములుండువఱకు.)

క. మే మతనికి దాసుల మై, యీ మేనులు బ్రోవవలయు ♦ నిప్పుడు వానిన్
శ్రీమహిళేశ్వర! తీర్పఁగ, సామం; బది యెంత నీకు ♦ క్షణ మల్గినచోన్. ౧౩౭౭

అర్థములు. తీర్పఁగన్=చంపఁగ. సామంబు=తగిన కార్యము.

తా త్ప ర్య ము

(మేము వానికి దాసులమై బ్రదుకవలెను. శ్రీలక్ష్మీనాథా! వాని నిప్పుడు చంపుట మంచిది; నీకుఁ గోపము వచ్చిన నది యెంతపని?)

క. నీకరుణ గన్నదాదిగ, లోకంబుల నెల్ల వాఁడు • లోఁగొనె నిపు డీ
వే కరుణాకలితాత్మక, నాకుల రక్షింపఁ దలఁపు • నాళీకాక్షా. ౧౩౬౮

అర్థములు. నీకరుణ గన్నది ఆదిగన్=నీదయకుఁ బాత్రుఁడైనది మొదలు వృత్రుఁడు విష్ణుభక్తుఁడు, నాకులన్=దేవతలను, నాళీకాక్షా=కమలము వంటి కన్నులు గలవాఁడా.

తా త్ప ర్య ము

నీ దయ సంపాదించుకొన్నది మొదలు వాఁడు లోకములను లోపఱచి కొనెను. నీవు దయ తలంచి దేవతల రక్షింప యత్నింపుము.

క. నీవలన స్వస్థమానసులై వెలయఁగ నెదురు చూచు • నమృతాంధసులో
దేవా! యున్నా రాశరు, గావర మడఁగించి జగముఁ • గావంగదవే. ౧౩౬౯

అర్థములు. అమృతాంధసులు=దేవతలు, ఆశరు=రాక్షసుని యొక్క, గావరము=గర్వము.

తా త్ప ర్య ము

(దేవా! దేవతలు నీ వలన మనస్థిరతము గలవారై బ్రదుక నెదురుచూచు చున్నారు. రాక్షసుని పొగరణఁచి లోకమును గాపాడుము.)

తే. ధీరధర! సాధులైన సబ్బం • దారకులకు, నిచ్చలును నీవ గతి వయి • నివ్వటిలుచు
విం క దుస్సహ మెవ్వరి • కేని దీనిఁ, జక్కఁదిద్దఁగఁ, గాన మా • దిక్కు నీవ. ౧౩౭౦

అర్థములు. ధీరధర=మందర పర్వతము ధరించినవాఁడా, ధీరస్తునాబుధే, అంబుధౌచ త్రిషు శ్వేవ మందరే ధైర్యవత్యపి॥ నానా॥ర॥ నిచ్చలు=సర్వదా.

తా త్ప ర్య ము

(మందరధరా! సాధువులైన దేవతలకు నీవే గతివై యున్నావు. దీనిదిద్దుట కెవరికిని సాధ్యముగాదు. కావున నీవే మాకు దిక్కు.)

—• విష్ణువు వాసవుతో వృత్రుఁ జంప నుపాయంబు దెలుపుట •—

క. వాసవుఁ డిటు పల్కిన హరి, యే సౌహృదబద్ధుఁడం జుఁ • డీ వృత్రునెడన్
మీ సంతోషంబునకై, యే సంపఁగ నొల్లనచటి • కే తెంచి యనిన్. ౧౩౭౧

అర్థములు. సౌహృదబద్ధుఁడన్=ప్రేమచేఁ గట్టఁ బడినవాఁడను, ఏన్=నేను, సంపఁగన్=చంపుటకు, చంపు రూ. సంపు సారంగాహితమున్, సంపెఁ గనహర్షమేపునఁ బొదలన్. హ. స. ౨ ఆ.

తా త్ప ర్య ము

(ఇంద్రుఁ డీ ప్రకారము చెప్పఁగా విష్ణు విట్లనియె. వృత్రునియందు నాకు స్నేహభావము గలదు. కావున మీ సంతోషమునకుఁ గాను నేను వానిని యుద్ధమందుఁ జంప నొల్లను.)

ఉ. వినను మీకు భద్రము వ ♦ యంబుగఁ గూర్చెద, నాదు తేజమున్
మానితశీలులార! బల♦మర్దనునందు శతారమందు భూ
మీనిలయంబునన్ నిలుప ♦ మేకొనువాఁడను దాన వృత్రహిం
సా నిపుణత్వ మొందుఁ బవి ♦ సాధను డంచన వేల్పు లెల్లరున్. ౧౩౮౨

అర్థములు. భద్రము=శుభము, బలమర్దనునందు=ఇంద్రునియందు, శతార మందున్=వజ్రమందు, భూమినిలయంబునన్ = భూప్రదేశమందు, మేకొనువాఁడను=అంగీకరించెదను, పవిసాధనుఁడు=ఇంద్రుఁడు, వృత్రహింసానిపుణత్వము= వృత్రుని జంపుటయందు సామర్థ్యము.

తాత్పర్యము

అటు లున్నను మీకు మేలు గలుగు నుపాయము చెప్పెదను. నాతేజస్సును ఇంద్రునియందు వజ్రాయుధమందు భూమియందు నుంచెదను. దానిచే నింద్రుఁడు వృత్రుఁ జంప సమర్థుఁ డగును అని చెప్పఁగా దేవతలందఱు.

క. మ్రొక్కుచు నీ వతికరుణను, దిక్కగుటను మేము బ్రదికి♦తిమి లక్ష్మీశా!
రక్కసుఁ దునుమఁగ వాసవు,మక్కువ భరియింపు మాత్మ♦మహిమనటంచున్.

తాత్పర్యము

(శ్రియఃపతీ! నీవు మిగుల దయతో రక్షించుటచే బ్రదికితిమి. రాక్షసునిఁ జంపుటకు నీ ప్రభావమున నింద్రునిఁ గాపాడవలె ననుచు,)

చ. బలరిపుఁ గూడి వృత్రుఁడు త♦పం బొనరించు వనంబుఁ జేరి ని
స్తులనిజభూరితేజమునఁ ♦ దోయదమార్గము నిర్దహించు వ
ట్లలఘుతపంబునం గొఱలు ♦ నాతని గాంచి భయంబు నొంది రీ
బలియునిఁ జంపు టెట్లు? పరి♦భావముఁ బొందక యుండు టెట్లొకో? ౧౩౮౪

అర్థములు. బలరిపున్=ఇంద్రుని, నిస్తుల=అసమానమైన, నిజ=తనయొక్క, భూరితేజమున్=గొప్ప తేజస్సుచే, తోయదమార్గమున్ = ఆకాశమును, పరి భావము=అవమానము.

తాత్పర్యము

ఇంద్రునిఁ గూడి వృత్రుఁడు తపస్సు చేయు వనమునకుఁ బోయి తన తేజముచే నాకాశమును దహించువాని వలెనున్న వృత్రునిఁ జూచి యీబలశాలిని నెవ్విధముగఁ జంపఁగలము? ఎట్టు లవమానపడకుందుమని భయపడిరి.

మ. అని చింతింపఁగ వేల్పు లెల్లరు సహ♦స్రాక్షుండు వృత్రాసురున్
దునిమెం గ్రూరత ఘోరవజ్రహతిఁ బ్రో♦న్మూర్ఛితజ్వాలజ్వాలముల్
జనతాభీతికరంబుగా నెగసెఁ గ♦ల్పం బో యనన్ సాధుచిం
తను నిష్కారణ మింద్రుఁ డిట్లు నటకం♦దఘోరపాపం బొగిన్. ౧౩౮౫

అర్థములు. సహస్రాక్షుండు=ఇంద్రుఁడు, ఘోరవజ్రహతిన్=భయంకరమైన వజ్రము దెబ్బచే, ప్రోద్భూత=పుట్టిన, జ్వలత్=మండుచున్న, జ్వాలముల్=శిఖలు, జనతా=జనసమూహమునకు, భీతికరంబుగాన్=భయము కలిగించునదిగా, కల్పంబో=ప్రలయకాలమో, సాధుచింతను = మంచి యాలోచన గలవానిని, నిష్కారణము=కారణము లేక, న్యాయయుద్ధమందుఁ జంపినవాఁడు కాఁడు, తత్+ఘోరపాపంబు=ఆ భయంకరపాపము.

తాత్పర్యము

ఇట్లు దేవత లాలోచించుచుండ నింద్రుఁడు వజ్రముచే దయాహీనుఁడై చంపెను. అప్పుడు ప్రలయమో యనునట్లు మంటలు లోకులకు భయము కలుగునట్లు లెగసె. సాధుచింతగల వృత్రుని నిష్కారణముగఁ జంపఁగా నా ఘోరపాపము.

—• ఇంద్రునకు బ్రహ్మహత్య ప్రాప్తించుట •—

ఆ. బ్రహ్మహత్య వెంటఁ•బడ శచీవల్లభుఁ, డురుక విడువ కదియు•నతఁ డి నతని
నాకవిభుఁడు వసరి•లోకంబు కడపలఁ, దమమునందు డాఁగె•నమరు లిచట.

అర్థములు. ఉరుకన్=పరువెత్తఁగా, ఆయుధములు ధరించిన తమ్ముఁ జంపవచ్చినవారి నెవరిని జంపినను దోషము లేదు. అట్లు గాకుండుటచే నింద్రునకు బ్రహ్మహత్య ప్రాప్తించెను.

తాత్పర్యము

(బ్రహ్మహత్య వెంటఁబడఁగా నింద్రుఁడు పరువెత్తెను. అది విడువక నతని నాక్రమించెను స్వర్గాధిపతి దుఃఖించి లోకమున కవలఁ జీకటిలో డాఁగెను. అచట దేవతలు.)

చ. హతవిమతుల్ ప్రణష్టవిబు•ధాధిపు లగ్నిపురోగముల్ రమా
పతిఁ గన నేగి పల్కిరి స•పర్యలఁ దన్పి జగత్పితా! జగ
ద్గతి పరమేశ పూర్వజ జ•గత్పరిపాలన హేతు వైన వి
ష్ణుతఁ గొని నీవు మ మ్మిపుడు•చూడుము సార దయార్ద్ర దృష్టులన్. ౧౬౭౭

అర్థములు. హతవిమతుల్=చంపఁబడిన శత్రువు గలవారు, ప్రణష్ట విబుధాధిపులు=ఇంద్రుని పోఁగొట్టుకొనినవారు, ఇంద్రుడు కానరాకపోయిన, అగ్నిపురోగముల్=అగ్ని మొదలగువారు, రమాపతిన్=విష్ణువును, సపర్యల=సేవలచే, తన్పి=తృప్తిపడఁజేసి, పూర్వజ=మొట్టమొదట పుట్టినవాఁడా.

తాత్పర్యము

శత్రువు చచ్చుటయు ఆదోషమున నింద్రుఁడు కానరాకపోవుటయుఁ జూచి యగ్ని మొదలగువారు విష్ణునొద్దకుఁ బోయి సేవలు సేసి సంతోషపఱిచి పరమేశ్వరా! జగమును బరిపాలింప విష్ణువైన నీవు మమ్ము నిపుడు కనికరమునఁ జూడుము.

క. చచ్చెను నీచే వృత్రుఁడు, వచ్చె నిపుడు బ్రహ్మహత్య ♦ వాసవునకు నా
సచ్చరితుఁడు దుష్కృతమున,మ్రుచ్చిర కుండఁగ నుపాయ♦మున్ సెల విమ్మా.

తాత్పర్యము

నీచే వృత్రుఁడు చచ్చెను గాని బ్రహ్మహత్య యింద్రునకు వచ్చెను. మంచి నడవడి గల యతఁడు ఆపాపమున శోకింపకుండ రక్షింపుము. దాని కేదైన నుపాయము చెప్పుము.

క. అనవుడు విష్ణుం డిట్లను ననుఁగూర్చి సవంబు సలిపి♦నన్ శక్రుఁడు పా
వనుఁగా నొనరించెదఁ గావున నొక హయమేధ మతఁడు♦పూనఁగ నిండీ

అర్థములు. సవంబు=యజ్ఞము.

తాత్పర్యము

అని చెప్పఁగా విష్ణు విట్లు చెప్పెను. నన్ను గుఱించి యజ్ఞము చేసినచో నింద్రుని పవిత్రునిఁ జేసెదను. కావున నతఁ డశ్వమేధ యాగము చేయనిండు.)

తే. మరల సురలఁ గలయు ♦ నరుగుఁ డటన్నను, వారు వల్లెయనుచుఁ♦బని వినంగ
బ్రహ్మహత్యబలిమి ♦ దానవుఁ డంధ త, మసమునందు వేష్ట♦మానుఁడగుచు.

అర్థములు. బని వినంగన్=ఆజ్ఞ దీసికొని పోఁగా, అంధతమసమందు=గాఢాంధకారమందు, వేష్టమానుఁడు=చుట్టఁ బడినవాఁడు.

తాత్పర్యము

(మరల దేవతలతోఁ జేరఁగలఁడని చెప్ప వారు 'మహాప్రసాద'మని సెలవు తీసికొన్న పోఁగా నింద్రుఁడు బ్రహ్మహత్య బలిమిచే గాఢాంధకారముచే నావరింపఁ బడిన వాఁడయి.)

— ♦ ఇంద్రుఁ డశ్వమేధ మొనర్చి బ్రహ్మహత్యఁ దొలఁగించుకొనుట ♦ —

చ. ఉరగముఁ బోలి నష్టమతి ♦ యుం గతచేతనుఁ డౌచు నుండఁగా
ధరణి తపించెఁ, గాననవి ♦ తానము లెండెఁ దరంగిణుల్ సరో
వరములు శోషిలెన్, వఱపు♦వ ర్తిలె, భూతచయంబు లన్నియున్
దరమునఁ దత్తఱిల్లె, విబు ♦ ధప్రకరం బతి దాక్ష రీతిగన్. ౧౩౯౧

అర్థములు. ఉరగముఁబోలి = పామువలె, నష్టమతి=మనస్సు చెడినవాఁడు, గతచేతనుఁడు=జ్ఞానము లేనివాఁడు, కానన వితానములు=అడవి సమూహములు, తరంగిణుల్=నదులు, సరోవరములు=కొలఁకులు, శోషిల్లెన్=నీ రెండిన వయ్యెను, వఱపు = వాన లేమిని, దుర్భిక్షము, దరమునన్ = భయముచే.

## తాత్పర్యము

(ఇంద్రుఁడు పామువలెఁ జుట్టుకొనిపోయి, మతిచెడి, తెలివిలేక పడియుండ భూమి యుడికిపోయెను, అడవులెండిపోయెను, నదులు వట్టిపోయెను. వానలేదయ్యెను, ప్రాణులన్నియు భయముచేఁ దత్తఱపోయెను, దేవతాసమూహ మప్పుడు విష్ణుమూర్తి యాజ్ఞప్రకారము.)

చ. హరిహయు నున్కిపట్టెఱిఁగి ♦ యాతనిఁ దెచ్చి సవంబుఁ జేయ న
ధ్వరముతుదన్ మహాఘము బు♦ధప్రతతిం గని నాకు నిల్వఁగా
నిరవు వచింపుఁడీ యనఁగ ♦ నిట్లని రెల్లరు నాల్గుపాళ్ళుగా
దురితమ! కమ్ము, గట్టుపగ♦తున్ విడి యుండుము నొందు నేనియున్. ౧౩౬-౨

అర్థములు. అధ్వరము తుదన్=యజ్ఞము కడపట, మహాఘము = బ్రహ్మహత్యా పాపము, బుధప్రతతిన్=దేవతా సమూహమును, ఇరవు=స్థలము, దురితమ=పాపమా, నాలుగుపాళ్ళు=నాలుగు భాగములు, గట్టుపగతున్=ఇంద్రుని

## తాత్పర్యము

ఇంద్రుఁడుండు స్థలము దెలిసికొని యతని సమాధానపఱచి యజ్ఞము చేయఁగా యజ్ఞము కడపట బ్రహ్మహత్య దేవతలారా నే నెందుండును చెప్పుఁడని కోరఁగా నీవు నాలుగు భాగములు యింద్రుని విడిచి యెంతైన నుండుము అనిరి.

సీ. అనవుడు నాబ్రహ్మ♦హత్య యిట్లు వచించె, వానకారున నాల్గు♦పక్షములను
గామవారిణి నయి ♦ కలుషమానసదర్ప, నాశిని నై పూర్ణ♦నదులయందు
నేకాంశమున నుందు ♦ నింకొక్క భాగానఁ జవుడుగా నెప్పుడు♦స్నానసింతు
దర్పసంపూర్ణలై ♦తనరు యౌవనయుక్త, నారులయందు మా♦న్నాళ్ళలుందు
ఆ. వారికామమదము♦వారింప మూఁడవ, యంశమునను; నిగులు♦నంశమునను
గల్లలను నమాన♦క బ్రహ్మణులఁ జంపు, వారియం దమర్త్య♦లార! యుందు.

అర్థములు. వానకారున=వానకాలమందు, నాల్గుపక్షములు=రెండు నెలలు, సింహకర్కట మాసములందు, శ్రావణాషాఢమాసములు, కామవారిణినై=స్నానము చేయువారి కోరికను వారించు దాననై, కలుషమానస=పాపపుమనస్సు గలవారి, దర్పనాశినినై=దర్పము నాశముచేయుదాననై, పూర్ణనదులయందు=నిండుగాఁబాఱు నదులయందు, ఏకాంశమున=ఒక్క భాగమున.

## నదీరజోదోషనిర్ణయము

మార్కండేయః ద్విమాసం సరిత స్సర్వా భవంతి హి రజస్వలాః। అప్రశస్తం తతః స్నానం వర్షాదౌ నవవారిణి। వ్యాఘ్రపాదః, సింహ కర్కటయోర్మధ్యే సర్వానద్యో రజస్వలాః, తాసు స్నానంనకుర్వీతవర్జయిత్వా మహానదీః। ఉపాకర్మణి

చోత్సర్గే ప్రేతస్నానే తథైవచ। చంద్రసూర్య గ్రహేచైవ రజోదోషోనవిద్యతే। అభావే కూపవాపీనా మనపాయి నమో భృతామ్। రజోదుష్టేపి పయసి గ్రామ భోగో న దుష్యతి। దీనివలన ఆషాఢ శ్రావణములందు శ్రోత్రసీటియందు నదులలో స్నానము చేయరాదు. మహానదులం దనఁగా ఉపనదులు గాక ప్రత్యక్షముగా సముద్రములోఁ గలియు గంగా, కావేరి, గోదావరి, తామ్రపర్ణి నర్మద, సింధులోనగు నదులందు స్నానము చేయవచ్చును. ఉపాకర్మమందు, ఉత్సర్గమందు ప్రేతస్నానమందు, చంద్ర సూర్య గ్రహణములందు రజోదోషము లేదు. బావులు తీర్థములు గాని విడువక యుండు జలాశయములు గాని లేని గ్రామములందు నేటి స్నానము దుష్టము గాదు.

తా త్ప ర్య ము

దేవతలిట్లు చెప్పఁగా బ్రహ్మహత్య యిట్లనియె. వానకాలమందు రెండు నెలలు కామము వారించు దాననై పాపాత్ములదర్ప మణఁచు దాననై యొక భాగమున నిండుగాఁ బాఱు నదులందునను, రెండవభాగమున భూమియందు చవుడై యుందును. మూఁడవ భాగమున యౌవనదర్పము గల స్త్రీలు పురుషులతో సంభోగించి సుఖపడకుండ మూఁడుదినము లుందును. నాలుగవ భాగమున నిర్దోషులగు బ్రాహ్మలను గల్లలచే నపకీర్తిపాలు చేయు వారియం దుందును.

క. అనవుడు నీ కోరినవిధ,మున నుండు మటంచు నమర•ముఖ్యులు పలుకం
జనె నదియుఁ బూతుఁడౌ శ,క్రుని దోడ్కొని చనిరి సురలు•కువలయ మలరన్

అర్థములు. కువలయము=భూచక్రము.

తా త్ప ర్య ము

(అని యడుగఁగా నీవు కోరినట్లే యుండుమని దేవతలు చెప్పఁగా నది పోయెను. పవిత్రుఁడైన యింద్రుని తోడ్కొని దేవతలు భూలోకము సంతసింపఁగాఁ బోయిరి)

—• శ్రీరాముఁడు లక్ష్మణునకు నిలుని వృత్తాంతముఁ దెలుపుట •—

ఉ. ఇట్టిది యశ్వమేధ మన • నీ వొనరింపుము దానినంచుఁ దో
బుట్టు వచింప రాఘవుఁడు • పొంగి హసించుచు నశ్వమేధ మా
నట్టిద కర్దమాత్మజుఁ డ • నంతయశోం డిలనామధేయధా
త్రీట్టగు బాహ్లి కేశ్వరుఁడు• నియ్యది సల్పెను మున్ను లక్ష్మణా! ౧౩౯౧

తా త్ప ర్య ము

అర్థములు తోఁబుట్టువు=తమ్ముఁడు, కర్దమాత్మజుఁడు=కర్దమ ప్రజాపతి కుమారుఁడు, ఇలనామధేయ=ఇలుఁ డను పేరుగల, ధాత్రీట్టు=రాజు బాహ్లికేశ్వరుఁడు=బాహ్లిక దేశ ప్రభువు.

### తాత్పర్యము

(ఇట్టి ప్రభావము గలది యశ్వమేధ మని చెప్పఁగా, లక్ష్మణుఁడు,అన్నా! నీవు దానిని జేయుమనఁగా సంతసించి, నవ్వుచు అవును. అశ్వమేధమట్టిదే.మిగులఁ బ్రఖ్యాతి వడసిన కర్దమ ప్రజాపతి కుమారుఁడు బాహ్లిక దేశమునకుఁ బ్రభువగు నిలుఁడను రాజు దీనిని జేసెను.)

చ. తనవశమున్ ఘటించి వసు ♦ ధాతల మంతయు ధర్మపద్ధతిన్
జనులను నాత్మపుత్రకుల ♦ చందమునన్ భరియించి వేల్పులున్
దనుజులు నాగరాక్షసులు ♦ తత్పరులై భయయుక్తి నమ్మహా
త్మునిఁ భజియింతు రీ భువన ♦ ముల్ వణఁకుం గిను కాతఁ డూనినన్. ౧౩౯౭

అర్థములు. కినుపు=కోపము.

### తాత్పర్యము

(భూమండలంబంతయుఁ దన స్వాధీనము చేసికొని ప్రజలను దన కన్నబిడ్డల వలెఁ బోషించెను. దేవతలు, దానవులు, నాగులు,రాక్షసులు లోబడి భయముతో నతనిఁ గొలుతురు. ఈ లోకములన్నియు నతఁడు కోపించిన గడ గడ లాడును.)

చ. ఇలుఁ డిటు ధర్మవీర్యమతు ♦ లెంతయు వాసిఘటింప నేలుచోఁ
జెలువపుఁ జైత్రమంతఁ దఱి♦సెక్ మృగయాభిరుచిన్ నృపాలుఁడున్
బలభటవాహయుక్తుఁ డయి ♦ బంధురకాననసీమ కేగి జం
తులఁ బరిమార్చి వేలకొల ♦ ముల్ దనివింగనఁజాల కొక్కటన్. ౧౩౯౮

అర్థములు. ధర్మవీర్యమతులు=ధర్మము బలము బుద్ధి, తఱిసెన్=సమీపించెను, మృగయ+అభిరుచిన్=వేటయందలి కాంక్షచే, బలభటవాహయుక్తుఁడయి=సేనాభటులతోను గుఱ్ఱములు మొదలగు వాహనములతోను, బంధుర కాననసీమకు=దట్టమైన యడవిప్రదేశమునకు, జంతులున్=మృగములను.

### తాత్పర్యము

ధర్మము, బలము, బుద్ధిచేఁ బ్రసిద్ధుఁడైన యిలుడు రాజ్యమేలుచు నొక చైత్రమాసమున వేటాడఁగోరి సేనాభటులను గుఱ్ఱములు లోనగు వాహనములను దీసికొని దట్టమైన యడవి కేగి వేటాడి తృప్తిలేక.

తే. షణ్ముఖుం డుదయించిన ♦ స్థలముఁ జేరి, సందుగొరీనమేతుఁడై ♦హరుడు కేళిఁ దేలుచుండెను బరిచర♦జాలయుక్తి, భార్యప్రీతికి నాఁడుహా♦సంబుఁ దాల్చి. ౧౩౯౯

అర్థములు. షణ్ముఖుఁడు=కుమారస్వామి, పరిచరజాలయుక్తి=సేవకురాండ్ర సమూహముతో.

తా త్ప ర్య ము

పోఁబుపోయి కుమారస్వామి పుట్టిన స్థలము చేరెను. అందు శివుఁడు భార్యను సంతోషింపఁ జేయ నాఁడు రూపము దాల్చి పరిచారికలతోడ భార్యతోఁ గ్రీడించు చుండెను.

ఉ. అందలి భూరుహంబులును • ప్రాణులు సర్వము నాఁడురూపముం
జెంది రహించు చుండె నటఁ • జేరి ధరాపతి వింత చూచుచో
సుందరి యయ్యెఁ దాను నది • చూచి మహావ్యసనాబ్ధి మున్గి బా
లేందు కిరీటుకృత్య మని • యెంచి సభృత్యుఁడు సానుగుండునై ౧౩౯

అర్థములు. భూరుహంబులును=చెట్లును, సుందరి=ఆఁడుది, బాలేందు కిరీటు=శివునియొక్క, కృత్యము=కార్యము.

తా త్ప ర్య ము

అక్కడఁ జెట్లును ప్రాణు లన్నియు నాఁడు రూపములు ధరించియుండెను. అక్కడఁ జేరి యందలి వినోదములు చూచుచుండఁగా నాయనయు నాఁడు దయ్యెను. దానికిఁ జాల శోకించి యిది శివుఁడు చేసినపనియని తలంచి భృత్యుల తోను సహచరులతోను.

•—• ఇలుఁడు స్త్రీయై పార్వతీ పరమేశ్వరుల శరణుఁ జొచ్చుట •—

క. త్రినయను శరణముఁ జొచ్చినఁ, గని యాశుఁడు నగుచు లెమ్ము • కర్దమతనయా
వని తాత్వచ్యుతి తక్కఁగ, మనుజేశ్వర! వరము కోరు • మా యెది యైనన్.

అర్థములు. త్రినయను=శివుని, వనితాత్వచ్యుతి తక్కఁగన్=ఆఁడుతనము పోవలయుననునది తప్ప.

తా త్ప ర్య ము

(శివుని శరణు చొరఁగా జూచి, నవ్వి రాజా! లెమ్ము! ఆఁడు తనము పోవలయు ననునది తప్ప మఱియేదియైన వరము కోరుము.)

క. శంకరు వాక్యములకుఁ బతి, సంకటపడి యన్య మేది • నమ్మతి లేమిన్
శంకరి పదముల వ్రాలెం గింకరుఁడను దల్లి! ప్రోచి • కీర్తిం గొనుమా. ౧౪౧

అర్థములు. శంకరి=పార్వతి.

తా త్ప ర్య ము

(శంకరుని మాటలను విని సంకటపడి, మఱేది కోరుట కిష్టములేక పార్వతి పాదములమీఁదఁబడి తల్లీ! కింకరుఁడను, నన్ను రక్షించి కీర్తి వడయుము.)

ఉ. ఏలికసాని వీవు జగ • మెల్లనుఁ బ్రోవఁగ దేవి కామితా
ర్థాళి ఘటింప శక్తవు ద • యామతివిన్ వరదాన కర్త్రి వే
వేఁ ద్వదీయదర్శనము • విశ్రుతసౌఖ్య నిదానమౌట శ్రీ
లోలవిలోచనా! యఘము • లోఁగొని నన్ను క్షమింపు మీశ్వరీ! ౧౪౦౨

అర్థములు. ఏలికసానివి=ఈశ్వరివి, కామితార్థాళి=కోరిన ప్రయోజనములు శక్తవు=శక్తిగల దానవు, దయామతివి=దయగల దానవు, వరదాన కర్త్రివి=వరము లిచ్చు దానవు, అఘము=పాపము.

తాత్పర్యము

(దేవీ! లోకము లన్నియుఁ గాపాడ నీ వీశ్వరివి. కోరిన కోరిక లీయసమర్థురాలవు. దయగల దానవు. వరము లిచ్చు దానవు నీ దర్శనము శాశ్వత సౌఖ్యము నకు నిదానము. నా యపరాధమును లోఁగొని నన్ను క్షమింపుము.)

ఆ. నన్నుఁ గరుణఁ జూడు • కన్నతల్లివి నీవు, తల్లిగాక యెవరు • తనయు మొఱల
నాలకించువార • లంబ! నీ చరణముల్, వదల నన్ను జేయి • వదలితేని. ౧౪౦౩

తాత్పర్యము

(నీవు కన్నతల్లివి. నన్నుఁ గరుణింపుము. తల్లిగాక తనయుల మొఱవినువా రెవరున్నారు అమ్మా! నీవు నన్నుఁ ద్రోసివేసినను నీపాదములు నేను వదలను.)

క. నావుడు ధరణీవల్లభు, భావంబు నెఱింగి పల్కె • భవ సమ్మత యో
భూవర నేను వరార్థం, బీవచ్చు హరుండె కర్త • యీయఁగఁ గోఱితన్. ౧౪౦౪

అర్థములు. భవసమ్మత=ఈశ్వరునకుఁ బ్రియురాలు, వరార్థంబు=సగము వరము.

తాత్పర్యము

(అని చెప్పఁగా, పార్వతి రాజు నభిప్రాయము తెలిసికొని రాజా! నేను నీకు సగము వర మీయవచ్చును. తక్కిన కోఱిక పూర్తిచేయుటకు శివుఁడే కర్త యని చెప్పెను.)

## ఇలుఁ డొకనెల స్త్రీగను నొకనెల పురుషుఁడుగ నుండఁ పార్వతి యనుగ్రహించుట

ఆ. ఏది కోరె దనిన • నృపుడు సంతోషించి, శైలతనయ! సుప్రసన్న వేని
మాస మొండు పురుషు • మాడ్కినై యొకనెల, యనుపమానసుంద • రాంగినగుచు.

అర్థములు. అనుపమాన సుందరాంగి = అసమాన సౌందర్యము గల యాఁడుది.

తా త్ప ర్య ము

ఏ వరము కోరెద వని పార్వతి యడుగ, రాజు సంతోషించి అమ్మా! నీవు నాయందుఁ బ్రసన్నవైనచో నొక నెల పురుషుఁడనై యొక నెల యసమాన సౌందర్యముగల యాఁడు దాననై.)

తే. ఉండ వరమిమ్మటన్న వే•తండయాన యుండు మట్టుల నృప! పురు•షుండ వగుచు
నుండు వేళల స్త్రీభావ•ము విదగ్ధయైన, వేళ బురుషత్వ మాత్మలో•విస్మరింపు.

అర్థములు. విస్మరింపు=మఱవుము.

తా త్ప ర్య ము

ఉండునట్లు వర మీయఁగోరెద ననఁగా పార్వతీదేవి నీవు కోరినట్టులే యుండుము. పురుషుఁడ వైనప్పుడు స్త్రీవై యున్న విషయము, స్త్రీవైనపుడు పురుషుఁడుగా నున్న విషయము మఱచి పొమ్ము.

క. వర మొంది యిట్లు కార్దమి, పురుషుండుగ నెలయు నెలయుఁ•బొలఁతుకయగుచున్
బరఁగె నిలయనఁగఁ బేరను, నరపతియయి రాజ్యపాల•నము గావించెన్. ౧౪౦౭

అర్థములు. కార్దమి=కర్దముని పుత్రుఁడు.

తా త్ప ర్య ము

కర్దముని కొడుకయిన యిలుఁ డిట్లు వరమును బొంది నెల మగవాఁడై, నెల యాఁడుదియై యిల యను పేరుతో నుండెను. రాజయి రాజ్యము పాలించెను.)

—• ఇలుఁడు స్త్రీయై బుధుని యాశ్రమంబుఁ జేరుట •—

చ. అన విని విస్మయంబున ధ • రాధిపుఁ గన్గొని తమ్ములాడి రా
మనుజవిభుం డ దెట్టులొకొ • మానిని యై చరియించె నంతకం
టెను గలుగంగ నేర్చునొకొ • నీచపు దుర్గతి? యేమిచేసెనో
వనజదళాక్షి యాచు మగ•వాఁడుగ నై వివరింపుమీ యనన్. ౧౪౦౮

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా విని యాశ్చర్యమున రాజును దమ్ము లనిరి. ఆ రాజు ఆఁడుదియై యెట్లు తిరిగెను? అంతకంటె నీచమైన దుర్గతి కలదా? ఆఁడుదియై యేమి చేసెను? మగవాఁడుగనుండి యేమి చేసెను? వివరముగాఁ దెలుపుమని యడుగఁగా.)

చ. తొలుతటిమాసమం దతఁడు • తోయజలోచన యాచుఁ బూర్వభౌ
త్యులు నతు లై భజింపఁగ న• తుల్యమనోహరరూపకాంతి ది
క్కులు వెలిఁగింప భూమిరుహ • గుల్మలతాపరికీర్ణ కాననం
బులఁ జరియించెఁ గాల్నడన • మున్పటి యానములెల్లఁ బాయుచున్. ౧౪౦౯

అర్థములు. పూర్వభృత్యులు=మగవాఁడుగా నున్నప్పటి భృత్యులు, భూమిరుహగుల్మలతావరికీర్ణకాననంబులన్=చెట్లుపొదలు తీఁగలు వీనిచే వ్యాపించిన యడవులందు, యానములు=వాహనములు.

### తాత్పర్యము

మొదటి నెలయందతఁడు స్త్రీయై మునుపటి భృత్యులందఱు స్త్రీలై తన్ను సేవింపఁగా చెట్లచేతను పొదలచేతను దీఁగలచేతను వ్యాపించిన యడవులందు మునుపటి వాహనములన్నియు వదలి కాలినడకతో సంచరించెను.

క. ఇటు హేలఁ జరించుచు నక్కుటిలాలక గాంచెఁ బూర్ణకువలయమిత్ర
స్ఫుటరోచుల వెలిఁగెడుబుధుఁ దట దేశసదేశమునను దప మొనరింపన్. ౧౪౧౦

అర్థములు. హేలన్=విలాసముగా, కుటిలాలక=స్త్రీ, పూర్ణకువలయమిత్రస్ఫుటరోచులన్=నిండు చంద్రుని విశదకాంతులతో, తటదేశసదేశమునను=ఆ పర్వత ప్రదేశ సమీపమందు.

### తాత్పర్యము

ఆ స్త్రీ యిటు విలాసముగఁ దిరుగుచు పూర్ణచంద్రుని కాంతి గలిగి యా పర్వత సమీపమందుఁ దపము చేయు బుధుని జూచెను.

క. జలజారిసుతు వయస్థుని, జలమధ్యమునందుఁ దపము నలుపఁగఁ గని యా
యిల పరిజనవనితలతో, జలకేళిం జలుపఁ జొచ్చె సరసీవారిన్. ౧౪౧౧

అర్థములు. జలజారిసుతున్=చంద్రుని కుమారిని, వయస్థుని=ప్రాయపు వానిని.

### తాత్పర్యము

చంద్రుని కుమారుఁడును ప్రాయపువాఁడు నగు బుధుఁడు నీళ్ళనడుమతపము చేయఁగా జూచి యా కొలని నీటియందే పరిచారికలతో జలక్రీడకై దిగెను.

### —* బుధుఁ డిలాదేవిని జూచి మోహించుట *—

చ. నళినదళాక్షిఁ గాంచి శశి నందనుఁడున్ స్మరబాణపాతనం
చలితమనస్కుఁడై తపము నల్పుట మాని తదేకచిత్తుఁడై
చెలువ మొగంబుఁ గాంచుచు విశిష్టచరిత్రుఁడు బాసవాలుక
న్నెల తలఁ దన్ను సోయగము నీటును గాంచె ని దేపొలంతియో? ౧౪౧౨

అర్థములు. శశినందనుఁడు=చంద్రుని కుమారుఁడు, చంద్రునకు తారయందు జనించినవాఁడు బుధుఁడు. స్మరబాణపాతే=మన్మథబాణములు పడుటచే, సంచలితమనస్కుఁడై = చలించిన మనస్సు గలవాఁడై, తదేకచిత్తుఁడై = దాని

యందే మనస్సుంచినవాఁడై, విశిష్టచరిత్రుఁడు=మిగుల శ్రేష్ఠమైన నడవడి గల వాఁడు, బాసవాలు కన్నెల=దేవతాస్త్రీల, తలదన్ను=అతిక్రమించు, సోయగము=చక్కఁదనము.

తాత్పర్యము

బుధుఁ డా స్త్రీని చూచి కామ బాణములచే మనస్సు చలించినవాఁడై తపస్సు వదలి దాని మొగమును జూచుచు దానియందే మనస్సు నిలిపి దేవతా స్త్రీల చక్కఁదనమును మీటును మించు దాని చక్కఁదనమును జూచుచుండి యా స్త్రీ యెవ్వతయో.

క. అచ్చరలమిన్నలందు వి, యచ్చరసతులందు నాసు•రాంగనలందున్
మెచ్చిచ్చు పాఁపపాపల, నిచ్చుగురుంబోఁడి నెనయు•నింతిని గానన్. ౧౪౧౩

అర్థములు. అచ్చరలమిన్నలందు=అప్సరః స్త్రీలయం దుత్తమురాండ్రను, వియచ్చర సతులందు=ఇతరదేవతా స్త్రీలయందు, అసురాంగన లందున్=రాక్షస స్త్రీలయందు, పాఁపపాపలన్=నాగకన్యకలందు, ఇచ్చిగురుంబోఁడిన్=చిగురువలెఁ గోమలమైన దేహముగల దీనిని, ఎనయు=సరిపోలు, ఇంతిని=స్త్రీని.

తాత్పర్యము

(అప్సర స్త్రీలందలి, యుత్తమురాండ్రయందు, నితరదేవతా స్త్రీలయందు, రాక్షస స్త్రీలయందు. మెచ్చఁ దగిన నాగకన్యకలం దీ చిగురుఁబోఁడితో సాటి యైన స్త్రీని జూడలేదు.)

క. పరునిం బెండ్లాడనిచోఁ, దరుణీమణి నాకుఁ దగిన•దయితయ యంచున్
సరసీజలనిర్గతుఁడై, యరిగి నిజాశ్రమములోని • కక్ష్యేక్షణలన్. ౧౪౧౪

అర్థములు. దయితయ=ప్రియురాలు, సరసీజల నిర్గతుఁడై=కొలని నీటినుండి వెలువడినవాఁడై, అక్ష్యేక్షణలన్=పరిచారిక స్త్రీలను.

తాత్పర్యము

ఇంతకుముం దిది యెవ్వరిని బెండ్లాడకుండెనా; యిది నాకుఁ దగిన ప్రియురాలు అని తలఁచుచు కొలని నీటినుండి వెలుపల వచ్చి తన యాశ్రమము లోనికిఁ బోయి యా స్త్రీలను.

చ. పిలిచి మృగాక్షులార! యలి • వేణి యెవ త్తుక? యేల యీవనీ
తలమున సంచరించెడి? య • థాస్థితి సర్వముఁ దెల్పరే యనన్
సలలితవాక్యము ల్విని వ • శాగమనామణి మాకు భర్త్రి, య
ప్పొలఁతికి బెండ్లి లేదు, వన•భూముల మాబడి సంచరించెడిన్. ౧౪౧౫

అర్థములు. వశాగమనామణి=ఆఁడేనుఁగు నడకవంటి నడకగలది, భర్త్రి=యజమానురాలు.

తాత్పర్యము

(పిలిచి యో వనితలారా! యీ సుందరి యెవతె? ఈ వనమునం దేల సంచరించు చున్నది? వాస్తవమెఱిఁగింపుఁ డని యడుగ, వా రాతని మాటలువిని యీ చాన మా యజమానురాలు; ఆమెకుఁ బెండ్లి లేదు-అడవులలో మాతోఁ గూడి సంచరించు చున్నది.)

క. అని శశివదనలు పలికినఁ దనవిద్యామహిమ వారి • తత్త్వం బెల్లన్
మనమున నెఱింగి వారల, కనియెన్ మీరెల్లఁ బర్వ • తావనియందున్. ౧౪౧౬

అర్థములు. పర్వతావని యందున్=పర్వతప్రదేశమందు

తాత్పర్యము

(అని యీ చంద్రముఖులు చెప్పఁగా వారి యథార్థమును దన విద్యా ప్రభావమున మనస్సులోఁ దెలిసికొని వారలతోఁ జెప్పెను. మీరంద ఱీ పర్వత ప్రదేశమందు.

తే వాసమును గొంచు నుండుఁడు • వనితలార!
వలయు ఫలములఁ గూర్తును • వలసినన్ని
పురుషు లౌదురు మీకుఁ గింపు • రుషు లనిన
నెల్లవుకొని రందు వా రెల్ల • నిమ్మళముగ. ౧౪౧౭

తాత్పర్యము

(నివసింపుఁడు-మీకుఁ గావలసినన్ని ఫలముల సమకూర్చెదను. కింపురుషులు మీకుఁ బురుషులయ్యెద రని చెప్పఁగా వారందఱు నిమ్మళముగ నచ్చట నివాసము చేసిరి.)

## —• ఇలాదేవి బుధునితోఁ గలియుట •—

క. భరతుఁడు సౌమిత్రియుఁ గిం, పురుషాక్షీక్షణాల పుట్టు•వున్ విని రామా!
ధరణీనాయకు నావలి, చరితము వినిపింపు మనిన•క్ష్మాపతి యనియెన్. ౧౪౧౮

తాత్పర్యము

(భరతుఁడు లక్ష్మణుఁడు కిన్నర స్త్రీల జననమును విని రామచంద్రప్రభూ! యిలుఁడు తరువాత నేమి చేసెను? వినిపింపుమని యడుగ రాజు వారికిఁ జెప్పెను.)

క. కిన్నరయోషల దవ్వుగ, నన్నియమివరుండు పంచి•హాసంబున నం
దున్న యిలానతికిం డాఁ, జెన్నగు నుడి నిట్టు లనియె•శీతాంశుముఖి! ౧౪౧౯

అర్థములు. కిన్నర యోషలన్=కింపురుష స్త్రీలను, కిన్నరులు కింపురుషులు వేఱువేఱయినను పురుషశబ్ద పర్యాయముగ నిచట నరశబ్దము ప్రయోగింపఁ

బడెను. దవ్వుగన్=దూరముగ, నియమివరుండు=తపస్వి, హాసంబునన్=నవ్వుతో, ఇది కామముచేఁ గలిగిన సంతోషచిహ్నము.

తాత్పర్యము

(ఆ బుధుఁడు కింపురుష స్త్రీలను దూరముగాఁ బంపి, యిలాదేవిని జూచి నవ్వుచు నింపగు మాటలతో నిట్లనెను. చంద్రముఖీ!)

క. సోమునిసుతుఁడను బుధుఁడను, భామిని ననుఁ జూడు స్నేహ•పర్యాకుల దృ
క్స్తోమంబుల నన నిర్జన, భూమిని గామిని నచించెఁ•బురుమోదమునన్. ౧౪-౨౦

అర్థములు. సోమునిసుతుఁడను=చంద్రుని కుమారుఁడను, స్నేహపర్యాకుల=స్నేహముచేఁ గలఁతపడిన, దృక్+స్తోమంబుల=చూపుగములచే, నిర్జనభూమిని=జనములేని ప్రదేశమందు, జనములేని యడవియం దొక్కఁడైన మనుష్యుఁడుకనఁబడెను గదా యనియు, నెవ్వరులేని కారణమున మనస్సు దాఁపక చెప్పవచ్చుననియు భావము, కామినీ=కామముగలది. యిట్లనుటచే బుధుని చూడఁగానె యిలకును గామము జనించెనని భావము. పరికరాంకురాలంకారము, పురుమోదమునన్=అధిక సంతోషముతో.

తాత్పర్యము

(నేను చంద్రుని కుమారుఁడను నన్ను బుధుఁడందురు. ప్రేమపుఁ జూపుల నన్నుఁ జూడుము. అని చెప్పఁగా, నిలాదేవి యధిక సంతోషముతో.)

ఉ. నేను స్వతంత్ర సోమసుత! • నీకడ నుండెద నెద్ది పంచినన్
మానక చేయుదాన నన • మానినిమాటకుఁ బొంగి యాతఁడున్
దానిని గూడియుండ సుఖ•తత్పరుఁడై త్రుటివోలె నెప్పుడో
యా నెల మాధవం బరిగి • సంతట సుప్తుఁడు లేచి దిగ్గనన్. ౧౪-౨౧

అర్థములు. స్వతంత్రన్=వివాహము కాని దానను కావున నొకనిస్వాధీనమందుండు దానఁ గాను, మాధవంబు=మాధవము వైశాఖమాసము, సుప్తుఁడు=నిద్రపోవువాఁడు, ఆఁడుదిగా నిద్ర పోయినవాఁడు నెల కడపటి దినమందు మగవాఁడుగా నిద్రలేచెనని భావము.

తాత్పర్యము

(బుధా! నేను స్వతంత్రురాలను, నీయొద్ద నుండెదను. నీవేది చెప్పిన నది తప్పక చేసెదను. అని చెప్పఁగా నాతఁడు పొంగి దానిని గూడి సుఖముగా నుండఁగా వైశాఖమాసము క్షణములో నెప్పుడో జరిగిపోయెను. నిద్రపోయినవాఁడు తత్క్షణమె లేచి)

చ. ఉదకములోన నిల్చి కర ♦ యుగ్మము నెత్తి తపం బొనర్చు నా
  సదయునిఁ గాంచి మౌనివర! ♦ సానుచరుండను దుర్గసీమ నేఁ
  గదుకొని వేఁట వచ్చితిని ♦ గావను భృత్యుల నెందుఁ బోయిరో
  మదిఁ దలపోసి చెప్పు మన ♦ మానవపాలునితో బుధుం డనున్. ౧౮౨౨

అర్థములు. సానుచరుండను=భటులతోఁ గూడిన వాఁడను, దుర్గసీమన్=అడవియందు, కదుకొని=అతిశయించి.

తాత్పర్యము

(నీటిలో నిలిచి రెండుచేతులు పైకెత్తి తపము చేయుచు నా బుధునిఁ జూచిఁ మునిశ్రేష్ఠా! నేను భటులతోఁ గూడి వేఁటకు వచ్చితిని. నా భృత్యు లెచ్చటికి బోయిరో కాన రాలేదు. మీరు మనస్సులో యోజించి చెప్పుఁడని యడుగఁగా రాజుతో బుధుఁడు చెప్పెను.)

ఆ. రాలవాన గురిసి ♦ రాజ! నీ సైన్యంబు, మంటిఁ గలసె నాశ్ర♦మంబునందు
  వాతవర్షభయము♦వలన నుండుటఁ జేసి, బ్రతికినాఁడ వేల♦భయముపడెదు.

అర్థములు. వాతవర్షభయము=గాలివాన వలన భయము, ఇది యసత్యము అయినను అతని మేలునకే చెప్పఁబడినది.

తాత్పర్యము

(రాజా! నీ సైన్యము రాలవానవలన నశించిపోయినది, ఆశ్రమము నందుండుట చేత గాలివాన వలని భయము లేక నీవు బ్రదికినావు. నీ వెందుకు భయపడెదవు?)

క. ఫలమూలంబులఁ దినుచున్, నిలుమీ నీ విం దటన్న♦ నిజసైన్యాళీ
  విలయంబునకున్ వగచుచుఁ, బలికెం దారేయుతోడ♦వ్యసనార్తుండై. ౧౮౨౪

అర్థములు. తారేయు తోడన్=బుధునితో, తారాపుత్రునితో.

తాత్పర్యము

(పండ్లు దుంపలు తినుచు నీ విచట నిలువుము. అని చెప్పఁగా, తనసేన నశించి పోవుటకు దుఃఖించుచు బుధునితోఁ జెప్పెను.)

క. విడచితి రాజ్యము భృత్యులు, మడిసిరి నే నిందు నిలువ♦మరియాద గునే?
  యిడు మాజ్ఞఁ జనెద నాకుం,గొడుకగు శశిబిందుఁ జలుపుఁ గువ♦లయపతిగన్.
  అర్థములు. కువలయపతిగన్=రాజుగా.

తాత్పర్యము

(రాజ్యము విడిచి వచ్చితిని. భృత్యులందరు చచ్చిరి. నే నిచట నిలుచుట మరియాదగా నుండునా? ఆజ్ఞ యొసఁగుఁడు పోయెదను. నా కొడుకయిన శశిబిందుని రాజుగాఁ జేయవలెను.)

క. చనియెద భృత్యుల దారల, జనముల సౌఖ్యముల విడిచి•సంయమివలె నే
వనముల నుండఁగఁ దగునే?, మునినాథా! యశుభవాక్య•ములు పల్కఁ- కదన్.

తా త్ప ర్య ము

(పోయెదను భృత్యులను, భార్యలను, జనులను, సౌఖ్యములను వదలి తపస్వి వలె నేనడవులలో, బడియుండఁదగునా? మునీంద్రా! అశుభములయిన మాట లన కుము. అని పలుకఁగా.)

క. రాజేంద్రుని సూక్తులకున్, రాజసుతుం డబ్బపడుచు•రాజా! యేలా
యోజన చేసెదు? నిలు మిట, రాజితహిత మేను వత్స•రము గడచనినన్.

అర్థములు. వత్సరము=ఏఁడాది, కడచనినన్=దాఁటిపోఁగా, ఇల గర్భిణి కావున నీ గడువు సంవత్సరము కడవఁగానే సరి.

తా త్ప ర్య ము

(రాజు చెప్పిన మాటల కాశ్చర్యపడి బుధుఁడు, రాజా! యేల యోజించె దవు ఇచ్చట నుండుము. ఒక యేఁడాది కడచిన పిమ్మట నేను నీకు మేలు)

—• ఇలాదేవి పురూరవుం గనుట •—

క. కూరుతు నీ కనఁ గార్దమి, కూరిమి నట నిలిచి పలిపి • ఘోరతపంబున్
వారక నెల చనఁ గ్రమ్మఱ,నారీమణి యగుచు నిందు•నందనుఁగలసెన్. ౧౮-౨౦

తా త్ప ర్య ము

నేను మేలు చేసెదను అని చెప్పగా నిలుఁ డందే నిలిచి ఘోరతపము చేసెను. నెల కాఁగానే మరల స్త్రీయై బుధుని కలయుచుండెను.

క. తొమ్మిదినెల లిటు లరిగినఁ గొమ్మపురూరవుఁ డనంగఁ•గొడుకుం గని తా
నమ్మాణవకుం దండ్రికి, గొమ్మని యప్పుడ యొసంగెఁ•గుతుకము మీరన్.

అర్థములు. మాణవకున్=పిల్లవానిని, ఉపనయనాది కార్యములకుఁగా చంద్రుని యొద్ద విడిచెను.

స్త్రీగా నున్నప్పుడుంజిన గర్భము పురుషుఁడుగా నున్నప్పుడుండెనాపోయెనా? ఉండినది గాని పార్వతీవరమువలన నది యాయనకుఁ దెలియలేదని కొందఱు, తొమ్మిది నెలలు బుధుని యొద్ద నిల యుండిన కాలమే కాని గర్భధారణ కాలము గాదనియుఁ దొమ్మిదవ నెలయందు సద్యోగర్భమునఁ బురూరవుఁ బ్రసవించె ననియు మఱికొందఱు తొమ్మిది నెల లనఁగా స్త్రీగానున్న నెలలు తొమ్మిదనియుఁ బదునెనిమిది నెలలు బుధుని యొద్దనిల యుండెననియు పురుషుఁడుగా నున్నప్పుడు గర్భము స్త్రీత్వముతోపాటు అదృశ్య మగుచుండెననియు మఱికొందఱు.

తాత్పర్యము

(తొమ్మిది నెలలు జరిగిన తరువాత నిలాదేవి పురూరవుఁడను, కొడుకును గని యాపిల్లవాని నప్పుడే సంతోషముతోఁ దీసికొమ్మని యిచ్చెను)

తే. ఏఁడు గడచిన వడవడి॰ తేఁడు పురుష, రూపమును గాంచఁగా న॰నురూపసూక్తి
గరిమ హృద్యకథాళులఁ॰ గంజవైరి, తనయుఁ డతనికి హర్షంబు॰ దనరఁ జేసె.

అర్థములు. అనురూపసూక్తిన్=తగిన మాటలచే, కంజవైరి తనయుఁడు= బుధుఁడు.

తాత్పర్యము

(సంవత్సరము కడచిన పిమ్మట రాజు పురుషరూపము గాంచెను. అంత బుధుఁడు తగిన మాటలచే మనోహరమైన కథలు చెప్పి యతని సంతోషపఱిచెను.)

**బుధుఁ డిలునకు శాశ్వత పురుషత్వముఁ గలిగింప నశ్వమేధంబు సేయుట**

సీ. అన వత్సరాంతంబు॰ నం దేమి యొనరించె, నిలుఁడని యనుజులు॰ పలుక రాముఁ
డనియెఁ దారాసుతుం॰ డాత్మమిత్రులను సంవర్త్యునిఁ జ్యవనునిఁ॰ బ్రమదదాయిఁ
గశ్యపు దూర్వాసుఁ॰ గలయోగివర్యుల, రప్పించి యిట్లను॰ రాజవరుఁడు
కార్దమేయుఁడు భవ॰ త్కారుణికుఁ బాత్రుఁడు, తద్దశ మీకు హృ॰ ద్గతము కాదె
ఆ. నరగ మేలు చేయు॰ సదుపాయ మొక్కటి, చేయవలయు ననుచుఁ॰ జెప్పుచుండఁ
గర్దముండు వచ్చెఁ॰ గదలి యచ్చోటికి దివ్యతేజులైన॰ ద్విజులతోడ. ౧౪౩౧

అర్థములు. ప్రమదదాయిన్=సంతోషము కలిగించువాని, కార్దమేయుఁడు= కర్దముని కొడుకు, ఇలుఁడు, తద్దశ=ఆయన యవస్థ, హృద్గతము=తెలిసినదే.

తాత్పర్యము

ఇట్లు చెప్పఁగా సంవత్సరము కడపట బుధుఁ డేమిచేసెనని తమ్ములడుగఁగా రామచంద్రమూర్తి యిట్లనియె. బుధుడు తన స్నేహితులగు సంవర్తుని, చ్యవనుని, కశ్యపుని, దుర్వాసుని మఱికొందఱ యోగివర్యులను రప్పించి యీరాజు నవస్థమీకుఁ దెలియును గదా! ఈయనకు మేలుచేయు నుపాయమేదైనఁ జేయవలయునని చెప్పుచున్న సమయమున కర్దముఁడు దివ్యతేజస్కులగు బ్రాహ్మణులతోడ నచ్చటికి వచ్చెను.

తే. క్రతువును బులస్త్యుఁడును వష॰ట్కారమవల,
నోంకృతియువచ్చెనచటికి॰ నుల్లమలర
నెల్ల వారును నృపతికి॰ హితము సేయఁదలఁచి భాషించుచుండఁ గ॰ ర్దముఁడు పలికె.

తాత్పర్యము

క్రతువు, పులస్త్యుఁడు, వషట్కారము, ఓంకారము నచ్చటికి వచ్చెను. అందఱు రాజునకు మేలుచేయవలయునని చెప్పుచుండఁ గర్దముఁ డిట్లనియె.

ఉ. దీనికి మందు శంకరునిఁ • దేర్చుట దక్కఁ మఱొండు లేదు శ
ర్వాణీ విభుండు మెచ్చెడు స • వంబు తురంగమమేధ మొక్కఁడే
కాన హరుండు ప్రీతి గొనఁ • గా మన మెల్ల నృపార్థమై తగున్
దాని నొనర్ప నన్న ముని • దండము దానికి నీయకొంటయున్. ౧౪౩౩

అర్థములు. తేర్చుట=ప్రసన్నునిఁ జేయుట, శర్వాణీవిభుండు=పార్వతీపతి, సవంబు=యజ్ఞము, తురంగమమేధము=అశ్వమేధము, నృపార్థమై=రాజునకుఁగాను మునిదండము=మునుల సమూహము.

అశ్వమేధము లక్ష్మణుఁడు విష్ణుప్రీతికర మని చెప్పెను. ఇచ్చట శివప్రీతికర మని యున్నది. ఇది యెట్లు? 'యజ్ఞో వై విష్ణుః' అన్నట్లు ఏయాగమైనను విష్ణు స్వరూపము యజ్ఞపురుషుఁ డాయనయే. అయినను అశ్వమేధము సర్వదేవతా ప్రీతికరము ఇచ్చట శపించినవాఁడు శివుడు కావున నాయన శాపము నాయనయే మరలింపవలయును. కావున నాయనప్రీతి కని చెప్పఁబడెను.

తాత్పర్యము

ఇది చక్కఁబడు నుపాయము శంకరుని ప్రసన్నుఁజేయుటే గాని వేఱొండు లేదు. ఆయనను ప్రసన్నుఁజేయుటకు నశ్వమేధము చేయుట తగిన కార్యము కావున శివుఁడు ప్రసన్నుఁడగుటకు రాజు నిమిత్తమై మన మశ్వమేధము చేయఁ దగును. అని చెప్పఁగా మును లంద అంగీకరించిరి.

ఆ. శంకరార్పితముగ • సప్తతంతువుఁ దీర్ప, విప్రవరులు గడఁగి • విధియుతముగ
సకల వస్తువులను • సంవర్త రాజర్షి, ఛాత్రుఁ డగు మరుత్తు • సంఘటించె. ౧౪౩౪

అర్థములు. సప్తతంతువు=యజ్ఞము, ఛాత్రుఁడు=శిష్యుఁడు.

తాత్పర్యము.

(శంకరార్పణముగా బ్రాహ్మణులు విధ్యుక్తముగా యజ్ఞము చేయఁబూనఁగా సంవర్తుని శిష్యుడైన మరుత్తు సమస్త వస్తువులను సమకూర్చెను.)

క. హరిణాంకతనూజాశ్రమ, ధరణీనికటమ్మునన్ య • థావిధి సవమున్
జరుపఁగ ప్రీతుండై య, ధ్వరమునతుదఁ బురహరుండు • ప్రత్యక్షంబై. ౧౪౩౫

అర్థములు. హరిణాంకతనూజ=బుధుని యొక్క, ఆశ్రమ నికటమ్మునన్= ఆశ్రమ సమీపమందు, సవమున్=యజ్ఞమును, అధ్వరమునతుద = యజ్ఞము కడపట.

తాత్పర్యము

(బుధుని యాశ్రమము దగ్గఱ యథావిధిగా యజ్ఞము చేయఁగాఁ యాగాంతమున సంతోషించి శివుఁడు ప్రత్యక్షమై.)

## —* ఇలుఁ డెప్పటియట్ల పురుషత్వముం గనుట *—

చ. ఇలునకు నేమి మేలు ఘటి • యింపఁగఁ గోరెద రన్న వార ల
స్ఖలితము గాఁగ దేవ! పురు • షత్వమునన్ వసుధామహేంద్రుఁడున్
వెలఁగెడిఁ గాక నా నటుల • చేకుఱు మీ యభికాంక్ష యంచు బూ
చులదొర కన్మొఱంగుడును • సూరిజనుల్ ముగియించి యజ్ఞమున్. ౧౪౩౬

అర్థములు. అస్ఖలితముగాఁగ=లోపము లేకుండునట్లు, కొన్నాళ్ళు స్త్రీగాఁ గాకుండునట్లు, బూచుల దొర=పిశాచప్రభువు శివుఁడు, కన్మొఱంగుడును=అదృశ్యుఁడు కాఁగా, సూరిజనుల్=పండితులు.

తాత్పర్యము

(ఇలున కేమి మేలు చేయఁ గోరెదరని యడుగ, వారు, రాజు లోపము లేకుండునట్లు పురుషత్వమును గలవాఁడు గావలె ననఁగా, నట్టులే యగుత మని శివుఁడు కనఁబడకుండఁ బోఁగా, పండితులు యజ్ఞమును ముగించి.)

క. తమ తమ యాశ్రమముల కు, త్తమమతు లేగుటయు నిలుఁడు • తరలిచనెన్ రా
జ్యమునకు నట శశిబిందుని, విమలమతిన్ రాజుఁ జేసి • వెలువడి పురమున్.

తాత్పర్యము

(ఋత్విక్కులగు మునులు తమ తమ యాశ్రమములకుఁ బోఁగా నిలుఁడు తన రాజ్యమునకుఁ బోయి శశిబిందుని రాజుగాఁ జేసి, పత్తనము విడిచి.)

తే. మధ్యదేశంబునందు క్ష • మావిభుండు, స్థాపితు నొనర్చె నొక ప్రతి • ష్ఠానపురము
నందుఁ బతిగఁ బురూరవు • నధికనియతి, సంచరించి దివిం జేరె • సమయమగుడు.

తాత్పర్యము

మధ్యదేశమునఁ బ్రతిష్ఠానపురమునందు పురూరవుని రాజుగాఁ బట్టాభిషేకము చేసి యిలుఁడు తపస్సుచేసి కాలము రాఁగా స్వర్గ మేగెను.

క. వింటిరె హయమేధం బిటు, వంటిమహామహిమ మీఱు • వసుధాపతి వా
ల్గంటియయి పురుషుఁ డయ్యెను, గుంటువడ దెట్టికోర్కి • గుఱ్ఱపువేల్మిన్.

అర్థములు. కుంటుపడదు=వ్యర్థము కాదు, గుఱ్ఱపువేల్మిన్ = అశ్వమేధము వలన.

తాత్పర్యము

(వింటిరికదా అశ్వమేధ మిటువంటి మహా మహిమ కలిగినది. రాజస్త్రీ యయి యీ యాగ ప్రభావమున మరలఁ బురుషుఁ డయ్యెను. అశ్వమేధయాగము వలన నది యెటువంటి కోరిక యయినను వ్యర్థము కాదు.)

**శ్రీరాముఁడు పురోహితాదులఁ బిలిపించి యశ్వమేధం బొనర్తునని చెప్పుట.**

సీ. మనపురోధల వసి•ష్ఠుని వామదేవుని, జాబాలిఁ గాశ్యపు•క్ష్మావిబుధుల
సౌమిత్రి! తోడి తెమ్ము-సాగింతు హయమేధ,మఖిలలక్షణయుతం•బశ్వమొండు
విడిచెద నావుడు•వెస నతఁ డేగి వా,రలఁ బిల్వ వారెల్లఁ•గ్రన్నవచ్చి
కృతనమస్కారుని • క్షితినాథు దీవించి, యుచితాసనంబుల•నుండ నంత

ఆ. రామచంద్రవిభుఁడు•ప్రాంజలి యగుచును, వారిఁ జూచి నేను•వాజినమము
సలుప నెంచినాఁడ • సెలవిత్తురే యన, మదుల వారు హరు న•మస్కరించి.

అర్థములు. పురోధలన్=పురోహితులను, కృతనమస్కారునిన్=నమస్కరించిన వానిని, వాజినమము=అశ్వమేధము.

తా త్ప ర్య ము

(లక్ష్మణా! మన పురోహితులైన వసిష్ఠునిఁ వామదేవుని జాబాలిని, కాశ్యపుని తక్కఁగల బ్రాహ్మణులను దీసికొని రమ్ము అశ్వమేధము చేసెదను. సమస్త శుభ లక్షణములు గల గుఱ్ఱమును విడిచెను, అని చెప్పఁగా వెంటనే యతఁడు పోయి వారలను బిలువఁగా వారంకఱు తత్క్షణమువచ్చి, నమస్కరించిన రామచంద్రునిదీవించి యుచితములగు నాసనములందు వేంచేసి యుండిరి. అంతట రామచంద్రమూర్తి చేతులుజోడించి, వారినిఁ జూచి నే నశ్వమేధ యాగము చేయఁ దలఁచితిని. సెలవిచ్చెదరా యని యడుగ, వారు మనస్సులందు శివునికి నమస్కారమొనరించి.)

తే. అశ్వమేధం బొనర్ప న•ర్హంబు సకల, రాజవర్యులకును శుభ•ప్రద మటన్న
సంతసించి సుమిత్రాత్మ•జాతు గాంచి, పలికె నిట్లని శ్రీరామ•భద్రుఁ డపుడు.

తా త్ప ర్య ము

(రాజశ్రేష్ఠుల కందఱకు నశ్వమేధ యాగము చేయఁ దగినది. శుభప్రదమైనది. అని చెప్పఁగా, సంతోషపడి, లక్ష్మణునిఁ జూచి రామచంద్రమూర్తి యప్పుడిట్లని చెప్పెను.)

సీ. యజ్ఞమహోత్సవం • బనుభవింపఁగ సర్వకీశులతోడ సు•గ్రీవు నిటకుఁ
బిలువంగ దూతల • వేగమ పంపుము, దోషాచరులతో వి•భీషణుండు,
మత్ప్రియాసక్తు లౌ•మహీపులు పరివార, ములతోడ రాఁగ దూ•తలను బంపు
దేశాంతరస్థు లౌ•ద్విజుల ధర్మాత్ముల, బిలిపించి సతులతో•వేల్మికొఱకు

ఆ. మునులు నెల్లవారి • మునుకొని రప్పింపు, నటులఁ దాలధరుల•నర్తకులను
బిలువనంపు యజ్ఞ•వేశ్మాలి నిర్మింపు, గోమతీతటమున•నైమిశమున. ౧౭

అర్థములు. దోషాచరులతో=రాక్షసులతో, మత్ప్రియాసక్తులు=నాకుఁ బ్రియము చేయుట యందు నాసక్తులు, మహీపులు=రాజులు, దేశాంతరస్థులు=

ఇతర దేశముల నుండువారు, ద్విజులన్=బ్రాహ్మణులను, వేల్మికొఱకు=యజ్ఞము నిమిత్తము, తాలధరులన్=తాలము వాయించువారిని, యజ్ఞవేశ్మలిన్=యజ్ఞము నకు ఇండ్లవరుసలు, గోమతీ తటమునన్=గోమతీనదియొడ్డున, నైమిశమునన్=నైమిశారణ్యమందు.

తాత్పర్యము

(అశ్వమేధ యాగ మహోత్సవము చూచుటకు సమస్తవానరులతో సుగ్రీవుఁడు, సకల రాక్షసులతో విభీషణుఁడు, నాకుఁ బ్రియమొనరించుటయందాసక్తులయిన రాజులను నిచ్చటకు వచ్చుటకుఁ బిలువ దూతలను వేగముగాఁ బంపుము. ఇతర దేశములందుండు ధర్మాత్ములగు బ్రాహ్మణులను యజ్ఞము నిమిత్తము భార్యలతోఁగూడ వచ్చునట్లు పిలువనంపుము. మునుల నందఱను ముందుగా రప్పింపుము-తాలము వాయించు వారిని నర్తకులను బిలిపింపుము-నైమిశారణ్యమందు గోమతి నదియొడ్డున యజ్ఞమున కిండ్లవరుసలు నిర్మింపుము.)

చ. అనఘుల ధర్మవేదుల మ•హాత్ముల నెల్లరఁ బిల్వఁ బంపుమీ
తనివి సనంగ నధ్వరవి•ధానముఁ జూచి సుఖానుషంగు లై
మన మలరంగఁ బుష్టు లయి • మందిరము ల్గన నేగువారుగా
కనుఁ జేఁడ! నూరు వేల్ దృఢమ•యంబులపై భరతుండు బియ్యమున్. ౧౪౪౩

• అర్థములు. అనఘులన్=పాపరహితులను, ధర్మవేదులన్=ధర్మ మెఱిఁగిన వారిని, అధ్వరవిధానము=యజ్ఞము నేర్పాటు, సుఖానుషంగులై=సుఖములోఁ గూడినవారై, పుష్టులయి=పోషింపఁబడినవారై, దృఢమయంబులపై=బలముగ నొంటెలమీఁద.

తాత్పర్యము

(లక్ష్మణా! పాపరహితులు, ధర్మమెఱిగిన వారు, నగు మహాత్ములనంద ఱను బిల్వనంపుము-వారు యజ్ఞము నేర్పాటు తనివితీఱ చూచి మనసు ఆనందమున మీఱఁ, జక్కఁగాఁ బోషింపఁబడి తిరిగి వారి గృహములకు బోవుదురుగాక-భరతుఁడు లక్ష బలమైన యొంటెలమీఁద బియ్యమును.)

సీ. పదివేలయెద్దుల•పై బెసల్ నూవులు, పెసగలు నులువలు•మినుము లుప్పుఁ
దదనురూపంబుగఁ • దైలాదులును మఱి, గంధపుఁజెక్క•లు•ముందరరుగఁ
గొని కోటి హేమముల్•కోటులుపది వెండి, నాణెముల్ చనెదుఁ;జ•నంగవలయు
నటులు నర్తకులును•నైగమజనములు, సూదకారులు భటుల్•సూరవరులు
తే.వర్తకులుఁ గోశనాథులుఁ•బనులవారుఁ, దల్లులును జిన్నవాండ్ర యం•తఃపురంబువారు; నాపత్ని కాంచన•ప్రతిమ దీక్ష- కైన వస్తులఁగొని యతఁ•డరుగుఁగాక.

అర్థములు. తైలాదులు=నూనె మొదలయినవి, నైగమజనములు=వర్తకులు, సూదకారులు=వంటచేయువారు, వర్ధకులు=వడ్రంగులు, నాపత్ని=నాభార్య యగు కాంచన ప్రతిమ, బంగారు విగ్రహము, నా పత్ని కాంచనప్రతిమ యనుటచే రెండవభార్య లేదని యేర్పడుచున్నది. ఈ విషయము యుద్ధకాండమందుఁ జర్చింపఁబడెను. 'కాంచనం జానకీం కృత్వాతయాసార్థం మహాబలః, చకార యజ్ఞాన్ బహుశో రాఘవః పరమార్థవిత్'—పద్మ.

### తాత్పర్యము

(బదివేల యెద్దులమీఁద బెసలుఁ నూవులు, సెనగలు, ఉలవలు, మినుములు ఉప్పు వానికిఁ దగినట్లు నూనె మొదలగునవి, గంధపుఁజెక్కలు, కోటి బంగారు నాణెములు, పదికోట్లు వెండినాణెములు తీసికొని ముందుగాఁ బోవలెను. నటులు, నర్తకులు, వర్తకులు, వంటచేయువారు, భటులు, శూరవర్యులు, వడ్రంగులు, కోశాధీశులు, పనులుచేయువారు, మన తల్లులు, పసివాండ్రు అంతఃపురమునందలి వారు పోవలెను. నాభార్య యగు బంగారు విగ్రహము యజ్ఞదీక్షకుఁ గావలసిన వస్తువులను దీసికొని, భరతుఁడు ముందుపోవలెను.)

క. రాజులకు గొప్పవారికిఁ, దేజన గొనబారి నిగ్గు • దేఱి సుఖంబై
రాజిలు నుప్పరిగల గృహ, రాజుల నిర్మింపఁబంపు•రాజకుమారా! ౧౪౪౫

• అర్థములు. ఉప్పరిగలన్=మేడల, గృహరాజులన్=ఇండ్లవరుసలను.

### తాత్పర్యము

(లక్ష్మణా! రాజులకు, గొప్పవారికిఁ, గాంతిచే నందమై యొప్పు మేడలను గృహముల వరుసలను సుఖముగా నుండునట్లు నిర్మింప నేర్పాటు చేయుము.)

## —• శ్రీరాముఁ డశ్వమేధయాగము సేయ నుపక్రమించుట •—

చ. అనవుడు నట్లు తీర్పఁగ స•మస్తము రాముఁడు నల్లయిజ్జితో
నెనయు సలక్షణాశ్వమును • ఋత్విజులున్ ఘననాదవైరియున్
గొన కొని కాన పీడి మఱి • గొబ్బునఁ జేరఁగవచ్చి నైమిశం
బును గ్రతువాటిఁ గాంచి ముద•ముం గనె నద్భుతమంచు నాత్మలోన్. ౧౪౪౬

అర్థములు. సలక్షణాశ్వమును=అశ్వమేధమునకుఁ దగిన లక్షణములు గల గుఱ్ఱమును, ఘననాదవైరి=మేఘనాద, విరోధి=లక్ష్మణుఁడు.

(అని చెప్పఁగా నాప్రకారమే సమస్తము నేర్పాటుచేయఁగా రామచంద్ర మూర్తి నల్లజింకతో సాటివచ్చు నశ్వమేధమునకుఁ దగిన లక్షణములుగల గుఱ్ఱ

మును ఋత్విజులును లక్ష్మణుండు సంరక్షించుచుండ, విడిచి, వేగముగా నైమిశారణ్యమునకు వచ్చి యజ్ఞశాలను జూచి తన మనసులో నద్భుతముగా నున్న దను కొనుచు సంతోషించెను.)

సీ. నైమిశంబున రఘు•నాయకుం డుండఁగ, నవనినాయకు లుప•హారములను
కొనిరాఁగఁ గైకొని•కూర్మిఁ బ్రత్యర్చించి, విపులగృహంబుల•విడియఁ బంచి
సానుచరాళికిఁ•బానంబు నన్నంబు, వస్త్రంబు లేవి కా•వలయు నన్ని
సమకూర్ప భరతుండు•శత్రుఘ్నుఁడను బూని, నర్కజుతోడివ•నాటు లెల్ల

తే. క్షితిసురావళి నెమకి పూ•జించుచుండ
వృద్ధులను ఋషిజనుల వి•భీషణుండు
రాక్షసాన్వితుఁ డగుచు స•ర్యావిధాన
ములను సంతుష్టిఁ గూర్చుచుఁ జె•లఁగు చుండె. ౧౪౪౮

అర్థములు. ఉపహారములను=కానుకలను, ప్రత్యర్చించి = బదులుపూజించి, విపుల గృహంబులన్=విశాలమైన యిండ్లయందు, సానుచరాళికిన్ = వారి వెంట వచ్చిన వారికి, నెమకి=వెదకి, క్షితిసురావళిన్=బ్రాహ్మణ సమూహములను.

తాత్పర్యము

(నైమిశారణ్యమందు రామచంద్రమూర్తి యుండఁగా రాజులు కానుకలను దీసికొనిరాఁగా వానిని దీసికొని వారలఁ బ్రేమమీఱ మరలఁ బూజించి, విశాలము లయిన యిండ్లయందు వారినుండ నేర్పాటుచేసి, వారివెంట వచ్చినవారి కన్న పానములు వస్త్రములు ఏవేవి కావలయునో వాని నన్నిటిని సమకూర్చుటకు భరతుఁడు శత్రుఘ్నుఁడు పూనుకొనిరి. వెదకి బ్రాహ్మణులను బూజించుటకు సుగ్రీవుని తోడి వానరులు, పెద్దలను మునులను బూజావిధానముల సంతోషము గలిగించు విభీషణుఁడు రాక్షసులతోఁ బూనుకొనియుండిరి.)

క. తురగము సుమిత్రతనయుఁడు, పరిరక్షింపఁగను విహిత•పద్ధతిఁ గ్రతువున్
జరుగఁగ నిడుఁడీ యిడుఁడీ, పరితుష్టిగ ననెను నులివు•బహుళం బయ్యెన్.

అర్థములు. పరితుష్టిగ=మిక్కిలి తృప్తిగ, ఉలివు=ధ్వని.

తాత్పర్యము

(గుఱ్ఱమును లక్ష్మణుఁడు కాపాడుచుండఁగా యజ్ఞము యథావిధిగా జరుగు చుండఁగా, తృప్తిదీఱ నిడుఁడు ఇడుఁడు అనెడు ధ్వని విస్తారమయ్యెను.)

తే. కండచక్కెర బెల్లంబు • పిండివంట
లారఁ జాల్చాలు వంచును • యాచకాళి
పలుకు నందాఁకఁ దెం డను • పలుకు రాక
మున్నె యొసఁగిరి వర్ధించు • మన్నవారు. ౧౪౪౯

తాత్పర్యము

(కండచక్కెర, బెల్లము, పిండివంటలు సమృద్ధిగా యాచకుల సమూహము చాలు చాలు ననువఱకు అడుగకముందే వడ్డించువారు వడ్డించిరి.)

చ. మలినుఁడుం దీనుఁడుం గృశుఁడు•మాటకునైన మహాధ్వరంబునన్
గలుగఁ డొకండు, దీర్ఘ•తరకాలముగా మనియున్న మౌనిప
ర్యలు మును పెన్నఁ డేని గని•యుండఁగ లే దిటువంటివేల్మి, కో
ర్కులు దనివారి సెల్లరకుఁ•గోరినయట్లు మణీధనాదులన్. ౧౪౫౦

అర్థములు. వేల్మి=యజ్ఞము, మణీధనాదులన్=రత్నములచే ధనములచే, మలినుఁడు=మురికి దేహము గలవాఁడు, దీనుఁడు=దరిద్రుఁడు, కృశుఁడు=శుష్కిం చినవాఁడు, మనియున్న=బ్రదికి యుండిన.

తాత్పర్యము

(ఆ గొప్ప యజ్ఞములో, మురికి దేహము గలవాఁడు, దరిద్రుఁడు, శుష్కిం చినవాఁడు మాటకైనను లేఁడు- దీర్ఘకాలము బ్రదికియుండిన మునులు మును పెన్నఁ డిటువంటి యజ్ఞము మేము చూచియుండలేదు. ఎల్లరకుఁ గోరినట్లు రత్న ములచే ధనములచేఁ దనివితీరినది.)

తే. కాంచనముఁగోరువారలు•కాంచనంబు,విత్తములఁ గోరువారలు•విత్తచయము
వస్త్రములఁ గోరువారలు•వస్త్రములను, గోరిన ట్లెల్లఁ గాంచిరి•కొఱఁత లేక.

తాత్పర్యము

(బంగారు కావలసిన వారికి బంగారు, ధనములు కోరినవారికి ధనరాసులు, వస్త్రములాశించిన వారికి వస్త్రములు కోరినవారికిఁ గోరినట్లు కొఱఁత లేకుండ లభించినవి.)

తే. చూచితిమి శక్రుమఖముం, జూచితిమి ధనేశు క్రతువు•సూర్యజా సవమున్
జూచితిమి వరుణువేల్మిని, జూచితి మది దీనిసాటి•సుంతయు సగునే. ౧౪౫౨

అర్థములు. శక్రుమఖమున్=ఇంద్రుఁడు చేసిన యజ్ఞమును, ధనేశుక్రతువు= కుబేరుఁడు చేసిన యజ్ఞము. సూర్యజా సవమున్=యముఁడు చేసిన యజ్ఞము, వరుణవేల్మిని=వరుణుఁడు చేసిన యజ్ఞమును, సుంతయు=కొంచెమైనను.

తాత్పర్యము

(ఇంద్రుని యజ్ఞము చూచినాము కుబేరుఁడు చేసిన యాగము చూచితిమి, యముఁడు గావించిన క్రతువు చూచితిమి, వరుణుని జన్నము కంటిమి. కొంచె మైనను దీనితో సాటియగునా?)

క. అని అబ్బురపడుచుఁ దపో♦ధనులు వచింపఁగను గీశ♦దండము పోఁకుల్
గొని హ స్తంబుల వాసో♦ధనభోజనవస్తుతతులఁ♦ద త్తత్స్థలులన్. ౧౪౫౩

అర్థములు. పోఁకుల్=రాక్షసులు, వాసన్=వస్త్రములను, ధన=ధనములను, భోజన వస్తు తతులన్=భోజనపదార్థముల రాసులను, తత్+తత్+స్థలులన్=ఆయాప్రదేశములందు, ఏవేవి యెక్కడ నుండవలయునో యచ్చటవచ్చుట.

తా త్ప ర్య ము

(అని యాశ్చర్యపడుచు మునీశ్వరులు చెప్పుకొనుచుండ, వానరసమూహము, రాక్షసులు, చేతులలో వస్త్రములు, ధనము, భోజన వస్తువులు పట్టుకొని యచ్చటచ్చట.)

ఆ. నిలిచి యాచకులకు ♦ వలసిన వన్నియు, నిచ్చుచుండి రిట్లు♦లొచ్చు లేక
సర్వగుణసమేత♦స త్తతంతువు సాగె, నబ్ద మైన ముగియ♦కతులితముగ. ౧౪౫౪

అర్థములు. లొచ్చు=కొఱఁత, సర్వగుణసమేత = అన్నిసుగుణములతోఁ గూడిన, స త్తతంతువు=యజ్ఞము అబ్దమైనన్=సంవత్సరము ముగిసినను, ముగియక=యజ్ఞము సాంతముగాక.

తా త్ప ర్య ము

(నిలిచి యాచకులకు కొఱఁత లేకుండఁగావలసినవి యిచ్చుచుండిరి. అన్ని సుగుణములతోఁ గూడిన యాగము, సంవత్సరము ముగిసినను సంతముగా నస మాన వైభవముతో సాగెను.

**వాల్మీకి మహర్షి కుశలవుల రామాయణము గానముసేయ నియమించుట.**

ఉ. ఈ కరణిం బ్రవ ర్తిలు న♦హీనసవంబుఁ గనుంగొనంగ వా
ల్మీకి సశిష్యసంఘుఁ డయి ♦ మేదురర క్తిని వచ్చి తాపసా
నీకము లున్న వాటికి స ♦ నీడతలంబునఁ బర్ణశాలలం
గైకొని యుండె మూలఫల♦కాండలసచ్ఛకటంబు లొప్పఁగన్. ౧౪౫౫

అర్థములు. అహీనసవంబు=మహాయజ్ఞము, సశిష్యసంఘుఁడు=శిష్యసమూహముతోఁ గూడినవాఁడు, మేదురర క్తిని=అధిక ప్రేమతో, తాపసానీకములు=మునుల గుంపులు, వాటికిన్=ప్రదేశమునకు, సనీడతలంబునన్=సమీప ప్రదేశంబున, మూలఫలకాండ=వేళ్ళు పండ్లు వీని సమూహములచే, లసత్=ఒప్పుచున్న, శకటంబులు=బండ్లు. వాల్మీకి తన శిష్యులకుఁ దనకుఁ గావలసిన కందమూల ఫలములు తానే బండ్లమీఁదఁ దెచ్చె ననుటచే నప్రతిగ్రహవ్రతము గలవాఁడగుటచే రాజద్రవ్య మపేక్షింపలేదని సూచన.

## తాత్పర్యము

(మహాయజ్ఞ మీ విధముగా జరుగుచుండఁగా వాల్మీకి మహాముని శిష్య సమూహములో యాగము చూచుటకుఁ బరమ ప్రీతితో వచ్చి బండ్లతో వేళ్ళు పండ్లు గొనివచ్చి మునులుండు ప్రదేశమునకు సమీపముననే బర్ణశాలలందుండెను.)

క. రాజవరుచేతఁ దాపస, రాజవరులచేత నర్చ • గ్రహియించి మహా
తేజుం డాత్మజ్ఞుం డట, రాజిలి నిజశిష్యయుగము • రక్తిం బలికెన్ ౧౪౫౬

అర్థములు. రాజవరుచేతన్=రామచంద్రమూర్తి చేతను, తాపస రాజవరుల చేతన్=మునిశ్రేష్ఠులచేతను, అర్చ=పూజ, మహాతేజుండు=గొప్ప తేజస్సు గలవాఁడు, ఆత్మజ్ఞుండు=ఆత్మజ్ఞానము గలవాఁడు, ఇచ్చట జ్ఞానము సాక్షాత్కారమని భావము, నిజశిష్యయుగమున్ = తన యిరువురు శిష్యులను, రక్తిన్=అనురాగముతో.

## తాత్పర్యము

(రామచంద్రమూర్తి చేతను, మునిశ్రేష్ఠుల చేతను బూజలంది గొప్ప తేజస్సు గలిగి యాత్మజ్ఞానము గల వాల్మీకి మహర్షి తన శిష్యుల నిరువుర కనురాగముతోఁ జెప్పెను.)

ఉ. నాయనలార! బ్రాహ్మణజ • నంబుల పట్టుల మౌనివాడలం
దాయత రాజమార్గముల • క్ష్మాధిపులిండుల రామచంద్రు సం
స్థాయమువాకిటం గ్రతువు • సాగెడి చోటను రథ్యలందు రా
మాయణ మెల్లఁ బాడుఁడు ము • దాప్తిని గర్ణరసాయనంబుగన్. ౧౪౫౭

అర్థములు. నాయనలారా!=బిడ్డలారా! వీరు కుశలవులు. ఇప్పటికి వీరికి పండ్రెండు పదమూఁడు సంవత్సరముల వయస్సు. శత్రుఘ్నుఁడు లవణుఁ జంపఁబోవుచు వాల్మీకి యాశ్రమంబున నున్న దినమున కుశలవులు పుట్టిరి. శత్రుఘ్నుఁడు మధురయందుఁ బండ్రెండు సంవత్సరము లుండి, మరల నయోధ్యకుఁ బోవునపుడు రామాయణము వినెను. తరువాత నేఁడాదికి యజ్ఞమను కొనినను పదమూఁడు సంవత్సరముల కెక్కువ వయస్సు గలవారు కారు. బ్రాహ్మణ జనంబుల పట్టులన్=బ్రాహ్మణు లున్న చోటులందు. మౌనివాడలన్=మునులు దిగిన స్థలములందు, ఆయత=విశాలమైన, రాజమార్గములన్ = రాచబాటలందు, క్ష్మాధిపులిండులన్=రాజులు దిగిన యిండ్లయందు, సంస్థాయము= రామచంద్రమూర్తి యింటివాకిటను, క్రతువుసాగెడి చోటను=యజ్ఞము చేయఁబడు స్థలమునందు, రథ్యలందు=వీథులందు, ముదాప్తిన్=సంతోషముతో, కర్ణరసాయనంబుగన్= చెవులకు సంతోషకరముగా, నాలుగవ పాదంబున నుభయ యతి.

తాత్పర్యము

(కుఱ్ఱలారా! బ్రాహ్మణులుండు తావుల, మునులు దిగిన స్థలములందు విశాల మైన రాచబాటలందు రాజుల యిండ్లయొద్ద రామచంద్రమూర్తి యింటివాకిటను, యజ్ఞము జరుగుచోట వీథులందు, రామాయణము నంతయు సంతోషముతోఁ జెవుల కింపగునట్లు పాడుఁడు.)

క. అందు విశేషము ఋత్విగ్బృందంబులు వినఁగఁ బాడుఁ•డీ! యద్రిజముల్
సుందరమధురఫలంబులు, పొందుగ భుజియించి గాన•మును గొల్పఁ దగున్.

అర్థములు. విశేషము=ఎక్కువగ, ఋత్విగ్బృందంబులు=ఋత్విజుల సమూహములు, అద్రిజముల్=కొండలయందుఁ బుట్టినవి,సుందర=చూచుట కందమైనవి, మధుర=తినుటకుఁ దియ్యనైనవి యగు, ఫలంబులు=పండ్లు, వీనిని భుజించి పాడుఁ డనుటచే రాజాన్నము మీరు గ్రహింపవలదని భావము.

తాత్పర్యము

(అందు విశేషించి ఋత్విక్కుల సమూహము వినునట్లు పాడుఁడు-కొండల యందుఁ బుట్టిన, చూచుట కందమై, తినుటకుఁ దియ్యనైన పండ్లు తిని పాడ వలయును జుఁడీ!)

క. పురబాహ్య దేశభవముల, సురచిర ఫలములను మెక్క•సొలపే నలపేన్
బరఁగదు తాపెక్కదు మీ, స్వరమున కెంతేనిఁ బాడ•బాలకులారా! ౧౪౫౯

అర్థములు. పురబాహ్యదేశభవములన్=ఊరికి వెలుపలి ప్రదేశములందుఁ బుట్టినవి. సురుచిర ఫలములను=మనోహరములైన పండ్లను, మెక్కన్=తింటిరేని, సొలపేన్=వైముఖ్యము, అనఁగా వేసట, అలపు=ఆయాసము, దీని వలన గ్రామ ములందు మనుష్యులు వేసి పెంచిన వాని ఫలములు శ్రేష్ఠములుగావని భావము.

తాత్పర్యము

ఊళ్ళకు వెలుపలి భూములందుఁ బుట్టిన చెట్లపండ్లను దింటిరేని మీా రెంత సేపు పాడినను విసుఁగు వేసట గాని తోఁపదు. కంఠస్వర మొక్క విధముననే యుండును గాని తాపెక్కదు.

చ. పిలువఁగఁ బంచె నేని పృథి•వీవిభుఁ డా రఘురాముఁ డీరు త
త్తలమున కేగి తాపసవి•తానము లెల్ల వినంగఁ బాడుఁడీ
లలితమధూక్తి నాకటపు•లాగునఁ జెక్క ప్రమాణము ల్మదిన్
నిలిపి దినంబు నిర్వదిగ•నెమ్మిగ సర్గములం గుమారకుల్! ౧౪౬౦

అర్థములు. ఈరు=మీారు, తత్తలమునకున్ = ఆయన యున్నచోటికి, తాపసవితానములు=మునుల సమూహములు, లలితమధూక్తిన్ =మనోహరమై

తా త్ప ర్య ము

తియ్యనైన మాటలచే, నాకఱపులాగున=నేను నేర్పినట్లు, పెక్కు-ప్రమాణముల్=అనేక శాస్త్రప్రమాణములు.

తా త్ప ర్య ము

కుమారులారా! రాజగు రామచంద్రమూర్తి మిమ్ముఁ బిలిపించె నేని మీరు రచ్చటికిఁ బోయి మును లందఱు వినునట్లు తియ్యని మాటలతో నేను నేర్పిన విధాన రాగతాళాది శాస్త్రప్రమాణములు మనస్సున నిలిపి తప్పులు లేకుండ దినానికి నిరువది సర్గలవంతునఁ బాడుఁడు.

క. ధనకాంక్ష కొంచెమైనను, గొనకుఁడు లోభంబు దగదు ♦ గుణయుతులారా.
ధన మేల యాశ్రమస్థుల,కును ఫలమూలోపజీవి♦కూటంబులకున్. ౧౪౬౧

అర్థములు. ధనకాంక్ష=ధనముమీఁది కోరిక, లోభంబు=ఆశ, ఆశ్రమస్థులకు=ఆశ్రమములందుండువారికి, ఫలమూలోపజీవి కూటంబులకున్=పండ్లు మూలములు దిని జీవించువారికి, ధనమేల=ధనముతో నేమి కార్యము చెట్లపట్టలు కట్టుకొని చెట్లపండ్లు కందమూలములు దినువారు ధన మిచ్చి కొనవలసిన పదార్థము లేవి యున్నవి?

తా త్ప ర్య ము

*(ధనముమీఁ దించుకయైనను గోరిక నుంచుకొనకుఁడు-ఆశకూడదు. గుణవంతులారా! చెట్లపండ్లు దుంపలు వేళ్ళు దిని జీవించు నాశ్రమవాసులకు ధనముతో నేమికార్యము.)

ఆ. ఎవరిపిల్లవాండ్ర ♦ రీరని రాముండు, ప్రుడమిజేఁడు మిమ్ము♦నడిగె నేని
మీరు చెప్పవలయు♦మేము వాల్మీకిమ,హర్షి శిష్యుల మని♦యళుకులేక. ౧౪౬౨

అర్థములు. అళుకు=జంకు.

తా త్ప ర్య ము

(రామచంద్రమూర్తిప్రభువు ఎవరిపిల్లవాండ్రు మీరని యడిగినచో మేము వాల్మీకిమహర్షి శిష్యులమని జంకులేకుండ మీరు చెప్పవలెను.)

ఆ. మున్ను పోలె మీరు ♦ మూర్ఛనాపద్ధతి, తప్పు లేక వీణ♦తంత్రులంద
పూర్వసుస్వరంబు♦పొలుపొంద గానంబు, జంకు లేక లెస్స♦సలుపవలయు.

తా త్ప ర్య ము

(మీరు పూర్వమువలె సంగీతసరళి దప్పకుండ వీణెమీఁద శ్రుతికలిపి శ్రావ్యముగా, జంకక పాడవలెను.)

ఆ. పాడుఁ డాదినుండు♦వసుధేశుపట్ల న, వజ్ఞ దగదు మీకు♦బాలురార!
సర్వభూతములకు♦స్వామినాథుఁడే జనకుఁ కద, దగును ధర్మ♦సరణిఁజూడ. ౧౪౬౪

అర్థములు. వసుధేశుపట్లన్=రాజు విషయంబునందు, అవజ్ఞ=తిరస్కార భావము, ఏళ్ళనీళ్ళు త్రాగి అడవులయందుఁ గాయగసురులు దినువారు రాజుతో నేమి పనియని రాజును దిరస్కరింపరాదు. ధర్మసరణిన్=న్యాయపద్ధతిని, సర్వ భూతములకు=ప్రాణుల కందఱకు, క్ష్మానాథుఁడే=రాజేకదా, జనకుఁడు=తండ్రి. తండ్రి రక్షించునట్లు రాజు రక్షించునుగాన రాజు తండ్రియే. రామచంద్రమూర్తి యందు మీరు జనకభావ ముంపవలయును, గాని రాజని తిరస్కరింపవలదు.

ఉ. రేపటి నుండి మీరు పరిహృ • ష్టమనంబుల వీణె లూని నా
నేపినయట్టు పాడుఁ డని • నిర్మలచిత్తుఁడు చెప్ప వారలున్
మీపలు కాచరింతు మని • నిండుముదంబునఁ జెప్పిపోయి యా
మాపు గురూక్తు లాత్మ నిడి • మానుగఁ బుచ్చిరి యుత్సుకాత్ములై. ౧౪౬-౫

అర్థములు. పరిహృష్ట మనంబులన్ = సంతోషముతోడి మనస్సులతో, నేపినయట్లు=నేర్పిన విధముగ.

తాత్పర్యము

(మీరు రేపటినుండి సంతోషముతో వీణెలుగొని నేను నేర్పిన విధముగాఁ బాడుఁడని నిర్మలమగు మనస్సుగల వాల్మీకి మహర్షి చెప్పఁగా, వారు మీ రాన తిచ్చినట్లు చేసెద మని పూర్ణముదమునఁ జెప్పిపోయి, గురువుచెప్పిన మాట మనస్సునందుంచుకొని యుత్సాహముతో నారాత్రి గడిపిరి.)

**—• కుశలవులు రామాయణము గానము సేయ శ్రీరాముఁడు వినుట •—**

తే. వారు వఱువాత మేల్కని • వారి నాడి, యగ్నులను వేల్చి ఋషివర్యు • నాజ్ఞ సరణి
గాన మొనరింప రాఘవ • క్ష్మాధవుండు, వీనులకు విందుగా దాని • విని యెసంగ.

అర్థములు. వఱువాతన్=ఉదయమున, వారినాడి=స్నానముచేసి.

తాత్పర్యము

(వారుదయమున మేలుకని, స్నానముచేసి, హోమ మొనరించి, వాల్మీకి మహర్షి యాజ్ఞప్రకారము గానము చేయఁగా రామచంద్రప్రభువు వీనులకు విందుగా దానిని వినెను. అటుపిమ్మట)

సీ. హర్షంబుతోడఁ బూ • ర్వాచారనిర్మిత, మై యపూర్వంబయి • యమరు దానిఁ
బాత్త్యజాతులగాన • పరిపాటినొప్పి ప్ర, మాణాతిశయముచే • మానితమయి
తంత్రీలయసమన్వి • తంబగు దానిని, బాలురు పాడఁగ • నాలకించి
కౌతూహలపరుండు • కాకుత్స్థతిలకుండు, కర్మాంతరంబున • ధర్మవిదుల

ఆ. మానిపవరుల బుధుల • మహిపాల నైగము, జనములం బురాణ • శబ్దవిదుల
సర్వకళానిపుణులఁ • బాదాక్షరసమాస, విదుల జ్యోతిషమున • విజ్ఞవరుల. ౧౪౬-౬

33)

అర్థములు. పూర్వాచార నిర్మితమై=సంగీత శాస్త్రకర్త యగు భరతాచార్యునిచే నిర్మింపబడినదై, అపూర్వంబయి = శ్రోత్రదై యిదివఱకు విన్నది కానిదై, పాఠ్య=పఠనయోగ్యమై, జాతులన్=షడ్జాది జాతులచే, గాన పరిపాటి=పాటక్రమము, ప్రమాణాతిశయముచేన్=స్వరముల యారోహణము అవరోహణము మర్యాదా సాధనములు గలదై, తంత్రీలయ సమన్విత మగుదానిని=వీణమీఁద లయతోఁ బాడఁబడునదై, కౌతూహల పరుండు=విస్మయము నొందినవాఁడు, కర్మాంతరంబులన్=యజ్ఞకార్యముల నడుమ విరామము దొరకినపుడు, ధర్మవిదులన్=ధర్మశాస్త్రము తెలిసిన వారిని, మునివరులన్ = మునిశ్రేష్ఠులను, బుధులన్=పండితులను, మహీపులన్=రాజులను, నైగమ జనములన్=వైశ్యులను, పురాణశబ్ద విదులన్=పురాణములను తెలిసిన వారిని వ్యాకరణ శాస్త్ర మెఱింగిన వారిని, సర్వకళా నిపుణులన్=అఱువది నాలుగు కళ లన్నియు నెఱిఁగిన వారిని, పాద అక్షర సమాస విదులన్=గురు లఘు సామాన్య జ్ఞానమును, సమాస జ్ఞానమును గలవారిని.

తాత్పర్యము

(సంగీతశాస్త్ర కర్తయగు భరతాచార్యునిచే నిర్మింపబడి, యిదివఱకెన్నఁడు విన్నది కాదయి, పఠింపనగినదై షడ్జాది జాతులచేఁ బాటక్రమమున నొప్పి స్వరముల యారోహణావరోహణముల నతిశయముచేఁ బొగడఁదగినదై పాటను వీణమీఁఁద లయతో బాలకులు సంతోషముతోఁ బాడఁగా శ్రీరామచంద్రమూర్తి యజ్ఞకార్యముల నడుమ విరామము కలిగినప్పుడు విని విస్మయము చెంది, ధర్మ మెఱిఁగిన వారిని, ముని శ్రేష్ఠులను, పండితులను, రాజులను, వైశ్యులను, పురాణములను దెలిసిన వారిని, వ్యాకరణ శాస్త్ర మెఱిఁగిన వారిని గురులఘు సామాన్య జ్ఞానము గలవారిని, సమాస జ్ఞానము గలవారిని జ్యోతిషమునఁ బండితులైన వారిని.)

క. సాముద్రికవిత్తములఁ గ, ళామాత్రావిభాగకుశలులన్ వేదజ్ఞ
స్తోమము గాయకులను బుర, ధాముల హేతూపచారదక్షోత్తములన్. ౧౦-౧౧

అర్థములు. సాముద్రిక విత్తములన్=సాముద్రికశాస్త్రము తెలిసినవారిలో శ్రేష్ఠులను, కలా=స్వరముల యొక్క, మాత్రా=ఏకద్విత్రి లక్షణములను, విభాగ కుశలులన్=వానిలోని భాగములఁ దెలిసిన నేర్పరులను, వేదజ్ఞస్తోమము=వేదవేత్తల సమూహము, గాయకులను=పాటలు పాడువారిని, పురధాములన్ = పురములం దుండు వారిని-పౌరులను, హేతూపచార దక్షోత్తములన్=యుక్తి ప్రయోగము లందు సమర్థులగు వారిని.

తాత్పర్యము

సాముద్రికశాస్త్రము తెలిసినవారిని, స్వరముల మాత్రావిభాగము తెలిసిన వారిని, వేదముల నెఱిఁగినవారిని, పాటలుపాడు వారిని, పౌరులను, యుక్తి ప్రయోగ దక్షులను.

తే. కావ్యనిపుణుల సత్క్రియా॥కల్పవిదుల, వృత్తసూత్రజ్ఞులను గీత॥వృత్తవిదుల
నీతినిపుణుల శాస్త్రజ్ఞ॥నిచయములను, నింగితజ్ఞుల భావ సం॥హీనమతుల. ౧౪౭౯

అర్థములు. కావ్య నిపుణులన్ = కావ్య లక్షణములు దెలిసిన వారిని, సత్క్రియా కల్పవిదులన్=క్రియాప్రయోగ ప్రతిపాదకము కల్పసూత్రము దానిని దెలిసిన వారిని, వృత్తసూత్రజ్ఞులను=వృత్తశాస్త్రము దెలిసిన వారిని, గీతవృత్తవిదులన్=సంగీతశాస్త్రము నెఱిఁగిన వారిని, నీతి నిపుణులన్=నీతి శాస్త్రమునందు సమర్థులను, శాస్త్రజ్ఞ నిచయములను=వ్యాకరణాది శాస్త్రముల నెఱింగిన వారిని, ఇంగితజ్ఞులన్=ఎదుటివారి యభిప్రాయములఁ దెలిసికొనఁ గల వారిని, భావన్= అష్టాదశ భావలందు, అహీనమతులన్=గొప్ప బుద్ధిగలవారిని.

తాత్పర్యము.

(కావ్యలక్షణ మెఱిఁగిన వారిలో నిపుణులను, క్రియాప్రయోగము తెల్పు కల్పసూత్ర మెఱిఁగిన వారిని, వృత్తశాస్త్రము తెలిసిన వారిని, సంగీత శాస్త్రమునఁ బండితులను నీతిశాస్త్రమునందు సమర్థులను, వ్యాకరణాది శాస్త్రజ్ఞులను, ఎదుటివారి యభిప్రాయములఁ దెలిసికొనఁ గలవారిని అష్టాదశభావల బాగుగఁ దెలిసిన వారిని-)

క. వేదాంతార్థసుబోధక, వైదిక ఛందోవిదగ్ర॥పౌరాణికులన్
వాదవచనకుశలులఁ జిత్రాదికవిత్వజ్ఞులన్ స॥భావనిఁ గూర్చెన్. ౧౪౮౦

అర్థములు. వేదాంతార్థ సుబోధక=వేదాంతార్థమును జక్కఁగ బోధించు వారిని, వైదిక వేదముల నెఱింగినవారిని, ఛందో విదగ్ర=ఛందశ్శాస్త్రము నెఱిఁగినవారిని, పౌరాణికులన్=పురాణముల నెఱిఁగిన వారిని, వాద వచనకుశలులన్= తార్కికులను, చిత్రాది=చిత్రకవిత్వము బంధకవిత్వము లోనగు కవిత్వముల నెఱిఁగిన వారిని, సభావనిన్=సభాప్రదేశమందు.

తాత్పర్యము

(వేదాంతార్థమును జక్కఁగ బోధించు వారిని, వేదముల నెఱిఁగిన వారిని, ఛందశ్శాస్త్రము తెలిసినవారిని, తార్కికులను, చిత్ర కవిత్వము బంధ కవిత్వము లోనగు కవిత్వముల నెఱిఁగిన వారిని, సభాప్రదేశమునందుఁ జేర్చెను.

అన్ని విధముల శాస్త్రములు దెలిసిన వారా సభయందుండి బాలకులు గానము చేయు విధమును కావ్యకవిత్వ గుణములను తమ తమ శాస్త్రప్రకారముగఁ బరీక్షించి మెచ్చికొనిరి. అనఁగా రామాయణమం దన్ని శాస్త్రముల విషయము గలదని భావము. ఈ కారణముచే నన్ని శాస్త్రము లెఱింగిన వారు గాని రామాయణ తత్త్వము నెఱుఁగఁజాల రని యేర్పడుచున్నది.

క. అందఱు వినుచుండఁగ నా,సుందర బాలకులు గీతి•సొం పలరింపన్
డెందముఁ గరంపఁ బాడ న,మందానందమున వినుచు•మతి లజ్జనముల్. ౧౪౭౧

అర్థములు. కరంపన్ = కరఁగింపఁగా, అమందానందమునన్=అమిత సంతోషమున.

తాత్పర్యము

(ఆ సుందర బాలకుల గీతము లచటివారి మనస్సులు కరగించెను. ఆనందముతో వినుచు నా జనములు.)

## కుశలవులయెడ శ్రీరాముని పోల్కచూచి జనులు విస్మితు లగుట

క. భూపాలకుఁగాయకులను, నాపోవక కనులఁ ద్రావు•నట్టులు కనుచున్
రూపంబున బాలకు లు, ర్వీపతినిం బోలి రిట్టి•వింతయుఁ గలదే? ౧౪౭౨

అర్థములు. ఆపోవక=తృప్తిలేక.

తాత్పర్యము

రామచంద్రమూర్తిని పాటపాడు బాలకులను మార్చి చూచి చెంత చూచి నను దృప్తిలేక వారని కన్నులతోనే త్రాగుచున్నట్టులె యిది యేమి వింత! ఈ బాలకులు రామచంద్రమూర్తినిబోలి యున్నారే.

క. బింబప్రతిబింబముల వి,ధంబున రాముండు మౌని•దారకు లౌరా!
డంబున రాణించిరి చి,త్రం బిది యే మొక్కొ యెట్లు•దల మగుఁ దెలియన్?

అర్థములు. మౌనిదారకులు=మునిబాలురు, డంబునన్=కాంతిచే.

తాత్పర్యము

అద్దములోఁ గానవచ్చు ప్రతిబింబములవలె నీ బాలకులు కాంతిని రామచంద్రమూర్తివలె నున్నారే? ఇది యేమి చిత్రము? వాస్తవ మెట్లు తెలియఁగలదు?

క. జడలును వల్కాజినములు, విడిచినచో బాలకులకు•బృథ్వీశున కే
ర్పడఁ గలదే భేదం బని,నుడువఁగ గానంబు జనమ•నోహర మగుచున్. ౧౪౭౪

అర్థములు. వల్కాజినములు=నారచీరలుఁ జింకచర్మములు.

తాత్పర్యము

(జడలు, నారచీరలు, జింకచర్మములు వదిలినచోఁ నే బాలకులకు రామచంద్ర భూపాలునకు భేదము లేదు. అని చెప్పుకొనుచుండగా, పాట జనుల మనస్సున కింపుగా.)

క. అతిమానుషమై వర్తిలె, నతిమధురం బగుచు శ్రోత•లందఱు లవ మేన్
మతిఁ దనివిఁగొనక విని విస్మృతి గాంచఁగ దమ్ము నంత•సీతాతనయుల్.

అర్థములు. అతిమానుషమై=మనుష్య శక్తికి మించినదై, లవమేన్=కొంచె మైనను, విస్మృతి=మైమఱపు.

తా త్ప ర్య ము

(మనుష్యశక్తికి మించి యతిమధురముగా నొప్పెను. వినువారికించు కంత యును దనివి లేకుండిరి. మైమఱచి తమ్ముఁజూచుచుండఁగా కుశలవులు.)

తే. మౌనినారదదర్శిత • మైనప్రథమ, సర్గమువ నుండి యిరువది•సర్గములను
గాన మొనరించి రపరాహ్ణ•కాలమునను, సర్గముల నిర్వదిని విని•సంతసమున.

అర్థములు. నారదదర్శితము=నారదుఁ డుపదేశించినది, దీనివలనఁ బ్రథమ సర్గము మొదలు వాల్మీకి కృత మని యేర్పడుచున్నది.

తా త్ప ర్య ము

(నారద మహర్షి చే నుపదేశింపఁబడిన మొదటి సర్గమునుండియు, నిరువది సర్గములను మధ్యాహ్నకాలమునందు కుశలవులు గాన మొనరించిరి. శ్రీరాముఁడు విని సంతోషముతో.)

—• శ్రీరాముఁ డిచ్చిన కానుకలఁ గుశలవులు నిరాకరించుట •—

క. అనుజులఁ గని రాముఁడు పదు, నెనిమిది వేల్ స్వర్ణముల ము•నీంద్ర సుతులకున్
మనసార నిడుఁడు మఱి వే, నిని గోరిన నిండు వేగ•నెమ్మి నటన్నన్. ౧౪౭౭

తా త్ప ర్య ము

(తమ్ములఁజూచి పదునెనిమిది వేల బంగరు నాణెములను యీ మునికుమా రులకు మనస్ఫూర్తిగా నీయుఁడు. ఇంకేమేమి కోరినను ప్రేమతో నిండు అని శ్రీరాముఁడాజ్ఞాపించెను.)

క. భరతుండును సౌమిత్రియు, సరగం దద్ధనముఁ దెచ్చి • సంయమిసుతులన్
గర మనురాగంబున నిడి, గురుమతి వేర్వేఱ మీరు•గొనుఁడీయనిరన్. ౧౪౭౮

తా త్ప ర్య ము

(భరత లక్ష్మణులు ఆధనము దెప్పించి ప్రేమతో మునికుమారుల బిలిచివిడి విడిగా మీరీవిత్తమును గైకొనుఁడు అనఁగా.)

క. పచ్చని బంగరుమాడల, నచ్చెఱువులు గాంచి విస్మి•తాత్మకు లయి తా
రిచ్చగొన రైరి గైకొన, వచ్చెడు ఫల మెద్ది దీన • వనవాసులకున్? ౧౪౭౮

అర్థములు. ఛిఱుతలు=పిల్లవాండ్రు, విస్మితాత్మకులయి = ఆశ్చర్యముగల మనస్సు గలవారై.

### తాత్పర్యము

పచ్చని బంగారు మాడల నా బాలుర చూచి యాశ్చర్యపడి యడవులలో నుండువారికి వీనివలన రాఁగల లాభమేమి యని వానిని గ్రహింప నిష్టపడిన వారు గారు.

చ. వనములలో వసించుచును ♦ పక్వఫలంబులు వేరు వెల్లకుల్
దినుచును ముక్కుఁబట్టికొని ♦ తేఁకువ నెప్పుడు దైవచింతనన్
దినములు ద్రోయు మాకు నృప ♦ తే! కనకంబు లివేల యెందు నే
పనియగు మాకు వీనిఁగొని ♦ పాతఱవెట్టిన భూమిలోపలన్? ౧౪౦

అర్థములు. పక్వఫలంబులు=పండిన పండ్లు. పాతఱపెట్టిన=భూమిలోఁ బూడ్చి పెట్టిన, వీనివలన మాకు రాఁగల లాభమేమి? ఇవియేపనికి నుపయోగించును?

### తాత్పర్యము

(అడవులలో నివసించి పండిన పండ్లు, వేరు వెల్లకులు తినుచు తపముచేసికొనుచు భయమెఱుఁగక దైవచింతనముతో దినములు గడుపు మాకీ ధనమేల? వీనిఁగొనిపోయి భూమిలోఁ బాతఱపెట్టిన మాకు రాఁగల ఫలమేమి? ఇవి యేపనికి నుపయోగించును?)

### —♦ రామాయణముఁ గూర్చి శ్రీరాముఁడు కుశలవులఁ బ్రశ్నించుట ♦—

చ. అను నుడు లాలకించి వసు ♦ ధాధిపుఁడున్ సభవారు విస్మయం
బున మునుఁగన్ రఘూత్తముఁడు ♦ మోదిలిపల్కెఁ గుమారులార! యే
ముని రచితంబు కావ్య మిది? మూల మ దెయ్యది? దేనిఁగూర్చి? నే
విన మది నాసఁగొంటె విని ♦పింపుఁడటన్నను మానిబాలకుల్. ౧౪౧

### తాత్పర్యము

(ఆమాటలను విని రామచంద్రమూర్తియు, సభవారును మిగుల నాశ్చర్యమును జెందిరి. సంతోషపడి రామప్రభువు కుఱ్ఱలారా! యేముని యీకావ్యము రచించినాఁడు? దీని కాధారమేది? దేనిని గూర్చి వ్రాసినాఁడు? నాకు వినవలెనని యాసగా నున్నది? వినిపింపుఁడు, అని యడుగఁగా, నా మునిబాలకులు.)

సీ. భగవంతుఁడగు♦మాని వాల్మీకి కృతికర్త, పవనావనీప దే♦శంబునంద
వసియించినాఁడు ♦ కావ్యంబున విషయంబు, శ్రీచ్చరితంబు స♦ర్వంబు తేఁప!
యిర్వదినాల్గువే ♦ లెనఁగ శ్లోకంబులు, నూఱుపాఖ్యానముల్ ♦మీరునట్టు
లేనూరు సర్గంబు♦లిందు రాణింపఁగఁ, గాండంబు లాఱు మ♦ఱొండు కాండ

ఆ. ముత్తరంబు నాఁగ • నుర్వీశ! శోభిల్ల, మాగురుండు పల్కె • మానివరుఁడు
భార్గవుండు నీదు • వర్తనంబె శుభా, శుభములెల్ల దెలియ • శుద్ధమతిని. ౧౪౭ ౨

అర్థములు. కృతికర్త=గ్రంథము రచించినవాఁడు, నవనావనీపదేశంబు నంద=యజ్ఞభూమి సమీపమందే, త్వచ్చరితంబు సర్వంబు ననుటచే నేడు కాండములు నని భావము.

తాత్పర్యము

మేము పాడుచున్న గ్రంథమును రచించినవాఁడు భగవంతుఁడగు వాల్మీకి. ఆయన నీవు చేయు యజ్ఞప్రదేశమునకు సమీపమందే యున్నాఁడు. ఈ కావ్యమునఁ జెప్పఁబడిన విషయము నీ చరిత్రమే. ఈ గ్రంథమునందు నిరువది నాల్గు వేల శ్లోకంబులు, ఇలోపాఖ్యానము వఱకు నూరుపాఖ్యానములు, ఐదునూర్ల సర్గములు, ఆఱుకాండములు, మఱియొక యుత్తర కాండము గలుగునట్లు మా గురువు మునీంద్రుఁడు భార్గవుఁడు పలికెను. ఇందు నీ నడవడియందు మంచిచెడ్డలు తెలుపఁబడెను.

క. వినఁ గోరిక కలదేనియు, జనవర! కర్మాంతరముల • సహజాతులతో
వినుమీా వినిచెదమన ముని, తనయులతో వల్లె యనుచు • ధరణీశుఁడనన్.

అర్థములు. కార్మాంతరములన్=యజ్ఞకార్యములు చేయు నడిమి విరామ కాలములందు, సహజాతులతో= నీ తమ్ములతో.

తాత్పర్యము

(రాజా! మీాకు విననలెననెడి కోరిక యుండినచో, యజ్ఞకార్యములందుఁ గలుగు విరామ కాలములందుమీా తమ్ములతో వినుఁడు. వినిపించెదమని చెప్పఁగా 'సరే' యని మునిబాలకులతో రామచంద్రమూర్తి పలుకఁగా.)

క. అరిగిరి వారలు ముదమున, గురుఁ జేరఁగ నుటజములకుఁ • గువలయపతియున్
వర మగుసంగీతము ను, స్వరతాలలయాన్వితంబు • సర్గాన్వితమున్. ౧౪౪౪

అర్థములు. ఉటజములకున్=పర్ణశాలలకు, సుస్వరతాలలయాన్వితంబు= మంచి స్వరముతోను తాలముతోను లయతోను గూడినది, సర్గాన్వితమున్=సర్గ విభాగములు గలది.

తాత్పర్యము

(వారు సంతోషముతోఁ దమయాశ్రమములకు గురువగు వాల్మీకులవారి యొద్దకుఁబోయిరి. రాజగు రామచంద్రమూర్తి మంచి స్వరము, లయ, తాలముతోఁ గూడి సర్గ విభాగముగల శ్రేష్ఠము గానమును.)

## కుశలవులు దనకొమరులని శ్రీరాముఁడెఱింగి వాల్మీకి మహర్షి యొద్దకు దూతల నంపుట.

ఆ. ఆలకించి కర్మ • శాలకుఁ జనియెను, మునులతోడ నాప్త • జనులతోడఁ
బిదప దినముదినము • వినియెఁ దద్గీతంబు, నృపులతోడఁ గొల్చు • కపులతోడ.

తాత్పర్యము

(విని యజ్ఞశాలకు బోయెను. తరువాతఁ బ్రతిదినము మునులతో నాప్తులగు వారితో, రాజులతోఁ దనను సేవించు వానరులతో గలిసి యాపాట వినెను.)

క. గీతమువలన నెఱుంగుచు, సీతాతనుజాతు లీకు • శీలవు లనుచున్
క్ష్మాతలపతి సభ వినఁగా, దూతలఁ బిలిపించి యనియెఁ • దోడన మీరల్.

అర్థములు. కుశీలవులు=కుశలవులు, పాటపాడు వారు.

ఉత్తరకాండమునఁ గుశలవోత్పత్తి వినువఱకు నా బాలకులు తనకుమారు లని శ్రీరామచంద్రమూర్తి యెఱుఁగఁడు. ముందెందును నీ విషయము చెప్పఁబడ లేదు. తమ గానము విను రాజు తమ తండ్రి యని కుశలవు లెఱుఁగరు. సీతాదేవి తమ్ముఁ గన్న తల్లి యనియైన నెఱుఁగుదురో యెఱుఁగరో సందేహమే.

తాత్పర్యము

(పాటవలనఁ గుశీలవులు సీతకొడుకులని తెలిసికొని సభవారు వినుచుండ, దూతలను బిలిపించి చెప్పెను వెంటనే మీరు.)

క. చని నాపలుకుగ నాకుజ, మునితో నిట్లనుఁడు మౌని • పుంగవ! ధాత్రీ
తనయ పరిపూత యని మీ, మనమునఁ గలదేని తెలియ • మా కెల్ల రకున్.

అర్థములు. నాకుజ=పుట్టలోఁ బుట్టిన, మునితో = వాల్మీకిమునితో, పరిపూత=పవిత్రురాలు.

తాత్పర్యము

(పోయి, వాల్మీకి మునీంద్రునితో నిట్లని చెప్పుఁడు. మునీశ్వరా! మీ మనస్సున సీత పవిత్రురాలని యున్నయెడల మా కందఱకుఁ దెలియునట్లు.)

ఆ. పూతశీల యనుచు • వీతకల్మష యని, మీయనుజ్ఞ నొంది • మెలఁత జేప
శపథ మొందు సేయ • జాలెడినా? యని, తపసిమతము సీత • తలఁపు నెఱిఁగి.

అర్థములు. పూతశీల=పవిత్రమైన నడవడి గలది, వీతకల్మష=దోషము లేనిది, మెలఁత=స్త్రీ=సీత.

తాత్పర్యము

(సీత మీ యాజ్ఞ పొంది, తాను పవిత్రమైన నడవడిగల దానను, దోషము లేనిదాన నని జేపు శపథము చేయఁ గలదా! యని వాల్మీకి యభిప్రాయముఁ సీత యుద్దేశము తెలిసికొని.)

తే. అగుగు రెండన వినువార • లద్భుతం బ
టంచుఁ బలుకంగ దూత ల• త్యంతజవము
తోడఁ జని క్రౌంచి మునినాథు • తోడ నెల్ల
మృదుమధూక్తులఁ బలుకంగ • బుషివిభుండు. ౧౪౮౯

అర్థములు. అత్యంతజవము=మిగుల వేగము.

తా త్ప ర్య ము

(రండు-అని చెప్పఁగా, వినువార లచ్చెరువని పలుకుచుండ, దూత లతి వేగమునఁ బోయి, వాల్మీకి మునిపుంగవునిఁ గని క్రౌంచి తేనవలెఁ దీయనై మృదువులగు మాటల విన్నవింప, వాల్మీకి మహర్షి.)

**సీత శపథంబు సేయునని వాల్మీకిమహర్షి శ్రీరామునకుఁ జెప్పి పంపుట.**

ఉ. రాముఁడు చెప్పినట్లు ధ•రాసుత సల్పెడుఁ గాక శేపటన్
భామల కెంము దైవతము • ప్రాణవిభుండె కదా య టం చనన్
రామునిదూత లాపలుకుఁ • గ్రమ్మఱి తెల్పఁగ మౌనిభూపతి
స్తోమముఁ గాంచి యిట్లు లనుఁ•దోయజనేత్రుఁడు హృష్టచిత్తుఁడై. ౧౪౯౦

అర్థములు. హృష్ట చిత్తుఁడై=సంతోషించిన మనస్సుగలవాఁడై.

తా త్ప ర్య ము

(సీత శేపు రాముఁడు చెప్పిన ప్రకారమే చేయును 'స్త్రీలకు దైవము భర్తయేకదా!' యని చెప్పఁగా రాముని దూత లామాటలఁ దిరిగిపోయి రామునకుఁ దెలుపఁగా రాముఁడు మునులయు, రాజులయు సమూహమును జూచియిట్లు చెప్పెను.)

చ. పరిచరయుక్తులౌనవని•వల్లభులార! సశిష్యులౌమునీ
శ్వరతతులార! యాత్మలను • సందియ ముండెడి లోకులార! మీ
ల్లరుఁ జనుదెండు తప్పక యి•లాసుత శేపు జగం బెఱుంగఁగా
వరశపథం బొనర్చు నప•వాదముఁ బాపుకొనంగ నం చనన్. ౧౪౯౧

అర్థములు. పరిచర యుక్తులు=సేవకులతోఁ గూడినవారు, సశిష్యులు=శిష్యులతోఁ గూడినవారు, ఇలాసుత=సీత, అపవాదము=అపకీర్తి, నింద.

తా త్ప ర్య ము

(రాజులారా, మీరు మీ పరిచారకులతో రండు. మునులారా, మీరు శిష్యులతోఁ గూడ విచ్చేయుఁడు, సీతవిషయమున మనస్సునందు సందేహముగల లోకులారా! మీరెల్లరు చనుదెండు-శేపు సీత జగమునకంతకుఁ దెలియునట్లు

తనకుఁ గలిగిన యపవాదము పోఁగొట్టుకొనుటకు మేలి శపథము చేయఁ గలదు.' అని చెప్పఁగా.)

క. మే లని మెచ్చిరి మౌనులు, వాలాయము పొగడు చవని•పాలురు రామా!
యీ లీల నీకె తగెడిం జాలునొకో యెవ్వఁడేని•పలుకఁగ నిట్టుల్? ౧౪౯-౨

తా త్ప ర్య ము

(మునులు, మేలని మెచ్చుకొనిరి. రాజులు రాముని గొనియాడుచు రామా! యీప్రకార మెవఁడు చేయఁగలఁడు? ఇది నీకే తగును?)

క. అని పలుకఁగ నీ రెల్లరు, జను డెండీ! తె పటంచు • జనపతి సెల వి
చ్చిన వా రా ముచ్చటలే యనుకొనుచుం జనిరి రాత్రి•యటు లరుగంగన్.

తా త్ప ర్య ము

(అని పలుకఁగా, రామచంద్రుఁడు 'మీరందఱు చేపు రండు' అని సెల వీయఁగా వారా ముచ్చటలే చెప్పికొనుచుఁ బోయిరి. రాత్రి యీ విధముగాఁ గడచి పోఁగా.)

—• సీతాశపథముఁ జూచుటకు లోకులు గుంపులుగా చేరుట •—

సీ. వఱువాత రామభూ•పతి యజ్ఞవాటంబుఁ, జేరి పిల్పించె వ•సిష్ఠు వామ
దేవు జా బాలిని • ధీమంతుఁ గాశ్యపు, గాధిజు దుర్వాసు•గర్గుఁ జ్యవనుఁ
బర్వతు నారదు • భార్గవు శక్తిని, వామమునిన్ భర•ద్వాజమౌని
గౌతమఋషిని మా•ర్కండేయునిఁ బులస్త్యుఁ, గాత్యాయనర్షి న•గస్త్యమౌని
తే. నెన్నిసుతు సుప్రభునిని సు•యజ్ఞమౌని
మఱియు మౌద్గల్యుఁ దక్కిన • మౌనివరుల
వానరుల రాక్షసుల భూమి•వరుల వైశ్య
శూద్రజనముల నెల్లరఁ • జూచుటకును. ౧౪౯-౪

తా త్ప ర్య ము

(ఉదయమున రామచంద్ర ప్రభువు యజ్ఞశాలకుఁ బోయి, వసిష్ఠుని, వామదేవుని, జాబాలిని, బుద్ధిమంతుఁడగు కాశ్యపుని, విశ్వామిత్రుని, దుర్వాసుని, గర్గునిఁ, జ్యవనుని, బర్వతుని, నారదుని, భార్గవుని, శక్తిని, వామనుని, భరద్వాజ మునిని, గౌతముని, మార్కండేయునిఁ, బులస్త్యునిఁ గాత్యాయనర్షిని, నగస్త్య మునిని, సుప్రభుని, సుయజ్ఞుని, మౌద్గల్యుని వీరుగాక తక్కిన మునులను, వానరులను, రాక్షసులను, రాజులను, వైశ్యులను, శూద్రులను, చూచుటకుఁ బిలిపించెను.)

తే. పెక్కు దేశంబులందుండి•విప్రవరులు, సంశ్రితవ్రతు లగువారు•జ్ఞాననిష్ఠ
కర్మనిష్ఠయు భూరియో•గమున నిష్ఠ, గలుగువారలు వచ్చిరి•కాంచుటకును.

అర్థములు. సంశ్రితవ్రతులు=వ్రతనిష్ఠ గలవారు.

తాత్పర్యము

(ఈ విశేషము చూచుటకు దేశదేశములనుండి వ్రతనిష్ఠగల బ్రాహ్మణులు జ్ఞాననిష్ఠులు, కర్మనిష్ఠులు, యోగనిష్ఠులు వచ్చిరి.)

తే. అరుగుదెంచిన వారెల్ల•నద్రిపోలెఁ గదలకుండిరి, దండియౌ•త్కంఠ్యమునను
జనములెల్లరు మూఁగిన•జాడ తెలిసి, మైథిలీయుక్తి వాల్మీకి•మౌనివచ్చె. ౧౮౭

అర్థములు. అద్రిపోలెన్=కొండవలె, ఔత్కంఠ్యమునను=తహతహపాటుచే.

తాత్పర్యము

(వచ్చినవారందఱును మిక్కిలి తహతహ పాటుతోఁ గొండవలెఁ గదలక కూర్చుండిరి. జనములెల్లరు మూఁగిన సమాచారము తెలిసికొని సీతాదేవితో వాల్మీకి మహర్షి వచ్చెను.)

—• సీతాదేవిని దోడ్కొని వాల్మీకిమహర్షి యజ్ఞశాలకు వచ్చుట •—

క. మునివరు వెంటన ధరణీ•తనయయు నెమ్మోము వ్రాల్చి•దశరథరామున్
దనమనమున ధ్యానించుచుఁ, గనునీరము నిలుపుకొనుచుఁ•గంఠమునందున్.

అర్థములు. కనునీరము=కన్నీళ్ళు, వెలుపల రాకుండునట్లు కంఠమునందే నిలిపెను.

తాత్పర్యము

(వాల్మీకి మునీశ్వరుని వెంబడి సీతయును తలవంచుకొని మనసులో రాముని ధ్యానించుచుఁ గన్నీళ్ళు కంఠమునందే నిలుపుకొని వచ్చెను )

క. కరకంజంబులు మోడిచి, యరుదేరఁగ బ్రహ్మవెంట•ననుగమనంబుం
బొనరుచు శ్రుతి చందంబున, మునివరుబడి వచ్చుచున్న•ముగ్ధం గనుచున్.

అర్థములు. కరకంజంబులు=హస్తకమలములు, మోడిచి=ముకుళించి, శ్రుతి చందనంబున=వేదమువలె.

తాత్పర్యము

(పద్మములవంటి చేతులు ముకుళించి వచ్చుచుండ, బ్రహ్మవెంటఁ జనుదెంచు వేదమువలె మునివరునివెంట వచ్చు ముద్దరాలగు సీతను జూచుచు.)

క. ఘనతరశోకభరంబున, జనములు హలహలరవంబు•సమ్మర్దముగా
వినుచుచు మేల్మేలను చుం, గనుగొని రా భూమితనయ•కాకుత్స్థవరున్ ౧౮౯

తాత్పర్యము

(మిక్కిలి గొప్ప శోకము మెుక్కఁ పెంపున జనులు సందడిగా రొదచేయుచు మేల్మేలని పొగడుచు నా సీతను రాముని జూచిరి.)

క. బాపురె! రామా! యనుచును, బాపు! బళీ! సీత! యనుచుఁ బలుకఁగ జనముల్
బాపురె! యని యా యిద్దఱఁ, జూపఱు మెచ్చిరి నితాంత శోకప్లుతులై.

అర్థములు. చూపఱు=చూచువారు, నితాంత శోకప్లుతులై =మిక్కిలి శోకమున మునిఁగిన వారై.

తా త్ప ర్య ము

(బాపురే! రామా! యనుచు, బళిబళీ! సీతా! యనుచు జనులు మిక్కిలి శోకమున మునిఁగి చూచు వారా సీతారాముల నిద్దఱి మెచ్చుకొనిరి.)

తే. భూమితనయాసహాయుఁడై పుణ్యమూని
వల్మికోద్భవుఁ డరుదెంచి ప్రజలనడుమ
నిలిచి యెల్లరు విన రఘు కులుని జూచి
బిగ్గ పలికెను రాఘవా! వినుము నీవు. ౧౫౦౧

అర్థములు. వల్మీకోద్భవుఁడు=వాల్మీకి.

తా త్ప ర్య ము

(సీతతోఁ గూడి పుణ్యాత్ముఁడు వాల్మీకిమహర్షి వచ్చి, ప్రజలనడుమ నిలిచి, రామచంద్రమూర్తినిఁ జూచి, యందఱు వినునట్లు 'రాఘవా !నీవు వినుము' అని బిగ్గరగాఁ జెప్పెను.)

**—సీతాదేవి పతివ్రత యని వాల్మీకిమహర్షి సత్యముఁ జేసి చెప్పుట—**

శా. రామా! జానకి సువ్రతాత్మ శుభధ ర్మస్ఫీతచారిత్ర నీ
వేమో లోకము నింద మాటలకు నై యీసాధ్వినిన్ మత్తపో
భూమీసక్తవనంబునన్ విడిచి, తీ భూపుత్రి లోకాపవా
దామానస్యుఁడ వీవు నమ్మ శపథం బారంగఁ గావించెడిన్. ౧౫౦౨

అర్థములు. సువ్రతాత్మ=మంచి పాతివ్రత్య మహిమ గలది, శుభధర్మస్ఫీత చారిత్ర=శుభకరమై ధర్మముచేఁ బ్రసిద్ధమైన నడవడి గలది, సాధ్వినిన్=పతివ్రతను, మత్తపోభూమీసక్త వనంబునన్ = నాతపోభూమికిఁ జేరి యుండు నడవియందు, లోకాపవాదామానస్యుఁడవు=లోకనిందచే దుఃఖించు వాఁడవు, శపథంబు=ప్రమాణము.

తా త్ప ర్య ము

రామా! జానకీదేవి నిర్మలపాతివ్రత్యమహిమ గలది. శుభకరమై ధర్మముచేఁ బ్రకాశించు నడవడిగలది. ఇఁక నీవో, లోకము లోనివారు నిందించినారని యీ పతివ్రతను నా యాశ్రమభూమియొద్ద వదలితివి. ఈసీతాదేవి లోకనిందలచే దుఃఖించు నీవు నమ్మునట్లు ప్రమాణము చేయగలదు.

క. అనుమతి యిమ్మా జానకి, తనయుల యీ కవలవారు•తథ్యము నీకుం
జనియించిరి దుర్ధర్షులు, దినకరకుల నే వచించి•తిన్ సత్యంబున్. ౧౫౦౩

తాత్పర్యము

నీయనుజ్ఞ లేక యామె యేదియుఁ జేయరాదు. చేయదు. కావున నామె ప్రమాణము చేయుట కనుజ్ఞ యిమ్ము. ఈ యమడ బిడ్డలు నీకుఁ బుట్టినవారు. ఇది సత్యము. వీ రసాధ్యులు, రామా! నేను సత్యము చెప్పితిని.

సీ. శ్రీరామ! నేను ప్ర•చేతసు పదియవ పుత్రుండ మదినైన•బొంకఁ దలఁప
నీ పుత్రు లిర్వురు•నీ పుత్రులే సుమ్ము, పెక్కు వేలేఁడు లే•నుక్కడంపుఁ
దప మొనరించితి•ధరణిజ దుష్టయేని, దపముఫలం బెల్ల•దగ్ధమగుత
మనసునఁ గర్మంబు•నను వాక్కుచేతను, గలుషంబు నే నెన్డు•సలుపలేదు

ఆ. వానిఫలము నాకు•ప్రాపించు భూసుత, పాపహీనయేని•పార్థివేంద్ర
భూతపంచకమున•బుద్ధిని జానకి, నెఱిఁగి పూత యని గ్ర•హించినాఁడ! ౧౫౦౪

అర్థములు. ఉక్కడంపు=ఉగ్రమైన. భూతపంచకమునన్=ఐదు మహాభూతములచే నేర్పడిన దేహముచేతను, శ్రోత్రము మొదలు పంచేంద్రియములచే నని భావము, పూత=పవిత్రురాలు.

తాత్పర్యము

శ్రీరామచంద్రా! నేను ప్రచేతసుని పదియవకుమారుఁడను. మనసునందైన నబద్ధమాడ వలయునని తలఁచినవాఁడనుగాను. ఈ కుమారు లిద్దరు నీకొడుకులే. నే ననేక సంవత్సరము లుగ్రమైన తపస్సు చేసితిని సీతాదేవి దుష్టురాలేని నా తప మంతయు దగ్ధమై పోవునుగాక. మనస్సుచేతను, వాక్కుచేతను, దేహముచేతను నేను పాపము చేయలేదు. సీతాదేవి పాపహీనురాలన్యైనా వానిఫలము నాకుఁ గలుగును. పంచభూతములచేతను బుద్ధిచేతను సీతాదేవి పవిత్రురాలని యెఱిఁగి నేను జేరఁదీసితిని, దేహముచేతఁగాని బుద్ధిచేఁగాని యామె యేపాపము చేసినది కాదు. ఈ పద్యము చదివినవారు వాల్మీకి క్రూరవృత్తి నుండెనని యెట్లు విశ్వసింతురో.

ఆ. పాపహీనురాలు•పతిదేవతామణి, యతిపవిత్రశీల•యవనిజనుల
నడికి వెఱచు నీకుఁ జక్కఁగ నమ్మిక, గలుగఁజేయు బాస•సలుపునిపుడు. ౧౫౦౫

అర్థములు. పాపహీనురాలు=పాపమెట్టిదో యెఱుఁగనిది, పతిదేవతామణి=పతియే దైవమని తలఁచు పతివ్రతలలో శ్రేష్ఠురాలు, అతిపవిత్రశీల=మిక్కిలి పావనమైన నడవడి గలది, అవని జనుల నడికి=లోకులాడు నిందకు, వెఱచు=భయపడునట్టి, బాస=ప్రమాణము.

తాత్పర్యము

(పాపమెట్టిదో యెఱుఁగనిది, పతియే దైవమని తలఁచు పతివ్రతలలో శ్రేష్ఠురాలు, మిక్కిలి పావనమైన నడవడిగలది సీత లోకులాడు నిందకు భయపడు నీకు జక్కఁగా నమ్మిక కలుగునట్లు చేయ నిప్పుడు ప్రమాణము చేయును.)

ఆ. దివ్యదృష్టిచేత • భవ్యాత్మ యీసతి, యనుచు నెఱిఁగినాఁడ • జనుల దూఱు
పడఁగ లేక నీవు • పడఁతి శుద్ధయటంచు, నెఱిఁగి యెఱిఁగి విడిచి • తీమె నడవి.

తాత్పర్యము

ఈమె పవిత్రురా లని నీ కెట్లు తెలియు నందువా? నేను దివ్యదృష్టిచేతఁ జూచితిని. ఈమె పతివ్రత. పుణ్యాత్మురాలని యెఱిఁగితిని. నీవో జనులు నిందపడ లేక యీామె పతివ్రత యని తెలిసి తెలిసి యడవిలో వదలితివి, ఈమె నిర్దోషురాలని. నీ వెఱుఁగుదువు.

ఇటువంటి మహాపతివ్రత కిట్టి నిష్కారణనింద వచ్చెనే, దీనిని వారింపకున్న నదియే లోకమున స్థాపిత మగునే యని తలఁచి కరుణామయాత్ముఁడైన వాల్మీకి యీామె మహిమ లోక మెఱుంగుటకుఁ గాను రామాయణము వ్రాసెను.

**లోకాపవాదముఁ బాపుకొన సీతాదేవి శపథము సేయవలయునని శ్రీరాముఁడనుట.**

క. అని యిటు వాల్మీకి వచిం, చిన విని కరయుగము మోడ్చి • శ్రీరాఘవుఁడున్
జనమధ్యంబున సీతా, వనజాక్షిం గనుచుఁ బలికెఁ • బరమ తపస్వీ! ౧౫౦౭

తాత్పర్యము

(అని యీావిధముగా వాల్మీకి మహాముని చెప్పఁగా, విని శ్రీరామచంద్ర మూర్తి రెండు చేతులు జోడించి జనుల నడుమ సీతనుజూచి చెప్పెను. ఉత్తమ మగు తపస్సు చేయుదానా!)

ఉ. నమ్మితి నేను నీ పలుకు • నాయెడ సందియ మేమి లేదు. ని
క్కమ్ము ధరాతనూభవ య • కల్మష, మున్ను సురాళిసన్నిధిన్
నమ్మతిఁ బ్రత్యయం బిడియెఁ • జాన, యటొటఁ గదయ్యె యప్ప గే
హమ్మున నేను దెచ్చితి, జ • నావళిదూఱు సహింప శక్యమే? ౧౫౦౮

అర్థములు. అకల్మష=దోషహీనురాలు, ప్రత్యయమిడియెఁ=ప్రమాణముచే నమ్మకము గలిగించెను, చాన=స్త్రీ=సీత, దూఱు=నింద.

తాత్పర్యము

మునీంద్రా! నీమాట నేను నమ్మితిని, ఆవిషయమున నాకే సందేహము లేదు, జానకి నిర్దోషురాలు. దేవతలయెదుట పరీక్ష యిచ్చి నమ్మకము ప్రదర్శించెను.

కావుననే యింటికిఁ దెచ్చితిని. కాని లోకనింద యెట్లు సహింతును? అక్కడ జరిగి నది వీరి కేమి తెలియును? నిప్పులలో దూఁకి బ్రదికినదనిన వీరి కసాధ్యముకావున వీరు నమ్మరు. కల్పితమని యందురు. కావున దానికి నే నేమి చేయగలను?

ఉ. కావున లోకభీతి మహి • కన్యక శుద్ధ యటం చెఱింగి నే
నీవిధి వీడఁగా వలసె • నీవు క్షమింపుము నన్ను దానికై
భావమునం దెఱుంగుదును • బాలకు లిద్దఱు నా కుమారు లీ
భూవలయంబు సీత పరి • పూత యటన్నను బ్రీతిఁ గూర్చెదన్. ౧౫౮౯

తా త్ప ర్య ము

ఈ కారణముచే సీతాదేవి శుద్ధాత్మయని యెఱిఁగి యెఱిఁగి లోకనింద తప్పించుకొనుటకై యీ ప్రకారము వదలిపెట్టవలసి వచ్చెను. నీవు మన్నింపుము. ఈబాలకు లిరువురు నా కొడుకులని నేనెఱుఁగుదును. ఈ భూమిజనులు సీత పవిత్రు రాలు ఆమెయందు దోషము లేదు అని చెప్పిరేని సంతోషించెదను. వాల్మీకి సీత పవిత్రురాలు, పరీక్షయిచ్చునని చెప్పనేకాని, నీవు పరిగ్రహింపుమని చెప్ప లేదు. రామచంద్రమూర్తియు సీత నిర్దోషురాలని జనులు విశ్వసించిన సంతోషిం చెదననెను గాని పరీక్ష యిచ్చిన నేను మరలఁ గైకొందునని చెప్పలేదు. భవిష్య త్తు వారికుఁ దెలియును. కావున ఆ విషయము చెప్పలేదు.

సీ. అనవుడు దశరథ • తనయు నభిప్రాయ, మెఱిఁగి దేవత లెల్ల • నింద్రుఁడాది
బ్రహ్మ మున్నుగ మింట • వచ్చినిల్చిరి సీత, శపథంబుఁ జూడంగ • సంభ్రమమున
వసువులు రుద్రు ల • ప్సరసలు గంధర్వు, లాదిత్యులు మరుత్తు • లశ్వు లోలి
విబుధ సిద్ధులు సాధ్య • విశ్వదేవులు మహా, ఋషివరుల్ వచ్చిన • నెల్ల వారిఁ

ఆ. జూచి రాముఁ డనియె • సురలార! మునులార!, మౌనివాక్యముఁ ను • మహితనూజ
నిర్మలాత్మ యనుచు • నెఱనమ్మినాఁడను. జగము నమ్మెనేని • సంతసింతు. ౧౫౯౦

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా, రామచంద్రమూర్తి యభిప్రాయము తెలిసి బ్రహ్మ మున్నుగా నింద్రాది దేవతలెల్ల సీత చేయు శపథమును జూడవచ్చి యాకాశ మున నిలిచిరి. అష్టవసువులు, ఏకాదశరుద్రులు, అప్సరసలు, గంధర్వులు, ద్వాద శాదిత్యులు, మరుత్తులు, అశ్వనీదేవతలు, సిద్ధులు, సాధ్యులు, విశ్వదేవులు, మహ ర్షులు సంబరముగా వచ్చిరి. వచ్చినవారి నందరను శ్రీరామచంద్రమూర్తి దేవత లారా! మునులారా! సీత పరిశుద్ధురాలనుచు వాల్మీకి మునీశ్వరుని మాటలను పూర్తిగా నమ్మినాఁడను. లోకముకూడ నమ్మినచో సంతోషించెదను.)

చ. అనవుడు దివ్యగంధము సు ♦ ఖావహమున్ హృదయంగమంబునై
యనిలుఁడు సర్వలోకులకు ♦ హాయిగ వీచెఁ గృతంబునం దనన్
జనము మహాద్భుతం బనుచు♦సంభ్రమ మారఁగఁ జూచు చుండ భూ
తనయయుఁ గావిచేలమును ♦ దాల్చి సభాజన తాంతరంబునన్. ౧౫౧౧

అర్థములు. సుఖావహము=సుఖముగలిగించునది, హృదయంగమంబు=మనోహరమైనది, అనిలుఁడు=వాయువు, హాయిగన్ = సుఖకరముగ, కృతంబునం దనన్=కృతయుగమునందువలె, కావిచేలమును=కాషాయ వస్త్రమును, సభాజన తాంతరంబునన్=సభాజనుల నడుమ.

తాత్పర్యము

రామచంద్రమూర్తి యిట్లు చెప్పఁగా సుఖము గలిగించునదియు మనోహరమునై కృతయుగంబు నందువలె వాయువు హాయిగా వీచెను. లోకు లిది మహాద్భుతమని తొట్రుపాటుతోఁ జూచుచుండఁగా సీతాదేవి కావిచీర కట్టుకొని సభాజనుల నడుమ నిలిచి.

—* సీతాదేవి శపథంబు సేయుట *—

క. కరకంజంబులు మోడిచి, ధరణిం గనుఁగొనుచు శిరముఁ♦దగ వ్రాలిచి మె
ల్లన వినఁగా నిట్లనియెను, సరసీరుహనయన దా న♦చంచలమతియై. ౧౫౧౨

అర్థములు. కరకంజంబులు=హస్తకమలములు, అచంచలమతియై=చలింపని మనస్సు గలదై.

తాత్పర్యము.

(హస్తకమలములు ముకుళించి, నేలఁజూచుచుఁ దలవ్రాల్చి చలింపని మనస్సు గలదై సీత యందఱు వినునట్లు ఈ ప్రకారము చెప్పెను.)

తే. స్వాంతమందైన శ్రీరామ♦చంద్రుఁ దక్కఁ, బెఱపురుషుని మదిని భా♦వింపనేని
బరమశీలంబుచేతఁ బా♦వనిన యేని, దల్లి! యో మాధవీదేవి!♦దారినిమ్ము.

అర్థములు. స్వాంతమందైనన్=మనస్సునందైనను, తక్కఁన్=తప్ప, పరమశీలంబుచేతన్=ఉత్తమమైన సదాచారముచే, పావనిన=పవిత్రురాలనే, మాధవీదేవీ, ఓ భూదేవీ మాధవపత్ని-మాధవీ.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తిని దప్ప మఱియొక పురుషుని మనస్సునందైనను రాగముచేఁ దలంపకుండినను ఉత్తమపాతివ్రత్యముచేతఁ బవిత్రురాలనే యగుదునేని తల్లీ! యోభూదేవి! నాకు దారి నిమ్ము

తే. మనసుచేతను నుడులఁ గ•ర్మములచేతఁ, బ్రాణవల్లభుఁ డైన శ్రీ•రామభద్రు
నే సదా యర్చనము సేఁత•నిక్కమేని, తల్లి! యోమాధవీదేవి!•దారినిమ్ము.

తాత్పర్యము

మనస్సు చేతను మాటలచేతను కార్యముల చేతను నాభర్తయగు శ్రీరామచంద్రమూర్తినే నేను సదా పూజించు చుండుట నిజమగునేని యోతల్లీ! భూదేవీ! నాకు దారి నిమ్ము.

తే. ప్రాణవల్లభుఁడౌ రామ•భద్రుఁ దప్పఁ బరపురుషు నే నెఱుంగ నా•భాషితంబు
బొల్లుగాదేని ముమ్మాటి•కెల్లరుఁ గనఁ దల్లి! యో మాధవీదేవి!•దారి నిమ్ము.

తాత్పర్యము

నా ప్రాణభర్తయగు రామచంద్రుని దప్ప నితరపురుషుని కామముచే నేను దలఁచినదానఁ గాను. నాయీ మాట యసత్యము గాదేని ముమ్మాటికి నిందఱు చూచుచుండఁ దల్లీ! మాధవీ దేవి! నాకు దారి నిమ్ము.

### —• సీతాదేవి రసాతలంబునకుఁ బోవుట •—

సీ. అని శపథంబుల • నాడిన యంతన, పరమాద్భుతంబుగఁ • బ్రజలు గనఁగ
నమితవిక్రములైన • యహిపతుల్ శిరమున, ధరియింప దివ్యర•త్న జ్వలితము
దేవతాయరచితంబు•దివ్యసింహాసన, మిలనుండి వెంటనే • యెగయుఁ దెంచె
నందు ధాత్రీదేవి • హస్తంబులను సీత,గ్రహియించి కుశలంబుఁ • బ్రశ్న సేసి

తే. సింహపీఠిక నుపవిష్టఁ • జేసి కొంచుఁ
బోయెను రసాతలమునకు • భూమితనయ
పై నవిచ్ఛిన్నముగఁ బుష్ప • వర్షమపుడు
గురిసెఁ గొండాడఁ జొచ్చిరి • సురలు ఋషులు. ౧౫౧౮

అర్థములు. అహిపతుల్=సర్పరాజులు, దివ్యరత్నజ్వలితము=దివ్యములైన రత్నములచే బ్రకాశించునది, దేవతారచితంబు = దేవతలచే నిర్మింపఁబడినది, ఎగయుఁ దెంచెన్=పైకెగసి వచ్చెను, ధాత్రీదేవి=భూదేవి, సింహపీఠికన్ = సింహాసనమందు, ఉపవిష్టఁజేసి=కూర్చుండఁబెట్టి, అవిచ్ఛిన్నముగన్=తెఱపిలేక, కొండాడఁజొచ్చిరి=పొగడసాగిరి.

తాత్పర్యము

(అని సీతాదేవి శపథములు పలికిన వెంటనే పరమాశ్చర్యముగాఁ బ్రజలు చూచుచుండ, నమితపరాక్రమము గల సర్పరాజులు మోయుచున్నదియు దివ్య రత్నములతోఁ బ్రకాశించునదియు దేవతలచే నిర్మింపఁబడినదియునగు సింహాసనము

భూమిలోనుండి పైకెగసి వచ్చెను. అందుండి భూదేవి సీతాదేవిని చేతులతోఁ దీసికొని కుశలమడిగి సింహాసనమునఁ గూర్చుండఁ బెట్టి రసాతలమునకుఁ దీసికొనిపోయెను. సీతాదేవిమీఁద నెడతెఱిపిలేకుండఁ బూలవాన గురిసెను. దేవతలు, మునులు, పొగడసాగిరి.)

మరల నగ్నిప్రవేశమే చేసి పరీక్ష చూపి యుండరాదా యని కొందఱు తలఁతురు. దానినే మరలఁ జూచినపక్షమున నీమె యొద్ద నేదియో యగ్నిస్తంభన విద్యయో మూలికా ప్రభావమో గలదు. కావుననే ధైర్యముగ నగ్నిలో దూఁకు నని లోకులందురు. అదియునుగాక, లంకలో నందఱయెదుట పరీక్షచూపినను లోకుల నింద తప్పినదికాదు. ఇప్పుడట్టి పరీక్ష చూపినను దేశాంతర కాలాంతరమందు మరల నట్టిది పుట్టదని యేమి నమ్మకము? ఎన్నిమార్లని పరీక్షచూపుట? అదియునుగాక ప్రమాణము చేసినను మరల గ్రహించెద నని రామచంద్రుఁడనలేదు. లోకులు నమ్మినఁ జాలు ననియే చెప్పెను. ఈ కారణముచేత సందేహమున కెడమీయని ప్రమాణము చేసెను. అగ్నిలో దూఁకి బ్రతుకుటకంటె నిది కఠినమైన పరీక్ష. భర్త యాజ్ఞ లేకపోవుటచేతను భర్తవంశము నిలుపవలయునను కోరికతోను అప్పుడే యిట్టి కార్యము చేసినదికాదు. ఆ రెండడ్డములు తీరినవి. కొడుకులు మగనియొద్దఁ జేరిరి. భర్తయాజ్ఞయు నయ్యెను గనుక కలకాలము నిందమోచి బ్రతుకుటకంటె దేహత్యాగము చేయుట మేలని తలఁచెను. మఱియొక యోజన:—ఇప్పుడు నేనొక శపథముచేసి దేహము నిలిపెదనని రామచంద్రమూర్తి తన్ను గ్రహింపక తప్పించుకొన లేదు. అప్పుడా భృగుమహర్షి యిచ్చినది నను భవించెదననియు తన భర్త యంగీకరించినదియు నగు శాపము ననుభవించుటకుఁ దా నడ్డుపడిన ట్లగును. కావున దేహము విడువఁదలఁచెను.

తే. మేలు మేలమ్మ! జానకీ! • మేలు దేవి!, యౌర! బాపురే! భళి భళీ! • యహహా! బాఁగు
నీదుశీలం బహో! యెంత • నిర్మలంబొ!, యిట్టిదా నీదు నడవడి • యిగురుఁబోఁణి!

తాత్పర్యము

(అమ్మా! సీతమ్మా! యేమి నీ పాతివ్రత్యమహిమ! ఔరా! యెంత నిర్మలము! ఎంత నిర్మలము!! ఇట్టి మహిమ కలదా నడవడి!!

క. అని యంతరిక్షగతు లన మనములు విస్మయ మహాబ్ధి • మగ్నంబులుగా
మునులును యజ్ఞాలయగతి, జనవర్యులు ప్రతిమలట్లు • సంవీక్షింపన్. ౧౫౧౪

అర్థములు. అంతరిక్షగతులు=ఆకాశమం దుండువారు! విస్మయమహాబ్ధి=ఆశ్చర్య మను సముద్రమందు, మగ్నంబులుగాన్=మునుఁగఁగా, యజ్ఞాలయగతి=యజ్ఞశాలయం దుండు, జనవర్యులు=రాజులు, ప్రతిమలట్లు=బొమ్మలవలె, సంవీక్షింపన్=చూడఁగా.

తాత్పర్యము

(అని యాకాశమునం దుండువారు పలుకుచుండ, మునులు యజ్ఞశాలయం దున్నరాజులు తమ మనసులాశ్చర్య మను గొప్ప సముద్రమునందు మునుఁగఁగా, బొమ్మలవలెఁ జూడ)

క. భూతలమున గగనంబునఁ, బాతాళమునందు నెల్లఁ • బన్నగదనుజ
వ్రాతము స్థావరజంగమ జాతము క్రియ మూని వీత•చైతన్యం బై  ౧౫౯

అర్థములు. పన్నగదనుజవ్రాతము = పన్నగుల దానవుల సమూహము స్థావరజంగమ జాతము=కదలనివి, కదలునవి వీనిసమూహము, క్రియ=వలె, వీత చైతన్యంబై=స్మృతి తప్పినవై.

తాత్పర్యము

(భూమియందు, నాకసమున, పాతాళలోకమునఁ బన్నగుల దానవులస్థావర జంగముల సమూహము స్మృతి తప్పి చేష్ట లుడిగిన వయ్యెను.)

క. కొందఱు ముదమున నలరిరి, కొందఱు ధ్యానమున మునిఁగి•కూరిరి చింతన్
గొందఱు రామునిఁ జూచిరి, కొందఱు కనుగొనిరి పుడమి•కొమరి నె మదులన్.

అర్థములు. ముదమునన్=సీతాదేవి యపవాదము పోయెనని సంతోష ముతో, మదులన్=మనస్సులందు, సీతాదేవిని జూచిరి.

తాత్పర్యము

(సీతాదేవికి వచ్చిన యపవాదము పోయెనని సంతోషముతో నలరిరి కొందఱాలోచనలో మునిఁగి దుఃఖమును బొందిరి. కొందఱు రామచంద్రమూర్తిని జూచిరి. కొందఱు తమ మనస్సులలో సీతాదేవినిఁ గనుగొనిరి.)

క. సీతాప్రవేశనంబును, భూతకదంబంబు చూచి • పొదలినచింతన్
జాతమహావిస్మయమునఁ, జేతము చెడి మోహమునను•జేష్టది యుండెన్.

అర్థములు. భూతకదంబంబు=ప్రాణులసమూహము, చేతము=మనస్సు.

తాత్పర్యము

(సీతాదేవి భూమిలోఁ బ్రవేశించుట చూచి ప్రాణుల సమూహము విచారము విస్మయము నధికమగుటచే మనస్సులు చెడి చేతలుడిగి తెలివితప్పి యుండెను)

### —• సీతా వియోగంబునకు శ్రీరాముఁడు పరితపించుట •—

సీ. జానకీదేవి ర•సాతలంబున కేగ, మేలు మే లని కపి • జాల మనఁగ
దండకాష్ఠంబు నూఁ•తగఁగొని రాముండు, శిరము వ్రేలఁగ నై చి•చింతమునిఁగి
పరమదుఃఖితుఁ డయి•బాష్పము ల్గార్చుచు, బెద్దకాలం బేడ్చి•వితత శోక
రోషయుక్తుం డయి•భాషించె నీగతి, నెప్పుఁడు నుఃఖ మే•నెఱుఁగ నిప్పు

ఆ. దననుభూతశోక • మావహించెడి మది, నేను జూచుచుండ • శ్రీనిబోలు
నాదుదయిత సీత • నష్టయయ్యె నయారె, యెట్టు సైఁపనచ్చు • నిట్టివెతను.

అర్థములు. దండకాష్ఠంబు=దండరూపమైన కాష్ఠము, దండకాష్ఠము, సోమ క్రియ పర్యంతంబు దీక్షితుఁడు ధరింపవలసిన మేడిదండము, శోకమున నిలువ లేక దండమును నూఁతఁగఁ గొనెను, నష్టయయ్యెన్=అదృశ్యయయ్యెను.

తాత్పర్యము

సీతాదేవి రసాతలమునకుఁ బోఁగా వానరు లందఱు మేలు మేలని మెచ్చు కొనిరి. రామచంద్రమూర్తి దీక్షితుఁడు ధరించు దండము నూఁతగఁ గొని శిరము వ్రేలవైచి మిగులఁ జింతచే దుఃఖించి కన్నీరు గార్చుచుఁ జాల నేపేడ్చి యిట్లు చెప్పెను. ఇదివఱకు ననుభవింపని దుఃఖ మిప్పుడు ప్రాప్తించెను. నేను జూచు చుండ నాకన్నుల యెదుటనే లక్ష్మీదేవివంటి సీత యదృశ్య యయ్యెను. అయ్యో! యీ దుఃఖము నెట్లు సహింతును?

క. జలనిధి యావలితటమున, బలితపులంకన్ నిరుద్ధ•భామిని మరలన్
బలమునఁ దెచ్చిన నాకీ,యిల దాఁచిన సీతఁ దెచ్చు • టెంతటి పనియో.

అర్థములు. నిరుద్ధ=అడ్డగింపఁబడిన, చెఱనుంచఁబడిన.

తాత్పర్యము

(సముద్రము నవలియొడ్డున నున్న బలిష్ఠమైన లంకలోఁ చెఱయందుంచఁ బడిన సీతను మరలఁ దీసికొని వచ్చిన నాకీ భూమి దాఁచిన సీతను దెచ్చుట యెంతటిపని? గొప్ప పని కాదని భావము.)

—* శ్రీరాముఁడు భూదేవిపైఁ గోపించుట *—

క. వసుధాదేవీ! సీతను, వెసఁ గ్రమ్మఱఁ దెచ్చి విడుము•విడువవ యేనిన్
గసిమసఁగి నాదురోషం, బసదృశగతిఁ జూపువాఁడ•నాత్మ నెఱుంగన్. ౧౪-౨౮

తాత్పర్యము

(ఓ భూదేవీ! వెంటనె తీసికొనివచ్చి సీతను నా యొద్ద విడువుము. అట్లు విడువకుంటివా, విజృంభించి నీ మనసునకుఁ దెలియునట్లు సాటిలేని నా కోపమును జూపెదను.)

క. హలహస్తుం డగు జనకుఁడు కలికిని నేలోన నుండి•కద దున్ని వెడన్
వెలికిం దెచ్చెను ధర్మము, కలిమిం బరికింప నత్త•గారవు నాకున్. ౧౪-౨౪

అర్థములు. హలహస్తుఁడు=నాఁగేలు చేఁతగలవాఁడు.

తాత్పర్యము

(నాఁగేలు చేతఁబూని కదా జనకమహారాజు నీలోనున్న సీతను వెలుపలికిఁ దీసికొని వచ్చెను. ధర్మమాలోచించిన నీవు నాకత్తగారవు.)

ఉ. కావున నా తలోదరిని ♦ గ్రమ్మఱ నిమ్మువు డీవు కానిచో
దేవిరొ! నాకు నిమ్ము చనఁ♦దెర్వు రసాతలమందో స్వర్గమం
దో వనితామణిం గదిసి ♦ యుత్సుకతం జరియించుచుందు నా
దేవి యథాస్వరూపముగఁ ♦ దేకయె యాలముఁ జేసి తేనియున్. ౧౫౨౬

అర్థములు. ఆలము=ఉపేక్ష.

తాత్పర్యము

(కాఁబట్టి నా భార్యను మరల నాకిమ్ము. కాకున్న నాకు దారిచూపుసంగుము. నాప్రియురాలు స్వర్గమందే యున్నదో పాతాళమునందే యున్నదో యక్కడకుఁ జేరి యామెతోఁ గలిసి సంతోషముతో విహరించెదను. నా దేవి నిదివఱకున్న రూపముతోఁ దీసికొనిరాక యుపేక్ష చేసితివేని.)

క. అత్తా! జానకికతమున మత్తుఁడఁ గోపమున రూపు♦మాపెద నిన్నున్
బత్తనకాననధరణీ, భృత్తతితో నీటఁ గలిపి♦వేసెదఁ గనుమీ. ౧౫౨౭

అర్థములు. పత్తన కానన ధరణీభృత్ + తతితోన్=పట్టనములు అడవులు కొండలు వీని సమూహముతో.

(అత్తా! సీతలేని కారణమున నేను గోపముచే నొడలు తెలియకున్నాఁడను పట్టనములతో నడవులతో గొండలతో నిన్ను నీటఁ గలిపివేసి రూపు మాపెదఁ జూడుము.)

## —♦ బ్రహ్మ శ్రీరామునిఁ శాంతునిఁ జేయుట ♦—

చ. అనుచు రుషాకషాయితదృ♦గంచలుఁడై వచియించు రామునిన్
గని సురసంచయాన్వితుఁడు ♦ కంజభవుండు వచించె రాఘవా!
కినియకు రామచంద్ర! మదిఁ ♦ గీల్కొలుపం దగుఁ బూర్వభావమున్
మును పొనరించుమంత్రమును ♦ ముగ్ధసరోజవిశాలలోచనా. ౧౫౨౮

అర్థములు. రుషాకషాయిత దృగంచలుఁడై =కోపముచే నెఱ్ఱనైన కనుఁగొనలు కలవాఁడై, సురసంచయాన్వితుఁడు=దేవతాసమూహముతోఁ గూడినవాఁడు, కంజభవుఁడు=బ్రహ్మ, కినియకు=కోపింపకుము, పూర్వభావమున్=విష్ణుత్వమును, మంత్రము=ఆలోచన, ముగ్ధసరోజ విశాలలోచనా=క్రొత్తగా వికసించిన కమలమువంటి కన్నులు కలవాఁడా.

తా త్ప ర్య ము

అనుచు కోపముచేఁ గనుఁగొన లెఱ్ఱచేసి చెప్పుచున్న రామచంద్రమూర్తి యొద్దకు దేవతలతోడ బ్రహ్మ వచ్చి యిట్లనియె. రామచంద్రమూర్తీ! కోపింపకుము. నీ విష్ణుత్వమును అవతారసమయమున దేవతలతో నీవు చేసిన యాలోచనము స్మరింపుము.

క. నిను స్మరియింపఁగఁ జేయఁగ, ననఘా! నే నెంతవాఁడ•నాత్మఁ దలఁపుమీ
వనజాక్ష వైష్ణవంబగు, జననం బిద్వేళఁ జిత్త•శాంతిం గనుమీ. ౧౫-౨౯

తా త్ప ర్య ము

(పాపరహితుఁడవగు నో రామచంద్రమూర్తీ! నీ విషయమై నీకు స్మృతికి వచ్చునట్లు చేయుటకు నే నెంతటి వాఁడను. నీవు నీమనస్సులో నాలోచింపుము. పుండరీకాక్షా! నీవు రావణవధనిమిత్త మవతరించిన విష్ణుదేవుఁడవు. చిత్తమున శాంతి నొందుము.)

క. నీపూర్వపరాయణయగు, భూపుత్రిక విమలసాధ్వి • భోగిజగతిఁ ద్వ
త్ప్రాప్రిత తపోబలంబున, నేహారెడి సర్వసుఖస•మేతాత్మిక యై. ౧౫౩౦

అర్థములు. పూర్వ పరాయణ=పూర్వభావమునందు ప్రేమ గలది, నీ ప్రకృతి ప్రాప్తియందు నౌత్సుక్యము గలది, విమల=దోషరహిత, సాధ్వి=పతివ్రత, భోగిజగతిన్=నాగలోకమందు, నాగలోకమునకుఁ బోయి యచ్చట నుండి వైకుంఠము చేరినదని భావము, త్వత్ప్రాప్రిత తపోబలంబున = నిన్నాశ్రయించిన తపోబలముచేత, వేదవతిగా నున్నప్పుడు నిన్నుఁ బొందఁగోరి చేసిన తపోబలముచేత, సర్వసుఖ సమేతాత్మికయై=అన్ని సుఖములతో గూడిన మనస్సుగలదై.

తా త్ప ర్య ము.

నీ ప్రకృతి ప్రాప్తియందు విశేషము కోరిక గల సీత నిర్దోషురాలు, పతివ్రత, నిన్నాశ్రయింప చేసిన తపోబలముచే నాగలోకమందు సర్వసుఖము లనుభవించుచున్నది.

## —• రామాయణశేషము వినుమని బ్రహ్మ శ్రీరాముని వేఁడుట •—

క. నిన్నుఁ గలయును స్వర్గంబున, ఘనవేణి నిజంబు నీదు•కావ్యం బెల్లన్
విను మది సర్వముఁ దెలిపెడు, వనజాక్షా! నిలుపునాదు•వాక్యము లెదలోన్.

అర్థములు. ఘనవేణి=మేఘమువంటి నల్లని జడగలది, స్వర్గంబునన్=వైకుంఠమందు.

తా త్ప ర్య ము

ఆమె నిన్ను వైకుంఠమునఁ గలసికొనును సత్యము నీకావ్యమంతయు వినుము. సర్వము తెలియఁగలవు నామాట మనస్సునం దుంచుము.

ఉ. ఉత్తమకావ్య మయ్యది త్వ • దుద్భవమాది సుఖంబు దుఃఖముల్
హత్తినరీతిఁ జెప్పెడి య • థార్థముగా సభవిష్యమై మఱిన్
సోత్తరమూ నటుల్ పలికె • సొంపుగ వాల్మికి దాని నెల్ల నీ
విత్తఱి విన్మనీన యవ•నీశ్వర! యర్హుఁడ వద్ది గైకొనన్. ౧౯౩౨

అర్థములు. త్వదుద్భవము=నీ యవతారము, ఆది=మొదలు, హత్తినరీతిన్=కలిగిన విధమును, యథార్థముగా=జరిగినది జరిగినట్లు, సభవిష్యమై = రాఁగలదానితోడ, సోత్తరము=నీతో పసంహారమున కావల జరిగినది.

తాత్పర్యము

రామచంద్రమూర్తీ! యిది యుత్తమ కావ్యము. నీవు నీవు జనించినది మొదలు నీకుఁ గలిగిన సుఖములు, దుఃఖములు జరగినవి జరగినట్లు తెలుపును. అందు నీతోప సంహారమున కావల జరుగఁగల భవిష్యద్విషయము చెప్పఁబడినది. దానిని నా యనుగ్రహముచే వాల్మీకి రచించెను. దానిని నీవు వినుము. అది గ్రహింప నీవె యర్హుఁడవు.

క. నీయందె సుప్రతిష్ఠిత, మై యఖిలం బింతు రామ • యాదిమకావ్యం
బీయది దివ్యం బద్భుత, మై యజ్ఞానచ్యుతంబు • నై సత్యంబై. ౧౯౩౩

అర్థములు. సుప్రతిష్ఠితము=చక్కఁగాఁ బ్రతిష్ఠగొనినది, ఆదిమకావ్యంబు= ప్రథమ కావ్యము, కావ్యములందు మొదటిది, దివ్యంబు=మానవ సంబంధమైనది కాదు, అద్భుతము=ఆశ్చర్యకరము, అజ్ఞానచ్యుతము=అజ్ఞానముచేఁ జెప్పఁబడినది కాదు, అజ్ఞానమును దొలగించునది, సత్యంబు = శాశ్వతమైనది, ఉన్నదున్నట్లు చెప్పునది.

తాత్పర్యము

(నీ యందే సర్వము నెలకొనియున్నది, రామా! యిది కావ్యములందు మొదటిది మానవ సంబంధమైనది కాదు. అజ్ఞానమును దొలగించునది. శాశ్వతమైనది. ఉన్నదున్నట్లు చెప్పునది యగు.)

గీ. రాజలెడి నేను నిర్జర, రాజులతో వినినవాఁడ•రామా! దీనిన్
భ్రాజితకీర్తిద సత్కృతి, రాజమునకుఁ దగఁ డెవండు•రాముఁడు దక్కన్.

అర్థములు. నిర్జరరాజులతో=దేవతా సమూహములతో, భ్రాజిత కీర్తిద సత్కృతిరాజము=ప్రకాశించు కీర్తిని గలిగించు మంచి యుత్తమ గ్రంథమునకు. సత్కావ్యమునకు నర్హుఁడగువాఁడు రామచంద్రుఁడు తక్కఁ దక్కిన వా రెవరు గారని భావము. కావుననే యుత్తమకవు లందఱు కాళిదాస, భవభూతి, మురారి, జయదేవాదులు రామకథనే చెప్పిరి. దీనివలన రామునకు సంబంధింపని కావ్యము దుష్కావ్యము కావునఁ బఠింపరాదని యర్థము. కావుననే 'కావ్యాలాపాంశ్చవర్జయే' త్తని చెప్పఁబడెను.

తాత్పర్యము

(ప్రకాశించును- రామా! నేను దీనిని దేవతానసమూహములతోఁ గూడ వింటిని. ప్రకాశించు కీర్తిని గలిగించు మంచి యుత్తమ గ్రంథమునకు శ్రీరామ చంద్రుఁడు తక్కఁ దక్కినవారెవరును యోగ్యులుగారు.)

క. రామా! శేషభవిష్యము, రామాయణ మాలకింపు • రాగమున ముని
స్తోమంబుతోడ నుత్తర,నామక మది మిగిలినది వి•నందగు దీవే. ౧౫౩౫

అర్థములు. శేషభవిష్యము=రామాయణమందు నీవు వినఁగా మిగిలినది. జరగఁబోవునది.

తాత్పర్యము

(రామా! రామాయణము నీవు వినఁగా మిగిలినది. ఉత్తరకాండము- అది మిగిలిపోయినది. మునుల సమూహముతోఁ గూడి యనురాగముతో వినుము. అది వినఁదగినవాఁడు నీవే.)

క. మిగిలిన రామాయణమును, దగు దీ వొక్కఁడవె వినఁగఁ • దగ రితరు లటం
చగపడకుండ దివంబున, నెగసిచనెన్ సురలతోడ • ఋషికాండముతోన్.

తాత్పర్యము

• (మిగిలిన రామాయణము నీ వొక్కఁడవే వినఁదగుదువు. ఇతరులు వినఁదగరు, అని చెప్పుచు దేవతలతో ఋషుల సమూహముతో నగపడకుండ నాకసమున కెగసి పోయెను.)

క. ఆవల రాముఁడు విధివా,క్యావళి మది నిలిపి కొంత•నాలించుమతిన్
దా వాల్మీకికి నిట్లనె, నే వినియెద భావిచరిత • నిఖిలము వేగన్. ౧౫౩౬

అర్థములు. విధి వాక్యావళి=బ్రహ్మచెప్పిన మాటల సమూహమును, భావి చరిత=జరగఁబోవు చరిత్రము.

తాత్పర్యము

(అటుపిమ్మట రామచంద్రమూర్తి బ్రహ్మచెప్పినమాటలు విని, కొంత పడిన కథ వినవలెనని మనస్సు కలిగి వాల్మీకితో నిట్లనెను. 'జరగఁబోవు చరిత్ర మంతయు శీఘ్రముగా వినెదను.)

క. అని నిశ్చయించి జనములఁ, బని విననడని చెప్పి కవల • బాలురతో న
మ్మునిపర్ణ శాలకుం జని, జనకజఁ దలపోసికొనుచు • శర్వరి గడపెన్. ౧౫౩౭

అర్థములు. పని వినుఁడు=పొండు, శర్వరి=రాత్రి.

తాత్పర్యము

(అని నిశ్చయము చేసికొని, జనులనందఱఁ బొమ్మనిచెప్పి, కుశలవులతో వాల్మీకిముని పర్ణశాలకుఁ బోయి, సీతను దలచుకొనుచు రాత్రి గడపెను.)

**—♦ శ్రీరాముఁ డుత్తరకాండ శేషమును వినుట ♦—**

క. కమలాప్తుం డుదయించినఁ, గొమరుల డాయంగఁబిలిచి ♦ కొంకక శేషం
బమలగతిం బాడుఁడనన్, రమణీయముగాఁగ వారు♦రామాయణమున్. ౧౬౯

తాత్పర్యము

(సూర్యుఁడుదయించిన తర్వాత బాలకులను బిలిచి సందేహింపక మిగిలిన రామాయణమును మనోహరముగాఁ బాడుఁడు అని చెప్పఁగా వారు.)

క. జరుగఁగలదానిఁగల యు,త్తరకాండము శేష మెల్లఁ ♦ దత్త్వజ్ఞ ఋషుల్
ధరణీశుఁడు వినఁబాడిరి, సరగన యజ్ఞంబు దీర ♦ త్మానాథుండున్. ౧౬౭౧

అర్థములు. తత్త్వజ్ఞ ఋషులు=వాస్తవము తెలిసిన ఋషులు, ధరణీశుఁడు=రాజు, రామచంద్రమూర్తి, దీనివలన వీరు తప్పఁ దక్కిన విన్నవారు కారని సూచన.

తాత్పర్యము

(ముందు జరగఁగల రామాయణమందలి యుత్తరకాండ శేషమునంతయు వాస్తవమెఱిఁగిన ఋషులు రామచంద్రమూర్తి వినఁగాఁ బాడిరి. యజ్ఞముపూర్తి కాఁగా రామచంద్రమూర్తి.)

క. వైదేహి లేమి దుస్సహ, వేదన శూన్యంబుగాఁగ ♦ విశ్వము దోఁపన్
మేదురశోకంబున గోత్రాధయితులకును వనాట♦రాక్షసతతికిన్. ౧౬౭౧

అర్థములు. మేదురశోకంబునన్=గాఢవ్యసనమున, గోత్రాధయితులకున్=రాజులకు, వనాటరాక్షసతతికిన్=వానరసమూహమునకు. రాక్షస సముహమునకు.

తాత్పర్యము

(సీత లేకుండుటచే భరింపరాని వేదనవలనఁ బ్రపంచము పాడుపడినట్లు తోఁచఁగా గాఢమగు వ్యసనమున రాజులకును రాక్షస సమూహమునకును.)

**—♦ శ్రీరాముఁడు కొడుకులతోఁ నయోధ్యఁ బ్రవేశించుట ♦—**

క. జనములకున్ విప్రులకున్, ధనముల నర్పించి పంపి ♦ తమయుపాధ్యులకున్
మనమున సీత స్మరించుచుఁ, జనియె నయోధ్యకును నాత్మ♦జాతులతోడన్.

అర్థములు. ఆత్మజాతులతోడన్=కొడుకులతో.

తాత్పర్యము

(యజ్ఞము చూడవచ్చిన జనులకు బ్రాహ్మణులకును కోరినధనమిచ్చి వారి వారి గ్రామములకుఁ బంపి,మనసులో సీతను దలఁచుకొనుచుఁ గొడుకులతో నయోధ్యకుఁ బోయెను.)

క. జానకినిగాక వేఱొక, మానవతి వరింపఁడయ్యె • మహితవ్రతుఁ డ
న్యూనంబుగఁ గార్తస్వర,జానకియే భార్య జన్న•జన్నమునందున్. ౧౫౪౩

తాత్పర్యము

సీతాదేవిని గాక వేఱొక భార్యను రామచంద్రమూర్తి గ్రహించినవాఁడు కాఁడు. ప్రతియజ్ఞమునందు బంగారు సీతా విగ్రహమే యాయన భార్య ఇది రామచంద్రమూర్తి యేకపత్నీత్వమును స్థాపించుచున్నది.

క. ఆవిధిఁ బదివేలేఁడులు, గావించెను వాజిమేధ•కంబులఁ బెక్కుల్
సౌవర్ణ వాజపేయము, లావారిగదక్షిణల స•మర్పించెఁ దగన్. ౧౫౪౪

అర్థములు. సౌవర్ణవాజపేయములు=బంగారు నాణెముల దక్షిణలతోఁ గూడిన వాజపేయ యాగములు, ఆవారిగ=విస్తారముగ.

తాత్పర్యము

ఆ ప్రకారము పదివేలేండ్లు విస్తారముగా బంగారునాణెములు దక్షిణలిచ్చి యశ్వమేధయాగములు ననేకములు గావించెను.

సీ. నియతిమై నలిపె న•గ్నిష్టోమగోసవ, ములఁ బెక్కు లతిరాత్ర•ములను విభుఁడు
కడచెను బెద్దయుఁ • గాల మిట్టులు జను,లెల్లను సంప్రీతి • నెసక మెసఁగ
వానరరాక్షసుల్ వర్తిలఁ దనయాజ్ఞఁ, గాలవర్షంబులు • గలుగుచుండఁ
గాటకంబులు లేక • కలిమిఁ దలిర్పఁగ, హృష్టులై పుష్టులై•యెల్లరెసఁగ

ఆ. వ్యాధు లెందు లేవు•ప్రాణికోటి కకాల మరణ మెందు లేదు•పౌరయరవ్వ
కెట్టికీడునైన న•నిట్టులు బహుదీర్ఘ,సమల నేలె రామ•చంద్రవిభుఁడు. ౧౫౪౫

అర్థములు. ఎసక మెసఁగ=వృద్ధినొందఁగా, కాటకంబులు=కఱవులు, సమలు=సంవత్సరములు.

తాత్పర్యము

అగ్నిష్టోమము గోసవము అతిరాత్రిమము అనుయాగముల ననేకములు నియమ ప్రకారము చేసెను. ఇట్టులనేక సంవత్సరములు జరుగఁగా జను లందఱు సంతోషము గలవారై యుండిరి. వానరులు రాక్షసు లాయనయాజ్ఞకు లోఁబడి వర్తించిరి. అదను తప్పక వానను గురియుచుండెను. కఱవులు లేక సంపద గల

వారై జనులు సంతోషించిన వారును, బలిసినవారినై యుండిరి. రోగములు లేవు. అకాలమరణము లేదు. ప్రజలకెట్టి కీడులు లేవు. ఈ ప్రకార మనేక సంవత్సరములు రామచంద్రమూర్తి రాజ్యము పాలించెను.

## —• కౌసల్యా సుమిత్రా కైకేయులు మరణించుట •—

సీ. పుత్రపౌత్రులతోడఁ • బొలుపార కౌసల్య, చాలకాలము వెనుకఁ • జనియెదివికి
నాయమ వెనుకొని • యనఘ సుమిత్రయుఁ, గైకయు ధర్మముల్ • కడమవడక
సలిపి వా రందఱు • స్వర్గంబునకు నేఁగి, దశరథుఁ గూడి ము • దంబుఁ గాంచ
వారికై రాముండు • బహుదానములు సల్పి, మునుల బ్రాహ్మణులను • దనివిఁబఱచి
ఆ. యౌర్ధ్వదైహికముల • నన్నిటిఁ బచరించి, పితరులకును జాలఁ • బ్రీతిఁగూర్చి
యవల రాజ్యమేలె • హాయనంబులు పెక్కు, వేలు రామచంద్ర • విభుఁడు రక్తి.

అర్థములు. ఔర్ధ్వదైహికములన్ = మరణించిన పిమ్మట దేహికై చేయవలసిన కార్యములు.

తాత్పర్యము

కొడుకులతో మనుమలతో సుఖపడి చాలకాలమయిన వెనుక స్వర్గమునకు బోయెను. ఆమె తర్వాత సుమిత్ర కైక ధర్మములు కొఱఁతపడకుండఁ జేసి స్వర్గమునకుఁ బోయిరి. వారందఱు స్వర్గమున దశరథునిఁ గలిసికొని యానందించిరి. వారి కొఱకు రామచంద్రమూర్తి యనేకదానములు చేసి మునులను బ్రాహ్మణులను దృప్తిపఱిచి పరలోకక్రియలన్నిటిని జేసి పితరులకుఁ జాల సంతోషము గలిగించి తర్వాతఁ జాల సంవత్సరములు రామచంద్రమూర్తి రాజ్యమేలెను.)

## —• యుధాజితుండు గార్గ్యుని శ్రీరామునొద్దకుఁ బంపుట •—

తే. ఒక్కనాఁడు యుధాజితుం • డుగ్రతేజుఁ, డంగిరసునిపుత్రు గార్గ్య మ • హర్షి వరునిఁ
దనదుగురువును దశరథ • తనయుకడకుఁ బంచెఁ గంబళరత్నాళి • వస్త్రయుక్తి.

తాత్పర్యము

ఇట్లు రాజ్యమేలు సమయంబున యుధాజితుండు నంగిరసుని పుత్రుఁడును తన గురువునగు గార్గ్యమహర్షిని రామచంద్రు నొద్దకుఁ గంబళములు, రత్నములు, వస్త్రము లిచ్చి పంపెను.

క. వాజుల దశసాహస్రం, బాజిసుతున కీయఁబంచె • నాతని రాకన్
రాజవరుఁడు రాముఁడు విని, రాజితగతి నెదురు చనియె • భ్రాతలతోడన్.

తాత్పర్యము

(పదివేల గుఱ్ఱములను దశరథకుమారు డగు రామచంద్రప్రభువున కిమ్మని పంపెను. ఆతని రాక రాజశ్రేష్ఠుఁడగు శ్రీరామచంద్రమూర్తి విని తమ్ములతోఁ గూడి యెదురుగాఁ బోయెను.)

ఆ. అరిగి క్రోశమాత్ర • మాతనిఁ గనుఁగొని, యమరవిభుఁడు జీవు•నర్చనలువు
నట్లు పూజచేసి•యాధనంబులఁ గొని, ప్రశ్న చేసెఁ గుశల•వార్తలెల్ల. ౧౧,౧౨

అర్థములు. జీవున్=బృహస్పతిని.

తాత్పర్యము

(క్రోసుదూరము పోయి యాగర్గునిఁ జూచి, యింద్రుఁడు బృహస్పతిని బూజించినట్లు పూజచేసి యాయన యిచ్చిన ధనములన్నియుఁ దీసికొని క్షేమ సమాచారము లడిగెను.)

—• గార్గ్యుఁడు యుధాజిత్తు సందేశమును శ్రీరామునితోఁ జెప్పుట •—

సీ. ఉపవిష్టుఁ డైనయా•యుర్వీసురునితోడ, మా మేనమామకు•క్షేమ మగునె
యేమికార్యార్థమై•యిందు మి మ్మనిచెనో, వచియింపు డాయన•వాక్యములను
నావుడు బ్రహ్మర్షి•నయముగ మీమామ, వచియించినది యెల్లఁ•బలుకువాఁడ
విన నభిమత మేని•వినవయ్య! సింధువు, నుభయపార్శ్వంబుల•నొప్పుమీఁలు

తే. దేశ మయ్యది ఫలమూల•దీపితంబు దాని రక్షించువారు గం•ధర్వవరులు
సాయుధుల్ యుద్ధకోవిదుల్•సాహసికులు, మూడుఁకోటులు శైలూష•పుత్రకులును.

అర్థములు. ఉపవిష్టుఁడు=కూర్చుండినవాఁడు, ఫలమూల దీపితంబు=పండ్ల చేతను మూలములచేతను ప్రకాశించునది.

తాత్పర్యము

(సుఖముగాఁ గూర్చుండిన గర్గునిఁ జూచి రామచంద్రమూర్తి మా మేన మామ క్షేమమా? ఏమిపనికై మిమ్మిచ్చటకుఁ బంపించినాఁడు? చెప్పుఁడని యడుగఁగా, బ్రహ్మర్షి యగు నాగర్గుఁడు మీకు విననలెనని యభిలాషయుండినచో మీ మామ చెప్పినదంతయుఁ జెప్పెదను వినుఁడు. సింధునది కిరువైపుల నున్న దేశము ఫలమూలములతో నొప్పియుండును. దానిని గంధర్వ శ్రేష్ఠులు శైలూషునికొడుకు లాయుధములు పూని రణపండితులై సాహసముతోఁ గాపాడుచుందురు.)

తే. దారుణాహవమునను గం•ధర్వపురము, రాఘవా! గెల్చి నీదు రా•ష్ట్రంబునందు
గలుపుకొను మిదియిష్ట మేన్•గానికార్య,మహిత మేనాఁడనయ్య శూ•రావతంస!

అర్థములు. దారుణాహవమునను=భయంకర యుద్ధమందు, కాని కార్యము= చేయరానిపని, అహితము=మేలుకానిది, శూరావతంస=శూరులందు శ్రేష్ఠుఁడా.

తాత్పర్యము

(రామచంద్రా! భయంకరయుద్ధమున వారల గెలిచి గంధర్వపత్తనమును నీ రాజ్యమున నీ కిష్టమైనచోఁ గలుపుకొనుము. శూరులందు శ్రేష్ఠుఁడా! యహితమై కానిపని నేను జెప్పను సుమా!

క. ఆరాష్ట్రింబులవంకను, బో రా దేవారికైన • భూపాలక నా
శ్రీరాముఁ డానుడు ల్విని, పేరిమిఁ గైకేయితనయు•వీక్షించెఁ దమిన్. ౧౯౯౨

తాత్పర్యము

(రాజా! యారాజ్యముల వైపున కెట్టివారికిని బోవఁదరముగాదు. అని చెప్పఁగా, శ్రీరామచంద్రమూర్తి యా మాటలను విని, భరతుని ప్రేమమీఱఁ జూచెను.)

క. మునివరుఁ గనుఁగొని భరతుని, తనయులు వీ రిర్వురందు • దమతాత తమున్
గొనకొని కావఁగ నుండెడ, రనుపమబలతక్షపుష్క•లాఖ్యుల వీరిన్. ౧౯౯౩

అర్థములు. తమతాత=యుధాజిత్తు, కైకకుఁ దోడఁబుట్టినవాఁడు, తక్షపుష్కలాఖ్యులన్=తక్షుఁడు పుష్కలుఁ డను పేరుగలవారు.

తాత్పర్యము

(గర్గమునిని జూచి వీరిరువురు భరతుని కొడుకులు, ప్రేమతోఁ దమతాత కావ నుండెదరు. వీరు సాటిలేని బలముగలవారు వీరిపేరు తక్షుఁడు,పుష్కలుఁడు వీరిని)

చ. భరతునితోడఁ బంపెదను • వాహినిఁ గూర్చి విరోధిసంఘమున్
దురమునఁ గూల్చి తత్పురము • దోర్బలశక్తి హరించి రెండుగాఁ
బరి విభజించి వీరలకుఁ • బోణిమిఁ బంచి యొసంగి క్రమ్మఱున్
బరమమునీంద్ర యంచుఁ దగు•భంగి బలంబుల నిచ్చి బాలురన్. ౧౯౯౪

అర్థములు. వాహినిన్=సేనను.

తాత్పర్యము

(మునీంద్రా! సేననిచ్చి భరతునితో వీరిని బంపెదను. శత్రువులను యుద్ధమందు గెలిచి, బాహుబలమున నాపత్తనము గైకొని, దానిని రెండుగా భాగించి వీరికిచ్చి భరతుఁడు తిరిగి రాగలఁడు. అని చెప్పి తగినవిధముగా సేననిచ్చి బాలురను.)

**— • శ్రీరాముఁడు సపుత్రు భరతుని గంధర్వుల జయింపఁ బంపుట • —**

క. అభిషిక్తులుగా నొనరించి, శుభనక్షత్రమునఁ బంప•సుతులును వేధో
నిధుఁ డగు గార్గ్యుఁడు బడి రా,విభవంబునఁ గైకసుతుఁడు•వెడలెం బురమున్.

అర్థములు. వేధోనిధుఁడు=బ్రహ్మతో సమానుఁడు.

తాత్పర్యము

(రాజులుగా నభిషేకించి, శుభనక్షత్రమునఁ బంపఁగా, బాలకులు బ్రహ్మసమానుఁడగు గర్గుని వెంటరాఁగా,భరతుఁడు వైభవముగా నయోధ్యాపత్తనము నుండి బయలుదేఱెను.)

క. రామానుగతము దివిజ,స్తోమదురాధర్ష మగుచుఁ • దోఁచె దళము సు
త్రామాన్వితం బయినటు,లీమాడ్కిని వెడలి దూర•మేగుచు నుండన్. ౧౫౫౮

అర్థములు. రామానుగతము=రామునిచే వెంబడింపఁబడినది, ఇట్లనుటచే రామచంద్రమూర్తి సేనవెంట కొంతదూరము పోయెనని సూచన, దివిజస్తోమ=దేవతాసమూహములను, దురాధర్ష ము=ధిక్కరింపరానిది, దళము=సేన, సుత్రామాన్వితంబు=ఇంద్రునితోఁ గూడినది.

తాత్పర్యము

రామునిచే వెంబడింపఁబడిన యాసేన యింద్రునితోఁ గూడిన సేనవలె దేవతలకును ధిక్కరింపరానిదై తోఁచెను. ఈ ప్రకారమయోధ్య విడిచి దూరము పోవుచుండఁగా.

క. పలలాదము లగుసత్త్వంబులు సోఁకులు భూతములును • బోవందొడఁగెన్
బలమునకు మ్రుంగలగాఁ, గలి గంధర్వామిషంబుఁ • గడుపారఁదినన్. ౧౫౫౯

అర్థములు. పలలాదములు = మాంసము దినునవి, సత్త్వంబులు=మృగములు, నక్కలు తోడేళ్ళు మొదలైనవి, సోఁకులు=రాక్షసులు, భూతములు=పిశాచములు, బలమునకున్=సేనకు, మ్రుంగలగాన్=ముందుగా, కలిన్ = యుద్ధమందు, గంధర్వామిషంబు=గంధర్వుల మాంసము, వీరు దేవగంధర్వులు కారు. మనుష్య గంధర్వులు.

మాంసము భుజించు మృగములు పక్షులు సేనకు ముందుగాఁ బోవుట శుభశకునము, ఎదురుగా వచ్చుట నపశకునము.

తాత్పర్యము

(మాంసముదిను తోడేళ్ళు, నక్కలు మున్నగు జంతువులు రాక్షసులు, పిశాచములు యుద్ధమునందు గంధర్వుల మాంసమును గడుపునిండఁ దినుటకు భరతుని సేనకు ముందుగా నడవఁజొచ్చెను.)

క. పులులును సింహంబులుఁ బందులు మున్నుగఁ బోవుచుండఁ•దోయజకులుఁడున్
నెల పదునేనుదినంబులు, లలితగతిం ద్రోవఁ జని బ•లంగముతోడన్. ౧౫౬౦

అర్థములు. తోయజకులుఁడున్=భరతుఁడు.

తాత్పర్యము

(పులులు, సింహములు, పందులు, ముందుగాఁ బోవుచుండఁగా, భరతుఁడు నెలమీఁద పదునైదుదినములు మార్గమున నడచి సేనతో.)

## —• భరతుండు గంధర్వుల జయించుట •—

సీ. కేకయపురిఁ జేరఁ • గీర్తితశౌర్యుండు, భరతుండు వచ్చిన•వార్త దెలిసి
తనదు సైన్యముతోడఁ•దరలె నిట్లిర్వురు, భరతయుధాజితుల్•ప్రకటబలులు
చటులున నేగి గం•ధర్వపురంబును, ముట్టిన నా రాజి•మోదమునను
బలముతో భటులతో•వెలువడి తుములంబు,గా సప్తరాత్రంబు•నోసరిలక
తే. సమర మొనరింపఁ గోదండ•శక్తిఖడ్గ,నక్రములు శోణితాపగల్•నరకళేబ
రములతోఁ బ్రవహించె ని•రంకుశముగ, సకలదిశలను రోమహా•ర్షంబుగాఁగ.

అర్థములు. ఆజిమోదమునను=యుద్ధమందలి సంతోషముచే, తుములంబుగాన్=సంకులముగా, ఓసరిలక=వెనుదీయక, శోణితాపగల్=నెత్తురు టేర్లు, రోమహర్షంబు=గగ్గురుపాటు గలుగునట్లుగ, నిరంకుశముగన్=అడ్డములేక.

తాత్పర్యము

(కేకయరాజు పత్తనమునకుఁ జేరఁగా, భరతుఁడు వచ్చినవార్త తెలిసి యుధాజిత్తు తన సైన్యముతోఁ గూడ వెడలెను. ప్రసిద్ధబలశాలులయిన భరతయుధాజితులు తత్క్షణము పోయి గంధర్వపురమును ముట్టడింపఁగా, నాగంధర్వులు యుద్ధమందలి సంతోషముచే సేనతో భటులతో బయలుదేఱి యేడురాత్రులు వెనుదీయక సంకులముగా యుద్ధముచేయఁగా, విండ్లు శక్తులు ఖడ్గములు మొసళ్ళుగా, నెత్తురుటేర్లు నరుల కళేబరములతో చూచువారి కొడళ్ళు గగుర్పొడుచునటు లడ్డము లేక ప్రవహించెను.)

ఉ. ధూర్తులతుల్యశౌర్యబల•దుర్ధరులై సరిగాఁగ ఘోర స
మ్మూర్తరపౌరుషంబుఁ గని•మార్చ్యెదఁ గాకని దారుణంబు సం
వర్తమనంగ నొప్పునమ•వర్తిమహాస్త్రము రోషసంజ్వల
న్మూర్తి రఘూద్వహుం డెదురు•మూఁకలపైఁ బరపంగ నద్దియున్.

అర్థములు. ధూర్తులు=దుష్టులు, అతుల్య=అసమానమైన, శౌర్యబలదుర్ధరులై=అతిశయించిన శౌర్యము బలముగలవారై, మూర్తర = శత్రువుల యొక్క, సంవర్తమనంగన్=సంవర్తమను పేరుగల, సమవర్తి మహాస్త్రము=యముఁ డధిష్ఠాతగాఁగల యస్త్రము యముదేవతాకము, రోషసంజ్వలన్మూర్తి=కోపముచే మండుచున్న యాకారము గలవాఁడు, ఎదురుమూఁకలపై=శత్రుసేనల మీఁద, పఱపంగన్=ప్రయోగింపఁగా.

తాత్పర్యము

దుష్టులును అసమాన బలశౌర్యములు గలవారునగు శత్రువుల పౌరుషంబు గని వీరిని మార్చి వేయవలయునని తలఁచి కోపముచే మండిపడుచు యముదేవతాకమైన సంవర్తకమను నస్త్రమును శత్రువులపై ప్రయోగించెను.

క. కాలానలహవ్యవహ,జ్వాలావళివోలె హేతి•వర్షము గురియన్
గోలాహల మొసఁగఁగ రిపు,జాలంబుల మూఁడుకోట్ల•క్షణమున మాడ్చెన్.

అర్థములు. కాలానల=ప్రలయకాలమందలి యనలమానమైన, హవ్యవహ=అగ్నిహోత్రుని యొక్క, జ్వాలావళివోలెన్=శిఖల సమూహములవలె, హేతి వర్షము=కత్తులసమూహము, కోలాహలము=కలకలధ్వని.

తాత్పర్యము

(ప్రలయకాలమందలి యగ్నిజ్వాలల వలె గత్తులసమూహమును గురియఁగా కలకలధ్వను లతిశయింపఁగా మూఁడుకోట్ల శత్రువుల సమూహమును క్షణములో మాడ్చివేసెను.)

క. మున్నిట్టిదాని నెన్నఁడు, గన్నట్టు స్మరింపరైరి • ఖచరులు భరతుం
డు న్నటి గెలిచి విరోధుల, నన్నగరయుగంబునందు•నాత్మజయుగమున్.

తాత్పర్యము

పూర్వ మిటువంటి కార్య మెన్నఁడు చూచినట్లు దేవతలు స్మృతికిఁ దెచ్చుకొన్నవారుగారు. భరతుఁడు శత్రువుల గెలిచి ఆరెండు పురములందుఁ దన యిరువురు కొడుకులను.

—• భరతుండు తక్షపుష్కలులకుఁ బట్టాభిషేకంబు సేయుట •—

తే. తక్షశిలయందుఁ దక్షుఁడ• న్తనయు నిలిపి,పుష్కలుని బుష్కలావతీ•పురమునందు
నిలిపె ధనరత్న కానన•కలితమైన, దీపితంబగు గాంధార•దేశమునను. ౧౧-౧౨

అర్థములు. తక్షశిలయందు = తక్షశిలయను పురమునందు. దీని నిప్పుడు (Taxila) టాక్సిల యందురు.

తాత్పర్యము

తక్షుఁడను తన పెద్దకొడుకును దక్షశిలయందును, పుష్కలుఁడను చిన్న కొడుకును పుష్కలావతియను నగరమందును ధనము చేతను రత్నముల చేతను బంగారు చేతను నిండిన గాంధారదేశమందు, ప్రభువులుగా నిలిపెను. గాంధారము నిప్పుడు కాండహార్ (Kandhahar) అందురు.

సీ. పాపహీనంబులౌ • వ్యవహారములచేతఁ, దతసుందరోద్యాన•తతులచేత
నతులవిభ్రాంత • రాపణంబులచేత, నవ్యంబులౌ విమా•నములచేతఁ
జాడఁజాడఁగఁ గడు•సొంపారునిండ్లచే, హారులౌ దేవాల•యములచేతఁ
దిలక తాలతమాల•లలితద్రుమాళిచే, వకులబంధురసౌర•భములచేతఁ

ఆ. బోటి వేసికొనిన•పోలుపున వాడాడు, భంగిఁ బురయుగంబు•వర్ధిలంగ
భరతుఁ డందు నైదు•వత్సరంబులు నిల్చి, క్రమ్మఱంగ వచ్చె•రాముకడకు.

అర్థములు. పాపహీనంబులు=అసత్యములు మోసములేని వ్యవహారముల చేతను, అతిసుందరోద్యానతతులచేత=మిక్కిలి యందములైన యుద్యానవనముల చేతను, విభక్త=విభజింపఁబడిన అంతరాపణంబులచేత = నడుమనడుమ నుండు సంగళ్ళ చేతను, నవ్యంబులు=మనోహరములగు, విమానములచేత=మేడలచేతను, హారులు=రమ్యములు, తిలక=బొట్టుగుచెట్లు, తాల=తాటిచెట్లు, తమాల=చీఁకటి మ్రాఁకులు, మొదలయిన, లలితద్రుమాళిచేత=అందమైన చెట్లచేతను, వకుల బంధుర సౌరభములచేత=పొగడ పూవుల విస్తార వాసనల చేతను.

### తాత్పర్యము

రెండు పురంబులందును వ్యవహారములందు మోసము అసత్య మనునవి లేవు. అందములైన యుద్యానములు నడుమ నడుమ సంగళ్ళు, మేడలు రమ్యములైన యిండ్లు దేవాలయములు బొట్టుగు చెట్లు తాటిచెట్లు చీఁకటి మ్రాఁకులు, మొదలయిన చెట్లు-వీనిచేతను, పొగడపూవుల వాసనల చేతను, రెండు పట్టణములు పోటి వేసికొనినట్లు వాదించు విధమున వృద్ధిచెందఁగా భరతుఁడు కొడుకుల యొద్ద నైదు సంవత్సరము లుండి రామచంద్రమూర్తి యొద్దకు వచ్చెను.

క. అరుదెంచి ధర్మమూర్తికిఁ. జరణంబుల వ్రాలి మ్రొక్కి సర్వము వినిచెన్
బరుల వధించుట తనయులఁ, బురముల నిల్పుటయు నన్న పొంగఁగ మదిలోన్.

### తాత్పర్యము

(తిరిగివచ్చి, ధర్మమూర్తియగు రామచంద్రప్రభువు పదముల వ్రాలి నమస్కరించి, శత్రువులను జంపుట, తన యిద్దఱుకొడుకులను రెండుపత్తనము లందు నిలుపుట సర్వమును నన్నగారు సంతోషించునట్లు చెప్పెను.)

## శ్రీరాముఁడు లక్ష్మణకుమారులను గారుపథ చంద్రకాంతములకుఁ ప్రభువులఁ జేయుట

తే. సానుజుండైన శ్రీరామ చంద్రవిభుఁడు, సర్వమాలించి సంతోష సంభ్రమమున
లక్ష్మణునిఁజూచి నీసుతు ధర్మవేదు, లంగదుఁడు చంద్రకేతుండు నమితబలులు.

అర్థములు. సానుజుండు=తమ్మునితోఁ గూడినవాఁడు, ఆలించి=భరతుఁడు చెప్పిన వంతయు విని, సంతోష సంభ్రమున=సంతోషమువలనఁ గలిగిన వేగిర పాటుతో.

### తాత్పర్యము

(శ్రీరామచంద్రప్రభువు తమ్ముఁడగు లక్ష్మణుతో నంతయును విని సంతోషము వలని వేగిరపాటుతో లక్ష్మణునిఁజూచి, నీ కొడుకు లంగదుఁడు, చంద్రకేతుఁడు ధర్మమెఱిఁగినవారు అమితబలము గలవారు.)

ఉ. వీరలు చాలువారు పృథి ♦ వీభరణంబున కే ప్రదేశముల్
తీ రగు వీరి నిల్ప నది ♦ తెల్పుమ యాశ్రమపాళి కేనియున్
భూరమణోత్కరంబునకుఁ ♦ బుట్టక యుండఁగఁ బీడ నావుడున్
శ్రీరాఘునాథుఁ గన్గొని వ ♦ చించెను సైకయిసూనుఁ డీగతిన్. ౧౦౨-౭

అర్థములు. చాలువారు=సమర్థులు, ఆశ్రమపాళికేనియున్ = ఋషీశ్వరుల యాశ్రమ సమూహములకైనను, భూరమణోత్కరంబునకు=రాజుల సమూహము నకు.

తాత్పర్యము

భరతుని కొడుకులకు శత్రుఘ్ను కొడుకులకు రాజ్యము లేర్పాటుచేసి లక్ష్మణు కొడుకులకు కేర్పాటు చేయఁదలఁచి లక్ష్మణుతో నీ కొడుకులు రాజ్యము భరింప సమర్థులు. వీరి కే దేశము లిచ్చుట తగునో చెప్పుము ఋషీశ్వరుల యాశ్రమము లకుఁ గాని యిదివఱకు దాయలుగా నున్న వారికేఁగాని బాధలేకుండ నేర్పాటు చేయువలయుననిన రామచంద్రమూర్తిని జూచి భరతుఁ డిట్లనెను.

ఉ. కారుపథంబనంగఁ గడుఁ ♦ గ్రమ్మ మబాధము నైన దేశమం
దీరమణీయమూర్తి ధర ♦ నీశ్వరుఁ జేయఁగ నొప్పు నంగదున్
దీ రగుఁ జంద్రకాంత మను ♦ దేశమునం దొగిఁ జంద్రకేతునిన్
భూరమణేంద్రుఁ జేయ నసఁ ♦ బొంగి రఘూత్తముఁ డాకుమారులన్. ౧౦౨-౮

అర్థములు. అబాధము=ఎవరికి బాధ లేనిది.

తాత్పర్యము

కారుపథం బను దేశమునకు నంగదుని రాజుగాఁ జేయవచ్చును. అది రమ్య మైన ప్రదేశము. దానికి రా జెవ్వఁడు లేఁడు. ఋష్యాశ్రమములకు సమీపమును గాదు. చంద్రకాంతు నట్లులే చంద్రకాంతపురమునకు రాజుగాఁ జేయవచ్చును. అనిన రామచంద్రుఁడు సంతోషించి యా కుమారులను.

ఆ. అంగదీయపురికి ♦ నంగదు రాజుగా, మల్లభూమియందు ♦ మల్లుఁడైన
చంద్రకేతు నిల్పి ♦ చంద్రకాంతాపురి, నాభిషేకవిధుల ♦ నాచరించె. ౧౦౨-౯

తాత్పర్యము

కారుపథ దేశమందు నంగదీయ మను పురమునకు నంగదు రాజుగాఁ జేసి మల్లభూమియందు చంద్రకాంత పట్టణమున మల్లుడగు చంద్రకాంతుని నిల్పి యిరువురికి నభిషేకము చేయించెను.

చ. పడమటిభూమి కంగదునిఁ ♦ బంపె సలక్ష్మణుఁ, జంద్రకేతు వెం
బడి భరతుం గుబేరదిశ ♦ నైపునఁ బంపెను, వారు ప్రీతి నా
పుడముల కేగి రందు జన ♦ పూజ్యుఁడు లక్ష్మణుఁ, డబ్ద ముండి తాఁ
గొడుకును నిల్పి రాజ్యమునఁ ♦ గోరికఁ గ్రమ్మఱె రాముఁ గొల్వఁగన్. ౧౦౨-౧౦

తాత్పర్యము

(పడమటి దేశమునకు లక్ష్మణునితో నంగదుని బంపెను. ఉత్తరపువైపునకు భరతునిచ్చి చంద్రకేతుని బంపెను. వారా భూములకుఁ బ్రీతితోఁబోయిరి. జనులచేఁ బూజింపఁబడువాఁడైన లక్ష్మణుఁడొక సంవత్సరముండి రాజ్యమునఁ దన కొడుకును నిలిపి. తిరిగి యన్నగారి సేవకై వచ్చెను.)

ఆ. చంద్రకేతుతోడ • సంవత్సరాధిక, కాల ముండి మరలఁ • గదలివచ్చె
మాండవీవిభుండు•మార్తండతేజుఁడౌ, రాముచంద్రుఁ గొలుచు•రాగమునను,

అర్థములు. సంవత్సరాధిక కాలము=సంవత్సరముకంటె నధికకాలము, మాండవీ విభుండు=భరతుఁడు.

తాత్పర్యము

(చంద్రకేతుతో సంవత్సరముకంటె నధికకాలముండి భరతుఁడు సూర్యుని తేజస్సువంటి తేజస్సుగల శ్రీరామచంద్రప్రభువును సేవింపవలె ననెడి ప్రేమతో వచ్చెను )

క. సౌమిత్రిభరతు లీగతి, రామపదాబ్జములఁ గొలుచు • రక్తిని గాలం
బేమాడ్కిఁజనెడి నెఱుఁగరు, దా మాత్మలఁ దలఁప రెపుడు•దమనందనులన్.

తాత్పర్యము

•(లక్ష్మణుఁడు, భరతుఁడు శ్రీరామచంద్రమూర్తి పాదముల సేవించుటయందుఁ గల ప్రేమచేఁ గాలమెట్లు పోయినది తెలియకుండిరి. తమ కొడుకుల విషయమున మనస్సునం దనుకొనరైరి.)

చ. ఇట్లు పదివేలవత్సరము • లేగ సదాజనకార్యరక్తులై
స్ఫుటపరిపూర్ణచిత్తులును • శోభితభాగ్యరమావిలాసులై
పటుతర తేజులై ముగురు•భ్రాతలు వెల్గిరి యాహుతిన్ విశం
కటరుచి మీఱునగ్నుల త్రి•కంబునకున్ సరిసాటి యాడుగన్. ౧౫౬౩

అర్థములు. సదాజనకార్యరక్తులై=ఎల్లప్పుడు ప్రజల ప్రజల కార్యములు చేయుటయందుఁ బ్రీతిగలవారై, స్ఫుటపరిపూర్ణచిత్తులై=ఏ విషయమందును కొఱఁత లేని మనస్సు గలవారై, శోభిత భాగ్య రమావిలాసులై = ప్రకాశించు భాగ్యసంపదయొక్క విలాసము గలవారై, పటుతర తేజులై=మిగుల దృఢమైన తేజస్సుగలవారై, వికంకటరుచిన్=విస్తారకాంతిచే, అగ్నుల త్రికంబునకున్= త్రేతాగ్నులకు.

తాత్పర్యము

ఈ ప్రకారము పదివేల సంవత్సరములు జరిగెను. అన్నలు దమ్ములు ముప్పురు సర్వదా ప్రజలకార్యములు చేయుటయం దాసక్తులై నిండిన కోరికలుగల

మనస్సుగలవారై భాగ్యసంపదచేఁ బ్రకాశించువారై దృఢతేజము గలవారై రఘూత్తములచే శ్రేతాగ్నులు మిగుల వెలుఁగునట్లు పరివారలులేక ప్రకాశించిరి.

**—• శ్రీరాముని సందర్శింపఁ గాలుఁడు వచ్చుట •—**

ఉ. అంతటఁ గొంతకాలమున • కంబుజనేత్రునిఁ జూడఁగోరి భూ
కాంతుని వాకిటన్ నిలిచి • కాలుఁడు తాపసవేష మూనిధీ
మంతుని లక్ష్మణుం గని కు•మారక! దూతను నేను ధారిణీ
కాంతునిఁ జూడఁగోరెదను • గార్యవశంబున వార్తఁ బుచ్చుమీ. ౧౫౭౮

అర్థములు. కాలుఁడు=యముడు.

తా త్ప ర్య ము

ఇట్లు కొంతకాలము జరుగఁగా రామచంద్రమూర్తిని జూడఁగోరి యాయన వాకిట యముఁడు మునివేషము వేసికొని నిలిచి లక్ష్మణునిఁ జూచి కుమారా! నేను దూతనై రామచంద్రుఁ జూడఁగోరి వచ్చితిని. ఆయనకుఁ జెప్పిపంపుము.

క. అమితౌజస్కుండగు సం,యమి యతిబలుఁ డంపె నన్ను •నన లక్ష్మణుఁడున్
సుముదంబున సరగం జని,యమి యొక్కఁడు దేవ! ఖరక•రాంశునిభుండున్.

అర్థములు. అమిత+ఓజస్కుండు = అపరిమిత తేజస్సు గలవాఁడు, సంయమి=ముని, సుముదంబునన్=సంతోషముతో, సరగన్=శీఘ్రముగ, యమి=ముని, ఖరకరాంశునిభుండున్=సూర్యునితో సమానుఁడు.

తా త్ప ర్య ము

(అమితమైన తేజస్సుగలిగి మిక్కిలి బలముగల ముని నన్నుఁబంపెను. అని చెప్పఁగా లక్ష్మణుఁడు సంతోషముతో వెంటనేపోయి దేవా! సూర్యునితో సమానుఁడైన యొక ముని)

క. దూత యయి మిమ్ముఁ జూడం, బ్రీతిపడె నటన్నఁ దెమ్ము•వేగ మటన్నన్
సీతద్యుతి ఋషిని సుమి,త్రాతనయుఁడు లోన విడువఁ•దాపసవిభుఁడున్.

తా త్ప ర్య ము

(దూతయై వచ్చి మిమ్ముఁజూడ వేడుక పడుచున్నాఁడని చెప్పఁగా, శీఘ్రముగాఁ దీసికొని రమ్మనెను. మిగుల కాంతిగల మునిని లక్ష్మణుఁడు లోనికిఁబో విడువఁగా మునియును)

ఉ. దీవన లిచ్చి రామవిభు • దెల్పిన నర్ఘ్యముఁ బాద్య మిచ్చి నీ
తావిభుఁ డర్థ్యపీఠిపయిఁ • దాపసు నుంచి మహాత్మ నేమమా?
యీవిధి రాఁక నేమి కత • మేర్పడం జెప్పఁ డటన్న రాఘవా!
యీవును నే రహస్యమిది • నియ్యది ముచ్చటలాడ నర్హమా. ౧౫౭౭

అర్థములు. తెల్పినన్=స్తుతింపఁగా, కతము=కారణము, రహస్+స్థలిని=ఎవ్వరులేని యేకాంతస్థలమున.

తాత్పర్యము

(దీవించి రామప్రభువు స్తుతింపఁగా, రామచంద్రమూర్తి యర్ఘ్యపాద్యము లిచ్చి తగిన యాసనమున మునిని గూర్చుండఁ బెట్టి మహాత్మా! క్షేమమా? మీ రీ విధముగా రాఁ గారణ మేమి విశదముగఁ దెలుపుఁడని యడుగ, రామా! నీవు నేను నీ విషయము రహస్యస్థలమున మాట్లాడఁ దగును.)

క. మన వాక్యము లెవఁ డేనియుఁ, వినఁ గూడదు మఱియు మనల♦వీక్షింపఁగ నేన్
జన దటు చేసినవానిన్, జనవర! వధియింతు వేని ♦ సంభాషింతున్. ౧౫౭౯

తాత్పర్యము

మనమాట లెవరు వినరాదు. మనము మాటలాడు నపుడు లోపలి కెవ్వరు రారాదు. అటు లెవ్వఁడైన వచ్చినా వానిని నీవు చంపవలెను. అట్లు నీవు చేసెద వేని రహస్యము చెప్పెదను.

క. మునిమతము హితాచరణం,బున నీమది చనెడి నేని ♦ పొనరింపుము క్ర
న్నన యిట్టు లనఁగ నట్టుల, యొనరించెద ననుచు నిజన♦హోదరుఁ బిలిచెన్.

తాత్పర్యము

మునియభిప్రాయప్రకార మాయనకు నీవు మేలుచేయఁ గోరికగల వాఁడ వేని యిట్టి యేర్పాటు చేయుము అనిన నట్టులే చేసెదనని లక్ష్మణుని బిలిచెను.

తే. పిలిచి సౌమిత్రితో నను ♦ నిలుము నీవ
ద్వారమున ద్వారపాలకుఁ ♦ బంపు దూర
ముభయులము మాటలాడుచు ♦ నుండ లోన
వచ్చువాఁడును వినువాఁడు ♦ వధ్యుఁ డగును. ౧౫౮౦

తాత్పర్యము

(పిలిచి, లక్ష్మణునితో నీవే ద్వారమునందుండుము. ద్వారపాలకుని దూరముగాఁ బంపివేయుము. మే ముభయులము మాటలాడునప్పుడు లోపలికి వచ్చిన వాడును, విన్న వాడును మరణదండనమున కర్హులు అని చెప్పెను.)

క. అని ద్వారమున సుమిత్రా,తనుజాతుని నిల్పి నియమ♦ధన! సందేశం
బును దెల్పుఁ డదియ నామనం,మున వర్తించెడిని నాఁగ♦ముని యిట్లనియెన్.

తాత్పర్యము

(అని వాకిట లక్ష్మణుని నునిచి మునీశ్వరా! సందేశమును దెల్పుఁడు, నామనసులో నదియే కలదు అని చెప్పఁగా, ముని యిట్లు చెప్పెను.)

## —• బ్రహ్మ సందేశమును గాలుండు శ్రీరామునకుఁ దెల్పుట •—

తే. వినుము రాజేంద్ర! నాపలుకు • విధము నెల్ల, బ్రహ్మ పనుపున వచ్చిన • వాడ నేను
పూర్వభవమున నే నీకుఁ • బుత్రకుఁడను, మాయచే నైతి సర్వసం • హారకుఁడను.

అర్థములు. పూర్వభవమునన్=తొలుతటి జన్మమునందు, మాయచే=నీ సంకల్పముచే, సర్వసంహారకుఁడను=సర్వము సంహరించు కాలరుద్రుఁడను.

తాత్పర్యము

రాజేంద్రా! నేను జెప్పునది వినుము. బ్రహ్మ పంపఁగా నేను వచ్చినాఁడను. పూర్వజన్మమందు నేను నీకుఁ బుత్రుఁడను. నీ సంకల్ప ప్రకారము సర్వము సంహరించు కాలరుద్రుఁడను.

సీ. కాలుండ నేను నీ • పాలింపు మో దేవ!, వారిజగర్భుని • వాక్యములను
స్వీయలోకంబును • జేరి రక్షింపఁగ, సమయ మియ్యది నీకు • సౌమ్యచరిత!
పూర్వంబు జగముల • బొలియించి మాయచే, స్వయముగ జలరాశి • శాయివగుచుఁ
దొలుత సృష్టించితి • జలములయందు న న్నవల జలేశయ • మైన నాగ

ఆ. వర మనంతము నెసఁగ • పురుభోగవంతంబు, మాయచేత సత్త్వ • మహితు లైన
మధుని గైటభాఖ్యు • మర్దింప వారల, యస్థితతి సశైల • మవని గలిగె. ౧౫౦౩

అర్థములు. వారిజగర్భుని=బ్రహ్మయొక్క, స్వీయలోకమును=భూలోకము గాక పరమ పదమును, మాయచే=స్వసంకల్పముచే, జలరాశిశాయివి=సముద్రమునందుఁ బరుండిన వాఁడవు, జలేశయము=జలమునందుండునది, నాగవరము=సర్పశ్రేష్ఠము, అనంతము=అనంతమను పేరుగలది, పురుభోగవతంబు=గొప్ప దేహము గలది. మాయచేత=అద్భుతశక్తిచేత, సత్త్వమహితులు=బలముచే గొప్పవారు, అస్థితతిన్=ఎముకలసమూహముచే, సశైలము=కొండలతోఁ గూడినది, అవని=భూమి.

తాత్పర్యము

నేను గాలుఁడను దేవా! బ్రహ్మవాక్యముల వినుము. భూలోకమందుండి యింతకాలము భూపాలనము చేసితివి. ఇఁక నీ లోకమును జాలించి పరమపదమం దుండి పాలింపసమయము వచ్చినది. పూర్వము జగముల నెల్ల సంకల్పముచేతనే సంహరించి నీ సంకల్పము చేతనే సముద్రమునఁ బండుకొని మొట్టమొదట జలములందుఁ బుట్టిన కమలమందు నన్నుఁ బుట్టించితివి. అవల నీ సంకల్పముచే పెద్ద దేహముగల యనంతమను సర్పమును గలిగించితివి. బలవంతులైన మధుకైటభుల నీవు వధియింప వారి యెముకలచే కొండలతోడ భూమి కలిగెను. జలములందుఁ బుట్టిన మకరాదులవలె మేదస్సు గలవాఁడు మధుఁడు, జలములందుఁ బుట్టిన

తాఁబేలు ముత్తెపు చిప్ప మొదలగు వాని వంటివాఁడు కైటభుఁడు, మేదస్సు వలనఁగలిగినది భూమి మెత్తని భాగము. ఎముకలవలనఁ గలిగినది కొండలు గట్టి భాగము, మేదిని=పృషోదరాదులలోఁ జేరుటచే సకారలోపము, ఈ భూమిని ధరించుటకుఁగా సృష్టింపబడినవాఁడు అనంతుఁడు, దానియందలి జీవకోటుల సృష్టింపఁ బుట్టింపఁబడినవాఁడు నేను. వృక్షలతాదులు మేదస్సునుండి పుట్టెను. శిలాదులు అస్థులనుండి పుట్టెను.

తే. దివ్యమై తామరస హిత•దీప్తిఁ దనరు, వారిజంబున నీనాభి•వలన నన్నుఁ
గలుగఁజేసి ప్రాజాపత్య•కర్మమునను, నీవ నిలిపితి వో దేవ! • నిత్యముగను.

అర్థములు. తామరస హిత దీప్తిన్=సూర్యకాంతిచే, ప్రాజాపత్య కర్మమునను=ప్రజల సృష్టించు కార్యమందు.

తాత్పర్యము

దివ్యమై సూర్యకాంతిగల కమలమందు నీనాభివలన నన్నుఁ బుట్టించి ప్రజను సృష్టిచేయు కార్యమందు నిలిపితివి 'యో బ్రహ్మాణం విదధాతి పూర్వ' మ్మని శ్రుతి.

ఉ. శ్రీకర! నేను సర్వమును • సృష్టి యొనర్చియు రక్ష సేయఁగా
నేర సమస్తభారమును • నీపయి వైచి జగత్పతీ! కృపన్
లోకము లెల్లఁ బ్రోచి యవి•లోలతఁ దేజము నాకుఁ గూర్పు మం
చీకరణిన్ వచింపఁగ మ•హీధవ! యంత దయాంతరంగతన్. ౧౫౪౫

అర్థములు. నేర=నేరక.

తాత్పర్యము

నీవు చెప్పినట్లు సర్వము నేను సృష్టించితినిగాని దానిని రక్షింప నాకు సామర్థ్యము లేదయ్యెను. అప్పుడా రక్షాభారము నీయందు వైచి జగన్నాథా! లోకములను నీవే రక్షించి నాకుఁ దేజస్సు కలిగింపుమని నేను నిన్నుఁ గోరఁగా నీవు నాయందు దయగలవాఁడవై.

సీ. నీవు దుర్ధర్షుండు•నిత్యుండ వగుటను, భూతరక్షాకార్య•మును దలంచి
విష్ణుండ వైతివి•విశ్వేశ! యావల, నదితిసుతుండ వై • యతులశక్తి
భ్రాతల నరయుచు•వలసినచో నెల్ల, సాహాయ్య మొనరింప•సాగితయ్య
యట్టినీవు ప్రజాళి•హావళి గొనఁ గని, రావణుఁ జంప ధ•రాతలమున

ఆ. మానవత్వమునను • మనసు నిల్పితి దేవ, పదియు వేలయేండ్లఁ•బదియునూర్ల
వత్సరంబు లుర్వి•వసియింప నియమంబు,నీవ మున్ను గొంటి•నీరజాక్ష! ౧౫౪౬

అర్థములు. దుర్ధర్షుండు=ధిక్కరింపరానివాఁడు, నిత్యుఁడు = సనాతనుఁడు, భూతరక్షాకార్యము=ప్రాణుల రక్షించుటని, విష్ణుఁడవు=ఉపేంద్రుఁడవు.

తా త్ప ర్య ము

దేవా! నిన్నుఁ గాదని తిరస్కరింపగలవారు లేరు; నిత్యుఁడవు. ఇట్టి పరవాసు దేవుఁడవైన నీవు ప్రాణుల రక్షింపఁదలఁచి అదితికిఁ బుత్రుఁడవై యుపేంద్రుఁడవై జనియించి సోదరులగు నింద్రాదుల రక్షించుచు వారికిఁ గావలసిన కార్యములందు సహాయపడసాఁగితివి. అట్టి నీవు ప్రజలు రావణుచే బాధపడుచుండ వానిని జంపుటకై మనుష్యుఁడవు కావలెనని తలఁచి పదునొకండు వేల సంవత్సరములు భూమిపై నుందునని నీవే నియమ మేర్పఱుచుకొంటివి.

క. నీవు మనోమయపుత్రుఁడవై వెలసితి దశరథునకు • ననుకొన్న యటుల్
దేవా! కాలము డాసెను, నీవలచినఁ బ్రజలఁ బ్రోవ • నిలువుము నెమ్మిన్. ౧౫౪౭

అర్థములు. మనోమయ పుత్రుఁడవై=స్వసంకల్ప కృతమైన దశరథపుత్ర భావము గలవాఁడు, వలచినన్=కోరెదవేని.

తా త్ప ర్య ము

స్వసంకల్పముచేత దశరథునకుఁ బుత్రుఁడ వైతివి. (పరవాసు దేవునుండి మహావిష్ణు నవతారము. ఈయనయే బ్రహ్మ శివుల నడుమనుండువాఁడు. ఆయిరువు రంగములు. ఈ మహావిష్ణువునుండి యుపేంద్రావతారము. ఈయన స్వర్గమందుండును. ఈయనయే రామావతార మెత్తిన వాఁడని గ్రహింపనగు) నీవు నియమించుకొన్న కాలము సమీపించెను. ఇంకను నీ విందే యుండి ప్రజల రక్షింపఁదలఁచితివేని సంతోషముతో నిలువుము.

క. రామా! యీగతి లోకపి, తామహుఁడు వచించె దేవతా • భువనంబున్
బో మీదిఁ గోరినచో నిక, లామరులు సనాథు లగుచు • హర్షింతు రెదన్. ౧౫౪౮

అర్థములు. లోక పితామహుఁడు=బ్రహ్మ, దేవతాభువనంబున్=దేవలోకమునకు, సనాథులు=నాథుఁడు గలవారు.

తా త్ప ర్య ము

(రామా! యీప్రకారము బ్రహ్మ చెప్పెను. నీవు దేవలోకమునకుఁ బోవఁ గోరినయెడల దేవతలందఱు దిక్కుగలవారై సంతోషించెదరు.)

క. అను కాలుని వాక్యంబులు, విని నవ్వుచు రాముఁ డనియెఁ • బ్రీతి ఘటిల్లన్
జను దెంచుట నీవే నిల, జనియించుట లోకరక్ష • సలుపఁగఁ గాదే. ౧౫౪౯

అర్థములు. నవ్వుచున్=తా ననుకొనుచున్నదే బ్రహ్మ చెప్పి పంపెను. గదా యని నవ్వు.

తా త్ప ర్య ము

(అనిన కాలుని మాటలు విని నవ్వుచు రామచంద్రమూర్తి నీవే వచ్చుటచే సంతోషమైనది. ఈభూమియందుఁ బుట్టుట లోకమును రక్షించుటకే కదా.)

క. ఎందుండి వచ్చినాఁడనో, యందులకే మరల వత్తు•సఫలంబు క్రియా
బృందము దీరెను నామన, మందుం గలయదియు నేఁడు•ప్రాప్తంబయ్యెన్.

తాత్పర్యము

నే నెచ్చటనుండి వచ్చితినో యచ్చటికే మరల వచ్చెదను. చేయవలసిన కార్యములు చక్కఁబడెను. నే నేవిషయ మాలోచించుచుంటినో యదియు నేఁడు ప్రాప్తించెను.

తే. సర్వసంహార! వారిజ•సంభవుండు, పలికినట్టులు మద్వశ•వర్తులైన
యమరనాథుల సర్వకా•ర్యంబులందు, నిలువవలయును నాకది•నియమమగుట.

అర్థములు. మద్వశవర్తులు=నన్నాశ్రయించి నాకు లోబడియుండువారు, వారి కేది మేలో యది భక్తపరతంత్రుఁడనైన నేను జేయవలసియున్నది. బ్రహ్మ సృజింపఁబడె నని చెప్పుటచే బ్రహ్మయందుఁ బరత్వము లేదని యేర్పడెను.

తాత్పర్యము

(సర్వసంహార! బ్రహ్మచే నట్లు నాకు లోబడిన దేవశ్రేష్ఠులను వారి వారి పనులందు నిలుపవలెను. అది నా నియమము.)

**దుర్వాసుండు తనరాక శ్రీరామున కెఱిఁగింపుమని లక్ష్మణుతోఁ జెప్పుట**

క. వా రిటు భాషించు నెడన్, ద్వారంబున రామచంద్ర•దర్శనకాంక్షన్
జేరి నిలిచి దుర్వాసుఁడు, శ్రీరామునిఁ జూపుమిపుడు•చెచ్చెర నాకున్ ౧౯౯-౨

తాత్పర్యము

(వా రీవిధముగా మాటలాడుచుండఁగా, శ్రీరామచంద్రమూర్తిని దర్శింపఁగోరి వచ్చి నిలబడి, దుర్వాసుఁడు నాకుఁ దక్షణము శ్రీరామునిఁ జూపుము.)

ఉ. కాల మతిక్రమించెడిని • గాదిక జాగు వచింపుమీ ధరా
పాలున కిప్పు డన్న రఘువర్యుని • తమ్ముఁడు మ్రొక్కి యిట్లనున్
జాలము సేయ, నేమిపని • సల్పుదు? నయ్యది వాంఛ? రామభూ
పాలుఁడు వ్యగ్రుఁ డిప్పుడు కృ • పారత! సైఁపు నిమేషమాత్రమున్. ౧౯౯-౩

తాత్పర్యము

కాలము మించిపోవుచున్నది. ఆలస్యము చేయరాదు. రాజున కిప్పుడే నా రాక తెలుపుము. అనిన లక్ష్మణుఁడు నమస్కరించి యిట్లనియె ఏమి చేయవలయునో మునీంద్రా! చెప్పుము, ఆలస్యము లేక చేసెదను. మీ రేమి కోరెదరు? రామచంద్రమూర్తి యన్యకార్యమందు మనస్సుంచి యున్నాఁడు. నిమిష మాత్రము నా యందు దయ యుంచి సహింపుఁడు.

క. నావుడుఁ గన్నుల నిప్పులు, వావిరిఁ గురియంగఁ గ్రోధ•పరితప్తుం డై
భూవిభునకుఁ జని చెప్పుము, నీ వీక్షణమందె చనుము•నిలువకు పోపో. ౧౫౪

తా త్ప ర్య ము

(అని చెప్పఁగాఁ గోపమున మండి కన్నుల నిప్పులురాల నీ వీక్షణమునందే పొమ్ము. రాజునకుఁ జెప్పుము. నిలువకు-పోపో.)

క. ఈ నిమిషంబునఁ జెప్పక, మానెదవా మీపురంబు•మండలమును రా
మానుజ! నిను నీయన్నల, మానక మీవంశములను•మాడ్చెదఁగనుమీ.

తా త్ప ర్య ము

(ఈనిమిషమునసే పోయి చెప్పకపోతివా, రామానుజా! చూడు మీపట్టణము-మీ రాజ్యమును నిన్ను మీయన్నలను మీవంశములను తప్పక మాడ్చివేసెదను.)

క. పెరిఁగెడి కింక శమింపఁగఁ, దరమా శపియింతు నిపుడ•తాళ నటన్నన్
బరుషము లగుముని వాక్కులు, సరణియు నిశ్చయముఁ దలఁచి•సౌమిత్రియెడన్.

అర్థములు. పెరిఁగెడి కింకన్=వృద్ధిపొందుచున్న కోపమును, తాళన్=సహింపను, నిదానింపను.

తా త్ప ర్య ము

(పెరిఁగి పోవుచున్న కోపమును నోర్చుకొన నాకు శక్యముగాదు. ఇప్పుడే శపించెద-తాళను. అనిపలుకఁగా కఠినములగు దుర్వాసముని మాటలతీరు, ఆయన నిశ్చయమును మనసునఁ దలఁచి లక్ష్మణుఁడు,)

క. ఏలా యిందఱు నాశిల, మేలు గదా నేనొకండె • మృతిఁ గను టని భూ
పాలునిఁ జేరం జని తా, వాలాయం బత్రిసుతుని•వాక్యము వినిచెన్. ౧౫౭

అర్థములు. నాశిల=నాశమైపోవ.

తా త్ప ర్య ము

(ఇందఱు నశించిపోవుట యెందుకు? నేనొక్కఁడనె మరణించుట మేలుగదా. యని తాను రాజుదగ్గఱకుఁబోయి, దుర్వాసుని మాటలను వినిపించెను.)

క. సౌమిత్రివాక్యముల విని, రాముఁడు వీడ్కొల్పి కాలు•రయమున దుర్వా
సోమునిఁ జేరంజని ముని, సోమా! కార్యంబుఁ బలుకు • మొప్పుగఁ దీర్తున్.

తా త్ప ర్య ము.

(లక్ష్మణుని మాటలను విని రామచంద్రమూర్తి యమునిఁ బంపి, దుర్వాసుని దగ్గఱకు వచ్చి మునిచంద్రా! మీరు వచ్చినపని యేమి? చేసెద సెలవిండు.)

చ. అనవుడు వేయివత్సరము•లద్భుతనిష్ఠఁ దపంబుఁ జల్పితిన్
జనవర! యిప్పుడే ముగిసె•సర్వము, క్షుత్తు సహింపఁ జాల భో
జన మిడు మున్న మాత్ర మన • న్నావిభుఁ డామునికిన్ సుధోపమం
బును రుచిరాన్నముం గుడువఁ•బూర్ణముగానిడఁ దుష్టచిత్తుఁ డై. ౧౫౯౯

అర్థములు. క్షుత్తు=ఆఁకలి, సుధోపమంబును=అమృతముతో సమానము, రుచిరాన్నము=ఇంపైన భోజనము, తుష్టచిత్తుఁడై=సంతోషించిన మనస్సు గల వాఁడై.

తా త్ప ర్య ము

అని చెప్పఁగా దుర్వాసుఁ డిట్లనియె. వేయిసంవత్సరము లాహారము లేక కఠిన తపస్సు చేసితిని. అది యిప్పుడే ముగిసెను. ఆఁకలి సహింపలేకున్నాను. ఇప్పుడున్నంతమాత్రె మన్నము పెట్టుము అని చెప్పఁగా నా మునికి రామచంద్ర మూర్తి అమృతసమానమై యింపైన యన్నము పూర్ణముగాఁ గడుపునిండఁ బెట్టఁగా సంతోషించినవాఁడై.

తే. సంతసించితివనిమెచ్చి•చనియె స్వాశ్రమంబునకు రామవిభుఁడును•మనసునందుఁ
గాలువాక్యంబు నెంచి యా•గాక యింక,నిఖలసంహార వేళయన్•నిశ్చయమున.

అర్థములు. నిఖిలసంహార వేళ=సర్వము సంహరించు సమయము, భ్రాతృ భృత్య మిత్ర బంధువులు లోనగు వారి నందఱను తనతోడఁ దీసికొనిపోవు సమయమున.

తా త్ప ర్య ము

సంతోషపడితిని-అని రామచంద్రమూర్తిని మెచ్చుకొని తన యాశ్రమము నకుఁ బోయెను. రామచంద్రమూర్తి తన మనసులోఁ గాలునివాక్యములను దలఁచు కొని యింక సర్వసంహార సమయమనెడి నిశ్చయమున.)

## లక్ష్మణుఁడు శ్రీరామునితోఁ దన్ను వధించి సత్యము రక్షింపు మని చెప్పుట

క. దీనుఁ డయి మోము వ్రాలిచి, మౌనంబు వహించి గ్ర స•మిహికాకరుచం
ద్రాన విగత తేజుండౌ, మానవపతి లక్ష్మణుండు•మధురోక్తులతోన్. ౧౬౦౧

అర్థములు. దీనుడయి=దుఃఖముతో గూడినవాఁడయి, లక్ష్మణుని జంప వలసి వచ్చెఁగదాయని దుఃఖము, గ్రస్త=రాహువుచే గ్రహింపఁబడిన, మిహికాకరు=చంద్రుని, చంద్రానన్=విధముగ, విగతతేజుండు=తేజస్సుపోయినవాఁడు, మధురోక్తులతోన్=తియ్యని మాటలతో.

తా త్ప ర్య ము

లక్ష్మణుఁ జంపవలసి వచ్చెఁగదా యని దుఃఖముచే ముఖము వ్రాల్చి మాటాడక గ్రహణమునాఁటి చంద్రునివలె కాంతి హీనుఁడైన రామచంద్రుని జూచి లక్ష్మణుఁడు తియ్యని మాటలచే.

చ. అలసమనంబుతో నను మ • దర్థ మిటేల మహానుభావ! చిం
తలఁ దపియింపఁ? బూర్వనియ • తం బగు కర్మముచే నిబద్ధమై
చెలఁగెడి కాల మిప్పగిదిఁ • జేసెఁ, నన్ను వధించి సత్యమున్
నిలుపుము, బాస తప్పుధర•ణీజనముల్ నరకంబునం బడున్. ౧౬౦౨

అర్థములు. అలరు మనంబుతోన్=సంతోషముతోఁ గూడిన మనస్సుతో, మదర్థము=నాకొఱకు, పూర్వనియతంబు=ముందే నియమింపఁబడినది, నిబద్ధమై=ఏర్పాటుచేయఁబడినదై, కట్టఁబడినదై, బాస=మాట, లక్ష్మణుఁడు తన వియోగము సుమంత్రునివలన ముందే వినియున్న వాఁడగుటచే వ్యసనపడ లేదనిభావము.

తాత్పర్యము

మహానుభావా! నన్నుఁ జంపవలసి వచ్చెనని నా నిమిత్తమై నీ వేల వ్యసన పడెదవు? ముందే యేర్పాటుచేఁ గట్టబడిన కాల మిట్లు తటస్థించెను. ఇది యాకస్మికముగ వచ్చినది కాదు. ముందే యిది యిట్లు జరగవలయునని యేర్పాటు చేయబడిన విషయము. కావున నన్నుఁ జంపి నీవు సత్యము కాపాడుము. మాట తప్పువారు నరకమునఁ బడుదురు.

ఉ. నన్నుఁ బ్రసాదదృష్టులఁ గ • నన్ మది గల్గిన యేని, నాపయిన్
సన్నుతశీల! నీకు దయ • చాలఁగఁ గల్గిన యేని నన్నయా!
నన్నుఁ వధింపుమీ యిపుడ•నర్మిలి మానుము ధర్మవర్ధనం
బున్నెఱి గూర్పుమీ, హృదయ•ముం బదిలం బొనరింపుమీ యనన్. ౧౬౦౩

అర్థములు. ప్రసాద దృష్టులన్=అనుగ్రహముతోఁ గూడిన చూపులతో, నర్మిలి=ప్రేమ, ధర్మవర్ధనంబున్ = ధర్మముయొక్క యభివృద్ధిని, పదిలము=దృఢము.

తాత్పర్యము

అన్నా! నాయందు నీకు ననుగ్రహము గలదేని నామీఁద నీకు నిండుదయ గలదేని నాపయి ప్రేమ వదలి యిపుడే చంపుము; ధర్మమును వృద్ధినొందింపుము హృదయము దృఢపఱచు కొనుము.

క. చలితేంద్రియుఁడై రాముఁడు, వలనుగ మంత్రులఁ బురోధుఁ•బనిచెం బిలువన్
తెలిపెను దాపసితోఁ దాఁ, బలికిన బాసయును సత్రి•ప్రభవుని రాకన్. ౧౬౦౪

అర్థములు. చలితేంద్రియుఁడై=చలించిన మనస్సు గలవాఁడై.

తాత్పర్యము

మనస్సు చలించినవాఁడై రామచంద్రమూర్తి మంత్రులను బురోహితుని వసిష్ఠుని బిలిపించి తపస్వితోఁ దాను జేసిన ప్రమాణము, దుర్వాసుఁడు వచ్చుట తెలిపెను.

## —* వసిష్ఠవాక్యంబున శ్రీరాముఁడు లక్ష్మణుని విడనాడుట *—

క. సోపాధ్యాయులు మంత్రులు, భూపాలకువాక్యజాల•మును వినుచుండన్
తాన్మపతితోడ వసిష్ఠుం, డీపగిది వచించె మున్న•దృష్టం బివియున్. ౧౬౦౫

తా త్ప ర్య ము

ఉపాధ్యాయులతో మంత్రులు రామచంద్రమూర్తి వాక్యములు వినుచుండఁగా వసిష్ఠుఁ డిట్లనియె. రామచంద్రా! యీ సందర్భములిట్లు వచ్చునని ముందు తెలిసిన విషయమే. క్రొత్తగా నాకస్మికముగ వచ్చినవి కావు. నాతపోబలమునను నాయాశ్రమమున దుర్వాసుఁడు దశరథునకుఁ జెప్పిన మాటల వలనను నాకుఁ దెలియునని భావము.

క. సౌమిత్రిని నీ విడుటయు, రామా! నీక్షయముఁ గానఁ•గ్రచ్చఱ విడుమీ
యీమహితగుణునిఁ దమ్ముని ధీమండిప! కాలబలము•దెలియని యదియే.

అర్థములు. నీక్షయము=నీవును పోవుటయు.

తా త్ప ర్య ము

(రామా! లక్ష్మణుని వదులుటయనఁగా నీవు పోవుటయేకాన, గొప్ప గుణములుగల నీ తమ్ముని తత్క్షణము వదలివేయుము. కాలముయొక్క బలము నీకుఁ దెలియనిదా.)

అ. వ్యర్థపఱుపరాదు • ప్రతినను ధర్మజ్ఞ! పలికి తప్ప ధర్మ•విలయ మొదవు
ధర్మనష్టమునను•దైత్రిలోక్యమును జరా, చరము లమరమౌని•చయముఁగూలు.

తా త్ప ర్య ము

(ధర్మము తెలిసినవాఁడా! చేసిన ప్రతిజ్ఞ తప్పరాదు.ఆడి బొంకిన ధర్మము నశించును. ధర్మము నాశమైనందు వలన మూఁడు లోకములు; చరాచరప్రాణులు దేవతలు మునుల సమూహము నశించును.)

క. త్రైలోక్యరక్షణార్థము, పాలింపఁగ ధర్మపథము • భ్రాతను విడుమీ
మేలు ఘటింపుము జగతికి, నా లక్ష్మణుఁ జూచి ధర్మ•నయపరుఁ డనియెన్.

అర్థములు. భ్రాతను విడుమీ=తమ్ముని నీయొద్ద నిఁక నుంచుకొనక వదలిపెట్టుము చంపవలసిన పనిలేదు.

తా త్ప ర్య ము

(మూఁడు లోకములను రక్షించుట కొఱకు ధర్మమార్గమును బాలించుటకుఁ దమ్ముని వదలివేయుము, జగమునకు మేలుచేయుము-అని చెప్పఁగా ధర్మనీతియందాసక్తిగల రామచంద్రమూర్తి లక్ష్మణుని జూచి చెప్పెను.)

క. చెడకుండ ధర్మనిధి నిను, విడిచితి సౌమిత్రి నాదు•ప్రియసోదరుఁడా!
పుడమిని సాధుల కిష్టుల, విడుచుట చంపుటయు నొక్క•విధమై యునికిన్.

తాత్పర్యము

ప్రియసోదరుఁడా! సత్యవాక్య పరిపాలన మను ధర్మమును రక్షించు కొఱకు నిన్ను వదలితిని. చంపుమనికదా కాలునితో నీవు ప్రతిజ్ఞ చేసితి వందువేమో. సాధువులగు వారికి నిష్టుల వదలి పెట్టుట వారిని జంపుటతో సమానము కావున నిన్నుఁ బొమ్మనుట నిన్నుఁ జంపుటే.

## —• లక్ష్మణుఁడు మేనితో దివంబున కేగుట •—

సీ. రాముని వాక్యముల్•సౌమిత్రి యాలించి, కన్నుల నీరులు•గార్చి యపుడ
తనగృహంబున కైనఁ•జనక చక్కఁగఁబోయె, సత్వరుండగుచును•సరయుకడకు
నంబువు లార్చి కృ•తాంజలి యగుచును, నఖిలేంద్రియంబుల•నాఁక గొనుచు
నూరుపు బిగియించి•యుండ సశక్రాప్సరోగణంబులు సుర•పూగములును
ఆ. పువ్వువృష్టి గురియ•బురుహూతుఁ డెవరికిఁ, గానరాక వచ్చి•కడుబలాఢ్యుఁ
డనువుతో సుమిత్ర•తనయుని గ్రహియించి, త్రిదివమునకుఁ జనియె•దివ్యులలర.

అర్థములు. కన్నుల నీళ్ళులు గార్చి=జీవించి యుండఁగానే రామకైంకర్యము విడువవలసి వచ్చెఁగదా యని వ్యసనమున, వార్చి = ఆచమించి, ఆఁక గొనుచు=నియమించి, ఊరుపు బిగియించి=కేవల కుంభకమందుండి, సురపూగములు=దేవతాసమూహములు.

తాత్పర్యము

లక్ష్మణుఁడు రామచంద్రమూర్తి వాక్యములనువిని రామచంద్రవియోగము సహింపలేక కన్నీరుగార్చి వెంటనే తన యింటికైనఁ బోక భార్యకైనఁ జెప్పక సరయువు నొద్దకుఁ ద్వరగాఁ బోయెను. ఇట్లు పోయి యేటినీట నాచమించి చేతులు జోడించి యింద్రియముల నియమించి యేకాగ్రమనమున కేవలకుంభకమున నుండఁగా నింద్రునితోఁడ నప్సరసలును దేవతలును ఆయనమీఁదఁ బూలవాన గురియించిరి. ఎవరికిఁ గానరాక యుండ నింద్రుఁడు వచ్చి శరీరము తోడ లక్ష్మణుని గ్రహించి స్వర్గమునకుఁ దీసికొని పోయెను.

ఇట్లు చెప్పుటచే నీ లోకమందలి శరీరమే స్వర్గలోకమందలి శరీరమని యేర్పడెను. దానివలన నీశరీరమును విడిచి వేఱొక శరీరము గ్రహింపలేదని సూచితము. దివ్యశరీరముతోనే భూలోకమునఁ గానవచ్చు చుండెను..

కడుబలాఢ్యుననుటచే నిచ్చట దేహబలమునకుఁ బ్రసక్తిలేదు కావున యోగబలముచేఁ గానరాక పోఁగా నింద్రుఁడు వచ్చి పిలుచుకొని పోయెనని యైనఁ జెప్పవచ్చును.

క. వెన్నునినాలవభాగం,బు న్నిర్జరవరులు స్వర్గ♦మును జేరంగాఁ
గన్నారఁగాంచి మిక్కిలి, మన్ననఁబూజించి రెల్ల♦మౌనులతోడన్. ౧౬-౧౧

అర్థములు. వెన్నుని నాలవభాగము=విష్ణువు చతుర్థాంశము, మూఁడు బాల కాండ ౪౭-౨వ పద్యము. వెన్నుని నాలవభాగము.

వెన్నుని నాలవభాగము, శేషసుపర్ణ విష్వక్సేన విష్ణురూపములను నాలుగు రూపములలో నాలుగవ భాగమగు శేషుఁడు లక్ష్మణుఁడనియు,సుపర్ణుఁడు భరతుఁ డనియుఁ, విష్వక్సేనుఁడు శత్రుఘ్నుఁడనియు, విష్ణువు రామచంద్రమూర్తి యనియు రహస్యార్థము. ఈ కారణము చేతనే లక్ష్మణుఁడు శేషుఁడని పురాణాం తరము లందు జెప్పఁబడెను. సర్వేశ్వరుఁడు అనంత గరుడ విష్వక్సేన విష్ణురూప ముల నాలుగు వ్యూహములుగా నుండునని తెలియవగు. గోవింద రాజీయము కతక వ్యాఖ్యయు దీనినే యనుమోదించెను గాని తిలకవ్యాఖ్య గరుఁడుడు న్యాయ ముగ వచ్చినట్లు యుద్ధకాండ మం దుండుటచే భరతుఁడు గరుడుఁడను విషయము నంగీకరింప లేదు కతకాభిప్రాయమున కిది విరోధింపదని సత్యతీర్థి వ్యాఖ్య.

తా త్ప ర్య ము

(విష్ణు దేవుని నాలుగవభాగము(అనగా లక్ష్మణుడు) స్వర్గమును జేరఁగా దేవతలు గన్నులార జూచి మిక్కిలి గౌరవముతో మునులతోఁగూడి పూజించిరి.)

## —♦ శ్రీరాముఁడు మహాప్రస్థానం బేగ నిశ్చయించుట ♦—

సీ. సౌమిత్రి విడనాడి♦ సంతాపభరమున, సచివ పురోహిత♦జానపదుల
నెల్లరఁ గనుఁగొని ♦ యిప్పు డయోధ్యకు, రాజుగా భరతు ధ♦ర్మప్రతాప్య
పట్టాభిషేకంబు ♦ పరఁగించి లక్ష్మణుఁ, డేగిన గతికి నే♦ నేఁగువాఁడ
జతఁగూర్పుఁడీ! సర్వ♦సంభారముల నన, శిరములు వ్రేలని ♦ర్జీవులట్లు
తే. యయిరి పౌరులు నిశ్చేష్టు♦లగుచు భరతుఁ డాత్మఁ గోయుచు రాజ్యంబు♦నన్న కనిరొ
నిన్ను విడనాడి నిర్జర♦నిలయమైనఁ, గోర నాకేల రాజ్యంబు ♦ గుణధురీణ!

అర్థములు. సచివ పురోహిత జానపదులన్=మంత్రులను బురోహితులను గ్రామముల వారిని, నిర్జీవులట్లు=ప్రాణములేని వారివలె, నిర్జరనిలయము=దేవ లోకము.

తా త్ప ర్య ము

లక్ష్మణు వదలిపెట్టి మిగులఁ బరితాపపడుచు మంత్రులను బురోహితులను గ్రామజనుల నందఱఁ జూచి రామచంద్రమూర్తి ధర్మప్రవర్త సంపత్తి గల భరతుని రాజ్యమునకుఁ బట్టాభిషిక్తునిఁ జేసి నేను లక్ష్మణుఁడు పోయిన త్రోవ బోయెదను. దానికిఁ గావలసిన పదార్థములు సేకరింపుఁడని చెప్పఁగా నందఱు ప్రాణములేని

వారినలైరి. అప్పుడు భరతుఁడు రాజ్యమును గుఱించి మనస్సున నసహ్యించు కొని యన్నతో నిన్ను విడనాడిన విమ్మట స్వర్గము లభించినను నాకేల? ఇఁక నీరాజ్యము మాట చెప్పనేల?

క. సత్య మిది రామచంద్రా!, సత్యముపైఁ బలుకువాఁడ శపథము నీయా
పత్యముఁ గుశుఁ గోసలమున, నిత్యంబుగ నుత్తరమున ♦ నిలుపుము లవునిన్.

అర్థములు. నీయాపత్యము= నీ కుమారుని.

తా త్ప ర్య ము

(రామచంద్రా! యిది సత్యము. సత్యముపైఁ బ్రమాణముచేసి చెప్పు చున్నాను. నీ కొడుకు కుశుని దక్షిణకోసలమునకు, లవుని నుత్తరకోసలమునకు నభిషిక్తుఁ జేయుము.

క. దూతల శత్రుఘ్నుం డిట, కేతేరఁగఁ బంపవయ్య ♦ యిపుడు వెస యథా
రీతిని గమనముఁ దెలుపఁగ భూతలవర! యంచుఁ బలుక ♦ జనసంఘంబుల్.

తా త్ప ర్య ము

(రాజా! శత్రుఘ్నునకుఁ బ్రయాణము సంగతి యథారీతి తెలిపి యిచ్చ టకుఁ దీసికొని వచ్చుట కిప్పుడే త్వరగా దూతలను బంపుమని చెప్పఁగా జనసమూ హములు.)

చ. శిరములు వ్రేల వైచి తుద ♦ చెప్పఁగరానిభృశార్తిఁ గుందుటల్
భరతుని వాక్యముల్ కని త ♦ లంచి రఘూత్తముతో నరుంధతీ
వరుఁ డిటు పల్కెఁ దండ్రి! యదె ♦ పౌరులఁ జూడుము వీరికోర్కె నీ
వరసి తదిష్టముం జలుప ♦ నర్హము నీకు మహాత్మ! నావుడున్. ౧౪-౧౫

అర్థములు. అరుంధతీవరుఁడు=వసిష్ఠుఁడు.

తా త్ప ర్య ము

(తలలు వ్రేలవైచి యంతము గానరాని మిక్కిలి దుఃఖముతో దుఃఖ పడుట, చూచి. భరతుని మాటలు తలఁచి, రామచంద్రమూర్తితో వసిష్ఠుఁడు తండ్రీ! యిదిగోఁ బౌరులను జూడుము. వీరికోరిక విచారించి వీరికోరిక తీర్చుట మహాత్మా! నీకుఁ దగిన కార్యమని చెప్పఁగా.)

తే. నేలఁ బడియున్న వారల ♦ లేల నెత్తియేల యీచింత మీకు మ ♦ దిష్టులార!
యేమి సేయంగవలయు మీ ♦ కెల్లరకును? దెలియఁజెప్పుఁడు మీమది ♦ తెలఁగటన్న.

తా త్ప ర్య ము

(నేలమీఁదఁబడి దుఃఖించుచున్న పౌరులను జూచి వారలను లేవనెత్తినా, కిష్టులైన ప్రజలారా! మీ కేలవిచారము? మీ మనస్సులో నున్న విషయమును దెలుపుఁడు-మీకు నేనేమి చేయువలెను-అని యడుగఁగా.)

—• శ్రీరామునివెంటఁ బోవఁ బౌరులనుజ్ఞ గోరుట •—

క. రాముని వాక్యములను విని, భూమిజను లేక వాక్య•ముగ నిట్లని రో
రామా! నీయేగెడు నెడ,కే మరుదెంచెదము వెంట•నిదు మీవరమున్. ౧౬-౧౭

తాత్పర్యము

(రామచంద్రమూర్తి మాటలను విని ప్రజలందఱేకవాక్యముగా రామా! నీవు పోవుచోటికి నీ వెంట మేమును వచ్చెదము-మాకీవరమిమ్ము.)

క. పౌరతతిమీఁద, నీమెడఁ గూరిమి నెయ్యంబు గలిగి•కొలిచెద వేనిన్
దారలతోఁ బుత్రులతో, వారక నీచనెడి త్రోవ•వత్తుము దేవా! ౧౬-౧౮

అర్థములు. పౌరతతిమీఁదన్=పురజనుల సమూహము మీఁద.

తాత్పర్యము

(పురజనుల సమూహముమీఁద నీకుఁబ్రేమ స్నేహము పూర్ణముగ నుండె నేని దేవా! ఆలు బిడ్డలతో నీవు పోయెడి దారిని మేము తప్పక వచ్చెదము.)

తే. తోలఁగక తపోవనమందొ•దుర్గమునినొ, యేటినీటనొ కాక ము•న్నీటియందొ
యెందుఁజొచ్చిననీవు మే•మందుఁజొత్తు,మీశ్వరా! మమ్మెదో•డ్కొని•యేగు వెంట.

తాత్పర్యము

(నీవు తపోవనమునకే పోయెదవో, దుర్గమునందే యుండెదవో యేటి నీటలోనో సముద్రములోఁ జొచ్చెదవో నీ వెంట మేమును నందుఁజొచ్చెదము ప్రభో! మమ్ము నీ వెంట తోడుకొని పొమ్ము.)

క. ఇదె మాకు బరమవర మగు, నిదియే పర మంపుఁ బ్రీతి•యిందఱు దృఢమా
మదిఁ గోరిరి నిను వెనుకొన, సదయమతీ! తోడుకొనియె•చనఁ దగు ననుడున్.

తాత్పర్యము

(ఇదియే మాకు గొప్పవరము. ఇదియే పరమప్రేమ. ఇందఱు గట్టి మనస్సుతో నీ వెంట వచ్చుటకుఁ గోరుచున్నారు. దయాశాలీ! తీసికొనియే పోవలెనని చెప్పఁగా.)

సీ. పౌరవర్గముదృఢ•భక్తిఁ గనుంగొని, యట్ల చేయుదు నని • యాడి యపుడు
కర్తవ్యముల నెంచి•కలఁగక కావించి, కుశు నిల్పి దక్షిణ•కోసలమున
లవుని నుత్తరకోస•లంబున నిలిపి పట్టాభిషేకంబుల • నాచరించి
కొడుకుల నిద్దఱఁ • దొడలపైఁ జేరిచి, మూర్ధంబు ప్రీతిమై•మూరుకొనుచుఁ

తే. గౌఁగిటను గ్రుచ్చి పదివేల•కరుల నరద,ములను వేలను ఘోటక•ములదశాయు
తముల వేర్వేఱ యిచ్చి ర•త్నముల విత్త,ములను హృష్టసుపుష్ట పౌ•రులనుగలుగు.

అర్థములు. కర్తవ్యములన్=చేయవలసిన పనులను, కలఁగక=మనసున చింత లేక.

తే. పట్టనములకు వారలఁ♦బంచి లక్ష్మ, ణానుజుని దోడితేర దూ♦తాళిఁ బంప
వారుమూఁడహో రాత్రముల్♦బాటనిలక, తూర్ణముగ నేగిమథురశ♦త్రుఘ్నుగాంచి.

తాత్పర్యము

పురజనముల దృఢమైన భక్తినిఁజూచి మీరు కోరునట్లే నాతోడ మిమ్ముఁ దీసికొని పోయెదనని చెప్పి చేయవలసిన కార్యము లాలోచించి కుశుని దక్షిణకోసల మునకు, లవుని నుత్తరకోసలమునకు రాజులుగాఁజేసి వారికిఁ బట్టాభిషేకంబు గావించి కొడుకుల నిద్దఱను దొడలపైఁ గూర్చుండఁబెట్టుకొని శిర స్స్వాఘ్రాణించి కౌఁగిలించుకొని యొక్కొక్కనికి పదివేల యేనుఁగులు వేయి రథములు మూఁడు వేల గుఱ్ఱములను వేఱు వేఱుగ నిచ్చి రత్నములు ధనములు హృష్టులు పుష్టులు నగు జనములు గల పట్టనములకు వారిని బంపి శత్రుఘ్నుని బిలుచుకొని వచ్చుటకు దూతలఁ బంపఁగా వారు దోవలో నిలువక మూఁడు రాత్రులు మూఁడుపగళ్ళు ప్రయాణముచేసి మధురకుఁ బోయి శత్రుఘ్నుని జూచి.

—♦ శత్రుఘ్నుఁడు కొడుకులకుఁ బట్టాభిషేక మొనర్చి యయోధ్యఁ జేరుట ♦—

సీ. రాముని ప్రతినయు♦రాముఁడు లక్ష్మణుఁ, బాయుటయును పౌర♦వర్గ మెల్ల
జనపతి వెంటన ♦ చన నిశ్చయించుట, యభిషేకములఁదీర్చి♦యాత్మజులకుఁ
గుశునకు వింధ్యాద్రి♦కూలంబునను గుశా,వతి యనుపట్టన♦వరము నిచ్చి
శ్రావస్తి లవునకు♦రాజధానిగఁ జేసి, విజనంబుగ నయోధ్య♦విడిచి రామ
తే. భరతులిర్వురు స్వర్గంబు♦పథముఁ జనెనీ,యత్నమున నున్నవారు మ♦హాత్మ!నీవు
వేగ చనుదెమ్మటన్న నా♦వీరవరుఁడు,కులముకూలంగ నుండుట♦తెలిసియపుడ.

తాత్పర్యము

రాముఁడు తపసితోఁజేసినఁ ప్రతిజ్ఞ, యాప్రతిజ్ఞప్రకారము లక్ష్మణుని వద లుట పురజను లందఱు రాముని వెంటఁబోవ నిశ్చయించుట కొడుకుల కభిషేకము చేసి వింధ్యపర్వతము నొద్ద కుశావతి యను పట్టనమును కుశునకు శ్రావస్తి లవు నికి రాజధానులుగ నిచ్చి యయోధ్యను మనుష్యులు లేనిదిగఁజేసి రామభరతు లిద్దఱు స్వర్గమునకు బోవనున్నారని - నిన్ను రమ్మనినారు-వేగముగ రమ్మని చెప్పఁగా నా శత్రుఘ్నుఁడు కులము కూలిపోవ నున్నదని తెలిసి వెంటనే.

ఉ. పౌరుల నెల్లరం బిలువఁ ♦ బంచి పురోహితుఁ గాంచ నాఖ్యునిం
జేరఁగఁ జీరి వారలకుఁ ♦ జెప్పి సమస్తము రామవృత్తమున్
వారలతోడ వేగతుల ♦ ప్రాప్తిలు నాకని రాజ్య మంతయున్
గూరిమి నాత్మపుత్రకుల♦కుం దగఁ బంచి కృతాభిషేకులన్. ౧౬-౨౪

తాత్పర్యము

(పౌరుల నందఱను రావించి, కాంచనుఁడను దన పురోహితుని బిలువనంపి, రాముని వృత్తాంతమంతయు వారలకుఁ జెప్పి, నాకును వారితోడ గతుల్ ప్రాప్తించు నని తన రాజ్యమంతయును దన కొడుకులకుఁ బంచి వారిని రాజులగా నభిషేకించి.)

తే. చేసి మథుర సుబాహు వన • జ్యేష్ఠసుతున, కిచ్చి వైదిశ మనుపురి • నిచ్చె శత్రు
ఘాతి యనియెడి సుతునకుఁ గలబలంబు, స్వమ్మునటులె సమముగఁ • బంచి రొనఁగి.

తాత్పర్యము

మథురను తన పెద్ద కొడుకగు సుబాహువను వారికి వైదిశమను నగరము ఘాతి యనియెడి రెండవ కొడుకున కిచ్చి ధనము సేన యట్టులే పంచియిచ్చి.

తే. ఒంటిరథముగ నేగి య • యోధ్యకందు జిలుఁగుఁ దెల్లనినుఁ, బట్టుఁ • జేలఁ దాల్చి
సంజ్వల త్పావకునిఁబోలి • సంయమీంద్ర, వరులమధ్యంబునందున్న • భ్రాతఁ గనుచు.

అర్థములు. ఒంటిరథముగన్=తన్నుఁ బిలువ వచ్చినవారు తప్ప మథుర వా రెవ్వరిని దోడఁదీసికొనక, జిలుఁగు దెల్లని నునుబట్టుచేల=సన్నని తెల్లనిపట్టు వస్త్రము, సంజల త్పావకునిఁబోలి=మండుచున్న యగ్నివలె, సంయమీంద్రవరుల మధ్యంబునన్=మునీంద్రుల నడుమ.

తాత్పర్యము

(తా నొంటిగా రథమెక్కి యయోధ్యకు వచ్చి యచ్చట సన్నని తెల్లని పట్టు వస్త్రము ధరించి మునీంద్రుల నడుమ మండుచున్న యగ్నివలె నున్నయన్న గారిని జూచుచు.)

తే. మ్రొక్కి-నిలఁబడి చేతులు • మోడ్చి ధర్మ, మర్మవిదుఁబల్కె రాముని • ధర్మవిధిని
సుతుల కభిషేక మొనరించి • హితవిధాన, నిన్ను వెన్కొనఁ బఱచితి • నిర్మలాత్మ!

తాత్పర్యము.

(మ్రొక్కి, నిలువఁబడి, చేతులు కట్టుకొని, ధర్మ రహస్య మెఱిఁగిన రామ చంద్రమూర్తితో ధర్మము ననుసరించి నా కొడుకులకుఁ బట్టాభిషేకముచేసి నీ వెంట వచ్చుటకుఁ బరుగెత్తుకొని వచ్చితిని-)

క. భవదనుగమనముఁ గోరెద, నవనీశ్వర! మనసునిశ్చయం బిది వింటె
యెవి యడ్డంబులు చెప్పకు, నవురుగ నీయాజ్ఞఁ జనఁగ • సమ్మతి పడెదన్.

అర్థములు. భవదనుగమనము=నీవెంట వచ్చుటకు.

తాత్పర్యము

(రాజా! మీవెంట వచ్చెదను. నా మనస్సులోని నిశ్చతాభిప్రాయ మిది. నీ వే యడ్డములు చెప్పకుము-నీ యాజ్ఞ ననుసరించి చేయ సమ్మతించెదను.)

క. అనవుడు రామమహీంద్రుం, డనుజాతునితోడ నట్లయౌత మటంచున్
జనవునఁ బలుకఁగ నీలో, వనచర భల్లూకతతులు బలలాశివరుల్. ౧౬-౨౯

అర్థములు. వనచరభల్లూకతతులు=వానరులు, ఎలుఁగులు వీరి సమూహములు, పలలాశివరుల్=రాక్షసశ్రేష్ఠులు, విభీషణునికి సంబంధించినవారు.

తాత్పర్యము

(అని చెప్పఁగా, రామప్రభువు తమ్మునితోఁ నట్లే కానిమ్మని ప్రేమతోఁ జెప్పఁగా, నీ లోపల వానరులయు నెలుఁగులయు సమూహములు విభీషణునికి సంబంధించిన రాక్షసశ్రేష్ఠులు.)

—• సుగ్రీవ విభీషణాదులు శ్రీరాముని జూడవచ్చుట •—

ఉ. వచ్చిరి గుంపు గుంపుగను వారిజమిత్ర సుతుండు మున్నుగా
సచ్చరితున్ రఘూత్తముని స్వర్గమనాభిముఖుం గనుంగొనన్
వచ్చి మహాత్మ! నీబడిని వచ్చెద మిందఱ మెందుఁ బోయినన్
మచ్చిక మమ్ముఁ నెల్లఁ గొని మానక సత్కృపఁ బోఁ గదే నృపా! ౧౬-౩౦

అర్థములు. వారిజమిత్రసుతుండు=సుగ్రీవుఁడు, స్వర్+గమనాభిముఖున్=వైకుంఠమునకుఁ బోవఁబూనిన వానిని, నీ బడిని=నీ వెంట.

తాత్పర్యము

(వైకుంఠమునకుఁ బోవఁబూనిన సచ్చరిత్రుఁడు శ్రీరామచంద్రమూర్తినిఁ జూచుటకు సుగ్రీవుఁడు మున్నుగా గుంపు గుంపుగా వచ్చిరి. వచ్చి మహాత్మా! నీ వెచ్చటకుఁ బోయిన నిందఱము నచ్చటకు వచ్చెదము – మమ్మందఱఁ బ్రేమ మీఱ విడువక మేలి కృపతో నీవు తీసికొని పొమ్ము.)

క. మముఁ బాసి నీవు పోయిన, యమదండముపాలఁ బడిన యట్లగుఁ బురుషో
త్తమ! మముఁ గావంగదవే, విమలమతీ! యనిన నవ్విభుఁడౌ నవఁగన్.

అర్థములు. యమదండము పాలఁబడిన యట్లగున్=నరకమున యమునిచే శిక్షింపఁబడిన వారివలె నగును, ఔనవఁగన్=అంగీకరింపఁగా.

తాత్పర్యము

(మమ్ము విడిచి పోయినచో నరకమున యమునిచే శిక్షింపఁబడిన వారివలె, నగును–కావున మమ్ముఁ గావుము. అని చెప్పఁగా నవ్వి రామచంద్రమూర్తి యంగీకరింపఁగా.)

ఉ. అంతట వానరప్రవరుఁ డంగను నిల్పి ధరాధిపత్యమం
దెంతయుఁ గోరి మీబడిగ నే నరుదేరఁగ నిశ్చయించి దై
త్యాంతక! వచ్చినాఁడ నను న్యాయముగాదు విడంగ నన్నఁ దా
స్వాంతములోన నాప్లవగ వల్లభమైత్రిఁ దలంచి యిట్లనున్. ౧౬-౩౨

అర్థములు. వానర ప్రవరుఁడు=సుగ్రీవుఁడు, ధరాధిపత్యమందున్=రాజ్య పరిపాలనమందు.

తాత్పర్యము

(అంతట సుగ్రీవుఁ డంగదుని వానరరాజ్యమునకు రాజుగా నభిషేకించి మీతో వచ్చుటకు నిశ్చయము చేసికొని వచ్చినాఁడను. నన్ను విడిచిపోవుట న్యాయ్యముగాదు. అని చెప్పఁగా నా సుగ్రీవుని స్నేహమును మనస్సులోఁ దలఁచుకొని యిట్టులనెను.)

క. ఘనమిత్రమ! సుగ్రీవా!, నినుఁ బాసి చనంగ నొల్ల • నే నెం దేనిన్
వినుదేవలోకమునకేన్, వనచరరాజేంద్ర! పరమ•పదమున కేనిన్. ౧౦-౩౩

అర్థములు. దేవలోకమునకేన్=స్వర్గమునకైనను, పరమపదమునకైనన్=వైకుంఠమునకైనను.

తాత్పర్యము

(ఘనమైన స్నేహితుఁడా! సుగ్రీవా! వానరరాజా! విను, నిన్ను విడిచిస్వర్గమునకైనను, వైకుంఠమునకైనను మఱెందైనను బోవ నిష్టపడను.)

—• శ్రీరాముఁడు హనుమద్విభీషణాదులకు వరంబు లిచ్చుట •—

సీ. అని విభీషణుఁ జూచి•యబ్జాక్షుఁ డిట్లను, రాక్షసనాయకా!•ప్రజలు ధరణి
యుండెడిదాఁక నీ వుండుము మేనితో, లంకాపురమున ని•శ్శంకమతిని
చంద్రుండు సూర్యుండు•క్ష్మాచక్ర మెల్లను, నాకథ యెందాఁక•లోకమునను
దలఁపఁ గ యుండునం•దాఁక నీ వుండుము, రాజవై స్నేహకా•రణముఁ జేసి
ఆ. పలికినాఁడ నీవు • పాలింపు నారాజ్ఞ, బదులు పలుకవలదు•ప్రజల నేలు
ధర్మ మాచరింపు తలఁగకు•మందుండి యేమి చెప్పువాఁడ•నింక నీకు. ౧౦-౩౪

తాత్పర్యము

(అని విభీషణుని జూచి రామచంద్రమూర్తి యిట్లనెను. రాక్షసరాజా! ప్రజలు భూమి యెందాఁకనుండునో యందాఁక నీవు శరీరముతో లంకాపట్టణమున జంకులేక యుండుము. చంద్రుఁడు, సూర్యుఁడు, భూలోకమంతయును, నా కథ యెంతవఱకు స్థిరమై యుండునో యందాఁక నీవు రాజవై యుండుము. నీయందలి స్నేహముచేఁ జెప్పితిని-నేను జెప్పినట్లు చేయుము-మాటాడవలదు-ప్రజలను బరిపాలనము చేయుము. ధర్మమాచరింపుము-ధర్మము తప్పకుము- ఇఁక నీకు నేనేమి చెప్పుదును?)

క. స్వారాణ్ముఖ సకల సుధా,హారులు కారాధనీయు•ననిశం బిక్ష్వా
క్వారాధిత కులదైవము, నార జగన్నాథు నీవు నర్చింపు తమిన్. ౧౦-౩౫

అర్థములు. స్వారాణ్ముఖ=ఇంద్రుఁడు మొదలుగాఁ గల, సకలసుధాహారుల కున్=దేవతల కందఱకు, ఆరాధనీయున్ = పూజింపఁ దగిన వానిని, ఇక్ష్వాక్వారాధిత=ఇక్ష్వాకునిచేఁ బూజింపఁబడిన, కులదైవము=ఆయనవంశము వారి వేల్పు, జగన్నాథున్=విష్ణువును, ఈయనయే శ్రీరంగనాథుఁడు.

'ఇత్యుక్త్వాథ స కాకుత్థ్సః స్వార్చ్యం విష్ణుం సనాతనమ్,
శ్రీరంగశాయినం సౌమ్య మిక్ష్వాకుకులదైవతమ్,
సుప్రీతః ప్రదదౌ తస్మై రామో రాజీవలోచనః' పాద్మము.

ఇట్లు చెప్పినవాఁడై రామచంద్రమూర్తి విభీషణు నంగలి ప్రీతిచే తా నారాధించుచున్న సనాతనుఁడగు విష్ణువు విగ్రహమును శ్రీరంగశాయిని నిక్ష్వాకు వంశము వారి యిలువేల్పును నిచ్చెను అని యర్థము. బ్రహ్మ విభీషణున కమరత్వ మిచ్చుటచే దానిని గౌరవింప విభీషణు నిలిపెను.

క. అనవుడు రాముని శాసనమును నాత్మఁ దలంచి యసుర • ముఖ్యుండౌ నం
చును గ్రహియించెను దశరథ తనయుని వాక్యంబు వినయ • తాత్పర్యములన్.

తా త్ప ర్య ము

(అని చెప్పఁగా రాముని యాజ్ఞను మనస్సులోఁ దలఁచుకొని విభీషణుఁడు మహాప్రసాదము అని రామచంద్రమూర్తి మాటను వినయము భక్తి కలిగి గ్రహించెను.)

ఉ. ఆవల రామభద్రుఁడు గు • ణాంబుధి వాయుజుఁ జూచి ప్రీతితో
జీవితమందు నాశ యెడ • సేయకు, మానకుమా ప్రతిజ్ఞ, యీ
భూవలయంబునందుఁ గపి • పుంగవ! మత్కథ యెంతదాఁకఁ బెం
పై విలసిల్లు నందనుక • హాయి రమింపుము మద్వచస్స్థితిన్. ౧౬-౩౭

అర్థములు. జీవితమందు నాశ=బ్రదుక వలయునను కోరిక, ఎడసేయకు= వదలి పెట్టకుము, ప్రతిజ్ఞ=నాకథ లోకములో నుండునంత వఱకు నుండఁగోరిన నీ ప్రతిజ్ఞ.

తా త్ప ర్య ము

(ఆవల గుణసముద్రుఁడు రామభద్రుఁ డాంజనేయునిఁ జూచి, ప్రేమతో. బ్రదుకవలయునను కోరిక వదలి పెట్టకుము. నాకథ లోకములో నుండునంతవఱకు నుండగోరిన నీ ప్రతిజ్ఞ మానవలదు. వానరశ్రేష్ఠా! యెంతదాఁక నా కథ యతిశయమై విలసిల్లునో యంతదాఁక నామాటప్రకారము హాయిగా నానందింపుము.)

చ. అనవుడుఁ జావమాని విన • యంబు దొలంకఁగ హర్ష వార్థిలో
మునుఁగుచు విన్నవించెఁ గడు • పుణ్యము త్వత్కథలోకమందుఁ బా
వనగతి నుండుదాఁక ధర • వర్తిలుచుందు భవన్ని దేశముం
గొని యన జాంబవంతు రఘు • కుంజరుఁ డట్ల వచించి యావలన్. ౧౬-౩౮

తాత్పర్యము

(అని చెప్పఁగా నాంజనేయుఁడు వినయాతిశయమున నానందసాగరమున మునుఁగుచు పుణ్యము. పుణ్యము మీకథ లోకములోఁ బావనమై యుండునందాఁక మీ యాజ్ఞ ననుసరించి భూమియందుండెదను. అని పలుకఁగా రామచంద్రమూర్తి జాంబవంతునితోఁ గూడ నట్లే చెప్పి తరువాత,)

తే. మైందు ద్వివిదుని నమ్మాడ్కి ♦ మందలించి,
బ్రహ్మసుతునితోడి యేవురఁ ♦ బలికెనిట్లు
ధరణిఁ గలివేళ ప్రాప్తించు ♦ దాఁక మీరు, జీవములతోడ నుండుఁడీ ♦ క్షేమముగను.

వీరు ద్వాపరాంతమున మరణించిరి.

తాత్పర్యము

(మైంద ద్వివిదుల కట్లే చెప్పి జాంబవంతునితో నైదుగురను నీ విధముగానే చెప్పెను. కలివచ్చునందాఁక భూమిమీఁద జీవములతో క్షేమముగానుండుఁడు.)

తే. అనుచు వచియించి తక్కిన ♦ వనచరాళి, భల్లుకంబులఁ గని మీరు ♦ వలచినట్ల
రండు నాతోడ నని పల్కి ♦ రాత్రిగడిపి తరణియుదయింప నిజపురో ♦ ధనునిఁ జూచి.

తాత్పర్యము

(అనుచుఁ బలికి తక్కిన క్రోఁతులగుంపును, ఎలుఁగులను జూచి మీరు కోరిన ప్రకారము నాతో రండని చెప్పి యారాత్రి గడపి ప్రొద్దుపొడువఁగాఁ దన పురోహితునిఁ జూచి.

## —♦ శ్రీరాముఁడు సకలప్రాణులతో మహాప్రస్థాన మేగుట ♦—

సీ. అగ్రజాతులతోడ ♦ నగ్నిహోత్రంబులు, తోలుతను బోనిమ్ము ♦ త్రోవలందు
వాజపేయచ్ఛత్రి ♦ వర్గంబు వలులుత, మన వసిష్ఠుం డట్ల ♦ యాచరించి
వైదికవిధి మహా ♦ ప్రస్థానికం బగు, కార్యము దీర్చి ♦ కడమవడక
యుండ శ్రీరామచం ♦ ద్రుండు సూక్ష్మాంబర, ధారి యై దర్భలఁ ♦ దాల్చి వ్రేళ్ళ
తే. సందులనుమాటలాడక ♦ న్యాయముగాఁగఁ,
బరమమగు బ్రహ్మమంత్రంబుఁ ♦ బఠన మొనర
జేసికొను చాత్మలోన ని ♦ శ్చేష్టుఁ డగుచు, మార్గసుఖములపై మది ♦ మరగనీక.

అర్థములు. అగ్రజాతులతోడ=బ్రాహ్మణులతో, మహాప్రస్థానము=మహాప్రయాణము, దీనిని బూనినవారు త్రోవలోఁ గూర్చుండరాదు. నిద్రాహారాదులు లేవు, దోవలో నీళ్ళువచ్చిన నిప్పులు వచ్చినను దానిలోఁబడి పోవలయునే కాని భయపడరాదు. కలికాలమున నిది నిషిద్ధము. సూక్ష్మాంబర ధారియై=సన్నని వస్త్రము ధరించినవాఁడై, బ్రహ్మమంత్రంబు=ప్రణవము నిశ్చేష్టుఁడు=నడచుట తప్ప మఱి యే కార్యము చేయనివాఁడు, ఇంద్రియముల నియమించినవాఁడు,

మార్గసుఖముల పైన్=ఇటు పోయిన ఱాలు కాళ్ళ తగులునే, అటు పోయిన బాగుండునే యను విచారము లేక

## తాత్పర్యము

(బ్రాహ్మణులతో నగ్నిహోత్రములు మొదటఁబోనీయవలెను. శ్రోవలందు వాజపేయ ఛత్రసమూహముండవలెను. అని చెప్పఁగా వసిష్ఠుడట్లే చేసి, మహాప్రయాణమునకు వైదికవిధానముగాఁ జేయవలసిన పనులు లోపము లేకుండఁ గావించి యుండఁగా, శ్రీరామచంద్రమూర్తి సన్నని వస్త్రము ధరించి, బ్రేళ్ళ దర్భలను దాల్చి స్వయముగా నడుమ నడుమ మాటలాడక, శ్రేష్టమగు ప్రణవము మనస్సులో జపము చేసి యింద్రియముల నియమించి దారి సుఖమును జూడక.)

సీ. దేప్యమానార్కు-ని • దిక్క-రించెడి కాంతిఁ, దనమందిరము వీడి • తరలుటయును
అపసవ్యదిశఁ బద్మ • హస్తయై శ్రీదేవి, హ్రీదేవి భజియింప • నెడమవంక
సంహారశక్తియుఁ • జనఁగ మున్నుగ శర, చాపముల్ పురుష • రూపములను
సకలాయుధావళుల్ • సరవిని గొలువంగ, బ్రాహ్మణాకృతులతోఁ • బరఁగ శ్రుతులు

తే. సర్వరక్షిణి గాయత్రి • చనఁగ వెంట
నోంకృతియును వషట్కా-ర • మొప్పఁ జుండ
బ్రాహ్మణులు ఋషులును రామ • భద్రు వెంటఁ
జనిరి వాకిండ్లు దెఱచిన • స్వర్గమునకు. ౧౬-౪.౨

అర్థములు. దీప్యమానార్కు-నిన్=ప్రకాశించుసూర్యుని, అపసవ్యదిశ=కుడివైపు, పద్మహస్తయై=పద్మమును చేతధరించినదై, శ్రీదేవి=లక్ష్మీదేవి, హ్రీదేవి=భూదేవి, 'హ్రీశ్చతే లక్ష్మీశ్చపత్న్యౌ' యని శ్రుతి, సంహారశక్తి=రౌద్రశక్తి. రూపము ధరించి ముందుపోఁగా, శరచాపములు=బాణములు,విండ్లు,పురుషరూపములను=మగవారి యాకారములతో, బ్రాహ్మణాకృతులతో=బ్రహ్మణరూపములతో, శ్రుతులు=వేదములు, సర్వరక్షిణి=సర్వవేద తన్మాలయజ్ఞ, యజ్ఞాధికృతా శేషజగద్రక్షిక-ఇట్లు చెప్పుటచే హైరణ్యగర్భశక్తియు సేవించుట చెప్పఁబడెను. వషట్కా-రము=ఇది కర్మయోగమును సూచించును, స్వర్గమునకు=సాంతానిక లోకము మొదలు వైకుంఠపర్యంతముగల లోకములకు వారి వారి యోగ్యతాను సారముగ.

## తాత్పర్యము

ప్రకాశించు సూర్యుని కాంతితోఁ దన యిల్లు వదలి బయలుదేఱఁగా కుడి ప్రక్క శ్రీమహాలక్ష్మియు నెడమప్రక్క భూదేవియు ముందుప్రక్క రుద్రశక్తియు, వెంబడి వేదములు, గాయత్రి, ప్రణవము, వషట్కా-రము పోఁగా విల్లు బాణములు సమస్తాయుధములు పురుషరూపములు ధరించిరాఁగా బ్రాహ్మణులు

ఋషులు తెలుపఁబడిన వాకిండ్లుగల సాంతానికాది లోకములకు వారి వారి యోగ్యతకొలఁది పోవ వెంట నంటిరి.

తే. దశరథాత్మజుతోడ నం•తఃపురంబు, సతులు బాలురతో వృద్ధ•తరులతోడ
వర్షధరకింకరులతోడ•వారిదాసి, ముఖ్యతో వెంట నంటిరి•ముదముఁగూర.

అర్థములు. అంతఃపురంబు సతులు=అంతఃపురమునను్న స్త్రీలు, వర్షధర=కావలికాచు నపుంసకులతో.

తాత్పర్యము

(రామచంద్రమూర్తితో నంతఃపురమున నున్న స్త్రీలు, బాలురు, ముదుసళ్ళు కావలికాచు నపుంసకులతో దాసీజనములో సంతోషముగా వెన్నంటి పోయిరి.)

ఆ. సాగ్నిహోత్రు లగుచు•నాత్మపత్నులతోడ, భరతుఁడును సుమిత్ర•పట్టి రాము
వెంటఁ జన మహాత్మ•బృందంబు సుతసతీ వహ్నియుక్తి జనియెఁ•బరమరక్తి.

అర్థములు. సాగ్నిహోత్రులు=అగ్నిహోత్రములోఁ గూడినవారు, ఆత్మపత్నులతోడన్=తమ భార్యలతోడ, శత్రుఘ్నుఁ డొంటి రథమున వచ్చెనని ముందు చెప్పినచోట భార్యాభర్త లిరువు రొక్కరథముననే కూర్చుండి వచ్చిరని గ్రాహ్యము. ఇందు భరతశత్రుఘ్నుల భార్యలు చెప్పఁబడిరి గాని యూర్మిళాదేవి చెప్పఁబడ లేదు. కావునను రామరాజ్యమందు వైధవ్యము లేదు. కావున నామె భర్తతోడఁ బోయెనని గ్రహింపనగు, మహాత్మబృందంబు=శ్రీరామచంద్రమూర్తి యందే మనస్సునిలిపిన వారగుటచే మహాత్ములగువారి సమూహము, సుత సతీ వహ్నియుక్తిన్=కొడుకులతో, భార్యలతో, నగ్నులతో, పరమరక్తిన్=మిగుల ననురాగముతో, దీనికే పరభక్తియని పేరు. దీనివలన మోక్షప్రాప్తికి భక్తియే యుపాయము. పండితుఁడైనను, పామరుఁడైనను, చేతనమైనను, అచేతనమైనను భగవద్దర్శన స్పర్శన సల్లాపనామ కీర్తనాదులలో నేది లభించినను, ముక్తి గాంచును. వీరిని గర్మబంధము లేమియుఁ జేయఁజాలవు.

తే. సచివవర్యులు భృత్యులు•సపశుపుత్ర, బాంధవులుగాఁగ శ్రీరామ•భద్రు వెంట
రాగమునఁబోయి రిట్టులు•ప్రకృతులెల్ల, రామగుణరక్తిఁ జనిరి ని•ర్మలమనీష.

అర్థములు. నిర్మలమనీషన్=కల్మషము లేని మనస్సులతో, రామచంద్రమూర్తి వెంటఁ బోగలిగెనను సంతోషము తప్ప నితర విచారము వారికి లేదయ్యెనని గ్రాహ్యము.

తాత్పర్యము

(మంత్రిశ్రేష్ఠులు. పరిచారకులు, పశువులు, కొడుకులు చుట్టాలు వీరితో ననురాగము మీఱ శ్రీరామచంద్రమూర్తి వెంటఁజనిరి. పురవాసులు మనస్సులం

దెట్టి విచారము లేక రామచంద్రమూర్తి వెంటఁబోఁగలిగెనను సంతోషముతోఁ బోయిరి.)

ఉ. అందఱు స్నానమాడి శుచు•లై పరిహృష్టమనంబులం గపుల్
సందడిచేయుచుం గిలకి•లధ్వను లారఁగ రాము వెన్కొనన్
మందునకైన నందు రుచి•మాలిన వాఁడును దుఃఖితుండు సి
గ్గొందెడివాఁడు దీనుఁడెడ•నొల్లనివాఁడును లేఁ డొకండునున్. ౧౬౪౬

అర్థములు. రుచిమాలినవాఁడు=మరణభయముచే కాంతి హీనుఁడగువాఁడు, దుఃఖితుండు=పోవలసి వచ్చెనే యని కష్టపడువాఁడు.

తాత్పర్యము

(అందఱు స్నానముచేసికొని పరిశుద్ధులై పరిపూర్ణానందముతో వానరులు కిలకిల ధ్వనులచేయుచుఁ గోలాహలముగా రాముని వెనువెంటఁజనఁగా నందు మరణభీతి వెలవెలఁబోవువాఁడు, పోవలసివచ్చెనే యని కష్టపడువాఁడు, సిగ్గుపడు వాఁడు, దీనుఁడైనవాఁడు నిష్టపడనివాఁ డొక్కఁడైన మందునకైన లేఁడయ్యెను.)

క. అందఱు నద్భుతమగు నా•నందంబున నుల్లసిల్లిరి•నవ్యగతి సమ
చ్ఛందను వెంబడి నాతని, సందర్శింపఁగను వచ్చు • జనపదజనముల్. ౧౬౪౭

అర్థములు. సమచ్ఛందను=నమస్కరించు వారికిఁ దాపమును చందనము వలె హరించువాని.

తాత్పర్యము

రామచంద్రమూర్తిని జూడవచ్చిన పల్లెటూళ్ళవారు కూడ నాయన వెంట సంతోషముతోఁ బోయిరి.

క. నాకారోహణమతిచే, నేకాంక్షయు లేక చనిరి • ఋక్షనిశాటా
నీకపులును బురవాసులు, నేకవిధపుఁ బరమభక్తి • నేగిరి శ్రద్ధన్. ౧౬౪౮

అర్థములు. నాకారోహణమతిచేన్ = మోక్షమునకుఁ బోవు కోరికచే, ఏకాంక్షయు=దేనియందును గోరిక.

తాత్పర్యము

(మోక్షమునకుఁ బోవు కోరికచేత దేనియందును కోరిక లేక ఎలుఁగులు, రాక్షసులు, వానరులు, పురజనులు నానావిధమైనఁ బరమభక్తి శ్రద్ధలతోఁబోయిరి.)

ఉ. పురిని నగోచరంబులగు • భూతములున్ రఘువంశవర్ధనున్
సరసతఁగన్న ప్రాణులును • స్థావరముల్ రఘురాము వెన్కొనెన్
బురమున నెద్ది శ్వాసమును • బుచ్చెడి దొక్కటియైన లేక శ్రీ
కరుబడి నేగెఁ జిత్తముల • గాటపుభక్తిని నిల్పి రాముపై. ౧౬౪౯

### తాత్పర్యము

అయోధ్యయందుఁ గంటికిఁ గానవచ్చు ప్రాణులేగాక కానరానివి కూడ, రామునిప్రేమతోఁ జూచిన స్థావరములుకూడ రామచంద్రమూర్తి వెంట బోయెను. ఆ పురమందు శ్వాసము విడుచునది యొక్కటియైన లేక యన్నియు రామచంద్రమూర్తియందు దృఢమైన భక్తి నిలిపి యాయనవెంటఁ బోయెను.

### —* బ్రహ్మాదులు శ్రీరాముని దర్శింప వచ్చుట *—

సీ. రామచంద్రుఁడు జన•స్తోమంబు వెన్కొన, నర్ధయోజనం•బరిగి యచటఁ
బశ్చిమముఖ మయి•ప్రవహించు సరయువు, పుణ్యజలంబులఁ•బోలఁ గాంచి
యాకులావర్త మా•నంబులం దిగి, సప్రజుఁ డగుచు ద•త్స్థలముఁ జేర
నామహార్తంబున • నఖిలలోకపితామ,హుండు విరించి ది•వౌకసులును

తే. ఋషులు గొలువంగ స్వర్గంబు • నేగుదెంచె
రాముఁ డుండెడిచోటికిఁ • గ్రన్ననచ్చొ
గగనతల మెల్ల నిండారఁ • గలితకాంతు
లైనయాకాశయాన వి•తానములను. ౧౬-౫౦

అర్థములు. జనస్తోమము=జనసమూహము, వెన్కొనన్ = వెంబడిరాఁగా, అర్ధయోజనము=ఒకటిన్నర యోజనము, పశ్చిమ ముఖము = పడమటిదిక్కు, పుణ్యజలంబులన్=స్నానముచేసిన వారికిఁ బుణ్యము కలిగించునీళ్ళను, ఆకుల+ఆవర్తము=నీటిసుళ్ళచేఁ గలఁతి చెందినది, అంబువులన్=నీటియందు, సప్రజుఁడు=ప్రజలతోఁ గూడినవాఁడు, విరించి=బ్రహ్మ, దివౌకసులు=దేవతలు, వృద్ధియతి-స్వర్గంబు=పరమపదము, ఏగుదెంచెన్=పోవుటకొఱకు, క్రన్నన్=త్వరగా, ఆకాశయాన=విమానముల, వితానములను=సమూహములచే.

### తాత్పర్యము

ఈ ప్రకారము జనులు తన్ను వెంబడించి రాఁగా శ్రీరామచంద్రమూర్తి యొకటిన్నర యామడ దూర మేగి యచట పడమటి ముఖముగాఁ బాఱుచున్న సరయూ నదియొక్క పుణ్యప్రదజలంబుల సుళ్ళచే వ్యాకులమైయున్న జలంబులం గాంచి జనులతో నానీళ్ళలో దిగఁగా ఆసమయమందే సమస్తలోకములకుఁ దాత యగు బ్రహ్మదేవుఁడు దేవతలు ఋషులు గొలువఁగఁ బరమపదము పోవ సిద్ధపడి యుండు శ్రీరామచంద్రమూర్తి యున్న స్థలమునకు విమానకాంతులచే నాకాశము వ్యాపింపఁగా త్వరగా వచ్చెను.

క. జ్యోతిర్భూతం బగు నా ద్యోతలము స్వయంప్రభామ • రోత్కరపుణ్య
వ్రాతమ్ములచే సుశ్రీకృతం బయి వెలిఁగె జనము•వెఱఁ గొందంగన్. ౧౬-౫౧

అర్థములు. జ్యోతిర్భూతము=కాంతి మయము, ద్యోతలము=ఆకాశప్రదేశము, స్వయంప్రభా=ఇతరకాంతుల సహాయము లేక తమంతట తామే వెలుఁగు, అమరోత్కర = దేవతాసమూహముల యొక్కయు, పుణ్యా=పుణ్యాత్ముల యొక్కయు, వ్రాతమ్ముల చేన్=సమూహములచే, సుశ్రీ=మంచిశోభచే, స్ఫీతంబయి=ప్రకాశించినదియై. వెఱఁగు=ఆశ్చర్యము.

### తాత్పర్యము

కాంతిమయమైన యాకాశము! సహజములైన కాంతి సమూహములు గల దేవతల సమూహముచే జూచు ప్రజలు వెఱఁగు పడునట్లు ప్రకాశించెను.

క. దైవతకరముక్తంబై, వావిరి సుమవృష్టి గురిసెఁ బవనుండును సౌ
 ఖ్యావహుఁడై శీతలుఁడై, పావనుఁడై పుణ్యగంధ వహుఁడై వీచెన్ ౧౬-౧౭

అర్థములు. దైవత=దేవతల యొక్క, కర=చేతులచే. ముక్తంబై=విడువఁబడినదై, వావిరి=విస్తారముగ, సుమవృష్టి=పూలవాన, సౌఖ్యావహుఁడై=సుఖము గలిగించువాఁడై, శీతలుఁడై=చల్లనివాఁడై, పావనుఁడై=పవిత్రుఁడై, పుణ్యగంధవహుఁడు=పుణ్యకరమైన వాసనగలవాఁడై, వీచెన్=విసరెను.

### తాత్పర్యము

దేవతలు పూలవాన విస్తారముగఁ గురియించిరి, చల్లని కమ్మనివాయువు సుఖకరుఁడై పవిత్రుఁడై వీచెను.

తే. తూర్యరావంబు లెల్లెడఁ దోరముగను, వేల్పుఁగన్నెలు గంధర్వ విసరములును
 సంకులంబుగ శ్రీరామచంద్రుఁ డపుడు, పాదచారియై సరయువు వారిఁజొరగ.

అర్థములు. తూర్యారావంబులు = వాద్యధ్వనులు, తోరముగను=విశేషముగ, స్థూలశబ్దభవము తోరము, విసరములు=సమూహములు, పాదచారియై=కాలినడక గలవాఁడై.

### తాత్పర్యము

విస్తారముగ వాద్యధ్వనులు మొరసెను. దేవతాస్త్రీలు గంధర్వసమూహములు గుంపులుగఁ గలసియుండిరి. అప్పుడు శ్రీరామచంద్రమూర్తి సరయూజలంబులందుఁ బ్రవేశింప (మీఁది పద్యములోని జతనంబుసేయఁగ ననుటతో నన్వయము.)

సీ. జతనంబు సేయంగ సరసిజసంభవు, డాకసంబున నిల్చి యనియె నిట్లు
 రా రమ్ము విష్ణు! భద్రం బగు మాయదృష్టంబున వచ్చితి సాధురక్ష
 సురనిభు లగుభ్రాతృ వరులతో నీకోరు,విధిని బ్రవేశింపు స్వీయతనువు
 వైష్ణవం బగుమహా వర తేజమో సనా,తన మగునభమొ నీ మనసుపగిది
తే. నీవ గతివెల్ల జగతికి నీదుమాయ, శ్రీవిశాలాక్షి పూర్వపరిగ్రహంబు
 గాక యెవ్వఁడు తెలియంగఁ గలఁడునిన్ను, నఘచయవిభంగ! విమలద యాంతరంగ

అర్థములు. జతనంబు=ప్రయత్నము యత్నశబ్దభవము, జతనము, సరసిజ సంభవుండు=బ్రహ్మ, రారమ్మ=రమ్మురమ్ము, ఆదరణమున ద్విరుక్తి, సాధు రక్ష=భక్తుల రక్షించువాఁడా, స్వీయతనువు=నీ దేహమును,సనాతనము, నిత్యము, శాశ్వతము, నభము=ఆకాశము, ఇది పరమాకాశము. సర్వశరీరులున్ నిగమ సంగతిఁజెంది విశీర్యమాణులై, పర్వినచో నభంబుగతి బ్రహ్మముతోఁ జెడకుండు నెప్పుడున్'' శ్రీ భాగ॥ఆకాశో బ్రహ్మఉపమాయ=మా+యా=యా+మా=ఎవతె లోకములకుఁ దల్లియో యామె మాయ, ప్రకృతి కధిష్ఠానదేవత 'కాంత స్తే పురు షోత్తమః ఫణిపతి శ్శయ్యాసనం వాహనం, వేదాత్మా విహగేశ్వరో యవనికా మాయా జగన్మోహినీ॥ చతుశ్శ్లోకి. ఈమెయే లక్ష్మీదేవి అయినను భూమి, సూర్యుడు లోనగు శబ్దములచేఁ దదధిష్ఠాన దేవతలు బోధింపఁబడునట్లు మాయా ప్రకృతి శబ్దములచేఁ దదధిష్ఠాన దేవత లక్ష్మిబోధింపఁబడును. కావుననే 'మాయాంతుప్రకృతిం విద్ధి మాయినంతు మహేశ్వర'మ్మని శ్రుతి. మాయా ప్రకృతి. దానిని గలవాఁడు మాయి, భగవంతుఁడు అటుగాక మాయ జడప్రకృతి యగునేని శ్రీవిశాలాక్షి యను విశేషణము నిరర్థక మగుచున్నది. జడప్రకృతికి కన్నులు లేవుగదా. అదియును గాక నీ పూర్వ పరిగ్రహము విశాలాక్షిగాక యెవఁడు తెలియఁగలఁ డన్నప్పు డామెకు జ్ఞానము చెప్పఁబడెను. అచేతన ప్రకృతి జ్ఞానము గలది కాదుకదా. భగవత్తత్త్వము శ్రీభగవతి లక్ష్మీదేవిగాక మఱెవ్వరును పూర్ణముగఁ దెలియఁగలరు. అఘచయ విభంగ=పాపసమూహముల నాశముచేయువాఁడా, విమలదయాంతరంగ=నిర్మలమైన దయతోఁగూడినవాఁడా.

## తా త్ప ర్య ము

ప్రయత్నము సేయఁగా బ్రహ్మ యాకాశమునని ల్చి యిట్లనియె. రమ్ము రమ్ము విష్ణుదేవా! నీకు మేలగును గాక. మా యదృష్టము కొలఁది భక్తరక్షకా! వచ్చితివి. దేవతలతో సమానములయిన తమ్ములతో నీయిష్టప్రకారము వైష్ణవ మైన మహాతేజస్సునందో, నిత్యము శాశ్వతమగు పరమాకాశమందో నీ దేహ మునఁ బ్రవేశింపుము. ఇవి యన్నియు నీ దేహములేకదా! సమస్త ప్రపంచము నకు నీవే గమ్యస్థానము. నీవు పూర్వమునఁ బరిగ్రహించిన శ్రీవిశాలాక్షి లక్ష్మి దేవి తప్పఁ దక్కిన వారెవ్వరు నీ తత్త్వము తెలియఁగలరు?

తే. అక్షయుండ వచింత్యుండ • వజరుఁడవును, నీవు కోరిన చోట్పున • నీదుతనువుఁ
జొరుము యెద్దానినైన వం • చును విరించి ప్రార్థనముసేయ శ్రీరామ • భద్రమూర్తి.

అర్థములు. అక్షయుండవు=నాశములేని వాఁడవు, అచింత్యుండవు=ఇట్టి వాఁడివని మనస్సుచేనైనఁ జింతింప సాధ్యపడని వాఁడవు, అజరుఁడవు = ముసలి తనము లేనివాఁడవు, 'అయ మాత్మా అపహతపాప్మా విజరో విమృత్యుర్విశోకో విజిఘృత్సోఽపిపాస స్సత్యకామ స్సత్యసంకల్ప'యను శ్రుతి నిట ననుసంధించునది.

తాత్పర్యము

శ్రీరామచంద్రా! నీవు నిత్యుఁడవు, శాశ్వతుఁడవు, సనాతనుఁడవు, కావున సపక్షయ మరణాదులు లేనివాఁడవు. నీ విట్టివాఁడ వని యూహింప మనస్సుచే నైన సాధ్యపడదు మరణము లేకున్న ముసలితనము లేనివాఁడవా యనిన నిర్వికారుడఁవగుట యదియును లేనివాఁడవే. ఇది యదియనక సర్వము నీ శరీరము కావున నీయిష్టప్రకార మేశరీరమందైనఁ బ్రవేశింపుము అని బ్రహ్మ వేఁడఁగా శ్రీరామచంద్రమూర్తి.

**—•శ్రీరాముఁడు సానుజుఁడై సశరీరుండై వైష్ణవతేజంబుఁ జొచ్చుట•—**

క. తా నిశ్చయించి మనమున, సానుజుఁ డై యపుడు చొచ్చె•సశరీరుండై
మానితవైష్ణవతేజము, మానసముల వేల్పు లెల్ల•మఱి మఱి పొగడన్.

అర్థములు. సానుజుఁడై=భరత శత్రుఘ్నులతోడ, సశరీరుండై=దేహముతోఁ గూడినవాఁడై. భరతశత్రుఘ్నులు రామచంద్రమూర్తి దేహములతో వైష్ణవతేజము ప్రవేశించి రనుటచే వారిశరీరములు ప్రాకృతములు గావని స్పష్టపడియె. ప్రాకృత శరీరములు అప్రాకృతమందుఁ గలియఁ జాలవు కదా.

తాత్పర్యము

మనస్సులో నిశ్చయించికొనినవాఁడై తమ్ములతోడ దేహముతో వైష్ణవ తేజస్సునఁ బ్రవేశించెను. దేవతలందఱుఁ దమ మనస్సులందు విశేషముగఁ బొగడిరి.

ఆ. అంత విష్ణుమయుని•నఖిలలోకేశ్వరు, దేవదేవు నఖిల•దేవతాళి
సాధ్యులును మరున్ని•చయములుఁ బూజించె, సేంద్రశుక్రమగుచు•హితముదోఁప.

అర్థములు. విష్ణుమయుని=విష్ణు స్వరూపుని, అఖిలలోకేశ్వరున్=సమస్త లోకములకుఁ బ్రభువును, దేవదేవున్ = దేవత లనఁబడు వారికిని దేవుఁడు, "దేవానాం దానవానాంచ సామాన్య మధిదైవత"మ్మని ప్రమాణము, అఖిలదేవతాళి=సమస్తదేవతలసమూహము, మరున్నిచయములును=మరుత్తుల సమూహములును, సేంద్రశుక్రము=ఇంద్రునితోను శుక్రునితోను గూడినవారై.

తాత్పర్యము

ఆ పిమ్మట ఇంద్రునితో శుక్రునితోఁ గూడిన దేవతలు సాధ్యులు మరుత్తులు సర్వలోక ప్రభువు, దేవాది దేవుఁడు నగు విష్ణుస్వరూపుని పొగడిరి.

ఇచ్చట శుక్రుఁడు చెప్పఁబడుట దానవాదుల కుపలక్షణము. కావుననే క్రింది పద్యమున దైత్యదానవులు చెప్పఁబడిరి.

తే. దైత్యదానవ యక్షగం•ధర్వగరుడ, నాగదివ్యర్షు లప్సరః•పూగములును
పావనం బయ్యెదివము స•ర్వంబుహృష్ట, పుష్టమయ్యెనుగూరెమా•యిష్టములును.

తాత్పర్యము

అప్పుడు దైత్యులు దానవులు యక్షులు గంధర్వులు గరుడులు నాగులు దివ్యర్షులు అప్సరల సమూహములు స్వర్గమున నీవు మరలఁ బ్రవేశించుటచే నది పవిత్రమయ్యెను. సమస్తము సంతోషించినది. పుష్టిగొనినది యయ్యెను. మాఁటిమాఁటికి కలు నిజవేఱను.

చ. అని పొగడంగ విష్ణువు స్వ•యంభువుఁ గాంచి నచించె సువ్రతా!
జనములఁ గంటె యిందఱు న•చంచలభక్తిని స్నేహయుక్తులై
యనుగమనంబుఁ జేసి తమ•ప్రాణము లిచ్చిరి నాకు మద్వియు
క్తిని సహింపరైరి, నిర•తిన్ భజితవ్యులు వీర లెల్లరున్. ౧౫౯

అర్థములు. స్వయంభువున్=బ్రహ్మను, అచంచలభక్తిన్=చలింపని భక్తిని, అనన్యభక్తిని, స్నేహయుక్తులై=నాయందలి ప్రేమతోఁ గూడినవారై, అనుగమనంబు=వెంటవచ్చుట, మత్+వియుక్తిని=నన్ను విడనాడుటను, నిరతిన్=నిండు ప్రేమతో, భజితవ్యులు=సేవింపబడఁదగినవారు, "యే యథా మాం ప్రపద్యంతే తాంస్తథైవ భజా మ్యహమ్"-ఎవరు నావిషయమై యెట్టిభక్తి, జ్ఞానము గలవారగుదురో నేను వారినట్లు భజింతును భ. గీ.

తాత్పర్యము

ఈ ప్రకారము స్తోత్రముచేయఁగా విష్ణుమూర్తి బ్రహ్మనుజూచి యిట్లు చెప్పెను నా మత మనుసరించి మంచి నియమము గలవాఁడా! యీ ప్రజలను జూచితివా? వీరందఱు నాయందు స్నేహముచే నావెంట వచ్చి నన్ను విడనాడఁ జాలక నాకై ప్రాణత్యాగము చేసిరి. అచంచలమై యనన్యమై పరమభక్తి యిదియేకదా. ఎవరు నా విషయమున నెట్లు వర్తింతురో వారి విషయమున నేను నట్లే వర్తింతును. కావున వీరందఱు నాకు సేవ్యులే.

—• బ్రహ్మ సమస్త జనంబుల నుత్తమలోకంబున నుంచుట •—

క. ఆకతమున వీరలఁ దగు, లోకంబున నిలుపు మనిన • లోకగురుండీ
లోకులు సంతానం బను,లోకంబున నుండువారు•లోకారాధ్యా! ౧౬౦

అర్థములు. ఆకతమునన్=ఆకారణముచే, లోకగురుండు=బ్రహ్మ.

తాత్పర్యము

ఆ కారణముచే వీరి నందఱను యోగ్యమైన లోకంబుల నిలుపుమని చెప్పఁగా బ్రహ్మయు వీ రందఱు సంతానమను పేరు గల లోకంబున నుందురు.

క. ఈవిధి నిను దిర్యక్కులు, భావించిన యోని నిదు•భక్తిని దనువుల్
బో విడిచిన యే నవ్వియు, వావిరి సంతానికమున•వఱలును దేవా! ౧౬౧

అర్థములు. తిర్యక్కులు=పశువులు, పక్షులు, తనువుల్=దేహములు.

తా త్ప ర్య ము

వీరు మాత్రమే కారు, వీరివలెఁ బశుపక్ష్యాదులైనను నిన్నుఁ దలంచుచుండి నను, నీకై దేహములు వదలినను నవికూడ సాంతానిక లోకంబున నుండఁగలవు.

ఆ. బ్రహ్మలోకమునకుఁ•బై నిఖలబ్రహ్మ,గుణ సమేత మగుచుఁ•గోఅలు నదియు
వానరాచ్ఛవరులు•వారల తొల్లింటి, సురలరూపములను • జొచ్చువారు.

అర్థములు. నిఖిల బ్రహ్మగుణ సమేతము=పరిపూర్ణ బ్రహ్మగుణములతోఁ గూడినది, భోగమాత్ర సామ్యలింగాత్తను బ్ర॥ సూ॥ ప్రకారము ముక్తులు పర బ్రహ్మ గుణములు(జగద్వ్యాపారము తప్ప) గలిగియుందురు, వానరాచ్ఛవరులు= వానర శ్రేష్ఠులు భల్లూక శ్రేష్ఠులు.

తా త్ప ర్య ము

ఏ యే వానరులు భల్లూకములు దేవతల యంశమున జనించిరో వారాయా దేవతలయందుఁ బ్రవేశింతురు. తక్కినప్రజలు బ్రహ్మలోకమునకును పైఁగానుండు సాంతానికలోకమున పరబ్రహ్మ భోగగుణములు గలవారై యుందురు.

క. వానరపతి సుగ్రీవుఁడు, భానునిమండలముఁ జొచ్చు•వాఁడు మహాత్మా!
వానరు లెల్లరుఁ బిత్రులను, మానుగఁ బొందెదరు విబుధ•మండలి గనఁగన్.

తా త్ప ర్య ము

వానరరాజగు సుగ్రీవుఁడు సూర్యమండలముఁ జొచ్చును. మహాత్మా తక్కిన వానరులు వారివారి తండ్రులందుఁ జొత్తురు.

సీ. అని పితామహుఁడిట్లు•వినుచు చుండఁగఁ గోప్ర, తారతీరంబున•ధరణిజనులు
సంతోషమున బాష్ప•జలధారఁ గన్నులు, గురియింప సరయువుఁ•గ్రుంకిరపుడు
రామభక్తిని దమ•ప్రాణము ల్విడిచిన, యెల్లప్రాణులు మేని•నింద విడిచి
దివ్యయానంబులఁ•దేజరిల్లుచు నేగి, రప్పుడు సరయువు•నందు మునిఁగి

తే. నట్టితిర్యక్సహస్రంబు•లమరతేజ, మొప్ప మేనులు దివి కేగె•నుత్సవముగ
ఋక్షవానరరాక్షసు•లాక్షణమున, సరయువున దేహముల్విడి•చనిరి దివికి.

అర్థములు. పితామహుఁడు=బ్రహ్మ, వినుచుచున్=వినఁజేయుచు, చెప్పుచు గోప్రతార తీరంబునన్=గోప్రతార మను పేరుగల రేవునందు, క్రుంకిరి=మునిఁగిరి, మేనినింద విడిచి=దేహములిచ్చటనే వదలి, రామభరతశత్రుఘ్నులు దేహముల తోనే దివ్యతేజస్సునఁ గలసి రని ముందు చెప్పఁబడిరి. తక్కిన వా రందఱు తమ ప్రాకృత శరీరంబు లా నీటియందు విడిచిపోయిరి.

## తాత్పర్యము

బ్రహ్మదేవుఁ డీ ప్రకారము చెప్పుచుండ లోకు లందఱు కన్నుల నానంద బాష్పములు రాలుచుండ సంతోషముతో సరయూజలంబుల మునిఁగిరి. రాము నందలి భక్తిచేఁ దమ ప్రాణములు విడిచిన వా రందఱు దేహముల నందే విడిచి దివ్యవిమానంబులఁ గూర్చుండి పోయిరి. దీనిచేఁ బరమభక్తి ప్రపత్తులు గలవారై దేహములు విడిచిన వారికి నర్చిరాది మార్గము లేదనియుసూటిగఁ బరమ పదమునకుఁ బోదురనియు నేర్పడు చున్నది. దీనికి వరాహపురాణ మందలి యీ వాక్యములు ప్రమాణములు.

శ్లో॥ స్థితే మనసి సుస్వస్థే శరీరే సతి యో నరః ।
ధాతు సామ్యే స్థితే స్మర్తా విశ్వరూపంచ మామిదమ్ ॥
తత స్తం మ్రియమాణంతు కాష్ఠ పాషాణసన్నిభమ్ ।
అహం స్మరామి మద్భక్తం నయామి పరమాం గతిమ్ ॥
యదా కదాచిద్వాతాదిధాతుసామ్యా దరోగతః ।
మనస్థితిః సంభవతి యః కశ్చిత్తు తదానరః ॥
స్మరే త్త్వామిత్ర సౌశీల్యవాత్సల్యాదిమహోదధిమ్ ।
అవతీర్ణం వరాహం మాం శ్రియా దీప్త గుణై ర్యుతమ్ ॥
నారాయణం విశ్వరూప మజ మిచ్ఛాత్త విగ్రహమ్ ।
శ్రీమన్నారాయణస్వామిన్ అనన్యశరణ స్తవ ॥
చరణౌ శరణం యాత ఇతిమాం యః స్మరేత్సకృత్ ।
తత స్త మితరోపాయవ్యవధానవిసర్జితం ॥
తదవస్థం మృతౌ ప్రాప్తౌ కాష్ఠపాషాణసన్నిభమ్ ।
కాష్ఠవత్తు స్వతో దేహే మనశ్చేష్టావిసర్జితమ్ ॥
ప్రబోధా సంజ్ఞంతు విలుప్త హృదయం తత ।
ఆత్మవత్స్వయ మస్యైశ్చ హితస్మరణ వర్జితమ్ ॥
ఆశ్రితేషు ప్రసుప్తేషు పురుషో యో వ్యవస్థితః ।
కామం కామం నిర్మిమాణః తేషాం జాగర్తి సిద్ధయే ॥
సోహ మాశ్రిత తం త్రాతాత్మా స్మరామిచ తవ స్వయమ్ ।
ఇమం మద్భోగ యోగ్యంతు కృపాపూర ప్రకాశనాత్ ॥
నయామి పరమం స్థాన మర్చిరాదిగతిం వినా ।
గరుడస్కంధ మారోప్య యథేష్ట మనివారిత ॥

దేహ మారోగ్యముగ నుండఁగా మనస్సు తన స్వాధీనమం దుండఁగా నజుఁ డను విశ్వరూపుఁడనైన నన్ను నెవరు స్మరింతురో యట్టివాఁడు మరణ కాలమునఁ

గఫవాతాదులచే స్మృతితప్పి కొయ్యవలె రాతివలెఁ బడియుండఁగా నా భక్తుని నేను స్మరించి పరమపదమునకుఁ దీసికొని పోదును. ఒకవేళ నారోగ్యవంతుఁడై, మనస్సు స్వస్థముగా నుండువాఁడయ్యేనేని యీ యవసాన కాలమున స్వామిత్వము సౌశీల్యము వాత్సల్యము లోనగు గుణములు గల నన్ను నారాయణు స్వేచ్ఛాగత శరీరుని నుద్దేశించి శ్రీమన్నారాయణస్వామీ! వేఱు రక్షకుఁడు లేనివాఁడనై నీ పాదముల శరణుచొచ్చితిని అని యొకసారి స్మరించెనేని యితరోపాయముల వదలి యీ యవస్థ యందుండి కొయ్యవలె రాతివలెఁ బడియుండు వానిని గదలలేక యుండువానిని నాశ్రితపరతంత్రుఁడనగు నేను స్మరించి నా దయాప్రవాహము ప్రకాశింపఁజేయ నర్చిరాదిమార్గము వదలి గరుడుని మూఁపుపై వానిని నెక్కించుకొని యథేష్టముగ నే యడ్డము లేక పరమపదమునకుఁ దీసికొని పోదును.

ఆ కాలమున సరయువున మునిఁగిన వేలకొలఁది పశుపక్ష్యాదులు దివ్య కాంతులతో సంతోషముతో పరమపదమునకుఁ బోఁగా వానరులు రాక్షసులు ఎలుఁగులు ఆక్షణమందే సరయువునఁ దమ దేహములు విడిచి స్వర్గమునకుఁ బోయిరి.

క. అంత ఁటు చేర రా నా, నంతంబున లోకగురుఁడు ♦ సవ్యముగు దివం

బం దందఱ నిలిపి ముదం, బంది మహాత్రిదివమునను♦వరిగెం బ్రీతిన్. ౧౬౬౫

### తాత్పర్యము

అంత ఈ ప్రకారము రాఁగా సంతోషముతో బ్రహ్మదేవుఁడు మనోహరమగు స్వర్గమున నందఱ నిలిపి సంతోషించి తాను సత్యలోకమునకుఁ బోయెను.

### —♦ శ్రీ రామాయణ ఫలశ్రుతి ♦—

ఉ. ఈయది సోత్తరం బయి ర ♦ హించును బ్రహ్మసుపూజితంబు, రా

మాయణ సుప్రసిద్ధిఁ గని ♦ పట్టెది, ముఖ్యము, వాల్మికుండు ని

ర్మాయి, చరాచరాత్మకుఁడు ♦ ప్రాగ్విధి విష్ణువు నిల్పె స్వర్గమం

దాయతహర్ష వృద్ధి నమ్ము♦తాంధను లెల్లరుఁ గూరుచుండఁగన్. ౧౬౬౬

అర్థములు. సోత్తరము—ఉత్తరకాండముతో గూడినది. పట్టాభిషేకానంతరము జరిగిన వృత్తాంతముతోఁ గూడినది. నిర్మాయి=మాయను జయించినవాఁడు. "దైవీహ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా మామేవయే ప్రపద్యంతే మాయా మేతాం తరంతి తే" యను భ. గీతావాక్యము చొప్పున వాల్మీకి ప్రపన్నుఁ డగుటచే మాయను జయించెను, త్రిగుణాత్మక మాయను జయింపభక్తి తప్ప వేఱు మార్గము లేదు. 'మాంచయోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే, సుగుణా న్సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే భ. గీ. ౧౪—౨౬ అని భగవద్వాక్యము. చరాచరాత్మకుఁడు=చరములకు అచరములకు నంతరాత్మయై యుండువాఁడు, చరాచరములు తనకు దేహముగాఁగలవాఁడు. ప్రాగ్విధి=యథాపూర్వము=మునుపటివలె.

తాత్పర్యము

ఈ గ్రంథము శ్రీరామచంద్రమూర్తి పట్టాభిషేకానంతరము జరిగిన చరిత్రముతోఁ బ్రకాశించునది. బ్రహ్మచే మిక్కిలి పూజింపఁబడినది. ఇది రామాయణమను పేరఁ గీర్తికాంచినది. నిశ్శ్రేయస సాభ్యుదయములు గోరువారి కిది మిక్కిలి ముఖ్యమైనది. దీనిని రచించినవాఁడు భక్తిచే మాయను జయించిన వాల్మీకి మహర్షి. అవతార దశకు పూర్వమున్నట్లులు చరాచరముల కంతరాత్మయై చరాచరములు తనకు శరీరముగాఁ గలిగిన విష్ణుమూర్తి దేవత లందఱు సంతోషించు చుండ స్వర్గమందు నిలిచెను.

క. దివిజులు గంధర్వులు ముని, నివహంబులు సిద్ధు లెల్ల • నిత్యము దివ్య
భవమున రామాయణమును, దివమున వినుచుందు రెలమి • దివ్యంబగుటన్.

తాత్పర్యము

ఈ రామాయణము భగవత్సంబంధమైనది కావున దీనిని దేవత లందఱు గంధర్వులు మునులు స్వర్గమునందును సర్వదా సంతోషముతో వినుచుందురు.

సీ. ఆఖ్యాన మియ్యది • యాయుష్కరంబును, బాపనాశనము సౌ • భాగ్యకరము
నామ్నాయసమము రా • మాయణం బియ్యది. శ్రాద్ధకాలంబులఁ • శ్రావ్యమగును
బాదమాత్రంబైనఁ • బఠియింప వాఁడన, పత్యుఁ డేనియు సుత • వంతుఁడగును
ధనహీనుఁ డైనను • ధనవంతుఁ డయ్యెడు, సకల పాపంబులు • సమసిపోవు

తే. దినము పాపంబులను జేయు • దీనుఁడైన
శ్రద్ధతోఁ బద్య మొక్కఁడేన్ • జదువుచున్న
వానిఁ బాపంబు లంటవు • వాస్తవంబు
వహ్ని సోఁకిన కంట్లంబు • పగిదిఁ జెడును. ౧౬౮

అర్థములు. ఆయుష్కరము=ఆయుస్సును వృద్ధిచేయునది, ఆమ్నాయసమము=వేదముతో సమానము, శ్రావ్యము=వినఁదగినది, శ్రాద్ధకాలములందు నశ్లీలములు గాని గ్రామ్యకథలు గ్రంథములు గాని యుచ్చరింపరాదు. వేదోక్తులే యుచ్చరింపఁదగును. ఇది వేదము గావున దీనిని జదువవలయును. అనపత్యుఁడు=బిడ్డలు లేనివాఁడు, సుతవంతుఁడు = కొడుకులు గలవాఁడు, వహ్ని సోఁకిన=అగ్ని తగిలిన, కంట్లంబు=దూదిమూట, దీని వాస్తవముఁ గోరువారు శ్రీరామనామ మాహాత్మ్యము చదువఁ బ్రార్థితులు.

తాత్పర్యము

(ఈ రామాయణకథ యాయుస్సును వృద్ధిచేయును. పాపము నశింపజేయును. సౌభాగ్యము నిచ్చును. వేదముతో సమానమైనది. శ్రాద్ధకాలములందు వినఁదగిన

దగును. పాదమాత్రమైన పఠించినచో సంతానము లేని వానికి సుతులు కలిగెదరు. ధనము లేనివానికి ధనము కలుగును. సమస్త పాపములు నశించి పోవును. ప్రతి దినము పాపముచేయు దీనుఁడైనను శ్రద్ధతో నొక్క-పద్యమైనఁ జదువుచుండెనేని వానిని పాపములు వాస్తవముగా నంటవు. దూది బుంగలకు నిప్పంటుకొనిన విధ మున రూపు మాసిపోవును.)

క. వాచకునకు దాతవ్యము, నైచికియుం గాంచనంబు ♦ నవ్యాంబరముల్
వాచకుఁడు సంతసించిన, నేచింతయు లేదు తృప్తి ♦ లెల్లరు విబుధుల్. ౧౬౯

అర్థములు. వాచకునకున్=గ్రంథము పఠించిన వానికి, దాతవ్యము ఈయఁ దగినది, నైచికి=శ్రేష్ఠమైన గోవు, కాంచనము = బంగారు, నవ్యాంబరముల్= క్రొత్తవస్త్రములు.

తాత్పర్యము

ఈ గ్రంథము పఠించిన వానికి బఠింపఁజేసినవారు గోవును బంగారు, క్రొత్త వస్త్రములు నీయఁదగును. అతడు సంతోషించిన దేవత లందఱు సంతోషింతురు.

క. ఆయుష్కర మగు శ్రీరా, మాయణముఁ బఠించు నాతఁ ♦ డాత్మజ పౌత్ర
శ్రీయుతుఁడై సుఖయించుచు, నాయతసుఖమంద స్వర్గ ♦ మందుం బిదపన్.

తాత్పర్యము

(ఆయుస్సును గలిగించు శ్రీరామాయణమును బఠించువాఁడు కొడుకులతో మనుమలతో సంపదతోఁగూడి సుఖపడును. అంతమున వైకుంఠమున శాశ్వత మగు సుఖమును బడయును.)

తే. శూన్యమై యుండి పెక్కేండ్లు ♦ ధన్యమైన
యాయయోధ్య పడంపడి ♦ యవని విభుఁడు
ఋషభుఁడనువాఁడు పాలింప ♦ వృద్ధి గాంచు
జన నివాసోచితం బయి ♦ సౌఖ్యమిడుచు. ౧౭౧

తాత్పర్యము

(ధన్యమైన యీయయోధ్య చాల సంవత్సరములు శూన్యమైయుండి యావల ఋషభుఁడను రాజు పాలనమున జనులు నివసింప యోగ్యమై సౌఖ్యకరమై వృద్ధి పొందును.)

తే. ఉర్వి వెలయించె దీని స ♦ హోత్తరంబు,గాఁగ సభవిస్మయముగ వల్మి ♦ కప్రభవుఁడు
లోకకర్తస్వయంబ యం ♦ గీకరించె, దీనిసంపూర్ణముగ ♦ విని దివ్యులలర.

అర్థములు. సహోత్తరము = పట్టాభిషేకానంతరము జరిగినది, సభ విస్మయము=సీతాదేవి భూప్రవేశము చేసిన విస్మాట జరిగినది, లోకకర్త=రామ

మూర్తి ధరించిన విష్ణువు, పుట్టంబుట్టినవాని రచితమైన దీనిని భగవంతుఁడు రామ చంద్రమూర్తి తన చరిత్రమును దాను స్వయముగ విని సరియని యంగీకరించుటచే నిది పరమప్రమాణ గ్రంథము. కావుననే దీనిని దేవతలు కూడ విని సంతోషింతురు.

తే. వాజిమేధసహస్రముల్•వాజపేయ, శతసహస్రంబు లొనరించు•నత్ఫలంబు
రామచంద్రునిచరితంబుఁ(శ్రవణమునను, ధ్యాన మొనరించుటనుఁ గాంచుఁ•దథ్యముగను.

తాత్పర్యము

(వేలకొలఁదిగా నశ్వమేధయాగములు లక్షలకొలఁది వాజపేయయజ్ఞములు చేసినఁ గలుగు మంచేఫలము రామచంద్రుని చరిత్రమును వినుటచేతనే, ధ్యానము చేయుటచేతనే వాస్తవముగాఁ గలుగును.)

తే. అమరవాహినిలోనగు•నాపగలను, నైమిశాదిమహారణ్య•భూములందు
మఱి ప్రయాగకురుక్షేత్ర•మండలములఁ, గాంచుఫల మొందు దీనినా•లించునతఁడు.

అర్థములు. అమరవాహిని=గంగ, ఆపగలను=నదులందు.

తాత్పర్యము

(గంగ మొదలగు పుణ్యనదులందు స్నానమాడిన ఫలము. నైమిశము మున్నగు పుణ్యారణ్యములను ప్రయాగ కురుక్షేత్రము మొదలగు పుణ్యక్షేత్రములను సేవించినఁ గలుగు ఫలము రామాయణము వినిన వానికిఁ గలుగును.)

క. భానూపరాగవేళను, దాని కురుక్షేత్రమందుఁ•దపనీయంబున్
దాన మొనర్చిన ఫలమును, దీని వినువాఁడు నొందు•దీటి రెండున్. ౧౬౮౫

అర్థములు. భానూపరాగవేళను=సూర్యగ్రహణ సమయమందు, దాని=దానము చేయువాఁడు. దాత, తపనీయము=బంగారు, దీటు=సమానము.

తాత్పర్యము

(సూర్య గ్రహణమప్పుడు కురుక్షేత్రములో బంగారు దానముచేసినఁ గలుగు ఫలము నీ రామాయణము వినినఁ గలుగు ఫలము నీ రెండు సమానము.)

క. మానవని శ్రద్ధను శ్రీ సీతానాయకుచరిత విని•ధన్యుఁడు ఘోరా
ఘానీకంబులఁ బాయుచుఁ, దా నెలకొను విష్ణుసన్ని•ధానమునందున్. ౧౬౮౬

అర్థములు. ఘోరాఘ+అనీకంబులన్=భయంకర పాపసమూహములను.

తాత్పర్యము

(వినువని శ్రద్ధతో శ్రీసీతాపతి యగు రామచంద్రమూర్తి చరిత్రను వినిన ధన్యుఁడు భయంకరములైన పాపముల సమూహములను వదలి విష్ణువు సన్నిధిలో శాశ్వతముగా నుండును.)

ఆ. ఆదికావ్య మిద్ది • యార్షంబు పూర్వంబు, వల్మికోద్భవర్షి • భాషితంబు
నియతి భక్తిచేత • నిరతంబు వినువాఁడు, రూఢిగాఁగ విష్ణు • రూపు గాంచు.

అర్థములు. ఆర్షంబు=ఋషిచేఁ జెప్పఁబడినది, పూర్వంబు = పూర్వంబు, మునుపు, శ్రీరామనిర్యాణమునకు ముందు, రామావతారమునకు ముందని భావము కాదు. యతిక్రాంచికాలమునకు ముందు జరిగినను పురావృత్తమే. ౭౦౩వపద్యము చూచునది, నిరతంబు=ఎల్లప్పుడు, దినదినము.

తా త్ప ర్య ము

(ఇది యాదికావ్యము. ఋషిచేఁ జెప్పఁబడినది-వాల్మీకి మహర్షి శ్రీరామ నిర్యాణమునకు మునుపు రచించినది నియమముగాఁ ప్రతిదినము భక్తితో విను వాఁడు రూఢిగా విష్ణుసారూప్య ముక్తిఁ గాంచును.)

క. దారసుతాదులు వృద్ధిం, గూరెద రెడఁదెగని కలిమిఁ • గొమరారుఁ గులం
బారఁగఁ దామరలంపర,లై రహిగను నియతి వినెడి • యనఘాత్మునకున్.

అర్థములు. దారసుతాదులు=భార్యలు, కొడుకులు లోనగువారు, అనఘాత్మునకున్=పుణ్యాత్మునకు.

తా త్ప ర్య ము

(దీనిని నియమముగా వినెడి పుణ్యాత్మునకు నాలుబిడ్డ లభివృద్ధి నొందెదరు-తెంపులేని భాగ్యము విస్తరించును-కులము తామరతంపరలై వెలయును.)

క. నిరతము రాముని చరితముఁ, బరమమతి న్వినెడివాఁడుఁ • భక్తివశమునన్
బరిపూతుండై బహువత్సరములు జీవించి మోక్ష • సంగతి నెలయున్. ౧౬౨౯

అర్థములు. వాంఛితములు=కోరికలు, బ్రాహ్మణవరు లిది వినిపింపవలయు అనుటచే శూద్రాదులకని భావము. ఈ నియమము సంస్కృత గ్రంథమునకే, ఆంధ్రగ్రంథమునకే నిర్బంధము లేదు. ఎవ్వరైనను భక్తిగలవారు చదువవచ్చును.

తా త్ప ర్య ము

(ఎల్లప్పుడు రామాయణమును శ్రేష్ఠమగు మనస్సుతో భక్తిచే వినెడి వాఁడు పవిత్రుండై యనేక సంవత్సరములు జీవించి, మోక్షమును బొందును.)

క. నిరతము రాఘవచింతా,పరుఁడగు మనుజుండు కోరు • వాంఛితములఁ దా
నరగన కాంచును బ్రాహ్మణ,వరు లిది వినిపింపవలయుఁ • బ్రతిదివసంబున్.

తా త్ప ర్య ము

(సర్వదా రామధ్యాన పరాయణుఁడయిన మానవుఁడు కోరినకోరిక లెల్లఁ జేకూరును-ప్రతిదినము బ్రాహ్మణుఁడు దీనిని వినిపింపవలెను.)

క. గాయత్రీరూపము రామాయణ మిదియొక్క పదము • నైనఁ బఠింపన్
జేయు దురితనాశము సుతు,లాయతధనములును గలుగు•నక్షయ మగుచున్.

అర్థములు. గాయత్రీరూపము = గాయత్రీ స్వరూపము గలది, గాయత్రీ మంత్రముచే గర్భితమైనది, గాయత్రీ మంత్రార్థము గలది కావున గాయత్రియే రామాయణ స్వరూపముగాఁ బరిణమించె నని భావము, ఒక్క పదమైనన్ = ఒక్కమాట నైనను అనఁగా నిందలి ప్రతిపదము వేదమునందలి దని యర్థము, దీనికి కొందఱు గాయత్రీమంత్రములోని యొక్క యక్షరముచేఁ తెలుపఁబడిన శ్లోకములని యందురు.

తా త్ప ర్య ము

ఈ రామాయణము గాయత్రీ స్వరూపము, దీనియందలి యొక్క మాట నైనఁ జదివిన యెడలఁ బాపము నశించును-కొడుకులు గలుగుదురు - శాశ్వతమై విస్తారమైన ధనములును గలుగును.)

క. సర్వము రాముని చరితము, నిర్వక్రమని పఁ జనువు•నియతాత్మకు లీ
యుర్వి విడిచి చనువిదప ఖగార్వుని లోకమున నుందు•రనవరతంబున్. ౧౬౭౨

అర్థములు. ఖగార్వుని లోకమునన్ = గరుడుని వాహనముగాఁ గల విష్ణుని లోకమ్మునన్, వైకుంఠమందు, అనవరతంబున్ = సర్వదా, మరల జన్మము లేదని భావము.

బ్రహ్మసూత్రములు బ్రహ్మజిజ్ఞాసతోఁ బ్రారంభించి సృష్టిస్థితిలయములు చేయువాఁడు బ్రహ్మమని నిర్వచించి జిజ్ఞాసాఫలము నపునరావృత్తి శ్శబ్దాత్ అని యుపసంహారము గావించెను.

ఈ గ్రంథమందును బ్రహ్మలక్షణము జిజ్ఞాసావిధము, మోక్షఫలము చెప్పఁబడెను.

అయోధ్యా జనులు కర్మయోగముచే, బ్రహ్మజ్ఞాననిష్ఠచే నష్టాంగయోగముచే మోక్షప్రాప్తి గోరినవారు కారు. స్నేహభావమున శ్రీరామచంద్రమూర్తి ననుసరించి యాయన ధ్యానముతో దేహములు విడిచిరి. వారికి ముక్తి లభించెను. ఇది 'సర్వధర్మాన్ పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ, అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి' యను భగవద్వాక్యమునకు లక్ష్యమై యున్నది. గోపికలు బృందావనస్థు లిట్లు లనురాగముచే మోక్షము గాంచినవారే. కావున శ్రీరామ భక్తి ముక్తి కారణ మని యేర్పడుచున్నది.

క. జనకుండును జనకజనకుఁడు, జనకుని తాతయును నతని • జనకుండును న
జ్జనకుఁడును విష్ణులోకంబున నిలుతురు రామకథను•బోరిఁబోరి విన్నన్. ౧౬౭౩

## తాత్పర్యము

రామాయణమును విన్నవాఁడు మాత్రమే కాక వాని దండ్రి తాత ముత్తాతలు ముత్తాత తండ్రి తాతలు కూడ విష్ణులోకమున నుందురు. ఈ కారణము చేతనే విష్ణుభక్తిగలవాఁడు మావంశమునఁ బుట్టునా యని పితరులు గోరుచుందురు. ఈకారణము చేతనే వంశ తంతుచ్ఛేదము గాకుండఁ గాపాడవలసి యున్నది. వంశమనునది యుండిన మంచి భక్తుఁ డేనాటికైనఁబుట్టకపోవునా యను నాశతో సత్సంతానము గోరి వంశము నిలుపవలయును. ఇది ధర్మపద్ధతి గలిగిన సంతానమునకే యన్వయించునుగాని జారత్వమువలనఁ గలిగిన సంతానమునకుఁ గాదు. దానివలన నరక ప్రాప్తియే. దీనివలన విష్ణుభక్తుఁడే కాక వానితోడి సంబంధము గలవారు కూడఁ తరింతు రని యేర్పడుచున్నది.

తే. రామచరితంబు ధర్మార్థ•కామములను, శాశ్వతంబగు పదము నొ•సంగునిజము
కాక నిత్యంబు జనులార!, కార్యమగును, శ్రద్ధతో మీరు దీనిని•జదువవినుట.

అర్థములు. ధర్మార్థకామములు, శాశ్వతంబగు పదము. ఇట్లు చెప్పుటచే నాలుగు విధములైన పురుషార్థములు రామాయణ పఠనమువలన ఫలించును. కొన్ని కేవల భోగప్రదములు కొన్ని కేవల మోక్షప్రదములు ఇది యట్లు గాదు. ఉభయలోకముల నభ్యుదయ నిశ్శ్రేయసములు గలిగించునది. కొన్నిమతములవారు మోక్షమునకు సన్న్యాసమనియు ఐహికాభ్యుదయమునకు కర్మమార్గ మనియుఁ జెప్పుదురు. దీనిచే నీవాదము నిరస్తము. ధర్మార్థకామముల ననుభవించుచునే గృహస్థుఁడు రామభక్తిచే రామాయణపఠన శ్రవణములచే ముక్తి సాధింపవచ్చును. అని యీ పద్యము స్పష్టపఱుచుచున్నది

జనులార యనుటచే సర్వసామాన్య మనుటయు అన్నివర్ణములవారు శ్రవణముచే ముక్తి కధికారులే యగుదు రనియు సన్న్యాసమందు విశేషము లేదనియు భావము. కావున రామభక్తి కధికారనియతి లేదు. శ్రద్ధావంతుఁడే యధికారి.

తే. భక్తితోడుతఁ బదమైనఁ•బాదమైన, ననయ మఘనాశనంబు రా•మాయణంబు
వినునతం డేగుబ్రహ్మస•దనమునకును, బ్రహ్మచేఁబూజితుండయి•వఱలుపరము.

## తాత్పర్యము

ఈ పద్యమునందు రామాయణమందలి యొకపదము వినినను పాదము వినినను బ్రహ్మలోక ప్రాప్తి కలదని చెప్పఁబడెనుగాని సద్యోముక్తి చెప్పఁబడలేదు. సన్న్యాసవ్రతము నిర్దుష్టముగా జరిపినవారికి బ్రహ్మలోకప్రాప్తియు పరాంతకాలమున బ్రహ్మతోడ మోక్షము శాస్త్రములు చెప్పుచున్నవి. ఆ ఫలమే రామాయణమున నొక పదమో పాదమో భక్తితో వినువారికిఁ జెప్పబడెను. మోక్ష

సుఖానుభవమందుఁ దారతమ్యము గలదు. గావున సంపూర్ణముగ రామాయణ మును బలుమారు పఠించిన వారికి వినినవారికి లభించు పరిపూర్ణ బ్రహ్మానుభ వమువలనఁ గలుగు సంతతి యానందము వీరికి లేదని గ్రహింపనగు. అటుగాదేని యొక పదము వినినవాఁడు పలుమారు వినినవాడు సమాను లగుదురు. అట్లు చెప్పుట సరిగాదు.

మానిని. ఈరహిఁ మించుమహత్త్వముఁ గల్గిన ♦ యిట్టి పురాతనవృత్తమణిన్
మీరు పఠింపుఁడు సంశయ మూనక ♦ నిండుమనంబున నమ్మి జనుల్!
దూరములై చను దోషము లన్నియుఁ♦దోరపుభద్రము మీ కగుతన్
వారక విష్ణుమహామహిమోన్నతి♦వర్ధిలుతం గడు వర్ధిలుతన్. ౧౬౮౬

అర్థములు. పురాతన వృత్తమణిన్=పూర్వము జరగిన చరిత్రములలో శ్రేష్ఠమైనది.

వర్ధిలుతన్ గడు వర్ధిలుతన్ అనునది గ్రంథాంతమును సూచించును.

తా త్ప ర్య ము

(జనులారా! యిట్టి యతిశయమైన మహిమ గలిగి పూర్వము జరిగిన చరిత్ర ములలో శ్రేష్ఠమైన దీనిని మీరు సంశయము మాని నిండు మనస్సుంచి పఠింపుఁడు మీ పాపములన్నియు నశించును, విశేషశుభములు మీకుఁ గలుగును. విష్ణుమహా ప్రభావాతిశయముచేత వర్ధిల్లుఁగాత. మిక్కిలి వర్ధిల్లుఁగాత.)

క. అని యార్ష మాదికావ్యం, బను నగు రామాయణంబు♦మును వల్మీకసం
జనితుఁడు తపస్వి సంహిత, గను బల్కెను భూప్రజోప♦కారకబుద్ధిన్. ౧౬౮౭

అర్థములు. సంహిత=వేదభాగము.

తా త్ప ర్య ము

(అని ఋషిప్రోక్తము నాది కావ్యము నగు రామాయణమును మునుపు తపస్వియగు వాల్మీకి మహర్షి భూమియందలి ప్రజలకుపకారము గలుగవలెననెడి బుద్ధితో వేదభాగముగ దీనిని జెప్పెను.)

—♦ ఆంధ్ర కవికృత గ్రంథాంత నమస్కారములు ♦—

క. ఒదవినవిఘ్నము లణఁచుచుఁ గదిసిన యాపదలఁ ద్రోలఁచి♦కడముట్టఁగ నీ
సదయతఁ బల్కించిన కృతి, యిదిగోఁ గైకొమ్ము జాన♦కీశ్వర రామా! ౧౬౮౮

అర్థములు. సదయతన్=దయతో, నీ=నీవు.

తా త్ప ర్య ము

ప్రాప్తించిన విఘ్నములను ఆపదలను ద్రోలఁగఁద్రోచి నీవు దయతోఁ బలి కించికొనిన గ్రంథమును సీతానాయకా! నీవే కైకొమ్ము. స్వయమేవ కారయ తేయను

సూక్తినను సరించి ఫలభోక్తవు కారయిత వైన నీవే కావున నీ కృతిని తత్కర్మ ఫలమును నీవే గ్రహింపుము.

క. తప్పొప్పు లెఱుంగను నీ, చెప్పించినయట్లు నేను • జెప్పితిఁ గద మా
యప్పా! దీనం గలిగిన, తప్పొప్పుల కీ వె దిక్కు • దశరథరామా! ౧౬౯

తాత్పర్యము

ఈ కృతియం దేది తప్పో యేది యొప్పో నే నెఱుఁగను నా స్వతంత్ర బుద్ధిచే నే నేదియుఁ గల్పించి వ్రాయలేదు. నాచేతికలము నాకెట్లో నేను నీకట్లు. ఒప్పుదెప్పులకు దానివలె నే నర్హుఁడను గాను. ఏలన నీవు చెప్పించినట్లు నేను జెప్పితిని. నిన్నుఁగాదని యేదైనఁ జెప్పఁగల స్వతంత్రశక్తి నాకెక్కడిది? అప్పా= తండ్రీ. నీవు తండ్రివి కావున బిడ్డలు తప్పులు పలికినను సంతోషించునట్లు నీవును నా తప్పుల క్షమింపుము.

ఉ. హెచ్చుగ నెందు నేని వచి•యించియ యుండిన రక్తిచేతనే
హెచ్చని వీడియుండిన ము•నీశ్వర! జ్ఞానము లేమిచేతనే
యచ్చపు యోగిరత్నమ! మ • హాత్మక! నీకృతి యీ ప్రబంధముం
బోచ్చెముగాదు జీవయుత • మూర్తియు ఛాయ యనంగ నుండెడిన్. ౧౭౦

అర్థములు హెచ్చుగన్=మూలమునందు లేనివి, *ఇట్టి చుక్కలు వేసినవి, రక్తిచేతనే=రామునియందలి యనురాగముచేతను, మునీశ్వర=వాల్మీకి మహర్షీ, హెచ్చని=రామో దశరథాత్మజ యన్నట్లు విశేషణములు పలుమాఱు చెప్పుట మానుటకు నీ వేయభిప్రాయముతో వేసితివో యది తెలిసికొను శక్తిలేకయే, పొచ్చెము=లోపము, జీవయుతమూర్తి=ప్రాణముతోఁ గూడిన శరీరి, ఛాయ= నీడ.

ఈ పద్యము వాల్మీకిమహర్షి నుద్దేశించి వ్రాయఁబడినది.

తాత్పర్యము

మునీశ్వరా! నీవు మహానుభావుఁడవు, యోగిపుంగవుఁడవు. జరిగినది జరిగినట్లు నీవు యోగదృష్టిచేతను ప్రత్యక్షానుభవముచేతను దెలిసికొని పలికినవాఁడవు, నీకు రామునందు రాగములేదు, రావణునందు ద్వేషము లేదు. నీవు యథార్థము చెప్పుటయే కార్యమను నియతి గలవాఁడవు. నేనో యజ్ఞుఁడను మూఢాగ్రేసర చక్రవర్తిని, పామరుఁడను, రాగద్వేషములకు దాసుఁడను. కావున నీవు రామచంద్రమూర్తి శైశవక్రీడాదులు వర్ణింపమికి శోకించి కొన్ని పద్యములు హెచ్చుగ వ్రాసితిని. కొన్ని విశేషణాదు లేల నీవు పలికితివో నీ యభిప్రాయము దెలిసికొను శక్తి లేక వదలితిని. సత్యము చెప్పుచున్నాను. నీకృతి ప్రాణయుక్తమైన శరీరమువంటిది; నాకృతి దానినీడ వంటిది. మన యిరువుర కృతులకుఁ దారతమ్య మిమాత్రమే.

ఉ. నీకృతి క్షీరసాగరము • నీవ యెఱుంగుదు తన్మహత్త్వమున్
నాకు వశంబొకో యెఱుఁగ • నన్నుఁ దరింపఁగఁ జేయ దాని నీ
వే కరుణాతిరేకమున • నిట్లు వచింపఁగఁ జేసి నంతనే
నాకు స్వతంత్రతాస్మయము•నాథ! లవంబును లే దెఱుంగవే? ౧౬౧

అర్థములు. నాథ=రామచంద్రమూర్తీ, క్షీరసాగరము=పాలసముద్రము, తన్మహత్త్వము=దాని గొప్పతనము, దానిన్=ఆసముద్రమును, ఆకృతిని, కరుణాతిరేకమునన్=దయాతిశయముచే, స్వతంత్రతాస్మయము=స్వయముగ బుద్ధిబలము, పాండిత్యబలము గలిగి వ్రాసితిననుగర్వము, లవము=కొంచెము.

తాత్పర్యము

రామచంద్రమూర్తీ! నీకృతి పాలసముద్రము వంటిది. దాని లోఁతెంతో వెడలు పెంతో నే నెఱుఁగను. తెలిసికొన నాకు సాధ్యము కాదు. కావున దానిని దరించుటకు శక్తిలేదు. కావున దానిని దాఁటింప నీవే నీదయావిశేషమునఁ బలుకఁ జేసితివి. ఆకారణమున నాబుద్ధి విద్యాబలముచే సాధించితిననుగర్వము నాకులేదు కుంటివాని నొకనియందు నావికుఁడు దయఁదలఁచి పడవలోఁ గూర్చుండఁ బెట్టుకొని గంగను దాఁటింపఁగా నాకుంటివాఁడు వివేకి యగునేని తాను దనశక్తిచే గంగదాఁటితి నని చెప్పునా? తలఁచునా? నేను సత్యము చెప్పుచున్నానో యసత్యము చెప్పుచున్నానో హృదయవాసివి సర్వజ్ఞుఁడవు నీవే యెఱుఁగుదువు.

చ. తలఁచుకొలంది తీపి, యమృ•తంబునుబోలెడి, లోఁతదెంతయో
తర మఱు చొచ్చి చూడ, గుణ•తత్త్వ మగమ్యము, పారమార్థిక
స్థిరమతియైన వానికిని • జిత్తము నిల్కడ నొందు నిందుఁ, గే
సరితనుజాతురీతి నసుఁ • జల్పుము రామ! త్వదేక చిత్తుఁగన్. ౧౬౨

అర్థములు. కేసరి తనుజాతురీతిన్=హనుమంతునివలె, త్వదేకచిత్తుగన్=నీయొక్కనియందే మనస్సు గలవానిఁగ.

తాత్పర్యము

నీగ్రంథవిషయ మాలోచించు కొలఁది నాలోచించుకొలఁది తియ్యఁదన మెచ్చుచుండును. 'సంగీతమపిసాహిత్యం సరస్వత్యాస్తనద్వయం, ఏకమాపాతమధురం ద్వితీయం చింతనామృత'మ్మని కలదు. సామాన్యసాహిత్య గ్రంథములందే యిట్లుండ వానికంటె సర్వవిధముల విలక్షణమైన రామాయణము గుఱించి యేమి చెప్పవలెను అమృతమువంటిది. తిన్న తీపు-మరణబాధదొలఁగించును. దానిలోఁతెంత యున్నదో చొచ్చిచూడ సాధ్యముగాదు. గుణతత్త్వము దెలియఁదరము గాదు. ఏది యెట్లుండినను పరమార్థచింతగల వానికి మనశ్శాంతి దీనివలనఁ గలు

గును. 'దదామి బుద్ధియోగం తం యేన మాముపయాంతి తే' భ.గీ. యని నీవే చెప్పితివి గావున నీవిషయమున కేవలియను ప్రీతియొక్కటె కాదు కేవలము మనస్సు గలఁవాఁడనైయున్న యట్లు నీయందే మనస్సుగలవానిఁగా జేయుము. రామచంద్రా! నీ తల్లిదండ్రులు తోఁబుట్టువులు దారపుత్రాదు లందఱు దుఃఖముల పాలయినవారే గాని సుఖపడినవారు లేరు. కావున నీవు నాకుఁ గొడుకవు కావలదు తండ్రివి కావలదు. హనుమంతునివలె దాస్యము నిరంతరధ్యానము కలుగనిమ్ము చాలును.

క. అఘటనఘటనా చాతురి, మఘవస్తుత! తెలుపుపొం పుఁ మాదృశుచేతన్
లఘుగతి నీదుమహాకృతి, యఘహర! చేయించి తివఁ యన్యము గలదే? ౧౬౯౩

అర్థములు. అఘటనఘటనాచాతురి=అసాధ్యములను సాధించు నేర్పు, మఘవస్తుత=ఇంద్రునిచేఁ బొగడఁబడినవాఁడా, తెలుపు పొంపుచ్ = తెలియఁజేయుకొఱకు, మాదృశుచేతన్=నావంటి యల్పునిచే, లఘుగతిన్=తేలికగా, అనాయాసముగ, మహాకృతి=గొప్ప గ్రంథము, అఘహర=పాపము నాశము చేయువాఁడా.

తాత్పర్యము

ఎట్టి యసాధ్య కార్యమైనను సుసాధముగఁ జేయు నేర్పుగలవాఁడవు, నీవు కావున నీశక్తి లోకమునకుఁ దెలియఁజేయుకొఱకు నెట్టి శక్తియు లేని నాచేత నా పాపములు హరింపఁజేయ నీకృతి రచింపఁజేసితివి గాని యితరముగాదు.

నీ విట్టివాఁడ వనుట కితర నిదర్శనములు గల వనుచున్నాఁడు.

చ. ఎలమి హుళిక్కియుండి యొక యింతిని జేసితి పాదధూళిచే
బలపరిపంథిముఖ్యుల కవార్యముఁ జేసితి దర్భపోఁచ, ని
శ్చల మపవర్గ మిచ్చితివి సత్కృప గ్రద్దకు నట్టినీకు నే
కొలదియె నన్ను నిట్లు రఘుకుంజర! త్వత్కృతికర్తఁ జేయఁగన్! ౧౬౯౪

అర్థములు. హుళిక్కి=లోకుల దృష్టికి శూన్యము, వాస్తవమునఁగాదు- బలపరిపంథి=ఇంద్రుఁడు, అవార్యము=వారింపరానిది, అపవర్గము=మోక్షము.

తాత్పర్యము

గౌతముని శాపముచే లోకులకుఁ గానరాకయున్న దానిని మరల స్త్రీగాఁ గానవచ్చునట్లు చేసితివి. దర్భపోఁచ యింద్రాదులకును నివారింప సాధ్యముగాని బ్రహ్మాస్త్రముగఁ జేసితివి. బ్రాహ్మణుఁడై జ్ఞానియై సన్యాసియైనఁగాని మోక్షము లేదను కొందఱ యభిప్రాయము సరిగాదు. నీసేవచేతనే యెవరైన ముక్తులగుదు రని తెలుప తిర్యగ్జాతి పక్షికి కర్మజ్ఞానయోగమార్గము తెలుపఁగని దానికి మోక్ష మిచ్చితివి. ఇట్టి యసాధ్య కార్యములు చేయు నీకు నన్ను నీ కృతికర్తగాఁ జేయుట యేమాత్రము కార్యము. మిక్కిలి సుకరము.

క. నాసత్త్వము నే నెఱుఁగుట, పీసంబును లేదు మోహ • విభ్రమ మెద సం
తోసము శ్రద్ధయు హెచ్చెను, వాసవనుత! నీదుకృపకుఁ • బాత్రమ నగుటన్.

అర్థములు. సత్త్వము=బలము, దేహబలము విద్యాబలము బుద్ధిబలము.

తాత్పర్యము

దీర్ఘరోగి నగుట దేహబలము బుద్ధిబలము లేదు. ఆ కారణముచేతనే గురుముఖలబ్ధ విద్యాపాండిత్యము లేదు. ఇది నే నెఱుఁగుదును. కావున నిట్టికార్యము నేను జేసితినని చేయఁగలనని మతివిభ్రమము లేదు. కాని నీవు నాచే నీకృతి చేయించుటచే నీ దయకుఁ బాత్రుడ నైతినని సంతోషము. నీవు దీనరక్షకుఁడవు. పోషకుఁడ నను శ్రద్ధయు నతిశయించెను. నేను బండితుఁడను మేధావినై యుండిన నాస్వశక్తిచేఁ జేసితినని భ్రమపడి యుందును. ఇప్పు డట్టి భ్రమకుఁ గారణము లేదు.

క. చేసితివి నీవు నాకున్, బాసను దరియింపు మీావు • వార్ధి నటంచున్
బాసను దప్పవు నీవను, వాసిం జగం బెఱుఁగు సత్య • భాషణ దీనన్. ౧౬౮

తాత్పర్యము

ఈ గ్రంథరచనకు నేను బూనుదునా వలదా యని నిన్ను నేను బ్రశ్నించి నపుడు సముద్రము దాఁటుమని చెప్పితివి. నీమాట నమ్మి నేను బూరించితిని. దీనివలన నీవు సత్యసంధుఁడవని లోక మెఱుంగఁగలదు.

క. జలనిధి దాఁటు మ టంటివి, జలనిధి కావ్యంబొ కాక • సంసారంబో
పలుకవు దాఁటించితి కృతిఁ, దలఁపక భవవార్ధి నట్ల • దాఁటింపు దయన్! ౧౬౯

తాత్పర్యము

మహాసముద్రము దాఁటుమని చెప్పితివి గాని యది కావ్యసముద్రమా సంసారసముద్రమా స్పష్టముగఁ జెప్పవైతివి. కావ్యసముద్రమును దాఁటించితివి. కావున నీసేవమున సంసారసముద్రమును నీ దయచేతనే దాఁటింపుము.

ఉ. కాలము వ్యర్థ మేగు ప్రతి • ఘస్రమునందును గొంత రిక్తగా
థాలపనంబునందు ఫల • మా? యొకమూర్తము యేని త్వత్క-థా
జాలమునందుఁ జిత్తమిడ • సత్ఫలదం బని యెంచి రామ! నీ
లీల రచింపఁ బూనితిని • లేశము లేశము నాఁడు నాఁటికిన్. ౧౭౦

అర్థములు. ఘస్రము=దినము, రిక్తగాథాలపనంబునందు=పనికిమాలిన ముచ్చటలందు.

నేనేపని చేసినను జేయకున్నను కాలముపోవుచుండును, గాని నిలువదు. కావున నిష్ప్రయోజనములైన ముచ్చటలందుఁ గాలము పోవుటకంటె నీకథలందుమనస్సుం

చిన మంచిఫలము గలదని తలఁచి నీచరిత్రమును దినదినము కొంచెము కొంచెము వ్రాయఁబూనితిని. రోగబాధ లేక యుద్యోగమున విరామము దొరకిన కాలమందు దినమున నుదయమున గంట గంటన్నర కాలము దీనికై యీగ్రంథకర్త వెచ్చించెను.

సీ. నీమాట నిజ మనుచు ♦ నేను శార్వరి నాశ్వ, యుజమాసమున శుద్ధ ♦ విజయదశమిఁ
గృతిని బ్రారంభింప ♦ నడనడ విఘ్నముల్, కలిగియు నేఁడుల ♦ నెలలకొలఁది
నవి యెల్ల నీకరు ♦ ణావలోకనమునఁ, బాయుట నీమహా ♦ వాక్య మొకఁడె
యాధారముగఁ గొని ♦ యదరక నీసేవ, సలుపఁగ నేఁటికి ♦ శాలివాహ

ఆ. శకమునందు గ్రాలు ♦ చంద్రరామగజేందు, సంఖ్య గొనరి మిగుల ♦ శస్తమైన
కీలకాబ్దమునను ♦ గీర్తిత శ్రావణ, పౌర్ణమాసియందుఁ ♦ బూర్ణమయ్యె. ౧౬౯౯

అర్థములు. చంద్ర=౧, రామ=౩, గజ=౮, ఇందు=౧, అనఁగా ౧౮౩౧ యని యర్థము.

క. సైరింపు దేవ! నాయప, చారము లవి యెన్ని కలవు ♦ సత్యము కరుణా
పారగ! కైకొనుము నమస్కారము లర్పింతు నొంటి ♦ శక్తుఁడ గామిన్. ౧౭౦౦

అర్థములు. అపచారములు=చేయరానివి చేసిన దోషములు, ఒంటి=మఱియొక విధమునను. శక్తుఁడన్=శక్తిగలవాఁడను.

తాత్పర్యము

నీవిషయమున నే నెన్నియో యపచారములు కృత్యాకరణములు, అకృత్యకరణములు చేసితిని. ఇది నిజము అయినను దయావంతుఁడవను బిరుదము గలవాఁడవు కావున నన్ను క్షమింపుము. దానికై నేనితర కార్యములు ప్రాయశ్చిత్తములు చేసికొనఁజాలను. సాష్టాంగనమస్కారము లర్పించెదను.

## —♦ కవి యీ గ్రంథము నొంటిమిట్ట శ్రీరాముల కర్పించుట ♦—

సీ. శాంతంబుగాఁగ నీ ♦ చరితంబు సకలంబు, నీగ్రామమం దిది ♦ నీకొసంగఁ
దలఁచు చుండఁగను మి ♦ త్రులము ముగ్గురము త, త్సంకల్పతిలక వ ♦ సంతసాహ్య
మునఁ బూచి ఫలియింప ♦ ముదమున నీయబ్ద, మందాశ్వయుజమాస ♦ మందుఁ బూర్ణి
మాతిథిఁ బాడ్యమి ♦ మఱి ద్వితీయాతిథి వేలకొలంది ప్ర ♦ జాళి గనఁగ

తే. నీకు పాలకియందు యీ ♦ నీదుకృతిని, నిల్పి కవులును పండితుల్ ♦ నీదుభక్త
వరులు మోయఁగ ఛత్రంబు ♦ పట్టి రాఁగ, బుణ్యమంగళవాద్యముల్ ♦ బొరుకొనఁగ

అర్థములు. మిత్రులము ముగ్గురము=ఈగ్రంథకర్త, శ్రోత్రపల్లి పద్మనాభశాస్త్రి, ౨౦౫ వేంకటసుబ్బయ్య (రఘునాథపురము) ఈ గ్రామమందు=ఒంటిమిట్టయందు, ఈయబ్దమందు=కీలకయందు, వసంత=వసంతఋతువు, వసంతరావు.

### తాత్పర్యము

(శాంతముగా నీ రామాయణ మంతయు నొంటిమిట్టయందు నీకు సమర్పించుటకు స్నేహితులము ముగ్గురము తలఁచుచుండఁగా, ఆ సంకల్ప మనడి తీఁగె వసంతకాలమునఁ బూచి ఫలింపఁగా, (వసంతరావుగారి సాయమువలన మీయాలోచన సఫలమైనదని భావము.) నీ కీలక సంవత్సర మందలి యాశ్వయుజ మాసమునఁ పూర్ణిమ, పాడ్యమి, విదియలందు వేలకొలఁది జనులు చూచుచుండ, నీ రామాయణ గ్రంథమును నీ పాలకి యందుంచి కవులు, పండితులు, భక్తులు మోయఁగా ఛత్రము పట్టుకొని రాఁగా, మంగళ వాద్యములు మ్రోగుచుండఁగా.)

చ. వలగొని దేవతాయతన ♦ వాటియు నేకశిలాపురంబుఁ దా
రెలమిని జొచ్చి కోవెలను ♦ నెల్లకృతిం బఠియించి యా దినం
బుల, మహిమాభిరాముఁ డగు ♦ భూపతికిం దగుదొడ్డకొల్వులో
పల బిరుదాంకితుల్ కవులు ♦ పండితవర్యులు దూరదేశగుల్. ౧౭౦౨

### తాత్పర్యము

(దేవాలయము గ్రామము ప్రదక్షిణము చేసి తిరిగి కోవెలకువచ్చి యీ కావ్యము నంతయు నా మూఁడు దినములలోఁ జదివి, మహిమచే మనోహరుఁడగు శ్రీరామ ప్రభువు పెద్దకొలువులో దూర దేశమునుండి వచ్చిన కవులు, పండితశ్రేష్ఠులు)

క. నీకృతిఁ దమిఁ గనుఁగొనఁగా, నేకశిలాపురికి రక్తి ♦ నేతెంచిన సు
శ్లోకులు మూలమునందలి, శ్లోకంబులతోడఁ బోల్చి ♦ శోధించి మఱిన్. ౧౭౦౩

అర్థములు. శోధించి=మూలమునంగల నానార్థములు, ధ్వన్యర్థములు అలంకారములు, లోనైనవి, కలవా లేవాయని పరీక్షించి, మఱిన్=అపిమ్మట.

### తాత్పర్యము

ఈ కృతిఁ జూడ నొంటిమిట్టకుఁ బ్రేమతో వచ్చిన మంచి పేరుపొందిన వారు మూలమందలి శ్లోకములతోఁ బోల్చి శోధించి, మఱియు.)

ఉ. ఈ కృతి నీకు సర్వ మని ♦ యేక విధంబుగ నెల్లఁ బ్రాజ్ఞులున్
బ్రాకటకీర్తిఁ బల్కఁగ న ♦ మర్పణ చేసి తాతంను తావకా
స్తోకమహత్త్వమున్ గరుణ ♦ చూపిన తీరు నుపన్యసించి నీ
యీ కృతి పార మందుటకు ♦ హేతువు నిక్కము నీవ యంచనెన్. ౧౭౦౪

అర్థములు. అతంను=కృతికర్త, తావక=నీ, అస్తోక=గొప్పదగు, మహత్త్వమున్=గొప్ప మహిమ.

తాత్పర్యము

(ఈ కృతి నీకుఁ దగినదని పండితు లంద రనేక విధములుగాఁ బ్రసిద్ధముగా జెప్పఁగా గ్రంథకర్త నీ గొప్ప మహిమను నీవు గరుణించిన విధము నుపన్యసించి యీకృతి పొంత మగుటకుఁ గారణము నీవే యని చెప్పెను.)

క. ఏవంవిధకృతిరచనకు నీ, వేమి వచించె దనుచు ♦ నినుఁ బ్రశ్నింపన్
నీ వాక్రుచ్చినవాక్యము, దేవా! నీకరుణ కాది♦దృష్టాంత మొకా. ౧౭౦౫

అర్థములు. నీవాక్రుచ్చిన వాక్యము="లెమ్మా హరిశార్దూలా! యిమ్మహీ తార్ణవము దాఁటుమీా నీవు" "ఉత్తిష్ఠ హరిశార్దూల లంఘయస్వ మహార్ణవమ్!" అను వాక్యము ఆదిదృష్టాంతము మొదటి నిదర్శనము.

తాత్పర్యము

(ఈ విధమైన కార్యము రచించుటకు ముందు నీ వేమి చెప్పెదవని యడుగఁగా, 'లెమ్మా! హరిశార్దూలా! యిమ్మహీ తార్ణవము దాఁటుమీా నీవు' అని నీవు సెలవిచ్చిన వాక్యము నీ దయకు మొదటి నిదర్శనముకదా.)

క. తావుల కనుగుణముగ దుఃఖావళి ప్రాప్తింపఁ జిత్త ♦ మారట గొనఁగా
నే విసివినచోఁ దేర్పవె, దేవా! నీ కరుణ కదియు♦దృష్టాంత మొకా. ౧౭౦౬

అర్థములు. తావులకు=ఆయా కథాసందర్భ ఘట్టములకు, అనుగుణముగన్=తగినట్లు, రామ భరత సమాగమ ఘట్టము వ్రాయునపుడు మాతృమరణము, వాలి వధ వ్రాయునపుడు జ్యేష్ఠభ్రాతృ మరణము, నాగపాశ బంధన దినమున జ్వరపీడ లోనైనవి, విసివినచోన్=విసుఁగుగొనిన వేళల, రోగాది బాధలచే వ్రాయఁ జాలకే యేల యీా పని పెట్టుకొంటిని, ఉన్న బాధ చాలకే యిదియు నొకటియా యని చాలింపఁదలఁచినపుడు, తేర్పవే=స్వప్నములందును ఉపశ్రుతులందును, నూరార్చి ధైర్యము చెప్పవా?

తాత్పర్యము.

(ఆయా కథా ఘట్టములు వ్రాయునపుడు తగినట్లు మాతృమరణము భ్రాతృ మరణము జ్వరపీడ లోనైన వాని మూలము దుఃఖములు ప్రాప్తించఁగా మన స్సునకు ఆరాటము గలుగ, రోగబాధచే విసువుపుట్టఁగా, స్వప్నములందు, ఉప శ్రుతులందు నూరార్చి ధైర్యము చెప్పవా! నీ దయకిదియు నిదర్శనమేకదా.)

క. నే వేడకయును గృతినిం, గావించుచు నుండ సాత్త్వి♦కత్యాగముగన్
భూవిభుఁ డిది ప్రకటించుట, దేవా! నీమహిమ కదియు ♦ దృష్టాంత మొకా.

అర్థములు. సాత్త్విక త్యాగముగ = ప్రతిఫలాపేక్ష లేక, భూవిభుఁడు= పిఠాపురము రాజుగారు, శ్రీ రాజారావు గంగాధర రామారావు కుమారుఁడు కుమార వేంకట మహీపతి సూర్యారావుగారు.

తా త్ప ర్య ము

(ప్రతిఫలాపేక్ష లేక నేనీ రామాయణమును వ్రాయుచుండఁగా నేను గోరకుండనే పిఠాపురము రాజుగారు దీని నచ్చువేయించి ప్రకటించుట రామా! నీ మహిమ కిది నిదర్శనము కాదా.)

క. నావిధము నీవు కృతిఁగొను, నావిభవము నిజము పలుక • నత్యుక్తిగఁ దా
భావించుఁ జూడనాతఁడు, దేవా! నీమహిమ కదియు • దృష్టాంతమొకా. ౧౭౦౮

అర్థములు. నావిధము=నాదరిద్ర స్థితి, ఆ విభవము = జగత్ప్రసిద్ధముగా మహారాజ విభవముతో సంకితము కొనిన కవి, అత్యుక్తిగన్=అద్భుతము అసత్యమని తోఁచు విధముగ, నమ్మరాని వాస్తవముగ, చూడ నాతఁడు=చూడని పురుషుఁడు.

తా త్ప ర్య ము

(నా దరిద్ర స్థితి, జగత్ప్రసిద్ధముగా మహారాజ విభవముతో నీ సంకితము గొన్న కవియు నిజము చెప్పినను చూడనివాఁడు నమ్మరాని వాస్తవముగా భావించును. దేవా! నీ ప్రభావమున కదియును నిదర్శనమేకదా.)

ఉ. కమ్మ నిమిత్తమాత్ర మని • కవ్వడి కీవు వచించినట్టి వా
క్యమ్మును నమ్మ నీమడి ప్ర•కారము వర్తిలు చున్న నీవె చి
త్రమ్ముగఁ దీర్చుటల్ కనితి • దాశరథీ! కయిగొంటి వీవు నీ
స్వమ్మును బూర్ణచిత్తమునఁ • జల్పుము నీమది వచ్చిన ట్లికన్. ౧౭౦౯

అర్థములు. కమ్మ నిమిత్త మాత్రము=నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ అని భ॥ గీ॥ వాక్యము, కవ్వడికిన్=అర్జునునకు, స్వమ్మును=సొమ్మును.

తా త్ప ర్య ము

(నీ వర్జునునకు 'నీవు నిమిత్త మాత్రముండుము' అని వచించినమాట నమ్మి. నీ చెప్పిన ప్రకారము నడచుచుండ సర్వము నీవు చిత్రముగా నెఱవేర్చుట చూచితిని-రామా! నీ సొమ్ము నీవు నిండు మనస్సు గ్రహించితివి-ఇఁక నీమనస్సు వచ్చినట్లు చేయుము.)

## —• ఉత్తరకాండాంత పద్యములు •—

క. నమస్కారిరక్షాదక్ష! న,నుస్కారణస్మరణతుష్ట•మా నవకములా!
భాస్కరకులదీపక! శ్రే,యస్కర! వినతాఘతస్క•రా! రఘువీరా! ౧౭౧౦

అర్థములు. మస్కరి రక్షా దక్ష=జ్ఞానుల రక్షించుట యందు దక్షా. మస్కరి=త్రిదండము ధరించిన వాఁడు, త్రిదండము మనోవాక్కాయముల నియమించినందులకై చిహ్నము, నమస్కరణ = నమస్కారము చేతను, స్మరణ= నామము స్మరించుట చేతను, తుష్ట=సంతోషించిన. మానస కమలా=మనస్సను తామర పుష్పము గలవాఁడా, భాస్కర కులదీపక=సూర్యవంశమును ప్రకాశింపఁ జేయువాఁడా, శ్రేయస్కర=భక్తులకు శ్రేయస్సు గలిగించువాఁడా, వినత= నమస్కరించిన వారి, అఘ=పాపములను, తస్కరా=దొంగిలించువాఁడా.

ఉ. పాలితసర్వలోక చయ! ♦ బ్రహ్మముఖామర నిత్యపూజితా!
క్షాళితభక్తలోక కలు♦షా!యసమానవదాన్య శేఖరా!
శ్రీలలితాంఘ్రి వారినిజ♦చిన్మయ నామపునీతసర్వదే
వాళిమనుష్యసంచయ! న♦రాకృతి భాసిత! కీర్తి భాసితా! ౧౨౧౧

అర్థములు. పాలిత=రక్షింపఁబడిన, సర్వలోకచయ=సమస్తలోక సమూహములు గలవాఁడా, బ్రహ్మముఖ=బ్రహ్మ మొదలైన, అమర=దేవతలచే, నిత్య పూజితా=ప్రతి దినము పూజింపఁబడువాఁడా, బ్రహ్మేంద్రాదు లవతార మూర్తులనే పూజింతురని విష్ణుపురాణమునఁ గలదు. క్షాళిత=కడుగఁబడిన భక్తలోక కలుషా=భక్తసమూహముల పాపములు గలవాఁడా. అసమాన=సమానులు లేని, వదాన్య శేఖరా = శ్రేష్ఠుఁడవైన దాతా, శ్రీలలిత=శోభచే సుందరమైన, అంఘ్రివారి=పాదజలము చేతను, నిజ=తనయొక్క, చిన్మయనామ=జ్ఞానమయమైన పేరిచేతను, పునీత = పవిత్రము చేయఁబడిన, సర్వదేవాళి= సమస్త దేవతలయు, మనుష్య=మనుష్యులయు, సంచయ=సమూహము గలవాఁడా, నరాకృతి భాసిత=మనుష్యాకారమున ప్రకాశించువాఁడా, కీర్తిభాసితా=కీర్తిచేఁ ప్రకాశించువాఁడా.

సుగంధి. రామ చంద్ర నేత్ర చంద్ర ♦ రమ్యపద్య గేయమా
నామలోత్తర ప్రచార ♦ యాదిదేవ శ్రీహరీ
రామ యొంటిమిట్టధామ ♦ రాజకన్యకాలస
ద్వామభాగ దివ్యభోగ ♦ వాసు దాస సేవధీ. ౧౨౧ ౩

అర్థములు. రామ=౩, చంద్ర=౧, నేత్ర=౨, చంద్ర=౧ అనగా ౧౨౧౩ సంఖ్యగల, రమ్య=మనోహరములైన. పద్య=పద్యములచే, గేయమాన=కీర్తింపఁ బడిన, అమల=నిర్మలమైన, ఉత్తర=శ్రేష్ఠమైన, ప్రచార=వర్తనము గలవాఁడా, ఇది యుత్తరకాండార్థమును సూచించుచున్నది. రాజకన్యకాలసత్ = జనక రాజ పుత్రికచేఁ ప్రకాశించు, వామభాగ = ఎడమ పార్శ్వము కలవాఁడా, వాసుదాస=వావిలికొలను సుబ్బరాయదాసునకు, సేవధీ = నిధియైనవాఁడా,

వాసుః=ఇది వాసుదేవ శబ్దమున నేకదేశము. ఎవనియందు సర్వము వశించునో ఎవఁడు సర్వమునందు వసించునో యతఁడు వాసుఁడు. అట్టి వానికి దాసుఁడని యర్థము. 'వాసుదేవ స్సర్వమితి, స మహాత్మా సుదుర్లభ'యను వాక్యము స్మరించునది.

## —• మంగళ మహాశ్రీ వృత్తము •—

మంగళము రామునకు • మంజుగుణధామునకు•మాన్యసురసోమునకు నెందున్
మంగళము సీత కన • మాన పరిపూతకును • మాత కఘఘాతకు సతంబున్
మంగళము భ్రాతృహిత • మండలసమేతునకు • మారుతిసమర్చితునకున్ స
న్మంగళము భక్తజన•మానసనివాసునకు•మా నగుత మంగళమహాశ్రీ. ౧౭౧౩

ఈ మంగళమహాశ్రీవృత్తరూపమున సీతారామాంజనేయులకు మంగళము చెప్పబడెను.

మంగళమహాశ్రీ భ జ స న భ జ స న గ గ లు గుణములు, తొమ్మిదింటఁ దొమ్మింట యతులు.

## —• గద్యము •—

ఇది శ్రీ మద్రామచంద్ర చరణారవింద మిళిందాయమాన
మానసత్వ మహావైభవ వావిలికొలను రామచంద్ర
రాయతనూభవ సుజనవిధేయ సుబ్బరాయ నామ
ధేయ ప్రణీతం బైన శ్రీమదాంధ్ర వాల్మీకి
రామాయణ మను నిర్వచన మహా
కావ్యంబునందు
ఉత్తర కాండము
సర్వము సంపూర్ణము

---

శ్రీ రామార్పణమస్తు.
శ్రీ శ్రీ శ్రీ

శ్లో. నమోస్తు రామాయ సలక్ష్మణాయ, నమోస్తు దేవ్యై జనకాత్మజాయై,
నమోస్తు వాతాత్మభువే వరాయ, నమోస్తు వల్మీకభవాయ తస్మై.

## —• వ్యాఖ్యాంత పద్యములు •—

చ. జనకసుతామనోహర! య ♦ శంకితవృత్తిని సర్వభారమున్
బనిగొని నీ పయిన్ వయిచి ♦ పల్కఁదొడంగితి నీ మహాకృతిన్
గనికర మారఁ దద్భరము ♦ గైకొని నీవును దీని పాంతమున్
బనిపడఁజేసి నిరుమహి ♦ మన్ వెలయించితి ధారిణీస్థలిన్.

సీ. నీదు ప్రేరణమున ♦ నిర్జరుల్ క్షీరాబ్ధి, మథియింపఁ బూర్వంబు ♦ మందరమున
హాలహాలంబు జనింప ♦ నణచిఁ యద్దానిని, గామధేనువు మణి ♦ కల్పనగము
అమృతంబు జనియింప ♦ నదియెల్ల బుధులకు, నీవ కా పంచితి ♦ నీరజాక్ష
అట్టులే రామాయ♦ణాబ్ధి మందరమునఁ, జిలుకంగ జనియింప♦హాలహాలంబు

ఆ. దాని నణఁచి బాలి♦ ఖాసురోద్ధతి మాన్పి, కలఁత మాన్పి తీవ్ర ♦ గ్రామమందు
మోహనాంగ యింక♦బుధుల కీయమృతంబుఁ, బంచి పెట్టవయ్య♦పటిమ చూపి.

సీ. ఈయూరఁగలిగిన ♦ నాయాశ్రమంబున, బాలకాండవ్యాఖ్య ♦ బలికినాఁడ
నగరిమేల్పట్టును ♦ నవ్యగ్రామమున సుబ్రహ్మణ్య నాయని ♦ భవనమందు
నాయన ప్రాపొంది ♦ యాడితి రెండవ, కాండంబు పూర్ణంబు♦గాఁగఁ బిదప
నడిగడ్డపాలెంబు ♦ నందుఁ గూనంనేని, వేంకటప్పయ్య స ♦ ద్వేశ్మమునను

గీ. బలికినాఁడను నారణ్య♦భాగమెల్ల, నవల నొకయేఁడు శుష్కవే♦దాంతిజనుల
తోడి కలహంబునను బోవెఁ♦దోయజాక్ష, నీదుకృతి రచియింపఁగ♦నేరనైతి.

క. ఎచ్చట స్వపరజనంబుల, రచ్చలు లేకుండఁ గృతిని ♦ రచియింతు నటం
చిచ్చను డోలాందోళన, మెచ్చఁగఁ దలపోయుచుండ♦ నీ సమయమునన్.

సీ. వీరవరంబును♦విశ్రుత కోలంక, గ్రామాదులకు నెల్ల ♦ రాజ్ఞి యగుచు
దాన సుశీలతా ♦ దమ దయా వాత్సల్య ప్రాభవముల కాట♦పట్టు దీన
జనయిత్రియైన రా♦జా బహదూరు చె, ల్లాయమ్మరావుగా♦రామెస్నువయఁ
గౌసల్యకును జాన♦కీసతి బోలిన, సాధ్వి రామాయమ్మ ♦ సదయహృదయ

గీ. రాజ రాజశ్రీ శ్రీ రాజ♦రావు ప్రథిత, మహిత వేంకటసూర్యకు♦మార మహిప
రావు బహదరు వారి య♦ర్ధాంగలక్ష్మి,యిరువు రవ్యాజకరుణనన్♦దరికిఁబిలిచి

క. నీ మందరగ్రంథంబును, మా మందిరమందుఁ బాత్రి♦మానుగఁజలుపన్
మామత మనుచును సెలవిడ, రాముని ప్రేరణ మటంచు♦రంజిలినాఁడన్.

క. అది యట్టు లనుచుఁ దెలిసితిఁ, బిదపన్ మా రామవిభుఁడె♦ప్రేరింపంగన్
ముదితల స్వభక్తిరతలన్, సదయులు నాకట్లు సెలవొ♦సంగి రటంచున్.

చ. పరమపదంబుఁ జేరఁ దన ♦ భక్తిబలంబునఁ బోవువేళ నా
వరగుణ చెల్లమాంబ తన ♦ ప్రాణపదంబును రామయమ్మనన్
దరియఁగఁ బిల్చి మర్త్యకము ♦ తల్లిరొ విశ్రుతు నొంటిమిట్ట శ్రీ
హరి రఘురాము నంచఁ బలు ♦ కాడెను నంతిమ భాషణంబుగన్.

సీ. ఉల్లమందలి భక్తి ♦ హోమాగ్నికిని నత్తగారివాక్యం బాజ్య♦ధార గాఁగ
మరల నన్ బిలిపించి♦మాతృవత్సలతను, నామె నన్ బోషించె♦సాదరముగ
సపరివారంబుగ♦సంవత్సరం బొందు, నూతనాశ్రమ మొందు♦ప్రీతినిలిపి
రామకార్యముదక్క♦నామనంబునయందు, వేఱొండు చింతను♦విడిచియుంటి

గీ. హాయిగాఁగనపూర్వ♦సౌఖ్యంబుఁగనుచు,గ్రంథమంతయుఁదుదఁగన♦వ్రాసినాఁడ
లక్ష్మినరసాపురంబున ♦ లలితశీల, మాసనవకంబునందు క్ష♦మాసుతేశ.

క. ఆశ్వశాస్సు వలదు ని,త్యైశ్వర్యము లోకయుగము♦నందు సుఖంబున్
శాశ్వతమాంగల్యంబును, విశ్వనుత! యనుగ్రహింపు♦విడువనికరుణన్.

సీ. ఆ తల్లి గా రిట్టు ♦ లాదరంబునఁ బ్రోవ, యామర్తి సుబ్బదా♦సార్యవరుఁడు
శిష్యుఁడై హితుఁ డయి♦చేదోడు నగుచును, నిఖిలకార్యంబు♦నిర్వహింప
సీతమ్మ ప్రాపుగా ♦ చిల్లర లక్ష్మమ్మ, యేకపున్నమ్మయు♦నెల్లవిధుల
మనిని బ్రోవంగ ♦ మేకొన నీ విట్లు, వీరినోపంగిన ♦ కారణమున

గీ. సాంతముగ గ్రంథ మంతయు♦జలుపఁగంటి, నేకచిత్తంబుతోడ నే♦లోకమందు
నైన వీరలతోడి పొ ♦ త్తనురియుండఁ, జేయవే జానకీనాథ ♦ శ్రీసనాథ.

క. అంతేవాసినులను నే,కాంతము నీ సేవ సేయు ♦ కాంతల శుభసు
స్వాంతలఁ గాంతులతో నీ యంతికమున నిల్పవయ్య♦యనవరతంబున్.

ఉ. ఎందఱు లేరు లోకమున ♦ నింతకు మించిన విత్తవంతు లా
యందఱి కేల నీవు భవ ♦ దాకృతిఁ జూపవు? భక్తులంచు నీ
రిం దయనీయ లంచుఁగద ♦ ప్రేరణచేసితి నీవు దృష్టికిన్
బొందుగఁ బాత్రలౌ సతులు ♦ పుణ్యలు మాన్యలు వంద్యలేకదా.

సీ. చేయించుకొంటివి ♦ శ్రీమహాసామ్రాజ్య, పట్టాభిషేకంబు♦ప్రకటరీతి
వ్రాయించుకొంటి వాంధ్ర♦రామాయణంబును, సవ్యాఖ్యముగ మౌని♦జల్పితంబు
కాయించుకొంటివి♦శయుని బుధు లెన్నఁ, గీర్తి వెన్నెలల ది♦క్సీమలందు
బోయించుకొంటివి♦వేయిఘటంబుల, నైదువందల సుతీ♦ర్థాంబువులను

గీ. నీదు మహిమంబు వెలయంగ♦నిఖిలజగతి, దేనికిని గొఱమాలిన♦దీన నన్ను
సాధనంబుగఁ గొనుచుఁ బ్ర♦శస్తరీతి, రమ్యవత్కీర్తి కోదండ♦రామమూర్తి.

సీ. కైవల్యమునఁ గాంక్ష♦గలవాని తీరున, బ్రహ్మచర్యమునకు♦భ్రాంతి సేయ
నాకలోకసుఖంబు♦నాశించు తపసి నా, నడవుల నలజడి ♦ కుడువనొల్లఁ
బరపిండనిరతుఁడై♦పర్యటించెడి యతి, చందంబునను నేను♦నందగింప
త్రుక్కుడిమిక్కాడక♦కూర్చుండు యోగుల, కుణపవృత్తముకయిఁ♦గోరికసేయ

గీ. తావకీనపదాబ్జాత ♦ సేవనమున, నిత్య నిరవద్య నిరవధి ♦ నిర్వికల్ప
నిస్తులానందవార్ధి ము♦నింగి యుండ, నభిలషించెద నేలోక♦మందు నున్న.

క. కర్మములకు జన్మములకు, ధర్మములకు వెఱవ నయ్య ♦ తావక సేవా
ధర్మమున భక్తి జనులకు, కర్మము గూర్పంగ నేను ♦ జాలుదు నేనిన్.

క. లోకోపకారకం బగు, నీ కైంకర్యంబునందు ♦ నిలుపుము నన్నున్
వైకుంఠమందె నిల్వఁగ, నా కభిలాషంబు లేదు ♦ నాళీకాక్షా.

సీ. ఆనందవార్ధి నీ ♦ హల్లోహలంబుగ, నను ముంచి యెప్పుడుఁ♦దనరు దాని
నీవేళ యీదశ ♦ యేదేశ మనకుండ, ననపాయముగఁ గూడి♦యలరు దాని
శైశవ బాల్య జ ♦ రామయములు లేక, నిత్యయౌవనమున ♦ నెగడు దాని
అన్యంబు పై మది ♦ నరుగ నీయక నన్ను, దక్కించుకొను జాణ♦తనము దాని

గీ. ప్రకృతివేశ్యకు నను఼ బాలు♦పడఁగ వీని, శక్తి భక్తి విరక్తియు♦జరుగు దాని
నిచ్చి పెండిలి సేయుమి♦యిందిరేశ, యుంకువుగ దీని గైకొని♦యుల్లమలర.

సీ. తనవలెనే నేను ♦ ధర్మధీ నలుపనే, నిష్ఠమై యేక ప♦త్నీవ్రతంబు
తనవలెనే నేను ♦ వనముల గుట్టలఁ, గొండల నిడుమలఁ ♦ గుడువ లేద
తనవలెనే నేను ♦ వనమూల ఫలములఁ, గందఁ గాలంబు ♦ గడప లేద
తనవలెనే నేను ♦ దనరి విధురుఁడనై, జనహితార్థంబుగ ♦ జరుగ లేద

గీ. తనదు సేవయె పరమార్థ♦మనుచుఁ దలఁచి, త్రికరణంబుల వదల నే♦సుకములెల్ల
నీయనే నాదు సర్వస్వ♦మెల్లఁ దనకె, యేల మఱచును నన్ను సీ♦తేశుఁ డెపుడు.

క. నన్నెట్లు నీవు మఱతువు, నిన్నెట్టులు నేను మఱవ ♦ నేర్తును జెపుమా
కన్నాకై యున్నాళ్ళలుఁ, బన్నుగ రక్షింపఁ జేటి♦వాదో డగుచున్.

ఉ. కమ్మ నిమిత్తమాత్రమని ♦ కవ్వడి కీవు వచించినట్టి వా
క్యమ్మును నమ్మి నీ నుడి ప్ర ♦ కారము వర్తిలనన్ని నీవె చి
త్రమ్ముగఁ దీర్పుటల్ గనితి ♦ దాశరథీ, కయికొంటి నీవు నీ
స్వమ్మును బూర్ణచిత్తమునఁ ♦ జల్పుము నీమది వచ్చినట్లికన్.

క. సైరింపు దేవ! నా యప,చారము లవి యెన్నొ కలవు ♦ సత్యము కరుణా
పారగ! కైకొనుము నను,స్వాకారముఁ గావింతు నొంట ♦ శక్తుఁడ గాదిన్.